

'రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు పాడిపంటలతో పులకించాలి'

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20+32 పేజీల ఆదివారం అనుబంధం

వెల: ₹ 7.00

విమెన్ ఆన్ డ్యూటీ



సాక్షి, హైదరాబాద్

అది బేగంపేట్ రైల్వేస్టేషన్. శతాబ్ది ఎక్స్‌ప్రెస్ వచ్చి ఆగింది. ప్రయాణికులు రైలెక్కారు. రైలు ముందుకు కదులుతున్న సమయంలో ఓ మహిళ హడావుడిగా పరుగెత్తుకొచ్చింది. రైలెక్కేందుకు ప్రయత్నిస్తూ.. పట్టు తప్పింది. ప్లాట్‌ఫామ్‌పై విధుల్లో ఉన్న ఆర్పీఎఫ్ మహిళా కానిస్టేబుళ్లు, టికెట్ తనిఖీ సిబ్బంది అది చూసి వెంటనే అలర్ట్ అయ్యారు. ఆ మహిళ ట్రైన్ కింద పడకుండా కాపాడారు. ప్రాథమిక చికిత్స అందించారు.

అదే స్టేషన్‌లో ఇద్దరు అమ్మాయిలు లింగంపల్లికి వెళ్లే ఎంఎంటీఎస్ రైలు ఎక్కబోతూ పట్టుతప్పి ప్లాట్‌ఫామ్‌పై పడిపోయారు. స్టేషన్ ఇన్‌చార్జి పల్లవి, ఆర్పీఎఫ్ ఎస్సై నసీమా బృందం వెంటనే వచ్చి.. ఆ అమ్మాయిలకు సపర్యలు చేశారు. ధైర్యం చెప్పారు. తర్వాత జాగ్రత్తగా మరో ట్రైన్ ఎక్కించారు.

.. రెండు ఘటనల్లోనూ బాధితులను కాపాడింది, సేవలు చేసింది మహిళా సిబ్బందే. ఇలాంటి ఘటనలే కాదు. టికెట్ల నుంచి భద్రతదాకా ప్రయాణికులకు కావాల్సిన సేవలు అన్నీ అందిస్తున్నది మహిళలే. ఎందుకంటే మొత్తంగా మహిళల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైల్వేస్టేషన్ అది. ఎవరికీ తీసిపోకుండా, సేవల్లో ఏమాత్రం లోపం రాకుండా.. అంకిత భావంతో పనిచేస్తూ విజయపథంలో దూసుకుపోతున్నారు. బేగంపేట్ రైల్వేస్టేషన్‌లో మహిళా సిబ్బంది. 25 మంది మహిళా ఉద్యోగులు షిఫ్టుల వారీగా 24 గంటల పాటు విధులు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ సత్తా చాటుతున్నారు.

బేగంపేట్ రైల్వేస్టేషన్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులు

- టికెట్ బుకింగ్ నుంచి అసాంఘిక శక్తులను అరికట్టే వరకు వారే..
- ప్రయాణికుల సంక్షేమం, భద్రత లక్ష్యంగా విధులు
- ఆరేళ్లుగా విజయవంతంగా సేవలు అందిస్తున్న 25 మంది మహిళా సిబ్బంది
- మంచి పనితీరుతో ప్రశంసలు పొందుతున్న తీరు
- ఇది తమకు గర్వకారణంగా ఉందంటున్న స్టేషన్ ఇన్‌చార్జి పల్లవి, ఆర్పీఎఫ్ ఎస్సై నసీమా



బేగంపేట స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఆర్పీఎఫ్ సిబ్బంది

మహిళా సాధికారతకు పట్టంగడుతూ..

2018లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించింది. మహిళా సాధికారతను సమున్నతంగా ఆవిష్కరిస్తూ.. బేగంపేట్, విద్యానగర్ స్టేషన్‌లను మహిళా రైల్వేస్టేషన్లుగా ప్రకటించింది. అప్పట్నుంచి ఈ స్టేషన్లలో టికెట్ బుకింగ్ కేంద్రాలు, టికెట్ల తనిఖీ, ఆర్పీఎఫ్ విభాగాల్లో పూర్తిగా మహిళా సిబ్బందే పనిచేస్తున్నారు. ఫ్రంట్‌లైన్ సిబ్బందిగా సేవలు అందిస్తున్నారు. ఇందులో హైదరాబాద్ నగరం నడిబొడ్డున ఉన్న బేగంపేట్ స్టేషన్‌కు ప్రయాణికుల తాకిడి ఎక్కువగానే ఉంటుంది. రోజూ సుమారు 15 వేల మంది ఈ స్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తారు. ఎంఎంటీఎస్ రైళ్లతోపాటు కోణార్క్, శతాబ్ది, దేవగిరి, నారాయణాద్రి, రాజ్‌కోట్ తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లు కూడా బేగంపేట్‌లో నిమిషం పాటు ఆగుతాయి. ''విధి నిర్వహణలో ప్రతి క్షణం కీలకమే. ప్రయాణికుల భద్రతలో భాగంగా నిరంతరం అప్రమత్తంగా ఉంటాం'' అని ఈ స్టేషన్‌లో విధులు నిర్వర్తించే ఆర్పీఎఫ్ ఎస్సై నసీమా చెప్పారు. ఇక్కడ 10 మంది ఆర్పీఎఫ్ మహిళా కానిస్టేబుళ్ల బృందానికి ఆమె నేతృత్వం వహిస్తున్నారు.

నిర్భయంగా పనిచేసే స్థితిలో..

రైల్వేస్టేషన్‌లో టికెట్ తనిఖీ సిబ్బంది విధులు కీలకమైనవే. పదుల సంఖ్యలో ప్రయాణికులు టికెట్ తీసుకోకుండానే ప్రయాణిస్తుంటారు. ఎంఎంటీఎస్ రైళ్లలో ఇలాంటి వారి సమస్య ఎక్కువగా ఉంటుంది. అలాంటి వారిని గుర్తించి జరిమానా విధించడం, కేసుల నమోదు వంటివి చేయాల్సి వస్తుంది. ఈ క్రమంలో కొందరు వాగ్వాదానికి దిగుతారు. ఒత్తిడి చేస్తారు. అయినా నిర్భయంగా పనిచేయాలి. దీనిపై చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ ఆర్తి రామతారక్ మాట్లాడుతూ.. ''ఒక స్టేషన్ నిర్వహణ బాధ్యతను పూర్తిగా మహిళలకు అప్పగించడం గర్వంగా భావిస్తున్నాం. మాకు అప్పగించిన బాధ్యతలను నిర్వర్తించడంలో రాజీలేకుండా పనిచేస్తున్నాం. ప్రతికూల పరిస్థితుల్లో పనిచేయాల్సి రావడం కొన్నిసార్లు ఇబ్బందిగానే ఉన్నా.. సవాళ్లను స్వీకరించి పనిచేయడం వల్ల ఎంతో సంతృప్తిగా ఉంటుంది..'' అని చెప్పారు.

ప్రయాణికుల క్షేమమే లక్ష్యం

రోజూ బేగంపేట్ స్టేషన్ నుంచి వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారు. తాము వెళ్లాల్సిన రైలు కోసం ఆదుర్దా కొందరిదైతే.. ట్రైన్ దిగాక తమకు కావాల్సిన, వెళ్లాల్సిన చోటికి ఎలా వెళ్లాలో తెలియక గందరగోళానికి గురయ్యేవారు మరికొందరు. రైల్వే స్టేషన్ సిబ్బంది అలాంటి ప్రయాణికులకు నిత్యం అందుబాటులో ఉండి అవసరమైన సలహాలు, సూచనలు అందజేస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు.. సాయంత్రం 3 గంటల నుంచి రాత్రి 8 వరకు రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో ఎంతో ఓపిగ్గా పనిచేయాల్సి ఉంటుందని మహిళా సిబ్బంది చెప్తున్నారు. ''బేగంపేట్‌లో సాధారణ టికెట్లతోపాటు రిజర్వేషన్ కౌంటర్లు కూడా ఉన్నాయి. రైళ్లు బయలుదేరే సమయం దగ్గర పడుతున్న కొద్దీ కౌంటర్ల వద్ద రద్దీ పెరుగుతూ ఉంటుంది. ఆ సమయంలో ఏ కొంచెం అసహనానికి గురైనా ప్రయాణికులు ఇబ్బందికి గురవుతారు. బేగంపేట్ నుంచి బయలుదేరే ప్రతి ప్రయాణికుడు సంతోషంగా ప్రయాణం చేయాలి. ఇక్కడ దిగిన వాళ్లు క్షేమంగా గమ్యం చేరుకోవాలి. ప్రయాణికులే దేవుళ్లు'' అనే స్ఫూర్తితో

మిగతా IIవ పేజీలో ▶



బేగంపేట రైల్వే స్టేషన్‌లో మహిళా సిబ్బంది

దటీజ్ దమ్



- శతాబ్దాల నాటి అనుబంధం..
- అత్యుత్తమ రుచుల్లో 6వ స్థానం
- సెకనుకు సగటున 2.5 బిర్యానీలు
- తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకూ..
- మండీ వచ్చినా... ట్రెండీ మనదే..
- సామాన్యుల నుంచి సెలబ్స్ వరకూ ఫిదా

11 లో

నేడు ప్రపంచ బిర్యానీ దినోత్సవం



బోనమెత్తుదాం

నేటి నుంచి కోట బోనాలు

7 లో



నగరానికి చెందిన రిటైర్డ్ టీచర్ శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు అమెరికాలోని టెక్సాస్‌లో మాస్టర్స్ డిగ్రీ చదువుతున్నాడు. ఆయన కొడుకును చూడటానికి వెళ్లాలనుకున్నాడు. ప్రేమతో నాలుగైదు జతల దుస్తులు, షూలు కొనుగోలు చేసి, అమెరికా విమానం ఎక్కాడు. అక్కడి విమానాశ్రయంలో పోర్ట్ ఆఫ్ ఎంట్రీ వద్ద యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ (సీబీపీ) అధికారులు శ్రీనివాస్‌రెడ్డి లగేజీని తనిఖీ చేశారు. చక్కగా ప్యాకింగ్ చేసి ఉన్న దుస్తులు, షూల గురించి ఆరా తీశారు. తన కుమారుడి కోసం తీసుకెళ్తున్నానని ఆయన చెప్పినా.. అవన్నీ అంతర్జాతీయ బ్రాండ్ల పేరిట ఉన్న నకిలీ ఉత్పత్తులంటూ ధ్వంసం చేసి చెత్తబుట్టలో పడేశారు.

.. ఇది శ్రీనివాస్‌రెడ్డి ఒక్కరికే కాదు. ఈ మధ్యకాలంలో అమెరికా వెళుతున్న చాలా మంది భారత ప్రయాణికులకు ఎదురవుతున్న చేదు అనుభవమిది. నగరంలో కొందరు వివిధ అంతర్జాతీయ బ్రాండ్ల పేరిట నకిలీలను అమ్ముతుంటే.. మనం నమ్మి కొనుగోలు చేస్తున్నాం. కానీ వాటిని అమెరికాకు తీసుకెళ్తే.. 'మేధో సంపత్తి హక్కుల' కింద అనుమతి నిరాకరిస్తున్నారు. విమానాశ్రయాల్లోనే ధ్వంసం చేసేస్తున్నారు. అందువల్ల విదేశాలకు వెళ్తున్నవారు అంతర్జాతీయ బ్రాండ్ల పేరిట ఉన్న నకిలీ ఉత్పత్తులను తీసుకెళ్లకుండా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

- సాక్షి, హైదరాబాద్

'ఫేక్' తీసుకెళ్తే.. బ్రేక్ పడినట్టే!

నకిలీ బ్రాండెడ్ వస్తువులను అనుమతించని అమెరికా


- విమానాశ్రయంలో తనిఖీల సమయంలో గుర్తింపు
- మన ముందే వాటిని ధ్వంసం చేసి పడేస్తున్న వైనం
- గత ఏడాది ఇలా 2.3 కోట్ల ఉత్పత్తులు స్వాధీనం
- వాటి విలువ రూ.20 వేల కోట్లపై మాటే!
- విదేశాలకు వెళ్లేవారు ప్రముఖ బ్రాండ్ల నకిలీలను తీసుకెళ్లొద్దంటున్న నిపుణులు

తెలిసీ తెలియక నకిలీలు కొంటూ..

మన దగ్గర నకిలీ బ్రాండెడ్ ఉత్పత్తుల విక్రయం.. వినియోగదారులు తెలిసీ తెలియక కొనడం మామూలే. దుస్తులు, బ్యాగ్‌లు, పాదరక్షలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, చర్మ సౌందర్య ఉత్పత్తులు ఇలా చాలా వరకు నకిలీలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. దేశీయ బ్రాండ్లే కాదు పూమా, నైకీ, అడిడాస్ వంటి అంతర్జాతీయ బ్రాండ్ల నకిలీలూ ఎక్కువగానే ఉంటున్నాయి. ధర తక్కువనో, లేదా తెలియకో చాలా మంది వాటిని కొనుగోలు చేస్తున్నారు. కానీ అలాంటివి అమెరికాకు తీసుకెళ్తే మాత్రం నష్టపోతాం.

ఒక్కటే అయితే తీసుకెళ్లొచ్చు..

అమెరికా సీబీపీ అధికారుల రూల్‌బుక్ ప్రకారం.. ఎవరైనా ఒక చొక్కా, ఒక హ్యాండ్‌బ్యాగ్ ఇలా ఏ వస్తువైనా నకిలీ బ్రాండ్లవి ఒక్కొక్క దాన్ని తీసుకెళ్లడానికి అనుమతిస్తారు. అది కూడా వ్యక్తిగత వినియోగా నికి మాత్రమేనని, ఎవరికీ విక్రయించడానికి కాదని వివరించాల్సి ఉంటుంది. లేకుంటే తీసుకెళ్లనివ్వరు. వాడిన పాత వస్తువులు అయితే మాత్రం ఇబ్బంది ఉండదని అంటున్నారు.



చదువు, ఉద్యోగం, వైద్యం, పర్యాటకం ఇలా కారణమేదైనా మన దేశం నుంచి యూఎస్‌కు రాకపోకలు పెరిగాయి. ముఖ్యంగా హైదరాబాద్ నగరం నుంచి వెళ్లేవారి సంఖ్య బాగా పెరిగింది. అలా వెళ్తున్నవారు వస్త్రాలు, హ్యాండ్‌బ్యాగ్‌లు, జ్యువెల్లరీ, షూస్, ఎలక్ట్రానిక్ పరికరాలు వంటివి తీసుకెళ్తుంటారు. కానీ వాటిలో నైకీ, గూచి, లూయిస్ విట్టన్, రోలెక్స్, హర్మేస్, అర్మానీ, పూమా, అడిడాస్ వంటి అంతర్జాతీయ బ్రాండ్లకు చెందిన నకిలీ వస్తువులు ఉంటున్నాయి. అమెరికా కస్టమ్స్ అధికారులు చేసే తనిఖీల్లో ఇలాంటివి బయటపడుతున్నాయి. వాటిని యూఎస్ కస్టమ్స్ ఆఫీసర్లు మీ ముందే ధ్వంసం చేసి, చెత్తబుట్టలో పడేస్తారు. అధికారులతో వాగ్వాదానికి దిగితే చట్టప్రకారం క్రిమినల్ కేసు పెట్టి, జైలుకు పంపే ప్రమాదం కూడా ఉంటుంది.

వాదనకు దిగితే.. చిక్కులు తప్పవు

గతేడాది 2.3 కోట్ల నకిలీ ఉత్పత్తులు స్వాధీనం..

గత ఏడాది 19,724 షిప్‌మెంట్ల నుంచి 2.3 కోట్ల ఉత్పత్తులను అమెరికా సీబీపీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.20 వేలకోట్ల (2.7 బిలియన్ దాలర్లు)పైనే ఉంటుందని గణాంకాలు చెప్తున్నాయి. నకిలీ బ్రాండ్ల ఉత్పత్తుల రవాణా అనేది మేధో సంపత్తి హక్కుల (ఐపీఆర్) ఉల్లంఘన కిందికి వస్తుందని.. అందుకే అమెరికా అధికారులు ఇలాంటి చర్యలు చేపడతారని నిపుణులు చెప్తున్నారు.

అమెరికాలోకి వీటిని తీసుకెళ్లనివ్వరు

- మద్యం
- ఆటోమొబైల్స్
- బయోలాజికల్ మెటీరియల్స్
- నిషేధించిన దేశాలకు చెందిన ఉత్పత్తులు, సరుకులు
- సాంస్కృతిక కళాఖండాలు
- డిఫెన్స్ ఉత్పత్తులు
- వేటకు సంబంధించిన ఉత్పత్తులు



అనుమతించేవి

(ఫెడరల్ ఏజెన్సీ నుంచి లైసెన్స్‌లు లేదా అనుమతులు అవసరమయ్యే ఉత్పత్తులు)

- కుక్క, పిల్లి వంటి పెంపుడు జంతువులు
- ఆయుధాలు
- ఫొటోగ్రాఫిక్ చిత్రాలు
- దిగుమతి చేసుకున్న మొక్కలు, విత్తనాలు
- గిఫ్ట్ లేదా వ్యక్తిగత వినియోగం కోసం టెక్స్‌టైల్స్





2023లో యూఎస్‌లో స్వాధీనం చేసుకున్న వస్తువులివీ.. (శాతంలో..)

అపెరల్స్ (వస్త్రాలు)	హ్యాండ్ బ్యాగ్స్	జువెల్లరీ	ఫుట్‌వేర్	ఎలక్ట్రానిక్స్	సన్‌గ్లాస్‌లు	బెల్ట్‌లు	ఇతర ఉత్పత్తులు	పర్సనల్ కేర్ ఉత్పత్తులు
26.2	24	15.6	11.6	3.1	3.1	2.1	8.2	2.8

టోపీలు, శిరస్త్రాణం వంటి తలకు ధరించే ఉత్పత్తులు: 3.3

విమెన్ ఆన్ డ్యూటీ



▶ మొదటి పేజీ తరువాయి

పనిచేస్తున్నామని స్టేషన్ ఇన్‌చార్జి పల్లవి చెప్పారు. అందుకే ఆరేళ్లుగా మహిళా సిబ్బందితో విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట

బేగంపేట్ రైల్వేస్టేషన్‌లో 10 మంది ఆర్పీఎఫ్ మహిళా సిబ్బందే ఉన్నా.. ప్రయాణికుల భద్రతలో నిత్యం అప్రమత్తంగా ఉంటున్నారు. రైళ్లలో అక్రమ మద్యం, గంజాయి, డ్రగ్స్ వంటివి తరలించే వారిని పట్టుకుంటున్నారు. ఎంఎంటీఎస్ రైళ్లలో తనిఖీలు నిర్వహించి పోకిరీల ఆటకట్టిస్తున్నారు. ప్రతి నెలా 45 నుంచి 50 మంది పోకిరీలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించి కేసులు నమోదు చేస్తున్నట్టు ఆర్పీఎఫ్ ఎస్సై నసీమా తెలిపారు. మహిళా ప్రయాణికులు, పిల్లల రక్షణ కోసం బేగంపేట్‌లో శక్తి టీమ్‌లు పనిచేస్తున్నాయి. అలాగే ఎంఎంటీఎస్ రైళ్లలో రెగ్యులర్‌గా ప్రయాణించే మహిళల కోసం ప్రత్యేకంగా ఒక వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేశారు.అందులో 325 మంది సభ్యులున్నారు. ప్రయాణ సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ఈ గ్రూపులో పోస్టు చేస్తే చాలు ఆర్పీఎఫ్ సిబ్బంది క్షణాల్లో చేరుకొని రక్షణ కల్పిస్తారు.

సమష్టిగా పని చేస్తున్నాం



మాది 25 మంది మహిళా ఉద్యోగుల సమష్టి విధి నిర్వహణ. ప్రతిరోజు 15 వేల మందికిపైగా ప్రయాణికులు రాకపోకలు సాగించే ఈ స్టేషన్‌లో ఎన్నో సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. వాటన్నింటినీ సమర్థవంతంగా ఎదుర్కొని పనిచేస్తున్నాం. చాలా సంతృప్తిగా ఉంది.

- పల్లవి మల్లిక్, స్టేషన్ ఇన్‌చార్జి

శక్తి టీమ్‌లు ఉన్నాయి



కొందరు అమ్మాయిలు ఇళ్లలో గొడవపడి వస్తారు. ఆత్మహత్య ప్రయత్నం చేస్తారు. అలాంటి వారిని చూస్తే బాధనిపిస్తుంది. క్షణికావేశంలో ప్రాణాలు తీసుకొనేందుకు సాహసిస్తారు. ఆర్పీఎఫ్ శక్తి టీమ్‌లు నిరంతరం గస్తీలో ఉండటం వల్ల అలాంటి ఎంతోమందిని కాపాడగలిగాం. తప్పిపోయి వచ్చే చిన్నారులను చేరదీసి తల్లిదండ్రులకు అప్పగించాం. అన్నివేళల్లో ప్రయాణికులకు రక్షణ కల్పించేందుకు సిద్ధంగా ఉన్నాం.

- నసీమా, ఆర్పీఎఫ్ ఎస్సై

రాత్రివేళల్లో కొద్దిగా ఇబ్బందే..

పగటిపూట విధి నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఉండవు. కానీ రాత్రిపూట టికెట్ తనిఖీ కొద్దిగా ఇబ్బందిగానే అనిపిస్తుంది. రకరకాల వ్యక్తులు వస్తారు. తాగుబోతుల బెడద కూడా ఉంటుంది. చాలా జాగ్రత్తగా వ్యవహరించాల్సి వస్తుంది. ఆ సమయంలో ఆర్పీఎఫ్ మాకు అండగా ఉంటుంది.

- ఆర్తి రామతారక్, చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్

సత్యమేవ జయతే

సాక్షి


'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

WWW.SAKSHI.COM

పేజీలు: 20+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00 సంపుటి: 17 సంచిక: 106

SUNDAY Special ఆదివారం 7-7-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



భారత్ పరాజయం

జింబాబ్వే టూర్‌ను టీమిండియా పరాజయంతో మొదలుపెట్టింది. తొలి టీ20లో భారత్ 13 పరుగుల తేడాతో ఓడింది. తొలుత జింబాబ్వే 20 ఓవర్లలో 115/9 స్కోరు చేయగా.. తర్వాత భారత్ 102 పరుగులకే ఆలౌటైంది. - 16లో



కుక్క కాటా..?

ఇటీవల వీధి కుక్కలు కాటు వేస్తున్న కేసులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. కొన్నిసార్లు పెంపుడు కుక్కలు కూడా కరుస్తుంటాయి. కుక్కకాటుకు గురైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రథమ చికిత్స, తదుపరి చికిత్సలను తెలుసుకుందాం. - 15లో



నీట్‌-యూజీ కౌన్సెలింగ్ వాయిదా

వైద్య విద్యాసంస్థల్లో ప్రవేశానికి ఉద్దేశించిన జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష-అండర్ గ్రాడ్యుయేట్ కౌన్సెలింగ్ వాయిదా పడింది. - వివరాలు 6లో



గుజరాత్‌లోనూ ఓడిస్తాం

గత ఎన్నికల్లో అయోధ్యలో బీజేపీని తమ కూటమి ఓడించిందని, ఇక గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిస్తామని రాహుల్ చెప్పారు. - వివరాలు 6లో



23న కేంద్ర బడ్జెట్

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఈ నెల 23న లోక్‌సభలో పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. - వివరాలు 6లో



మతవాదన పాలనకు ఎదురుదెబ్బ

ఇరాన్ అధ్యక్ష ఎన్నికల్లో కరడుగట్టిన మతవాది సయీద్ జలిలిపై మితవాది మసూద్ పెజెష్కియాన్ గెలుపొందారు. - వివరాలు 6లో

కమిటీలతో తేలుస్తాం

అపరిష్కృతంగా ఉన్న విభజన అంశాలకు చర్చలతో పరిష్కార మార్గాల అన్వేషణ

తెలంగాణ, ఏపీ సీఎంలు రేవంత్, చంద్రబాబు సమావేశంలో నిర్ణయాలు

- రెండు రాష్ట్రాల సీఎస్‌లు, చెరో ముగ్గురు అధికారులతో ఒక కమిటీ
- 2 వారాల్లో తమ స్థాయిలోని అంశాలకు పరిష్కారం చూపేలా ప్రయత్నాలు
- ఈ అధికారుల స్థాయిలో పరిష్కారం కాని అంశాలపై ఇరు రాష్ట్రాల మంత్రులతో మరో కమిటీ
- మంత్రుల కమిటీ నిర్ణయాలను సీఎంలు అంగీకరించేలా నిర్ణయం
- అయినా పరిష్కారం దొరకని అంశాలపై సీఎంల స్థాయిలో చర్చలు
- డ్రగ్స్, సైబర్ క్రైమ్‌లపై పరస్పర సహకారం కోసం కో-ఆర్డినేషన్ కమిటీ
- వివరాలను వెల్లడించిన ఇరు రాష్ట్రాల మంత్రులు భట్టి విక్రమార్క, సత్యప్రసాద్
- ఇకపై తరచూ కలుద్దామని ఇద్దరు సీఎంలు నిర్ణయించారని వెల్లడి


ఏపీ సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

వాదనలు అనవసరం!

ఏపీ సీఎస్, అధికారులకు సీఎం రేవంత్, భట్టి స్పష్టీకరణ

వివాదాల పరిష్కారం కోసమే సమావేశమయ్యాం

కూర్చొని పరిష్కరించుకుందాం.. కమిటీలు వేసుకుందాం

14లో

సాక్షి, హైదరాబాద్

తెలంగాణ, ఏపీ రాష్ట్రాల మధ్య విభజన సమస్యలు, ఇతర అపరిష్కృత అంశాలపై చర్చించి.. పరిష్కార మార్గాలను గుర్తించేందుకు కమిటీలు ఏర్పాటు చేయాలని రెండు రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయం తీసుకున్నాయి. ఇందులో భాగంగా ఇరు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల నేతృత్వంలో ఒక ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేయనున్నారు. అందులో ఇరు రాష్ట్రాల నుంచి ముగ్గురు చొప్పున అధికారులు సభ్యులుగా ఉంటారు. రెండు వారాల్లోగా ఈ కమిటీ సమావేశమై చర్చలు జరుపుతుంది. ఈ కమిటీ స్థాయిలో పరిష్కారం కాని అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకునేందుకు.. రెండు రాష్ట్రాల మంత్రులతో మరో కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ఆ మంత్రుల కమిటీ తేల్చిన పరిష్కారాలను ఇరు రాష్ట్రాల సీఎంలు అంగీకరించాలని నిర్ణయించారు. ఇక మంత్రుల కమిటీ స్థాయిలో సైతం పరిష్కారం లభించని అంశాలపై ఇరు రాష్ట్రాల సీఎంలు నేరుగా చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు. అపరిష్కృతంగా ఉన్న 'విభజన' అంశాలపై తెలంగాణ సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబుతోపాటు రెండు రాష్ట్రాల మంత్రులు, అధికారులు శనివారం సాయంత్రం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో సమావేశమయ్యారు. సాయంత్రం 6.20 నుంచి రాత్రి 8 గంటల వరకు గంటా 40 నిమిషాల పాటు ఈ సమావేశం జరిగింది. ఇందులో తెలంగాణ తరఫున ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు డి.శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీఎస్ శాంతికుమారి.. ఏపీ తరఫున మంత్రులు కందుల దుర్గేశ్, సత్యప్రసాద్, బీసీ జనార్దన్‌రెడ్డి, సీఎస్ నీరభ్‌కుమార్ ప్రసాద్

మిగతా 14వ పేజీలో ▶



7 బిల్లులకు గవర్నర్ ఓకే

- పెండింగ్‌లో ఉన్న బిల్లులకు రాధాకృష్ణన్ ఆమోదం
- దీర్ఘకాలంగా రాజ్‌భవన్‌లోనే ఆ బిల్లులు..
- బీఆర్‌ఎస్ సర్కారు ప్రతిపాదించిన పలు బిల్లులకు తమిళిసై నో
- ఇటీవల రాధాకృష్ణన్‌తో సీఎం రేవంత్‌రెడ్డి సుదీర్ఘ భేటీ
- పెండింగ్ బిల్లుల ప్రస్తావన.. వెంటనే ఆమోదముద్ర

సాక్షి, హైదరాబాద్: రాజ్‌భవన్‌లో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఏడు బిల్లులకు రాష్ట్ర ఇన్‌చార్జి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ శనివారం ఆమోదం తెలిపారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్ట సవరణకు సంబంధించిన మూడు బిల్లులతో పాటు తెలంగాణ స్టేట్ ప్రైవేటు యూనివర్సిటీల బిల్లు, తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) బిల్లు, తెలంగాణ స్టేట్ మైనార్టీస్ కమిషన్ బిల్లు, తెలంగాణ మున్సిపల్

మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

కాంగ్రెస్‌లోకి గద్వాల ఎమ్మెల్యే



గద్వాల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కృష్ణమోహన్ రెడ్డి చేరికతో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన ఎమ్మెల్యేల సంఖ్య ఏడుకు చేరింది.

- వివరాలు 2లో

కాళేశ్వరం లిఫ్టులపైనా విచారణ!



కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని కన్నెపల్లి (మేడిగడ్డ), సిరిపురం(అన్నారం), గోలివాడ (సుందిళ్ల) పంప్ హౌస్‌ల నిర్మాణంపై సైతం జస్టిస్ పినాకి చంద్రఘోష్ విచారణ ప్రారంభించినట్టు తెలుస్తోంది.

- వివరాలు 5లో

నిధుల సేకరణకు గ్రీన్‌సిగ్నల్



మూలధన వ్యయంతో పాటు ఇతర అవసరాల కోసం రుణ మార్కెట్ నుంచి ప్రాథమికంగా రూ. 5 వేల కోట్ల మేర నిధులు సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. టీజీఐఐసీ ద్వారా రుణం తీసుకొనేందుకు అవసరమైన ప్రక్రియను ప్రారంభించింది.

- వివరాలు 3లో

సికింద్రాబాద్ - గోవా మధ్య కొత్త బైవీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు



తెలుగు రాష్ట్రాలనుంచి గోవా వెళ్లే ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. సికింద్రాబాద్ నుంచి వాస్కోడిగామా (గోవా) వెళ్లేందుకు కొత్త ఎక్స్‌ప్రెస్ రైలును (17039/17040) ప్రారంభించనుంది.

- వివరాలు 13లో


కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న అజయ్‌కుమార్‌రెడ్డిని పరామర్శిస్తున్న వైఎస్ జగన్

12లో

అరాచకం ఆపండి

ఏపీ సీఎం చంద్రబాబుకు జగన్ మరోమారు హెచ్చరిక

- కూటమి అధికారంలోకి వచ్చాక చెడు సంప్రదాయానికి తెరలేపారు.. గతంలో ఎన్నికల తర్వాత అందరూ కలిసి ఉండే పరిస్థితి
- ఇప్పుడు భయాందోళన సృష్టిస్తున్నారు.. దాడులతో ఆనందం పొందుతున్నారు.. పులివెందులలో ఇలాంటి సంప్రదాయం మునుపెన్నడూ లేదు
- మీ మోసపూరిత వాగ్దానాల వల్ల 10% ఓట్లు టీడీపీకి షిఫ్ట్ అయ్యాయి.. ఎల్లకాలం అధికారం ఉండదని గుర్తుంచుకోండి.. ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చండి
- టీడీపీ దాడిలో గాయపడిన అజయ్‌కుమార్‌రెడ్డికి రిమ్స్‌లో పరామర్శ.. అండగా ఉంటామని భరోసా

ఉత్తరాఖండ్‌లో విరిగిపడిన కొండచరియలు

ఇద్దరు హైదరాబాద్ వాసుల మృత్యువాత

- ఉత్తరాఖండ్‌లో కొండచరియలు విరిగి పడిన ఘటనలో హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. బద్రీనాథ్ ఆలయాన్ని దర్శించుకుని మోటారు సైకిల్‌పై వస్తున్న నిర్మల్ షాహి, సత్య నారాయణలపై పర్వతప్రాంతం నుంచి బండ రాళ్లు దొర్లుకుంటూ వచ్చి పడటంతో చనిపోయారు.



6లో

ఏటా రెండుసార్లు టెట్

జూన్, డిసెంబర్‌లో నిర్వహిస్తామన్న ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఏటా రెండు సార్లు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటివరకు ఏటా ఏప్రిల్ లేదా మే నెలలో ఒకసారి మాత్రమే ఈ పరీక్ష నిర్వహిస్తుండగా.. ఇకపై రెండుసార్లు ఈ పరీక్ష నిర్వహించనున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ తెలిపింది. ఈమేరకు సవరణ ఉత్తర్వులను విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం జారీ చేశారు. ఒక అభ్యర్థి టెట్ పరీక్షను ఎన్నిసార్లు అయినా రాయొచ్చని, మెరుగైన మార్కుల కోసమే ఈ అవకాశం కల్పిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకుడితో పాటు ఎస్‌సీఈఆర్‌టీ సంచాలకులను ఆయన ఆదేశించారు.

రాజీనామా చేయించి ఎన్నికలకు వెళ్లే దమ్ముందా?

- ఫిరాయింపులపై సీఎం రేవంత్‌కు కేంద్ర మంత్రి బండి సవాల్
- ఇదేనా మీ పాంచ్ న్యాయ్?.. బీఆర్‌ఎస్ బాటలోనే కాంగ్రెస్ అడుగులు
- బీజేపీ ఎమ్మెల్యేలున్న చోట్ల అభివృద్ధి పనులు చేయడం లేదు
- రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీయే..

2లో


శనివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి బండి సంజయ్

ఇంతంజుకేత్


ఓన్లీ అధికార పార్టీ భవిష్యత్ మాత్రమే చెబుతారట!

ఇక బీఆర్‌ఎస్ యువగళం

- పార్టీ యంత్రాంగంలో యువతకు పెద్దపీట వేయాలని నిర్ణయం
- సంస్థాగతంగా దిద్దుబాటు చర్యలు ప్రారంభించిన అధినేత కేసీఆర్
- ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన నేతలకు పార్టీ బాధ్యతలు
- పార్టీ జిల్లా, రాష్ట్ర కమిటీల్లో ప్రధాన పదవులు వారికే
- ఉద్యమంలో అండగా నిలిచిన ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి వర్గాలతో తిరిగి దోస్తీకి కసరత్తు
- ఇప్పటికే కొందరితో సమావేశమై చర్చిస్తున్న పార్టీ కీలక నేతలు
- వచ్చే నెలలో ఘనంగా పార్టీ ఆవిర్భావ సభ నిర్వహించే యోచన



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో వరుస ఓటముల నేపథ్యంలో బీఆర్‌ఎస్ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. పార్టీ యంత్రాంగంలో యువతకు పెద్దపీట వేయాలని భావిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపై ఈ ఏడాది జనవరిలో ఉమ్మడి జిల్లాలవారీగా విశ్లేషణ చేపట్టిన గులాబీ దళం.. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లోనూ ఓడిపోవడంపై లోతుగా విశ్లేషణ జరిపింది. పార్టీ నాయకులు, కేడర్‌తోపాటు వివిధ సంస్థలు, వర్గాల నుంచి అందిన నివేదికలు, సమాచారాన్ని క్రోడీకరించి బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు కొందరు కీలక నేతలతో సారాంశాన్ని పంచుకున్నారు. దశాబ్దకాలంగా పార్టీ, పాలనాపరంగా దొర్లిన తప్పులు, పొరపాట్లకు సంబంధించి ఈ నివేదికల ద్వారా అనేక సూచనలు అందినట్లు సమాచారం. వాటితోపాటు తాజాగా జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఇటీవల తాజా రాజకీయ పరిస్థితులను కూడా కేసీఆర్ మదింపు చేసినట్లు సమాచారం. మరోవైపు జాతీయ, రాష్ట్ర రాజకీయాల్లో చోటుచేసుకొనే మార్పులు, బీఆర్‌ఎస్ భవిష్యత్తు ఎలా ఉండబోతోందనే కోణంలోనూ కేసీఆర్ పార్టీ ముఖ్య నేతలతో ఇప్పటికే లోతుగా చర్చించారు. పార్టీ ఆవిర్భావం నుంచి తెలంగాణ రాష్ట్ర అవతరణ వరకు బీఆర్‌ఎస్ ప్రస్థానం, ఆ తర్వాత పదేళ్ల పాటు పాలన సాగించిన తీరుతెన్నులను విశ్లేషించి దిద్దుబాటు ప్రణాళికను

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా కేకే

కేబినెట్ హోదాలో నియమిస్తూ ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా మాజీ ఎంపీ కె.కేశవరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనను ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు)గా కేబినెట్ మంత్రి హోదాలో నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

అభిషేక్ సింఘ్వీకి రాజ్యసభ సీటు!

కాగా, కేకే రాజీనామాతో ఖాళీ అయిన రాజ్యసభ స్థానాన్ని రాజస్తాన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత అభిషేక్ మను సింఘ్వీకి కేటాయించే యోచనలో కాంగ్రెస్ అధిష్టానం ఉన్నట్టు తెలుస్తోంది. ఇటీవల ఆయనను హరియాణా నుంచి రాజ్యసభకు పంపాలని పార్టీ నిర్ణయించినా అక్కడి కాంగ్రెస్ ఎమ్మెల్యేల క్రాస్‌ఓటింగ్‌తో సింఘ్వీ ఓటమి పాలయ్యారు. ఈ నేపథ్యంలో తెలంగాణ నుంచి ఆయనను రాజ్యసభకు పంపే ప్రతిపాదన ఉన్నట్టు గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

మంత్రి కోమటిరెడ్డిని కలిసిన అద్దంకి దయాకర్

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిశారు. శనివారం ఉదయం బంజారాహిల్స్‌లోని మంత్రి కోమటిరెడ్డి నివాసానికి వెళ్లిన దయాకర్ తాను హీరోగా నటిస్తున్న సినిమా ఆడియో లాంచ్ కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఇద్దరూ ఆత్మీయంగా మాట్లాడుకున్నారు.

'తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది'



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి కట్టుబడి ఉందని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలని, అన్ని రాష్ట్రాల అభివృద్ధికి మోదీ నేతృత్వంలోని సర్కార్ కట్టుబడి ఉన్నదని తెలియజేశారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బీజేపీ రాజ్యాంగం మారుస్తుందని, రిజర్వేషన్లు రద్దు చేస్తుందని రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారన్నారు. భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా శనివారం బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కె.లక్ష్మణ్, పార్టీనేతలు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, డా.కాసం వెంకటేశ్వర్లు, ప్రేమ్‌సింగ్ రాథోడ్, పీఎల్ శ్రీనివాస్, జయశ్రీ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ కశ్మీర్‌కు ప్రత్యేక అధికారాలు, స్వయం ప్రతిపత్తిని తీవ్రంగా వ్యతిరేకించి, ఆర్టికల్ 370 రద్దు కోసం ఉద్యమించిన గొప్ప దేశభక్తుడు శ్యామాప్రసాద్ అని పేర్కొన్నారు. కాగా, శనివారం సాయంత్రం రాజ్‌భవన్‌లో రాష్ట్ర ఇన్‌చార్జి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను లక్ష్మణ్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

అచ్చంపేట మున్సిపాలిటీ 'హస్తగతం'



అచ్చంపేట: నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ చేజిక్కించుకుంది. ఈ మున్సిపాలిటీ గతంలో బీఆర్ఎస్ ఆధీనంలో ఉండగా.. గత నెలలో చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టగా నెగ్గింది. ఈ మేరకు శనివారం ఉదయం ఎన్నికల అధికారి, ఆర్డీవో మాధవి నూతన చైర్మన్ ఎన్నిక నిర్వహించగా 14వ వార్డు కౌన్సిలర్ గార్లపాటి శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చైర్మన్‌గా గార్లపాటి శ్రీనివాసులు పేరును 1వ వార్డు కౌన్సిలర్ గౌరీశంకర్ ప్రతిపాదించగా.. 14 మంది కౌన్సిలర్లు, ఎమ్మెల్యే వంశీకృష్ణ చేతులెత్తి ఆమోదం తెలిపారు. దీంతో శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి మాధవి ప్రకటించారు. కాగా నూతన చైర్మన్ ఎన్నికకు పలువురు బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు.

12న బీజేపీ రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశం



సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మల్లికా కన్వెన్షన్ హాలులో ఈ నెల 12న బీజేపీ రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశం కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరగనుంది. ఈ సందర్భంగా పార్లమెంటు ఎన్నికల ఫలితాలపై సమీక్షతో పాటు పార్టీ సంస్థాగత విషయాలు, భవిష్యత్ కార్యక్రమాలు, రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించనున్నారు. ఈ సమావేశానికి పార్టీ ముఖ్యనేతలు, ఎంపీలు డీకే అరుణ, డాక్టర్ కె.లక్ష్మణ్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్, గరికపాటి మోహన్‌రావు, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు పాల్గొననున్నారు. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ముఖ్య అతిథిగా పాల్గొని కీలక అంశాలపై మార్గదర్శనం చేస్తారని బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి శనివారం తెలిపారు.

రాజీనామా చేయించి ఎన్నికలకు వెళ్లే దమ్ముందా?

కాంగ్రెస్‌లోకి ఫిరాయింపులపై సీఎం రేవంత్‌కు కేంద్ర మంత్రి బండి సంజయ్ సవాల్

- ఇదేనా మీ పాంచ్ న్యాయ్?.. బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ అడుగులు
- బీజేపీ ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు చేయడం లేదు
- రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీయే..
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కమలం పార్టీ సత్తా చూపుతుందని వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: పార్టీ ఫిరాయించే ప్రజాప్రతినిధులను అనర్హులను చేస్తామంటూ 'పాంచ్ న్యాయ్' పేరిట కాంగ్రెస్ ఇచ్చిన హామీ ఏమైందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నిలదీశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సింది పోయి ఫిరాయింపులపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి పెట్టడం దారుణమన్నారు. కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలతో చేత రాజీనామా చేయించి, ఎన్నికలకు వెళ్లే దమ్ముందా? అని సవాల్ చేశారు. పార్టీ ఫిరాయింపులు, అవినీతి, అక్రమాలు, హామీలు అమలు చేయకుండా మోసం చేసే విషయంలో కాంగ్రెస్‌కు, బీఆర్ఎస్‌కు తేడా లేదని విమర్శించారు. బండి సంజయ్ శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''మోదీ సర్కార్ వచ్చాక గోకుల్ చాట్ పేలుళ్లు లేవు. లుంబిని పార్కు బాంబు బ్లాస్టులు లేవు. ఉగ్రవాదుల ఊచకోతలు లేవు. నక్సలైట్ల అర్ధరాత్రి హత్యలు లేవు. దేశం ప్రశాంతంగా ఉంది. దేశ భద్రత మా ప్రథమ కర్తవ్యం.

రెండు లక్షల ఉద్యోగాల భర్తీ ఏది?

ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాళ్లకు మాత్రం ఉద్యోగాలు దొరికాయి. అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా ఒక్క ఉద్యోగం ఇవ్వని కాంగ్రెస్ సర్కార్.. మిగతా 5 నెలల్లో 2 లక్షల ఉద్యోగాలు ఎలా భర్తీ చేస్తుందో చెప్పాలి. ఇచ్చిన హామీలు నిలబెట్టుకోనందుకే లోక్‌సభ ఎన్నికల్లో సీట్లు తగ్గాయని కాంగ్రెస్ అధిష్టానానికి డౌట్



బీజేపీ కార్యాలయంలో బండి సంజయ్‌ను పూలమాలతో సత్కరిస్తున్న పార్టీ నేతలు

వచ్చింది. అందుకే కురియన్ కమిటీ వచ్చి హామీల అమలుపై కసరత్తు చేస్తున్నట్టుంది.

బీజేపీ ఎమ్మెల్యేల సెగ్మెంట్లకు నిధులివ్వరా?

రాష్ట్రంలో బీజేపీ ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి పనులు చేయడం లేదు. నిధుల పంపిణీ బాధ్యతను అక్కడ ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థులకు అప్పగించడం దుర్మార్గం. ఇది ప్రజాతీర్పును, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. రాష్ట్రంలో కాంగ్రెస్ మాదిరిగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తే.. వారి పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించాలి. రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా అన్ని పార్టీల ఎమ్మెల్యేలకు సమాన ప్రాధాన్యత, నిధుల కేటాయింపు జరపాలి.

చిత్తశుద్ధితో పనిచేయాలి

విభజన చట్టంలోని అంశాలపై రెండు రాష్ట్రాల సీఎంల సమావేశాన్ని స్వాగతిస్తున్నాం. అయితే చిత్తశుద్ధితో ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. ఇక కొందరు గోతికాడ నక్కలా సీఎంల భేటీని అడ్డుపెట్టుకుని మళ్లీ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు. అలాంటి వాళ్లకు అవకాశం ఇవ్వొద్దు. తెలంగాణ బిడ్డగా నా అభిప్రాయాలు నాకు ఉంటాయి. కానీ భారత ప్రభుత్వ ప్రతినిధిగా నేను రెండు రాష్ట్రాలను సమంగా చూడాల్సి ఉంటుంది. సమస్యల పరిష్కారానికి బాధ్యతతో కృషి చేస్తా.

రేవంత్, ఒవైసీ కుమ్మక్కయ్యారు

రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీయేనని లోక్‌సభ ఎన్నికల ఫలితాలు నిరూపించాయి. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీజేపీ గెలుపు ఖాయం. జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో ప్రజాసమస్యలను ప్రస్తావించిన బీజేపీ కార్పొరేటర్లపై ఎంఐఎం నేతల దాడి హేయమైన చర్య. సీఎం రేవంత్‌తో ఒవైసీ కుమ్మక్కై దాడులకు పాల్పడుతున్నారు. బీజేపీ తలచుకుంటే ఎంఐఎం నేతలు బయట తిరగలేరు..''అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

కేకే ఒక్కడితోనే ఎలా రాజీనామా చేయిస్తారు?

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావు ఒక్కరితోనే ఎట్లా రాజీనామా చేయిస్తారు? నిజంగా కాంగ్రెస్ ప్రజా పాలన మీద అంత నమ్మకం ఉంటే ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఎన్నికలకు వెళ్లాలి. కాంగ్రెస్‌లోకి 26 మంది ఎమ్మెల్యేలు ఫిరాయించబోతున్నారని వార్తలు వస్తున్నాయి. వారందరితో రాజీనామా చేయించి ఎన్నికలకు వెళితే.. ఆ సీట్లను బీజేపీ కైవసం చేసుకోవడం ఖాయం. బీజేపీలోకి రావాలనుకునే ఎమ్మెల్యేలెవరైనా రాజీనామా చేసి చేరాల్సిందే. గతంలో హుజూరాబాద్, మును గోడు ఎమ్మెల్యేలు రాజీనామా చేశాకే బీజేపీలో చేరారు.

శ్రీధర్‌రెడ్డి హంతకుల అరెస్ట్ ఎప్పుడు?

ఐజీకి కేంద్రమంత్రి బండి ఫోన్

సాక్షి, హైదరాబాద్: వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన సీనియర్ నేత శ్రీధర్ రెడ్డి హత్య జరిగి 50 రోజులు కావొస్తున్నా దోషులను అరెస్ట్ చేయకపోవడంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అసహనం వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి, నాగర్ కర్నూలు జిల్లా బీజేపీ అధ్యక్షుడు సుధాకర్ రావు ఆధ్వర్యంలో శనివారం శ్రీధర్ రెడ్డి తండ్రి బొడ్డు శేఖర్ రెడ్డి కుటుంబ సభ్యులు సహా పలువురు నేతలు పార్టీ కార్యాలయంలో బండి సంజయ్‌కు వినతిపత్రం అందజేశారు. తమ కుమారుడు చనిపోయి 50 రోజులైనా కనీసం నిందితులపై చర్యలు తీసుకోలేదని తండ్రి శేఖర్ రెడ్డి వాపోయారు. స్థానిక పోలీసులపై తమకు నమ్మకం పోయిందని, కేంద్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని వారు కోరారు. వెంటనే స్పందించిన బండి సంజయ్ ఐజీకి ఫోన్ చేశారు. తక్షణమే దోషులను అరెస్ట్ చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ శ్రీధర్ రెడ్డి హత్యకు కారకులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

7 బిల్లులకు గవర్నర్ ఓకే!

▶ మొదటి పేజీ తరువాయి

చట్టాల సవరణ బిల్లుకు గవర్నర్ ఆమోదముద్ర వేశారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి గత సోమవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో సుమారు రెండు గంటలపాటు సమావేశమై పెండింగ్ బిల్లుల అంశాన్ని ప్రస్తావించారు. ఈ నేపథ్యంలోనే గవర్నర్ పెండింగ్ బిల్లులపై నిర్ణయం తీసుకున్నారు. గత బీఆర్ఎస్ సర్కారు రాష్ట్ర శాసనసభలో ఆమోదించిన చాలా బిల్లులను నాటి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆమోదించకుండా సుదీర్ఘ కాలం పెండింగ్‌లో పెట్టారు. దీనిపై అప్పటి ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దాంతో తమిళిసై కొన్ని బిల్లులను మాత్రమే ఆమోదించారు. తెలంగాణ విశ్వవిద్యాలయాల ఉమ్మడి నియామక బోర్డు బిల్లు, తెలంగాణ అటవీ విశ్వవిద్యాలయం బిల్లును రాష్ట్రపతికి పంపించారు. మిగిలిన బిల్లులను తిరస్కరించడం లేదా ప్రభుత్వానికి తిప్పిపంపించడం చేశారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం శాసనసభ రెండోసారి ఆమోదించిన బిల్లులను గవర్నర్ తప్పనిసరిగా ఆమోదించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో పెండింగ్ బిల్లుల్లో నాలుగింటిని గత బీఆర్ఎస్ సర్కారు రెండోసారి రాష్ట్ర శాసనసభలో ఆమోదించి రాజ్‌భవన్‌కు పంపినా తమిళిసై ఆమోదించలేదు. తాజాగా ఏడు బిల్లులను గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఆమోదించడంతో ఈ వ్యవహారం కొలిక్కి వచ్చింది.

మరో ఐదు ప్రైవేటు వర్సిటీలకు చాన్స్

తెలంగాణ ప్రైవేటు విశ్వవిద్యాలయాల చట్ట సవరణ బిల్లు–2022ను గవర్నర్ ఆమోదించడంతో రాష్ట్రంలో కొత్తగా మరో ఐదు ప్రైవేటు విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు వీలు కలగనుంది. ఈ బిల్లును బీఆర్ఎస్ ప్రభుత్వం రెండోసారి శాసనసభలో ఆమోదించి రాజ్‌భవన్‌కు పంపించింది. కాగా మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలో ఎన్ఐసీఎంఏఆర్ (NICMAR) యూనివర్సిటీ, సంగారెడ్డిలో ఎంఎన్ఆర్, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో గురునానక్, మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం యామ్నంపేటలో శ్రీనిధి, సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గౌరారంలో కావేరి వర్సిటీల ఏర్పాటుకు మార్గం సుగమం అయ్యింది.

'అవిశ్వాసం' ఇక నాలుగేళ్ల తర్వాత..

మున్సిపల్ చట్టాల సవరణ బిల్లు–2022కు ఆమోదముద్ర లభించడంతో మున్సిపల్ చైర్‌పర్సన్/వైస్ చైర్‌పర్సన్‌లపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు కనీస కాల వ్యవధిని 3 ఏళ్ల నుంచి 4 ఏళ్లకు పెరిగింది. రాష్ట్రంలోని 129 మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల మేయర్లు/చైర్‌పర్సన్లు, డిప్యూటీ మేయర్లు/వైస్ చైర్‌పర్సన్లపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి వారి పదవీ కాలం కనీసం మూడేళ్లు ముగిసి ఉండాలని మున్సిపాలిటీల చట్టం పేర్కొంటోంది. మేయర్లు/చైర్‌పర్సన్లు, వైస్ చైర్మన్లు/డిప్యూటీ మేయర్లను బెదిరించడానికి, బ్లాక్ మెయిల్ చేయడానికి కౌన్సిలర్లు/కార్పొరేటర్లు ఈ నిబంధనను దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొంటూ గత ప్రభుత్వం ఈ వ్యవధిని 4 ఏళ్లకు పెంచాలనే ప్రతిపాదన చేసింది.

రాజ్యసభ సభ్యులకూ ఓటు హక్కు

➤ మున్సిపాలిటీల ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, లోక్‌సభ సభ్యులు, రాజ్యసభ సభ్యులు వ్యవహరిస్తారని మునిసిపాలిటీల చట్టంలో ఉండగా, చైర్‌పర్సన్/మేయర్, వైస్ చైర్‌పర్సన్/డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో ఓటేసే హక్కు మాత్రం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, లోక్‌సభ సభ్యులకు మాత్రమే ఉన్నట్టు చట్టంలో ఉంది. 'రాజ్యసభ సభ్యులు' అనే పదాన్ని చేర్చడంలో చట్టం రూపొందించే సమయంలో పొరపాటున మరిచిపోయారు. ఈ నేపథ్యంలో రాజ్యసభ సభ్యులకు సైతం ఓటు హక్కును కల్పిస్తూ ప్రభుత్వం ఈ బిల్లు రూపొందించింది. ➤ ఇక జీహెచ్ఎంసీలో ముగ్గురు కో–ఆప్షన్ సభ్యులకు గాను ఇద్దరు మైనారిటీలు ఉండాలి. జీహెచ్ఎంసీ పరిధి పెరిగిన నేపథ్యంలో కోఆప్షన్ సభ్యుల సంఖ్య 9కి, వారిలో మైనారిటీల సంఖ్య 6కి పెంచాలనే మరో ప్రతిపాదన ఈ బిల్లులో పెట్టారు.

మున్సిపాలిటీగా ములుగు

ములుగు మున్సిపాలిటీ ఏర్పాటు, కేతనపల్లి మున్సిపాలిటీ పేరును రామకృష్ణాపూర్‌గా మార్పు సంబంధిత అంశం కూడా బిల్లు ద్వారా ప్రతిపాదించారు. దీనిని కూడా రెండోసారి శాసనసభలో ఆమోదించి రాజ్‌భవన్‌కు పంపించారు.

మైనారిటీల జాబితాలో జైనులు

➤ తెలంగాణ స్టేట్ మైనార్టీస్ కమిషన్ చట్ట సవరణ బిల్లుతో రాష్ట్రంలోని మైనారిటీల జాబితాలో జైనులకు కూడా చోటు లభించింది. రాష్ట్ర మైనార్టీస్ కమిషన్‌లో ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, పార్శీలతో పాటు కొత్తగా జైన మతస్తుడిని సైతం సభ్యుడిగా నియమించడానికి వీలు కలిగింది.

➤ తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) బిల్లు ద్వారా హైదరాబాద్ నగరం నలువైపులా 4 బోధనాస్పత్రుల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రతిపాదించింది.

3 పంచాయతీలుగా భద్రాచలం

పంచాయతీరాజ్ చట్టసవరణ బిల్లుకు ఆమోదం లభించడంతో పాలన వికేంద్రీకరణలో భాగంగా భద్రాచలంను మూడు గ్రామ పంచాయతీలుగా, సారపాకను రెండు గ్రామ పంచాయతీలుగా విభజించడానికి, రాజంపేటను కొత్త గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసేందుకు మార్గం సుగమమైంది.

ఇక బీఆర్ఎస్ యువగళం

▶ మొదటి పేజీ తరువాయి

కేసీఆర్ ఖరారు చేసినట్లు సమాచారం.

దెబ్బతీసిన రాజకీయ పునరేకీకరణ

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత పాలనా సంస్కరణలు, మౌలికవసతుల కల్పనపై దృష్టి కేంద్రీకరించడంతో విద్యార్థులు, యువత, ఉద్యోగ వర్గాలు దూరమైనట్లుగా బీఆర్ఎస్ నిర్ధారణకు వచ్చింది. ప్రైవేటు రంగంలో భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన జరిగినా బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్, బీజేపీ ఉద్దేశపూర్వకంగా యువత, విద్యార్థులు ప్రేరేపించినట్లు గుర్తించింది. మరోవైపు కొన్ని సామాజికవర్గాలను కూడా బీఆర్ఎస్‌కు దూరం చేయడంలో ఈ రెండు పార్టీలు లోపాయికారీగా పనిచేశాయని పార్టీ నేతలు కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు ఉద్యమ సమయంలో ఇతర పార్టీల నుంచి నేతల చేరిక బీఆర్ఎస్ బలోపేతానికి దోహదం చేయగా అధికారంలోకి వచ్చాక రాజకీయ పునరేకీకరణ పేరిట జరిగిన వలసలు పార్టీ క్షీణతకు దారితీసినట్లు నివేదికలు వెల్లడించాయి. అధికార పార్టీలో చేరి పదవులు, ఆర్థిక ప్రయోజనాలు పొందిన నేతలే ఆ తర్వాత బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్, బీజేపీలో క్రియాశీల పాత్ర పోషించారని నివేదించాయి. ఇతర పార్టీల నుంచి చేరిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం, క్షేత్రస్థాయిలో సంస్థాగత నిర్మాణం లేకపోవడం, ఎమ్మెల్యేలపైనే పార్టీ కార్యకలాపాలు పూర్తిగా ఆధారపడటం తదితర కారణాలతో పార్టీ దెబ్బతిన్నట్లు కేసీఆర్‌కు అందిన నివేదికలు వెల్లడించాయి. పార్టీ పేరును టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా మార్చడంతో 'తెలంగాణ' నినాదానికి దూరమైందని.. ఇతర రాష్ట్రాలపై దృష్టి పెంచడం కూడా అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయావకాశాలను దెబ్బతీసిందని గుర్తించారు.

అంతరాన్ని పూడ్చే ప్రయత్నాలు

రెండు దశాబ్దాలకుపైగా తెలంగాణ రాజకీయాలను శాసించిన బీఆర్ఎస్ ఇకపైనా అదే స్థాయిలో పనిచేసేలా చూడాలని కేసీఆర్ నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఉద్యమకాలం నుంచి పార్టీతో కలిసి నడుస్తున్న వారికి కీలక బాధ్యతలు అప్పగించడంపై దృష్టి సారించారు. గతంలో పార్టీతో సన్నిహితంగా మెలిగి ప్రస్తుతం స్తబ్దుగా ఉంటున్న వారిని గుర్తించి తిరిగి వారిని క్రియాశీలం చేయాలనుకుంటున్నారు. ఉద్యమ సమయంలో వెంట నడిచిన ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి వర్గాలు, వివిధ సామాజిక వర్గాలకు దగ్గరయ్యేందుకు ఇప్పటికే ప్రయత్నాలు మొదలయ్యాయి. కీలక నేతలు కొందరు ఇప్పటికే ఆయా వర్గాలకు చెందిన వారితో సమావేశమై రాబోయే రోజుల్లో కలిసి పనిచేద్దామని ప్రతిపాదిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు కేసీఆర్ తీరును ఎండగట్టిన కొందరు మేధావులు తాము ఇప్పటికిప్పుడే యూటర్న్ తీసుకొనే పరిస్థితి లేదంటూనే కొంత వ్యవధి కావాలని కోరుతున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ విధానాలతోనూ తాము సంతృప్తిగాలేమని చెబుతూ బీఆర్ఎస్‌తో కలిసి నడిచేందుకు సుముఖత చూపుతున్నట్లు సమాచారం. రాబోయే రోజుల్లో భావసారూప్య వ్యక్తులు, సంస్థలతోనూ భేటీలు ముమ్మరం చేయాలని కేసీఆర్ భావిస్తున్నట్లు తెలియవచ్చింది. మరోవైపు పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని కూడా వీలైనంత త్వరగా ప్రారంభించాలని కేసీఆర్ నిర్ణయించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కీలక నేత హరీశ్‌రావు, ఇతర ముఖ్య నేతల నడుమ కూడా పని విభజన చేసి కొన్ని ప్రత్యేక బాధ్యతలు అప్పగించే అవకాశముంది.

యువతకు కీలక బాధ్యతలు

పార్టీ సంస్థాగత నిర్మాణంలో యువతకు కీలక బాధ్యతలు అప్పగించడంతోపాటు వారిని క్షేత్రస్థాయి కార్యక్రమాల్లో మమేకం చేయనున్నారు. గతంలో వివిధ కార్పొరేషన్లు, కమిషన్ల చైర్మన్లు, సభ్యులుగా పనిచేసిన యువ నాయకులను పార్టీ తరఫున జరిగే క్షేత్రస్థాయి కార్యక్రమాల్లో ముందు వరుసలో నిలపనున్నారు. బాల్క సుమన్, గ్యాదరి కిషోర్, ఎర్రోళ్ల శ్రీనివాస్, కె.వాసుదేవ రెడ్డి, ఆంజనేయగౌడ్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, రాజారాం యాదవ్, దూదిమెట్ల బాలరాజు యాదవ్, రాకేశ్‌రెడ్డి, శుభప్రద్ పటేల్, తుంగ బాలు, స్వామియాదవ్, ప్రవీణ్‌రెడ్డితోపాటు పలువురు యువ నేతలకు పార్టీ కమిటీల్లో చోటు కల్పించాలని నిర్ణయించారు. ఇప్పటికే నియోజకవర్గాలవారీగా నేతలు, కార్యకర్తలతో ఎర్రవల్లి నివాసంలో కేసీఆర్ భేటీ అవుతున్నారు. ఆగస్టులో పార్టీ ఆవిర్భావ సభ ఘనంగా నిర్వహించే యోచనలో ఆయన ఉన్నారు. మరోవైపు సోషల్ మీడియా వేదికగా బీజేపీ, కాంగ్రెస్‌లు బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తుండటంతో సోషల్ మీడియా విభాగాన్ని కూడా పటిష్టం చేయడంపై బీఆర్ఎస్ దృష్టి సారించింది.

కాంగ్రెస్‌లోకి గద్వాల ఎమ్మెల్యే

- ముఖ్యమంత్రి సమక్షంలో చేరిన కృష్ణమోహన్‌రెడ్డి
- సరితను సముదాయించి బండ్లకు పార్టీ కండువా కప్పిన సీఎం
- మంత్రి శ్రీధర్‌బాబుతో ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల భేటీ

సాక్షి, హైదరాబాద్/సాక్షి, రంగారెడ్డి జిల్లా/సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: గద్వాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం ఉదయం జూబ్లీహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మంత్రి జూపల్లి కృష్ణారావు, మరో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇలావుండగా సీఎం రేవంత్ త్వరలోనే గద్వాలలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రారంభించనున్నారు. ఆ రోజు భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కాగా అదే రోజు కృష్ణమోహన్‌రెడ్డి అనుచరులు, ముఖ్య కార్యకర్తలు భారీ సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉందని తెలిసింది.

జెడ్పీ చైర్మన్‌కు సీఎం సముదాయింపు

మరోవైపు బండ్ల చేరికను వ్యతిరేకిస్తూ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత వర్గీయులు కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో శనివారం ఆమె సీఎం రేవంత్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమెను ముఖ్యమంత్రి సముదాయించినట్లు తెలిసింది. ఆ తర్వాతే బండ్ల కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం గమనార్హం. ఉమ్మడి పాలమూరు జిల్లాలో మొత్తం 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. గద్వాల, అలంపూర్ మినహా మిగిలిన 12 స్థానాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. తాజాగా గద్వాల ఎమ్మెల్యే హస్తం గూటికి చేరడంతో జిల్లాలో కాంగ్రెస్ బలం 13కు పెరిగింది.



నిధులు కేటాయించండి

శ్రీధర్‌బాబుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వినతి

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శనివారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబుతో భేటీ అయ్యారు. ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డిలు సచివాలయంలో మంత్రిని కలిశారు. తమ నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని వారు మంత్రిని కోరారు. అయితే ఆరుగురు ఎమ్మెల్యేలు జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కలవడం రాజకీయంగా చర్చనీయాంశమైంది.

విలువలు వల్లిస్తూ, ఫిరాయింపులు ప్రోత్సహిస్తున్నారు

- కాంగ్రెస్‌పై మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ధ్వజం
- రాహుల్ గాంధీ ద్వంద్వ విధానాలను మానాలి
- ఫిరాయించిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలి
- రాజ్యాంగాన్ని అపహాస్యం చేయవద్దని కాంగ్రెస్ అగ్రనేతకు లేఖ



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఒక వైపు రాజ్యాంగ విలువల గురించి మాట్లాడుతూ, మరో వైపు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తోందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ధ్వజమెత్తారు. గతంలో ఇతర పార్టీల నుంచి చేరికల విషయంలో బీఆర్ఎస్ పార్టీ చట్టబద్ధంగా వ్యవహరించిందన్నారు. రాజ్యాంగ నియమాలకు లోబడే ఆయా పార్టీల శాసనసభా పక్షాలు బీఆర్ఎస్‌లో విలీనమయ్యాయని వివరించారు. శనివారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ తీరుపై మండిపడ్డారు. ఓ వైపు కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ నేతల ఇళ్లకు వెళ్తూ.. కాంగ్రెస్ కండువాలు కప్పుతుండగా, రాహుల్‌గాంధీ మాత్రం రాజ్యాంగ విలువల గురించి నీతులు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ద్వంద్వ విధానాలకు రాహుల్ గాంధీ స్వస్తి పలికి పార్టీ మారిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు అవుతున్నా ఆరు గ్యారంటీలు మాత్రం అమలుకు నోచుకోవడం లేదని విమర్శించారు. తమ పార్టీకి చెందిన ఏడుగురు ఎమ్మెల్యేలను చేర్చుకుని బీఆర్ఎస్ పని అయిపోయిందని కాంగ్రెస్ నేతలు విన్యాసాలు చేస్తున్నారని నిరంజన్‌రెడ్డి అన్నారు. పార్లమెంటులో కాంగ్రెస్ ప్రాతినిధ్యం కేవలం 20 శాతం మాత్రమేనన్నారు. కానీ తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ ప్రాతినిధ్యం 33 శాతం ఉందనే విషయాన్ని గమనించాలన్నారు. దీనిని బట్టి బీఆర్ఎస్ పార్టీ ఉందో లేదో కాంగ్రెస్ నేతలే తేల్చుకోవాలన్నారు.

కాంగ్రెస్ ఆగడాలను జాతీయ స్థాయిలో ప్రశ్నిస్తాం

పార్లమెంటులో రాహుల్ రాజ్యాంగాన్ని చేత పట్టుకుని దానినే అపహాస్యం చేస్తున్నారని నిరంజన్‌రెడ్డి విమర్శించారు. కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌లో చేరిన నేపథ్యంలో శనివారం రాహుల్ గాంధీకి నిరంజన్‌రెడ్డి లేఖ రాశారు. ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని పటిష్టం చేస్తామని ప్రకటించిన రాహుల్ .. మరోవైపు బీఆర్ఎస్ నుంచి వచ్చిన ఎమ్మెల్యేలతో కరచాలనం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ద్వంద్వ విధానాలను జాతీయ స్థాయిలో ప్రశ్నిస్తామని, రాహుల్ దీనికి సమాధానం చెప్పాల్సి ఉంటుందని పేర్కొన్నారు. గతంలో రాహుల్‌ను బీజేపీ ఇక్కట్లకు గురిచేసిన సందర్భంలో పార్టీలకు అతీతంగా తాము సానుభూతి చూపిన విషయాన్ని నిరంజన్‌రెడ్డి గుర్తు చేశారు.

రాష్ట్ర ప్రయోజనాలపై రాజీపడితే ఊరుకోం

తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీని స్వాగతిస్తున్నాం: ఏలేటి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాలకోసం రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీపడితే చూస్తూ ఊరుకోబోమని బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. విభజన సమస్యల పరిష్కారానికి రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీని స్వాగతిస్తున్నామన్నారు. శనివారం అసెంబ్లీ మీడియా హాల్ ఆయన మీడియాతో మాట్లాడుతూ, తాము ఎన్నిసార్లు ప్రయత్నించినా స్పీకర్ ప్రసాద్‌కుమార్ అందుబాటులోకి రావడం లేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని పిటిషన్ ఇచ్చేందుకు ప్రయత్నిస్తుంటే స్పీకర్ తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికే ఈ అంశం హైకోర్టులో కేసు ఉందని, తాము అవసరమైతే సుప్రీంకోర్టును కూడా ఆశ్రయిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. సర్కార్ పెద్దలు, వివిధ ట్యాక్సుల పేరుతో అవినీతికి పాల్పడిన తీరును తాను వాస్తవాలతో బయటపెట్టానని తెలిపారు. ముఖ్యంగా సివిల్ సప్లయ్ శాఖలో జరిగిన అవినీతి అక్రమాలపై కేంద్రానికి నివేదిక ఇచ్చామని, త్వరలోనే విచారణ జరుగుతుందని తెలిపారు.

వంద కోట్లు ముడుపులు చెల్లించాలేమో..

గత ప్రభుత్వంలో సర్పంచులు లక్షల రూపాయలు అప్పులు చేసి గ్రామాల్లో పనులు చేయించారని, కానీ, కేసీఆర్ సర్కారు ఆ పనులకు సంబంధించిన నిధులు విడుదల చేయలేదని ఏలేటి చెప్పారు. 'రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి ప్రభుత్వం ఒక్కో పంచాయతీలో రూ.3 లక్షల నుంచి రూ.కోటి వరకు బకాయి ఉన్నట్లు సర్పంచులు చెబుతున్నారు. ఈ లెక్కన రాష్ట్రం మొత్తమ్మీద రూ.1000 కోట్లకు పైగా బిల్లుల బకాయి ఉన్నట్లు సమాచారం. పది శాతం కమీషన్లు ఇస్తే తప్ప ఆర్థిక శాఖ బిల్లులు ఇవ్వడం లేదనే ఆరోపణలున్నాయి. వెయ్యి కోట్లకుపైగా ఉన్న పెండింగు బిల్లులను క్లియర్ చేసేందుకు పది శాతం కమిషన్ అంటే.. వంద కోట్లు ముడుపులు చెల్లించాలేమో'అని మహేశ్వర్ రెడ్డి వ్యాఖ్యానించారు.

ఎన్నికలు వద్దు.. వేలం ముద్దు: దాసోజు శ్రవణ్



సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగబద్ధ సంస్థలు ఉద్దేశపూర్వకంగా మౌన ప్రేక్షకులుగా మారడంతో రాజకీయ ఫిరాయింపులు చట్టబద్ధమవుతున్నాయని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ విమర్శించారు. భారత ఎన్నికల సంఘం ఇకపై ఎన్నికలు నిర్వహణ నిలిపివేసి పదవులకు వేలం నిర్వహిస్తే బాగుంటుందన్నారు. ఎక్కువ బిడ్ దాఖలు చేసిన వారికే ఎమ్మెల్యే పదవులు ఇస్తే సరిపోతుందని వ్యాఖ్యానించారు. ఇకపై ఎన్నికలు వద్దు.. వేలం ముద్దు అనే నినా దాన్ని పాటించాలని ఎద్దేవా చేశారు. కులం, ధనం, తప్పుడు హామీలతో తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కొందరు మరగుజ్జులు రాజ్యాంగాన్ని కలుషితం చేస్తున్నారని దాసోజు మండిపడ్డారు. రేవంత్ ప్రభుత్వం ఎన్నికైన ప్రజాప్రతినిధులను బ్లాక్‌మెయిల్ చేస్తూ, బెదిరింపులకు పాల్పడుతూ ప్రజలిచ్చిన తీర్పును, ఎన్నికల విధానాన్ని తీవ్రంగా కించపరుస్తోందని ఆరోపించారు. ఈ తరహా చర్యలు ప్రజాస్వామ్యాన్ని కించపరడం మినహా మరొకటి కాదని దాసోజు వ్యాఖ్యానించారు.

నిధుల సేకరణకు గ్రీన్‌సిగ్నల్

తాజాగా మరో టెండర్ జారీ చేసిన టీజీఐఐసీ

- మర్చంట్ బ్యాంకర్ ఎంపికకు షెడ్యూల్
- ఈ నెల 12లోగా టెండర్ దాఖలుకు గడువు
- నిధుల కోసం పరిశ్రమల భూములు కుదువ
- ఎంపికైన సంస్థలకు కనీసం రూ. 5 వేల కోట్లు టార్గెట్



సాక్షి, హైదరాబాద్: మూలధన వ్యయంతో పాటు ఇతర అవసరాల కోసం రుణ మార్కెట్ నుంచి ప్రాథమికంగా రూ. 5 వేల కోట్ల మేర నిధులు సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. తెలంగాణ పారిశ్రామిక మౌలికవసతుల కల్పన సంస్థ (టీజీఐఐసీ) ద్వారా రుణం తీసుకొనేందుకు అవసరమైన ప్రక్రియను ప్రారంభించింది. నిధుల సేకరణ బాధ్యతను రుణాలు ఇప్పించడంలో అనుభవంగల 'మర్చంట్ బ్యాంకర్'కు అప్పగించాలని నిర్ణయించింది. మర్చంట్ బ్యాంకర్ ఎంపికకు గత నెల 23న జారీ చేసిన టెండర్‌ను రద్దు చేసిన టీజీఐఐసీ... తాజాగా మరో టెండర్ షెడ్యూ ల్‌ను విడుదల చేసింది. దీనిప్రకారం ఈ నెల 12లోగా ఫైనాన్షియల్ సంస్థలు బిడ్లు దాఖలు చేసుకోవచ్చు. అదేరోజు సాయంత్రం సాంకేతి క బిడ్లను తెరిచి అర్హతగల సంస్థలకు సమా చారం ఇస్తారు. 2019–24 మధ్య రుణ మార్కె ట్ నుంచి రూ. 20 వేల కోట్లకుపైగా సేకరించిన సంస్థలకు ఎంపికలో ప్రాధాన్యత ఇస్తారు. ఎంపికైన బిడ్డర్ కనీసం రూ. 5 వేల కోట్ల మేర నిధులు సేకరించి ఇవ్వాల్సి ఉంటుంది. రుణం సేకరించి ఇచ్చే మర్చంట్ బ్యాంకర్‌కు కనీసం ఒక శాతం కమీషన్ లభించే అవకాశం ఉంది. టీజీఐఐసీ ఎంపిక చేసే మర్చంట్ బ్యాంకర్ నిధుల సేకరణకు అవసరమయ్యే అన్ని రకాల అనుమతులు, క్లియరెన్సులు, లైసెన్సులు తదితరాల బాధ్యతలు చూసుకోవాలి.

రూ. 10 వేల కోట్లు సేకరణ లక్ష్యం..?

టీజీఐఐసీ ఎంపిక చేసే మర్చంట్ బ్యాంకర్ కనీసం రూ. 5 వేల కోట్ల నిధులు సేకరించాలనే లక్ష్యాన్ని టీజీఐఐసీ విధించింది. అయితే ఒకరికంటే ఎక్కువ మంది మర్చంట్ బ్యాంకర్లను ఎంపిక చేసి మొత్తంగా రూ. 10 వేల కోట్లు సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి. టీజీఐఐసీ వద్ద ఉన్న పరిశ్రమల భూముల బ్యాంకు నుంచి కోకాపేట, రాయదుర్గం ప్రాంతంలోని 400 ఎకరాలకుపైగా భూమిని కుదువ పెట్టడం ద్వారా రూ. 10 వేల కోట్లు సేకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. విలువైన ప్రాంతంలో ఉన్న ఈ భూముల విలువను సగటున ఎకరాకు రూ. 50 కోట్లుగా లెక్కకట్టినట్లు సమా చారం. వీలైనంత త్వరగా నిధుల సేకరణ ప్రక్రియను ప్రారంభించాలని టీజీఐఐసీ భావిస్తోంది. రుణ మార్కెట్ నుంచి టీజీఐఐసీ రూ.10వేలు కోట్లు సేకరించేందుకు ప్రయత్నిస్తోందని శనివారం 'సాక్షి' ప్రధాన సంచికలో 'పరిశ్రమల భూములు తాకట్టు' అనే శీర్షికతో కథనం ప్రచురితమవడం తెలిసిందే.

డీఎస్సీ పరీక్షలపై టీ–శాట్ అవగాహన కార్యక్రమాలు

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం నిర్వహించనున్న డీఎస్సీ పరీక్షలపై అభ్యర్థులకు అవగాహన కల్పించేందుకు టీ–శాట్ ప్రత్యక్ష ప్రసారాలు చేయనున్నట్లు టీ–శాట్ సీఈవో వేణుగోపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 11,062 పోస్టులకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు పరీక్ష రాసే విధానం, ఇతర అంశాలపై అవగాహన కల్పిస్తామని, సబ్జెక్టుల వారీగా ప్రత్యేక ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈనెల 8 నుంచి ఉదయం 11 నుంచి 12 గంటల వరకు నిపుణ చానల్‌లో ఫ్యాకల్టీతో ప్రత్యక్ష ప్రసారాలుంటాయన్నారు. మొదటి రోజు ఇంగ్లిష్, 9న సైన్స్, 10న మ్యాథ్స్, 11న తెలుగుతో పాటు హిందీ, ఉర్దూ భాషలపైనా కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ, పండిట్స్, పీఈటీ, స్పెషల్ కేటగిరీ టీచర్లకు ఉపయోగపడే విధంగా ప్రత్యక్ష ప్రసారా లుంటాయని ఆయన వివరించారు. విద్య చానల్‌లో రాత్రి 7 నుంచి 8 గంటల వరకు ఈ కార్యక్రమాలు పునః ప్రసారమవుతాయన్నారు.

వర్గీకరణకు చట్టబద్ధత ఏదీ?

- మందకృష్ణకు పిడమర్తి బహిరంగ లేఖ



లేఖను విడుదల చేస్తున్న పిడమర్తి రవి

పంజగుట్ట (హైదరాబాద్): మూడు దశాబ్దాల ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో మంద కృష్ణ మాదిగ ఎన్నో పార్టీలకు మద్దతిచ్చినా.. వర్గీకరణను చట్టరూపంలో తీసుకు రాలేకపోయారని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి ఎద్దేవా చేశారు. ఈ మేరకు మందకృష్ణ మాదిగకు ఆయన రాసిన బహిరంగలేఖను సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి మద్దతు పలికిన మందకృష్ణ.. ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణకు ఎందుకు చట్టబద్ధత చేయించలేకపోయారని ప్రశ్నించారు. ఇప్పుడు సుప్రీంకోర్టు.. వర్గీకరణను రాష్ట్రాలే చేసుకోవచ్చని తీర్పుఇస్తే సీఎం రేవంత్ రెడ్డి దగ్గరకు ఏ ముఖం పెట్టుకుని వెళ్తారని నిలదీశారు. అప్పుడు బీజేపీ వైపు ఉంటారా? లేక కాంగ్రెస్ వైపు వస్తారా? అన్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి మాదిగ బస్తీబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పిడమర్తి తెలిపారు. ముందుగా సికింద్రాబాద్, హైదరాబాద్, మల్కాజ్‌గిరి, చేవెళ్ల నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాల్లోని ప్రతీ నియోజకవర్గంలోని దళిత వాడల్లో పర్యటిస్తామని వెల్లడించారు.

ఒడవని జీవో 317 లొల్లి

ఎస్సీ గురుకుల సొసైటీలో ఉద్యోగుల కేటాయింపులో గందరగోళం

- కార్యాచరణపై ఇప్పటివరకు పడని ముందడుగు
- ప్రస్తుతం సాధారణ బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) పరిధిలో జీవో 317 అమలుపై తీవ్ర గందరగోళం నెలకొంది. రాష్ట్రంలో అమల్లోకి వచ్చిన నూతన జోనల్ విధానానికి అనుగుణంగా ఉద్యోగుల కేటాయింపు చేపట్టేందుకు గత నెలలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించినప్పటికీ సాంకేతిక సమస్యలు నెలకొనడంతో అమలు తీరు అయోమయంలో పడింది. ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలో 317 కేటగిరీలో దాదాపు నాలుగు వందల మందికి పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది. కాంట్రాక్టు పద్ధతిలో నియమితులైన 550 మంది టీచర్ల సర్వీసు క్రమబద్ధీకరించిన అనంతరం వారికి కూడా జోన్ల కేటాయింపు, పోస్టింగ్ ఇవ్వాల్సి ఉండగా ఇప్పటివరకు ముందడుగు పడలేదు. కనీసం ఉద్యోగుల సీనియార్టీ జాబితాలు సైతం రూపొందించకపోవడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ఉద్యోగుల సాధారణ బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం గమనార్హం.

సొసైటీ కార్యాలయంలో ఎవరికి వారే...

జీవో 317 కింద ఉద్యోగుల కేటాయింపు, సీనియార్టీ జాబితాలపై ఉద్యోగులంతా ఎస్సీ గురుకుల సొసైటీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. గత నెల 24, 25 తేదీల్లో వీరికి వెబ్ ఆప్షన్లు ఇవ్వాల్సి ఉండగా... సాంకేతిక కారణాలతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. దాదాపు పది రోజులు గడిచినా ఇప్పటివరకు ఈ అంశంలో ఎలాంటి పురోగతి లేదు. దీంతో సొసైటీ కార్యాలయంలో సంబంధిత అధికారులను సంప్రదించినప్పటికీ తమకేమీ తెలియదంటూ చేతులు దులిపేసుకుంటున్నా రని ఉద్యోగులు మండిపడుతున్నారు. ప్రస్తు తం ఉద్యోగుల సాధారణ బదిలీల ప్రక్రియ మొదలైంది. ఎస్టీ గురుకుల సొసైటీలో ఉద్యో గుల బదిలీలకు సంబంధించి మార్గదర్శకాలు విడుదలయ్యాయి. ఈనెల 20వ తేదీనాటికి బదిలీల ప్రక్రియ ముగించాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇతర గురుకుల సొసైటీ లన్నీ వేగవంతంగా ప్రక్రియ పూర్తిచేస్తుండగా.. ఎస్సీ గురుకుల సొసైటీలో నెలకొన్న విచిత్ర పరిస్థితితో ఉద్యోగులంతా తలపట్టుకుంటున్నా రు. ముందుగా జీవో 317 కేటాయింపుల తర్వాత సాధారణ బదిలీలు చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశంపై ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదు చేసేందుకు వారు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

జీవో 317 బాధితులు ఆందోళన చెందొద్దు



జీవో 317 వల్ల నష్టపోయిన ఉద్యోగులు ఏమాత్రం ఆందోళన చెందవద్దని.. వారికి రాష్ట్ర ప్రభుత్వం తప్పకుండా న్యాయం చేస్తుందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హామీ ఇచ్చారు. జీవో 317 బాధిత ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో శనివా రం మంత్రి తన క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నేతలు వివరించిన అంశాలను విన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ జీవో 317 బాధిత ఉద్యోగులు, స్పౌజ్ బదిలీలపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సబ్‌కమిటీ శాశ్వత పరిష్కారం చూపుతుందని స్పష్టం చేశారు. అతి త్వరలో కేబినెట్ సబ్ కమిటీ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి తుది నివేదిక అందించనుందని వెల్లడించారు.

“ఆయన హెచ్చవలసియున్నది.
నేను తగ్గవలసి యున్నది.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీక్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు; ఆషాఢ మాసం; **తిథి:** శు.విదియ తె.4.25 వరకు (తెల్లవారితే సోమవారం) తదుపరి తదియ
నక్షత్రం: పుష్యమి (పూర్తి 24 గంటలు)
వర్జ్యం: ప.1.29 నుండి 3.09 వరకు
దుర్ముహూర్తం: సా.4.50 నుండి 5.42 వరకు
అమృత ఘడియలు: రా.11.32 నుండి 12.34 వరకు

సూర్యోదయం : 5.34
సూర్యాస్తమయం : 6.35
రాహుకాలం : సా.4.30 నుండి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుండి 1.30 వరకు

ఓం బిర్లా (లోక్‌సభ స్పీకర్)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

ఒకరికి తల వంచటం, తలవంచి ఒకరికి అభివాదం చెయ్యటం రెండూ ఒకటే అవుతాయా?!

మోదీజీకి నేను తలవంచి అభివాదం చేశానని, అది తల వంచటమేనని, స్పీకర్ అంతటి వ్యక్తి ప్రధానికి తల వంచటం ఏమిటని రాహుల్ ప్రశ్న!

నిండు సభలో రాహుల్ నన్నలా ప్రశ్నించి వారం రోజులు కావస్తున్నా, లోక్‌సభ సమావేశాలు ముగిసిపోయినా నన్నింకా ఆ ప్రశ్న వెంటాడుతూనే ఉంది!

నిజానికి నన్ను వెంటాడవలసిన గొప్ప విషయాలు, విశేషాలు చాలానే జరిగాయి. కొత్త లోక్‌సభ తొలి సమావేశాలు గొప్పగా ప్రారంభమై గొప్పగా ముగిశాయి. శ్రీమతి ముర్ము చాలా గొప్పగా ప్రసంగించారు. శ్రీ మోదీజీ అంతకు మించిన గొప్ప ప్రసంగ పాటవాన్ని ప్రదర్శించారు. సభ 103 శాతం సామర్థ్యంతో గొప్పగా పని చేసింది. ఇవే కాదు, గతంలో ఏ లోక్‌సభలోనూ, ఏ ప్రతిపక్ష నాయకుడి మీదా జరగనంత గొప్పగా రాహుల్ ప్రసంగాన్ని ప్రధాన మంత్రి, ఇతర మంత్రులు తిప్పికొట్టడం జరిగింది!



“సభలో ఎలా ఉండాలో అతడికి తెలీదు...” అన్నారు మోదీజీ. “సభలో ఎలా ఉండకూడదో అతడికి తెలీదు...” అన్నారు అమిత్‌షా. “సభలో ఎలా మాట్లాడాలో అతడి తెలీదు” అన్నారు రాజ్‌నాథ్ సింగ్. “సభలో ఎలా మాట్లాడకూడదో అతడికి తెలీదు...” అన్నారు శివ్‌రాజ్ చౌహాన్, భూపేందర్ యాదవ్, కిరణ్ రిజిజు.

ఇవి కదా నాకు గుర్తుకు రావలిసింది. వీటిని కదా నేను మళ్లీ మళ్లీ గుర్తు చేసుకోవలసింది. కానీ రాహుల్ ప్రశ్న ఒక్కటే నాలో మిగిలిపోయింది.

సభలో చాలా పెద్ద విషయాలే మాట్లాడారు రాహుల్! స్పీకర్ స్థానం అన్నది దేశ శాసన వ్యవస్థలో కీలకమైన భాగం అన్నారు! అది కార్యనిర్వాహక వ్యవస్థకు, లేదా ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహించే ప్రధాన మంత్రి అనే వ్యక్తికి లోబడి ఉండదు అన్నారు! అవన్నీ కాదు... “బిర్లాజీ, నేను మీకు కరచాలనం చేసినప్పుడు మీరు నిటారుగా నిలబడ్డారు. మోదీజీ మీకు కరచాలనం చేసినప్పుడు వంగి మీరు ఆయనతో కరచాలనం చేశారు. సభలో ప్రధాని కన్నా స్పీకర్ గొప్ప అని రాజ్యాంగం అంటోంది. అలాంటిది మోదీజీకి మీరు తల వంచటం ఏమిటి? ” అన్నారు.

ఆ రోజు నుంచీ అదే ఆలోచిస్తున్నాను. ఒకరికి తల వంచటం, తలవంచి ఒకరికి అభివాదం చెయ్యటం రెండూ ఒకటే అవుతాయా?

రాజ్యాంగంలో స్పీకర్ స్థానం ఎంత ఉత్కృష్టమైనదైనా కావచ్చు. స్పీకర్ స్థానంలోకి రావటానికి కారణమైన వారికి తలవంచి అభివాదం చేయటం రాజ్యాంగ విరుద్ధమా, పార్లమెంటరీ సంస్కృతీ సంప్రదాయాలను మంట కలపటమో అవుతుందా?

“ఆ..! దొరికింది డాడీ...” అంటూ వచ్చింది అంజలి. ఐఏఎస్ తను. యూపీఎస్సీలో ర్యాంకర్. రైల్వే మినిస్ట్రీలో చేస్తోంది. “స్పీకర్ పదవి ఔన్నత్యం గురించి గొప్పవాళ్లు ఎవరైనా గొప్పగా ఎక్కడైనా గొప్పగా ఏదైనా రెండు మాటలు చెప్పారా కాస్త చూసి చెప్పు తల్లీ...” అని అంతక్రితమే నా కూతుర్ని అడిగాను. ఆ గొప్ప వాళ్లు దొరికినట్లున్నారు.

“చెప్పారు డాడీ! గాంధీజీ చెప్పారు. నెహ్రూజీ చెప్పారు. ప్రధాని కంటే స్పీకర్ గొప్ప అని గాంధీజీ 1938 జూలై 17 ‘హరిజన్’ పత్రికలో ‘స్పీకర్స్ అండ్ పాలిటిక్స్’ వ్యాసంలో రాశారు. ఇక మన తొలి ప్రధాని నెహ్రూజీ... ‘స్వేచ్ఛకు చిహ్నం స్పీకర్ హోదా...’ అని ఒక సందర్భంలో అన్నారు...” అని చెప్పింది అంజలి.

నవ్వాన్నేను.

“ఏంటి డాడీ?” అంది అంజలి నవ్వుతూ.

“ఏం లేదమ్మా ...” అన్నాను.

స్పీకర్ ఎలా ఉండాలో గాంధీజీ చెప్పారు. నెహ్రూజీ చెప్పారు. ఇన్నేళ్లకు మళ్లీ ఇప్పుడు రాహుల్ చెబుతున్నారు!!

స్వరం మార్చిన బ్రిటన్!

జనతంత్రం



వర్ధెల్లి మురళి

జనాభాపరంగా చూస్తే బ్రిటన్ దేశం ఇంచుమించుగా మన కర్ణాటక రాష్ట్రంతో సమానం. కానీ ఒకప్పుడు రవి అస్తమించనంత మేర విశాల భూభాగాలను తన సింహాసన ఛత్ర ఛాయలోకి తెచ్చుకున్న దేశం బ్రిటన్. ఈ ఘనత (?) న భూతో న భవిష్యతి. భారతదేశ చరిత్రలో మహా సామ్రాజ్యాలను స్థాపించిన మౌర్య, మొఘల్ చక్రవర్తుల ఆధీనంలోని భూఖండాల కంటే బ్రిటిష్ సామ్రాజ్యం తొమ్మిది, పది రెట్లు పెద్దది. అంతేకాకుండా బ్రిటిష్ వాళ్లు మనదేశాన్ని కూడా రెండు శతాబ్దాలు పాలించి పీడించి దేశ సంస్కృతిపై బలమైన ముద్రనే వేశారు. కనుక బ్రిటన్ పార్లమెంట్ ఎన్నికలపై భారతీయులు ఆసక్తి చూపడం చాలా సహజం.

పైపెచ్చు నిన్నటి దాకా ప్రధానిగా ఉన్న రిషి సునాక్ భారతీయ మూలాలున్న వ్యక్తి. భారత జాతీయతనూ, హిందూ మతాన్నీ పర్యాయపదాలుగా మార్చుకున్న మన ఎగువ మధ్య తరగతి శిష్ట వర్గాలకు సునాక్ మరింత ప్రీతిపాత్రుడు. ఆయన కుటుంబం టెన్ డౌనింగ్ స్ట్రీట్ వాకిట్లో దీపావళి కాకరపువ్వొత్తులు కాలిస్తే మనవాళ్లు పులకించిపోవడం కూడా తాజా జ్ఞాపకమే! మన ‘ఇన్ఫోసిస్’ నారాయణమూర్తి, ఆయన సతీమణి – మోటివేషనల్ స్పీకర్ హోదాలో రాజ్యసభలో అడుగుపెట్టిన సుధామూర్తిల ఏకైక అల్లుడు. అందువల్ల సునాక్ మళ్లీ ప్రధాని అవుతాడా లేదా అనే ఉత్కంఠ భారతీయులకు ఉండటంలో ఆశ్చర్యం లేదు.

సునాక్ ప్రాతినిధ్యం వహిస్తున్న కన్సర్వేటివ్ పార్టీ దారుణంగా ఓడిపోయింది. అయితే ఆయన మాత్రం తన నియోజకవర్గం నుంచి పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. భారతీయ మూలాలున్న వ్యక్తులు 29 మంది ఈ ఎన్నికల్లో గెలుపొందారు. సునాక్ మళ్లీ ప్రధాని కానందుకు బాధపడే భారతీయులెవరైనా ఉంటే వారికి ఈ సంఖ్య పెద్ద ఊరట. ఇటీవల జరిగిన ఇండియన్ పార్లమెంట్ దిగువ సభ ఎన్నికల్లో గెలిచిన ముస్లిం అభ్యర్థుల కంటే బ్రిటన్ దిగువ సభకు ఎక్కువమంది భారతీయులు ఎన్నికయ్యారు.

భారతదేశంతో సంబంధాల విషయంలో కన్సర్వేటివ్, లేబర్ పార్టీల మధ్యనున్న ప్రధాన తేడా కశ్మీర్ అంశంపైనే! ఈ అంశంపై రెఫరెండం జరగాలన్నది లేబర్ పార్టీ పాత విధానం. అయితే ఇప్పుడు అది పెద్దగా పట్టింపులకు పోవడం లేదంటున్నారు. అట్లాగే సునాక్ హయాంలో రెండు దేశాల మధ్య చర్చకు వచ్చిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) పట్ల కొత్త ప్రధాని కెయిర్ స్టార్మర్ కూడా ఆసక్తిగానే ఉన్నట్టు సమాచారం. సునాక్ ప్రధాని కాలేదన్న లోటును ఎక్కువమంది భారతీయ సంతతివారు ఎన్నికల్లో గెలిచి భర్తీ చేశారు. కనుక భారత్‌కు సంబంధించినంత వరకు బ్రిటన్‌లో జరిగిన అధికార బదిలీ ఎటువంటి మార్పులకూ దారితీయకపోవచ్చు.

స్టార్మర్ గెలుపు ఇండియా విషయంలో యథాతథ స్థితి కొనసాగింపే కావచ్చు. కానీ ప్రపంచ రాజకీయ వేదికపై ఓ పెద్ద మార్పు. ఒక గొప్ప ఊరట. మితవాద (రైటిస్టు) భావాల ఉప్పెన పాన్ అట్లాంటిక్ దేశాల రాజకీయాలను కుదిపేస్తున్న తరుణంలో ఒక మధ్యేవాద – వామపక్షంగా గుర్తింపు పొందిన లేబర్ పార్టీ బ్రిటన్‌లో ఆ ఉప్పెనను తట్టుకొని నిలవడం, భారీ విజయాన్ని నమోదు చేయడం విశేషంగానే చెప్పుకోవాలి. ఈమధ్యనే జరిగిన యూరోపియన్ యూనియన్ పార్లమెంట్ ఎన్నికల్లో మితవాద పార్టీలు వాటి తడాఖాను చూపెట్టాయి. ఇటలీ, నెదర్లాండ్స్ ఎన్నికల్లో మితవాద శక్తులు విజయం సాధించాయి. ఫాసిస్టు నేత బెనిటో ముస్సోలినికి అసలు సిసలైన సైద్ధాంతిక వారసురాలు జోర్జా మెలోని ఇటలీ అధ్యక్షురాలయ్యారు. ఇండియన్ రైటిస్టు నాయకుడు మోదీతో సెల్ఫీలు దిగి ‘మెలోడీ’ పేరుతో ఆమె ట్వీట్ చేసిన సంగతి తెలిసిందే!

ఈ ఏడాది చివర్లో జరగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ప్రపంచ మితవాద శక్తులకు సూపర్ బాస్ లాంటి డోనాల్డ్ ట్రంప్ విజయం దాదాపు ఖాయంగా కనిపిస్తున్నది. బ్రిటన్ ఎన్నికల్లో కరుడుగట్టిన మితవాద నాయకుడు నైజెల్ ఫరాజ్ నేతృత్వంలోని ‘రిఫార్మ్ యూకే’ పార్టీ ఎన్నడూ లేని విధంగా 14 శాతం ఓట్లను సాధించింది. ఎన్నో దండయాత్రల తర్వాత ఫరాజ్ పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. ఆ వెంటనే ఫరాజ్‌ను డొనాల్డ్ ట్రంప్ అభినందనల్లో ముంచెత్తడాన్ని చూస్తుంటే ప్రపంచవ్యాప్తంగా మితవాద శక్తుల ఐక్యత అల్లుకుంటున్న సంగతి బోధపడుతుంది. ట్రంప్‌కు అనుకూలంగా మన ప్రధాన మంత్రి ఎన్నికల ప్రచారం చేసిపెట్టిన వైనాన్ని కూడా ఈ కోణంలోంచే చూడాలి.



> సునాక్ ప్రాతినిధ్యం వహిస్తున్న కన్సర్వేటివ్ పార్టీ దారుణంగా ఓడిపోయింది. అయితే ఆయన మాత్రం తన నియోజకవర్గం నుంచి పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. భారతీయ మూలాలున్న వ్యక్తులు 29 మంది ఈ ఎన్నికల్లో గెలుపొందారు. సునాక్ మళ్లీ ప్రధాని కానందుకు బాధపడే భారతీయులెవరైనా ఉంటే వారికి ఈ సంఖ్య పెద్ద ఊరట. ఇటీవల జరిగిన ఇండియన్ పార్లమెంట్ దిగువ సభ ఎన్నికల్లో గెలిచిన ముస్లిం అభ్యర్థుల కంటే బ్రిటన్ దిగువ సభకు ఎక్కువమంది భారతీయులు ఎన్నికయ్యారు.
>
> భారతదేశంతో సంబంధాల విషయంలో కన్సర్వేటివ్, లేబర్ పార్టీల మధ్యనున్న ప్రధాన తేడా కశ్మీర్ అంశంపైనే! ఈ అంశంపై రెఫరెండం జరగాలన్నది లేబర్ పార్టీ పాత విధానం. అయితే ఇప్పుడు అది పెద్దగా పట్టింపులకు పోవడం లేదంటున్నారు. అట్లాగే సునాక్ హయాంలో రెండు దేశాల మధ్య చర్చకు వచ్చిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) పట్ల కొత్త ప్రధాని కెయిర్ స్టార్మర్ కూడా ఆసక్తిగానే ఉన్నట్టు సమాచారం. సునాక్ ప్రధాని కాలేదన్న లోటును ఎక్కువమంది భారతీయ సంతతివారు ఎన్నికల్లో గెలిచి భర్తీ చేశారు. కనుక భారత్‌కు సంబంధించినంత వరకు బ్రిటన్‌లో జరిగిన అధికార బదిలీ ఎటువంటి మార్పులకూ దారితీయకపోవచ్చు.

ఫ్రాన్స్‌లో కూడా ఒక మితవాద సునామీ వేగంగా సన్నద్ధమవుతున్న సూచనలు వెలువడుతున్నాయి. మెరైన్ లీపెన్ నాయకత్వంలోని ఆర్‌ఎన్ (నేషనల్ ర్యాలీ) అనే పార్టీ అనూహ్యంగా బలం పుంజుకుంటున్నది. ఆమె గతంలో మూడుసార్లు ఫ్రెంచి అధ్యక్ష పదవికి పోటీచేసి ఓడిపోయారు. యూరోపియన్ పార్లమెంట్ ఎన్నికల్లో 32 శాతం ఓట్లు సాధించి లీపెన్ పార్టీ అధ్యక్షుడు... మేక్రాన్ అలయెన్స్‌ను మూడో స్థానానికి నెట్టివేశారు. దీంతో అప్రమత్తమైన మేక్రాన్ పార్లమెంట్ ఎన్నికలకు ఇంకో మూడేళ్ల గడువు ఉన్నప్పటికీ మధ్యంతర ఎన్నికలకు వెళ్లారు. ఈ ఎన్నికలు రెండు దశల్లో జరుగుతాయి.

జూన్ 30న తొలి రౌండ్ జరిగింది. మితవాద ఆర్‌ఎన్ పార్టీకి 34 శాతం ఓట్లు వచ్చాయి. వామపక్ష కూటమి న్యూ పాపులర్ ఫ్రంట్ 28 శాతం ఓట్లను సాధించింది. మేక్రాన్ నాయకత్వంలోని మధ్యేవాద కూటమికి 21 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. మొదటి రౌండ్ ఎన్నికల్లో 12.5 శాతం (ఎనిమిదో వంతు) ఓట్ల కంటే తక్కువ వచ్చిన వాళ్లను తొలగిస్తారు. ఈ ఆదివారం నాడు రెండో రౌండ్ పోలింగ్ జరుగుతున్నది. తొలి రౌండ్‌లో ప్రజానాడిని గమనించిన మధ్యేవాద – వామపక్ష కూటములు ఈ ఎన్నికల్లో ఏకమయ్యాయి. ఓట్ల బదిలీ జరిగి మితవాద శక్తులను ఈ కూటమి ఓడిస్తుందా, లేదా అన్న సంగతి తేలిపోనున్నది. ఒకవేళ ఆర్‌ఎన్ పార్టీయే పైచేయి సాధిస్తే మేక్రాన్ అధ్యక్ష పాలనకు ఒడుదొడుకులు తప్పవు.

మేక్రాన్ అధ్యక్ష పదవికి ఇంకో మూడేళ్ల గడువున్నది. సాంకేతికంగా చూస్తే ఆయన తప్పుకోవలసిన అవసరం ఉండదు. మిగిలిన యూరప్ దేశాలతో పోలిస్తే ద్రవ్యోల్బణ ప్రభావాన్ని తగ్గించడంలో మేక్రాన్ సాపేక్షంగా విజయం సాధించినట్టే లెక్క. రాజకీయంగా కూడా మేక్రాన్ మధ్యేవాద మితవాదే (రైట్ ఆఫ్ ది సెంటర్). ఆసియా, ఆఫ్రికా దేశాల నుంచి కొనసాగుతున్న వలసలను నిరోధించడంలో ప్రభుత్వాధినేతలు విఫలమవడం పట్ల యూరప్ ప్రజల్లో అసహనం వ్యక్తమవుతున్నది. అన్ని దేశాల్లోనూ నిరుద్యోగం, ద్రవ్యోల్బణం కవల పిల్లల్లా పెరుగుతున్నాయి. ఈ ఆర్థిక కారణాలు మితవాద రాజకీయ శక్తులకు ఆక్సిజన్ మాదిరిగా పనిచేస్తున్నాయి.

వలసల పట్ల స్థానిక ప్రజల్లో పెరుగుతున్న అసహనాన్ని తగ్గించడానికి రిషి సునాక్ కొంత ప్రయత్నం చేశారు. అక్రమ వలసదారులను గుర్తించి, వారిని మధ్య ఆఫ్రికాలోని రువాండా దేశానికి తరలించి, పునరావాస ఏర్పాట్లు చేయాలని భావించారు. ఈ మేరకు రువాండాతో బ్రిటన్‌కు ఒప్పందం కూడా కుదిరింది కానీ ఎందుకనో అది కార్యరూపం దాల్చలేదు. యూరప్ దేశాలు ఎదుర్కొంటున్న సవాలక్ష సమస్యలకు వలసలే కారణమనే వాదాన్ని కూడా పలువురు వ్యతిరేకిస్తున్నారు. కొన్ని తరాల ముందే వలస వచ్చి ఆ యా దేశాల ఆర్థిక, సాంస్కృతిక అభ్యున్నతిలో భాగస్వాములైన వారిపై కూడా వివక్షాపూరిత దృక్కులు ప్రసరిస్తున్నాయనే ఆందోళన వ్యక్తమవుతున్నది.

ప్రస్తుతం జరుగుతున్న ఫుట్‌బాల్ యూరో కప్ పోటీల ప్రారంభం ముందు ఫ్రాన్స్ స్టార్ ఆటగాడు కిలియన్ ఎంబప్పే చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. “మితవాద రాజకీయ భావాలు అధికారపు వాకిట్లోకి వచ్చి కూర్చున్నాయి. మా విలువల్నీ, మనోభావాల్నీ గౌరవించని దేశం తరఫున ఆడేందుకు మేం సిద్ధంగా లేము”. ఆఫ్రో – యూరోపియన్‌ల మనోభావాలను ఆయన బలంగా వెళ్లగక్కారు. అక్రమ వలసదారులు వస్తున్నారని యూరప్ ప్రజలు నిందిస్తున్న దేశాలన్నీ ఒకప్పుడు యూరప్ దేశాల వలసలే! వంద నుంచి రెండొందల ఏళ్ల పాటు యూరోపియన్లు ఈ దేశాల వనరుల్ని యథేచ్ఛగా దోపిడీ చేశారు. ఆ దేశాల ఆర్థిక మూలుగల్ని పీల్చి పిప్పి చేశారు. ఫలితంగా వలస దేశాల అభివృద్ధి చరిత్ర శతాబ్దాల పర్యంతం ఘనీభవించిపోయింది.

> వలస దేశాల సంపదతోనే యూరప్ దేశాలు చాలా కాలంపాటు వైభవోజ్జ్వల అధ్యాయాలను లిఖించుకున్నాయి. ఇప్పుడు ఈ దేశాల్లోకి వలస వస్తున్న ప్రజలకు ప్రతీకారం తీర్చుకునే ఉద్దేశం లేదు. పొట్టకూటి కోసం వారు వస్తున్నారు. ప్రతిభకు తగిన గుర్తింపు కోసం వస్తున్నారు. ఉన్నత విద్య కోసం, అవకాశాల కోసం వారు వస్తున్నారు. వలసలపై యూరప్ దేశాల మితవాదుల వైఖరి ఇట్లా వుంటే... అమెరికా మితవాదుల ధోరణి మరింత ఆశ్చర్యకరంగా ఉన్నది. అమెరికా నిర్మాణానికి వలసలే పునాది. అక్కడి భూమి పుత్రుడెవరు మిగిలారు అమెరికాలో! వాళ్లందరినీ యూరప్ వలసదారులు ఎప్పుడో వేటాడి నిర్మూలించారు. యూరప్ దేశాల ఆశాజీవులు, ఆఫ్రికా నుంచి బంధించి తెచ్చిన బానిసల సహాయంతో పెరిగిన అమెరికా ఒక వలసదారుల దేశం. వలసలకు కేరాఫ్ అడ్రస్. ఆ దేశంలోని ట్రంపిస్టులు కూడా వలసలకు వ్యతిరేకంగా మాట్లాడటం న్యూయార్క్ నగరంలోని స్వేచ్ఛా ప్రతిమ పాద పీఠిక మీద చెక్కిన ఎమ్మా లాజరస్ కవితా పంక్తుల స్ఫూర్తికి విరుద్ధం.

వలస దేశాల సంపదతోనే యూరప్ దేశాలు చాలా కాలం పాటు వైభవోజ్జ్వల అధ్యాయాలను లిఖించుకున్నాయి. ఇప్పుడు ఈ దేశాల్లోకి వలస వస్తున్న ప్రజలకు ప్రతీకారం తీర్చుకునే ఉద్దేశం లేదు. పొట్టకూటి కోసం వారు వస్తున్నారు. ప్రతిభకు తగిన గుర్తింపు కోసం వస్తున్నారు. ఉన్నత విద్య కోసం, అవకాశాల కోసం వారు వస్తున్నారు. వలసలపై యూరప్ దేశాల మితవాదుల వైఖరి ఇట్లా వుంటే... అమెరికా మితవాదుల ధోరణి మరింత ఆశ్చర్యకరంగా ఉన్నది. అమెరికా నిర్మాణానికి వలసలే పునాది. అక్కడి భూమి పుత్రుడెవరు మిగిలారు అమెరికాలో! వాళ్లందరినీ యూరప్ వలసదారులు ఎప్పుడో వేటాడి నిర్మూలించారు. యూరప్ దేశాల ఆశాజీవులు, ఆఫ్రికా నుంచి బంధించి తెచ్చిన బానిసల సహాయంతో పెరిగిన అమెరికా ఒక వలసదారుల దేశం. వలసలకు కేరాఫ్ అడ్రస్. ఆ దేశంలోని ట్రంపిస్టులు కూడా వలసలకు వ్యతిరేకంగా మాట్లాడటం న్యూయార్క్ నగరంలోని స్వేచ్ఛా ప్రతిమ పాదపీఠిక మీద చెక్కిన ఎమ్మా లాజరస్ కవితా పంక్తుల స్ఫూర్తికి విరుద్ధం. ఆ స్వేచ్ఛా ప్రతిమ వలస జీవులను రారమ్మని పిలుస్తున్నట్టుగా ఆ కవితా పంక్తులు ఉంటాయి. “డస్సిపోయిన మీ జనాలనూ, మీ నిరుపేదలనూ, / స్వేచ్ఛా వాయువులు పీల్చేందుకు తహతహలాడుతున్న మీ సకల కూటములనూ, / మీ తీరాలలో కిక్కిరిసిన తిరస్కృతులనూ, / నిరాశ్రయులనూ, తుపానుల్లో చిక్కుకుపోయిన అభాగ్యులనూ నా దరికి పంపండి. / బంగారు ద్వారం పక్కన దారిదీపాన్ని పైకెత్తి నిలుచున్నాను.” – (తెలుగు అనువాదం).

మితవాద శక్తుల ప్రభంజనం నేపథ్యంలో బ్రిటన్‌లో లేబర్ పార్టీ గెలుపునకు చాలా ప్రాధాన్యం ఉన్నది. ప్రపంచవ్యాపితంగా వున్న మితవాద రాజకీయ పక్షాలన్నిటికీ మతవాద, జాతివాద సారూప్యతలే కాకుండా ఆర్థిక విధానాల సారూప్యతలు కూడా ఉన్నాయి. కొంతమందే సంపద సృష్టించి, దాన్ని వారే సొంతం చేసుకునే ఆర్థిక కార్యక్రమం వారిది. బ్రిటన్ కొత్త ప్రధాని కెయిర్ స్టార్మర్ భిన్నమైన గళాన్ని ఎన్నికలకు ముందే వినిపించారు. కార్మిక వర్గం కోసం సంపద సృష్టించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజలందరికీ నాణ్యమైన విద్య, వైద్య సేవలను ప్రధాన ఎజెండాగా ప్రకటించారు. న్యాయమైన ఈ ఎజెండాకు బ్రిటన్ ప్రజలు జైకొట్టడం ఆహ్వానించదగిన పరిణామం. వలసదారుడిని ప్రధానిగా చేసిన పార్టీని శిక్షించడానికే ప్రజలు లేబర్ పార్టీని గెలిపించారని కొంతమంది ప్రచారం చేస్తున్నారు. ఇది బ్రిటన్ ప్రజల విజ్ఞతనూ, చైతన్యాన్నీ శంకించడమే!

vardhelli1959@gmail.com

మిగిలేది... మానవత్వ పరిమళమే!

అభిప్రాయం



డాక్టర్ దేవరాజు మహారాజు

సమాజం భ్రష్టు పట్టిపోయింది. మనుషులు జంతువుల్లా ప్రవర్తిస్తున్నారు. నిజమే! కాని, మానవత్వం గల మనుషులు కొందరైనా ఉన్నారు. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ప్రవర్తిస్తున్నారు. అయితే, సమాజంలో వీరి శాతాన్ని బాగా పెంచుకోవాల్సిన అవసరం ఉంది.

న్యూజిలాండ్ లోని గ్రేమోత్ లోకల్ మార్కెట్‌లో ఒక దయార్ద్ర హృదయుడు తిరుగుతుంటాడు. రొయ్యల, చేపలూ లాగా అక్కడ ఫుడ్ మార్కెట్‌లో తాబేళ్ళను కూడా అమ్ముతారు. మనం చెప్పుకుంటున్న దయార్ద్ర హృదయుడు తాబేలు మాంసం కోసం రాడు. తాబేళ్ళను రక్షించడానికి వస్తుంటాడు. బేరమాడి మార్కెట్‌లో బతికి ఉన్న తాబేళ్ళన్నింటినీ కొంటాడు. వాటిని ట్రక్కులో వేసుకుని పోయి సముద్రంలోకి వదులుతాడు. అక్కడ తాబేళ్ల అంతరించిపోయే దశలో ఉన్నాయి. అందుకే ఈ పని! ఏదో విధంగా తమ పని గడిస్తే చాలుననుకుంటూ కాలుష్యాలు పెంచుతున్న మనుషుల మధ్య ఎంతో బాధ్యతతో ‘మనిషి’లా ప్రవర్తించే వారున్నారు. ‘ప్రపంచమేమీ గొడ్డుపోలేదు’ అని అన్నది అందుకే! పాపువా న్యూ గినియా – మార్కెట్ల దగ్గరా ఇలాంటి జీవ పరిరక్షకులు ఉన్నారు.

ఇటీవల రాజస్థాన్ జైపూర్‌లో మానవత్వం మతాన్ని గెలిచింది. మధూలిక అనే ఒక 48 ఏళ్ల హిందూ మహిళ 13 మంది ముస్లింల ప్రాణాలు కాపాడింది. భర్త చనిపోయి, ఇద్దరు పిల్లలతో ఒక బట్టల కొట్టు నడుపుకుంటూ జీవిస్తోంది. ఆమె బట్టల కొట్టు ఉన్న ఆ వీధిలో ముస్లింలే ఎక్కువ మంది ఉన్నారు. ఒకరోజు హిందూ వర్గానికి చెందిన గుంపు – శోభాయాత్ర ఊరేగింపు తీస్తూ అల్లర్లు సృష్టించింది. అందులో భాగంగా అక్కడ ఉన్న 13 మంది ముస్లింలపై దాడిచేయడానికి వారి వెంట పడ్డారు. ఇదంతా గమనించిన మధూలిక ప్రాణభయంతో పరిగెత్తుకొచ్చిన ముస్లింలను తన కొట్టులోకి పంపి వెంటనే షట్టర్ వేసేసింది. తర్వాత హిందూ దుండగుల్ని ధైర్యంగా ఎదుర్కొని, చాకచక్యంగా వారిని



వెనక్కి పంపించింది. ‘మానవత్వం అన్నిటికన్నా గొప్పదని భావించి, ముస్లిం సోదరులకు ఆశ్రయమిచ్చాన’ని– ఆ తర్వాత ఆమె పత్రికల వారికి చెప్పింది. ఒక సామాన్య మహిళ ఆచరణాత్మకంగా, ఎంతో గొప్ప సందేశం ఇచ్చింది.

హైదరాబాదు పాత బస్తీలో గాజుల అంజయ్య అందరికీ తెలిసినవాడు. అతని మిత్రులలో చాలా మంది ముస్లింలే. 2022, ఏప్రిల్ 17న తన కొడుకు పెళ్ళికి మిత్రులందరినీ ఆహ్వానించాడు. అవి రంజాన్ రోజులు గనుక ‘రోజా’ పాటించే తన ముస్లిం మిత్రులెవరూ ఇబ్బంది పడకూడదని వారి కోసం నమాజ్ చేసుకోవడానికి ఏర్పాట్లు చేశాడు. ఇఫ్తార్ విందూ ఏర్పాటు చేశాడు. వారంతా మరునాడు ఉపవాసం పాటించేందుకు ‘సహారీ’ ఏర్పాటు చేశాడు. స్వార్థప్రయోజనాల కోసం విద్వేషాలు నూరిపోసే వారి వలలో పడకూడదనీ, గంగా జమునా తహజీబ్‌ను కాపాడుకోవడం అందరి బాధ్యత అనీ పాతబస్తీ అంజయ్య ఎప్పుడూ చెబుతుంటాడు. ఇలాంటిదే మరో సంఘటన కేరళలో జరిగింది. ఒక ముల్లాగారు తమ మసీదులో హిందూ అమ్మాయి వివాహం జరిపించి అందరికీ ఆదర్శప్రాయుడయ్యాడు.

ముస్లింల, క్రైస్తవుల సఖ్యత గూర్చి కూడా ఒక సంఘటన గుర్తు చేసుకుందాం. ఇది 2022 ఏప్రిల్ 21న మహారాష్ట్రలో జరిగింది. మహారాష్ట్రలోని నాసిక్‌లో ముస్లింలు చర్చిలో నమాజు చదివారు. ఇఫ్తార్ విందుకోసం అజ్మల్ ఖాన్ అనే వ్యక్తి అన్ని మతాల మత పెద్దల్ని ఆహ్వానించాడు. అయితే, అక్కడ చర్చి ఫాదర్ ఆ విందు ఆహ్వానాన్ని అంగీకరించడమే కాకుండా, ఆ ఇఫ్తార్ విందు తమ చర్చిలోనే నిర్వహించాలని సూచించాడు. ఆ రకంగా తొలి సారి ఇఫ్తార్ విందు చర్చిలో, ఫాదర్ పర్యవేక్షణలో జరిగింది. పరమత సహనం, సహకారం అంటే ఇదే కదా! అసలైన భారతదేశపు ‘ఆత్మ’ అక్కడ తొణికిసలాడింది. ఆత్మ అంటే... ఆత్మ – పరమాత్మలు కావు. అంతరంగంలోని ఒక సమర్పణ భావం! ఆలోచనల ఐక్యత!! గౌరవం ఇచ్చిపుచ్చుకోవడం. మనిషి మనిషిని మనిషిగా గుర్తించి ప్రేమించడం. ఇక్కడ చెప్పుకున్న సంఘటనలన్నింటికీ ఒక అంతస్సూత్రం ఉంది. ‘దేవుడు లేడు – మతం అనేది వ్యక్తిగతం – మన చివరి గమ్యం – మానవవాదం’ అనేది సాధించడానికి... ఇలా మెల్లమెల్లగా అడుగులు పడుతున్నాయేమో!

క్రమంగా తరతమ భేదాలు మరిచి, మనుషులంతా ఒక్కటే అనే విషయం జీర్ణించుకునేందుకు ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయేమో? మనిషికి మనిషే ముఖ్యం – దేవుళ్ళు కాదు, అనే భావనలోకి సమాజం ప్రయాణిస్తోంది. ఈ సందర్భంగా ‘మన మార్గం సుదీర్ఘమైంది. రాబోయే కాలం ఎలా ఉంటుందో తెలియదు. మన పరిమితులు మనకు తెలుసు. ఇరవై ఒకటవ శతాబ్దపు స్త్రీ – పురుషుల్ని అంటే మనల్ని మనం కొత్తగా తయారు చేసుకోవడానికి రోజు వారీగా కృషి చేస్తూనే ఉండాలి’ అన్న చే గువేరా మాటలు గుర్తు చేసుకుంటూ ఉండాలి. నిజమే– బూజు పట్టిన భావజాలాన్ని వదిలి, కొంచెం కొంచెంగా పైపైకి ఎదుగుతూనే ఉండాలి. పైకి ఎదిగితేనే (ఎగిరితేనే) అద్భుతమైన మానవత్వ దృశ్యాలు కనబడతాయి.

నువ్వు బతికి ఉన్నావంటే...
నీ జీవితపు విజయోత్సవాన్ని పంచుకో
స్వర్గమనేది ఎక్కడైనా ఉంటే...
దాన్ని భూమి మీదికి దించుకో–
అని ఎలుగెత్తి చెబుతూ ముందుకు సాగాల్సి ఉంది.

వ్యాసకర్త కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత

హక్కుల దండోరా!

దళితులపై కీలవేన్మమణి, బెల్చి, కంచికచర్ల, కారంచేడు ఊచకోతల నేపథ్యంలో 1994 జూలై ఏడో తేదీన ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం, ఈదుమూడి గ్రామంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్‌ఆర్‌పీఎస్) ఉద్యమం ప్రారంభమైంది. మాదిగ చర్మకార కులాల స్వీయ గౌరవ పరిరక్షణ, ఎస్సీ రిజర్వేషన్లలో జనాభా దామాషా ప్రకారం వాటా, కోల్పోయిన మానవ హక్కుల సాధన, అధికారంలో వాటా వంటివి ధ్యేయంగా మాదిగ హక్కుల ‘దండోరా’ ఉద్యమం ప్రారంభం అయింది. మాదిగ యువకులు ఈ ఉద్యమాన్ని ముందుండి నడిపించారు.

మాదిగ ఉద్యమం రాజకీయ వ్యవస్థను కదిలించింది. అసెంబ్లీలో చర్చను లేవనెత్తింది. పలుమార్లు ఉమ్మడి రాష్ట్ర అసెంబ్లీ మాదిగల ఆకాంక్షలకు మద్దతు తెలియజేస్తూ తీర్మానాలను ఆమోదించింది. ఉమ్మడి రాష్ట్ర అసెంబ్లీ 2000 సంవత్సరంలో చేసిన ఎస్సీ రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ చట్టం అమలు వలన, మాదిగ అనుబంధ కులాలకు విద్య, ఉద్యోగాలలో కొంత కాలం న్యాయం జరిగింది. కాగా, రిజర్వేషన్లను హేతుబద్ధీకరించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదంటూ, అసెంబ్లీ చేసిన చట్టాన్ని 2004లో సుప్రీమ్ కోర్టు కొట్టివేసింది. దీంతో, మాదిగ ఉద్యమం మళ్లీ తీవ్రమైంది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు మాదిగల ముఖ్య డిమాండ్ అయిన ఎస్సీ రిజర్వేషన్లను హేతుబద్ధీకరణ చెయ్యాలనే అంశంపై పరిశీలనకు నియమించిన కమిషన్లు, కమిటీలు రిజర్వేషన్లను హేతుబద్ధీకరించడానికి తగిన సూచనలు చేశాయి. పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేయడం ద్వారా, ఎస్సీ రిజర్వేషన్లను హేతుబద్ధీకరించవచ్చునని సిఫారసు చేశాయి.

మాదిగ దండోరా ఉద్యమానికి 30 ఏళ్ళు నిండాయి. రాజకీయ పార్టీలు చట్టసభల లోపలా, బయటా మాదిగల డిమాండ్లను బలపరిచాయి. అయినా మాదిగ ఆకాంక్షలు నెరవేరలేదు. అనేకానేక కారణాల వల్ల ఉద్యమం నీరుగారింది. జనాభా నిష్పత్తి ప్రకారం విద్య, ఉద్యోగ, అధికారాల్లో వాటాలు సాధించుకునేవరకూ దక్షిణ భారత దేశంలోని కోట్లాది మాదిగ చర్మకార అనుబంధ కులాల్లో పర్యవేక్షక చైతన్యం గుండె దండోరాయై మోగుతూనే ఉండాలి.

– కృపాకర్ మాదిగ,
ఎమ్‌ఆర్‌పీఎస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి

(నేటికి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి స్థాపించి 30 ఏళ్లు)

కాళేశ్వరం లిఫ్టులపైనా విచారణ!

- బరాజ్‌లపై విచారణకు మాత్రమే జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేసిన ప్రభుత్వం
- అనుబంధ అంశంగా పంప్‌హౌస్‌లపై విచారణ చేపట్టిన కమిషన్!
- 8న విచారణకు హాజరుకావాలని పంప్‌హౌస్‌ల ఇంజనీర్లకు ఆదేశం
- ఎన్డీఎస్ఏ, విజిలెన్స్ తుది నివేదికలు సత్వరం సమర్పించాలని కోరిన కమిషన్



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని కన్నెపల్లి (మేడిగడ్డ), సిరిపురం(అన్నారం), గోలివాడ (సుందిళ్ల) పంప్ హౌస్‌ల నిర్మాణంపై సైతం జస్టిస్ పినాకి చంద్రఘోష్ విచారణ ప్రారంభించినట్టు తెలుస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టులో బరాజ్‌ల నిర్మాణంలో చోటుచేసుకున్న అవకతవకలు, లోపాలపై విచారణ నిర్వహించే బాధ్యతలను మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్‌కు అప్పగించగా, విచారణలో అనుబంధ అంశాలుగా పంప్‌హౌస్‌లను కూడా పరిగణనలోకి తీసుకున్నట్టు తెలిసింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌లతో పాటు పంప్ హౌస్‌లపై సైతం విచారణ జరిపించాలని పలువురు కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టు లింక్–1 ప్యాకేజీలో భాగంగా ఈ పంప్‌హౌస్‌ల నిర్మాణం జరిగింది. అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) నుంచి చీఫ్ ఇంజనీర్ (సీఈ) స్థాయి వరకు.. పంప్‌హౌస్‌ల నిర్మాణంలో భాగస్వాములైన అధికారులందరూ సోమవారం విచారణకు హాజరు కావాలని జస్టిస్ పినాకి చంద్రఘోష్ తాజాగా ఆదేశించడం చర్చనీయాంశమైంది. పంప్‌హౌస్‌ల నిర్మాణానికి జారీ చేసిన పరిపాలన అనుమతులు, సాంకేతిక పరిశీలనలు, ఏ మేరకు నీటిని పంపింగ్ చేయడానికి వీటికి అనుమతినిచ్చారు? చేసిన పంపింగ్ ఎంత? వీటి ప్రధాన ఉద్దేశం ఏంటి? ఎన్నిసార్లు అంచనాలు సవరించారు? గత ఐదేళ్లుగా పంప్ హౌస్‌ల పరిస్థితి ఏంటి? అనే అంశాలపై కమిషన్ ఆరా తీయనున్నట్టు సమాచారం. మూడేళ్ల కింద గోదావరికి వచ్చిన వరదల్లో మేడిగడ్డ, అన్నారం పంప్‌హౌస్‌లు నీట మునగడంతో భారీ నష్టం వాటిల్లింది. ఇదిలా ఉండగా, శనివారం జస్టిస్ పినాకి చంద్రఘోష్ తన కార్యాలయంలో కమిషన్‌కు సహకరించేందుకు ఏర్పాటైన నిపుణుల కమిటీతో సమావేశమై చర్చలు జరిపారు. సత్వరంగా నివేదిక సమర్పించాలని వారిని కోరారు.

ఎన్డీఎస్ఏ తుది నివేదిక సమర్పించాలి

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) నిపుణుల కమిటీ తుది నివేదికను సత్వరం సమర్పించేలా చర్యలు తీసుకోవాలని జస్టిస్ చంద్రఘోష్ ఆదేశించారు. ఎన్డీఎస్ఏ చైర్మన్‌తో ఆయన శనివారం ఫోన్‌లో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌లపై విచారణ ప్రక్రియలో ఈ నివేదిక కీలకమని స్పష్టం చేశారు. తుది నివేదిక కోసం కమిషన్ తరఫున ఎన్డీఎస్ఏకు లేఖ రాయాలని నీటిపారుదల శాఖ అధికారులను సైతంఆయన ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ నిర్వహిస్తున్న విచారణకు సంబంధించిన తుది నివేదికను కూడా సత్వరం తెప్పించుకోవాలని ఆయన సూచించారు.

త్వరలో క్రాస్ ఎగ్జామినేషన్

జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ త్వరలో క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియను ప్రారంభించనుంది. ఇప్పటికే విచారణకు హాజరైన అధికారులందరినీ అఫిడవిట్ రూపంలో తమ వద్ద ఉన్న సమాచారాన్ని, వాదనలను సమర్పించాలని కమిషన్ ఆదేశించింది. అఫిడవిట్ల పరిశీలన పూర్తయిన అనంతరం గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన ప్రజాప్రతినిధులకు సైతం నోటీసులు జారీ చేసి క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియకు హాజరు కావాలని ఆదేశించే అవకాశముంది. ఇదిలా ఉండగా కమిషన్‌ను తప్పుదోవపట్టించే క్రమంలో కొందరు అధికారులు పరస్పర విరుద్ధమైన సమాచారాన్ని అఫిడవిట్ల రూపంలో సమర్పించినట్టు తెలిసింది. దీంతో వీరిని సైతం మళ్లీ క్రాస్ఎగ్జామినేషన్‌కు కమిషన్ పిలవనుంది. ఇక బరాజ్‌లు దెబ్బతినడానికి కారణాలేంటో తెలుసుకోవాలని కమిషన్ ఓ అధికారిని పుణెలోని సెంట్రల్ పవర్ అండ్ వాటర్ రీసెర్చ్ సెంటర్ (సీడబ్ల్యూపీఆర్ఎస్)కు పంపించింది. విచారణ ముగింపులో బహిరంగ విచారణను సైతం కమిషన్ నిర్వహించనుందని సమాచారం. తొలుత అఫిడవిట్ల పరిశీలన, ఆ తర్వాత నోటీసుల జారీ, క్రాస్ ఎగ్జామినేషన్ అనంతరం బహిరంగ విచారణ ఉంటుందని కమిషన్ వర్గాలు తెలిపాయి.

అన్నారం నుంచి నీటి తరలింపునకు కసరత్తు

- బరాజ్‌లను పరిశీలించిన ఈఎన్‌సీ జనరల్ అనిల్‌కుమార్ బృందం

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలంలోని కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం (సరస్వతీ) బరాజ్ గుండా ఖరీఫ్ సీజన్‌లో నీటిని ఎగువకు తరలించడానికి రాష్ట్ర ఇరిగేషన్ సాంకేతిక ఉన్నతాధికారుల బృందం శనివారం కసరత్తు చేసినట్లు తెలిసింది. ఈఎన్‌సీ జనరల్ గుమ్మడి అనిల్‌కుమార్ బృందంతోపాటు సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీఓ) మోహన్‌కుమార్, క్వాలిటీ కంట్రోల్ సీఈ వెంకటకృష్ణల బృందాలు, రామగుండం సీఈ సుధాకర్‌రెడ్డి మేడిగడ్డ (లక్ష్మి) అన్నారం (సరస్వతీ) బరాజ్‌లను పరిశీలించారు. ముందుగా అన్నారంలో చేపట్టిన సీపేజీ మరమ్మతులను పరిశీలించిన అనిల్‌కుమార్.. వాటిని త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. కన్నెపల్లిలోని లక్ష్మీ పంపుహౌస్ ద్వారా నీటిని తరలించడానికి ఇప్పటికే అక్కడ ఉన్న 11 మోటార్ల టెస్ట్ రన్‌లు, రిపేర్లు పూర్తిచేసి సిద్ధంగా ఉంచినట్లు అధికారులకు ఆయనకు చెప్పారని సమాచారం. అదేకాకుండా అన్నారం బరాజ్ పెద్దవాగు, మానేరు వాగులతోపాటు చిన్నచిన్న వాగుల ద్వారా నీటిలభ్యత ఉందని ఇంజనీర్లు ఈఎన్‌సీతో పేర్కొన్నారు. ఇప్పటికే అన్నారం బరాజ్‌లో ఉన్న మొత్తం 66 గేట్లను మూసి ఉంచారు. నీటి తరలింపు అంశంపై పరిశీలన చేయాలని ఇంజనీర్లను ఆయా బృందాలు ఆదేశించినట్లు తెలిసింది. మేడిగడ్డ వద్ద నీటి ప్రవాహం పెరుగుతుండటంతో ఎగువ నుంచి ప్రాణహిత ద్వారా 20 వేల క్యూసెక్కులకుపైగా నీరు వస్తోంది. ఉన్నతాధికారుల బృందం వెంట ఎస్ఈ కరుణాకర్, ఈఈలు యాదగిరి, తిరుపతిరావు ఉన్నారు.



అన్నారం బరాజ్‌ను పరిశీలిస్తున్న ఉన్నతాధికారుల బృందం

రేపు ప్రజాభవన్‌లో వైఎస్సార్ ఫొటో ఎగ్జిబిషన్

సాక్షి, హైదరాబాద్: దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆయనకు ఘనంగా నివాళులర్పించనుంది. ఈనెల 8న ప్రజాభవన్‌లో ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నారు. పంజగుట్టలోని వైఎస్సార్ విగ్రహానికి, గాంధీభవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పార్టీ నేతలు ఘనంగా నివాళులర్పిస్తారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బి. మహేశ్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, కాంగ్రెస్ సీనియర్ నేతలు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని, కాంగ్రెస్ కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పెద్ద ఎత్తున హాజరై మహానేతకు ఘనంగా నివాళులర్పించాలని శనివారం ఒక ప్రకటనలో ఆయన విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా...

'ఫిల్మ్‌నగర్' ఎన్నికల ప్రక్రియ కొనసాగించండి



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్ సహకార హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ ఎన్నికల ప్రక్రియను కొనసాగించాలని హైకోర్టు ఆదేశించింది. గత ఎన్నికల నోటిఫికేషన్ ప్రకారం ముందుకు వెళ్లాలని స్పష్టం చేసింది. కారణాలు లేకుండా ఎన్నికలు ఆపడం చెల్లదని, చట్టవిరుద్ధమని వ్యాఖ్యానించింది. ఫిల్మ్‌నగర్ సొసైటీ ఎన్నికల ప్రక్రియను ఆపేస్తూ రాష్ట్ర సహకార ఎన్నికల అధికారి జూన్ 13న జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ పి.ఉదయ్‌భాస్కర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్‌సి. వి.భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టారు. సొసైటీ పాలక మండలి గడువు మే 20న ముగిసిపోయిందని పిటిషనర్ న్యాయవాది వాదనలు వినిపించారు. గడువు ముగియకముందే రాష్ట్ర సహకార సంఘాల డైరెక్టర్ ఎన్నికల నిర్వహణకు రికార్డులు సమర్పించాలని ఆదేశాలిచ్చారన్నారు. అన్నీ పరిశీలించిన తర్వాత జూన్ 7న ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసి, 11, 12, 13 తేదీల్లో కమిటీ మెంబర్ పోస్టులకు నామినేషన్లు సమర్పించాలని అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆదేశించారని తెలిపారు. ఈ దశలో ఎన్నికలను ఆపేస్తూ రాష్ట్ర సహకార సంఘాల ఎన్నికల అధికారి జూన్ 13 న ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు. ఎలాంటి కారణాలు లేకుండా వాయిదా వేయడం సహకార సంఘాల నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేశారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఎన్నికల వాయిదాకు ఎలాంటి కారణాలు లేనందున ప్రక్రియ ఎక్కడ ఆగిందో అక్కడి నుంచి కొనసాగించాలని ఆదేశించారు. తదుపరి విచారణ ఈ నెల 22కు వాయిదా వేశారు.

సింగపూర్‌లో సూర్యాపేట జిల్లా యువకుడి మృతి



పవన్

కోదాడ రూరల్: సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణానికి చెందిన యువకుడు సింగపూర్‌లో బీచ్‌కు వెళ్లి నీటి అలలకు కొట్టుకుపోయి మృతిచెందాడు. కోదాడ పట్టణంలోని ఎర్నేని టవర్‌లో నివాసం ఉంటున్న చొడవరపు శ్రీనివాసరావు, చంద్రకళ దంపతుల రెండో కుమారుడు పవన్ (28) హైదరాబాద్‌లో ఆరేళ్ల పాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేశాడు. గతేడాది ఫిబ్రవరి నుంచి సింగపూర్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అయితే, పవన్ తన స్నేహితులతో కలిసి శుక్రవారం సింగపూర్‌లోని సెన్సోటియా బీచ్‌కు వెళ్లాడు. నీటిలోకి దిగిన పవన్ అక్కడ అలల ఉధృతికి కొట్టుకుపోయి మృతి చెందినట్లు తమకు సమాచారం వచ్చిందని కుటుంబ సభ్యులు తెలి పారు. శ్రీనివాసరావు పట్టణంలో ఆయిల్ మిల్లు నడుపుతున్నారు. ఆయనకు ముగ్గురు కుమారులు కాగా.. పవన్ రెండో కుమారుడు. పెద్ద కుమారుడు లండన్‌లో ఉద్యోగం చేస్తుండగా మూడో కుమారుడు స్థానికంగా ఉంటూ తండ్రి వ్యాపారాన్ని చూసుకుంటున్నాడు. పవన్ కొద్ది రోజుల్లోనే సింగపూర్ నుంచి అమెరికాకు వెళ్లాల్సి ఉందని బంధువులు తెలిపారు.

కృష్ణాలో ఎగువన పెరిగిన వరద

సాక్షి, అమరావతి: కృష్ణా నదిలో ఎగువన వరద ప్రవాహం పెరిగింది. నది పరివాహక ప్రాంతం (బేసిన్)లో ఎగువన మహారాష్ట్ర, కర్ణాటకల్లో రెండ్రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో కృష్ణా ప్రధాన పాయతోపాటు ప్రధాన ఉప నది తుంగభద్రలోనూ వరద పెరిగింది. కృష్ణా ప్రధాన పాయపై కర్ణాటకలోని ఆల్మట్టి డ్యామ్‌లోకి శనివారం 62,073 క్యూసెక్కులు వస్తుండటంతో నీటి నిల్వ 54.31 టీఎంసీలకు చేరుకుంది. ఆల్మట్టి నిండాలంటే ఇంకా 75 టీఎంసీలు అవసరం. కృష్ణా ప్రధాన ఉప నది తుంగభద్రల్లో ఒకటైన తుంగలో వరద ప్రవాహం పెరిగింది. తుంగ జలాశయంలో నీటి మట్టం గరిష్ట స్థాయికి చేరుకోవడంతో గేట్లు ఎత్తేసి వరద జలాలను దిగువకు వదిలేస్తున్నారు. దాంతో తుంగభద్ర డ్యామ్‌లోకి 25,556 క్యూసెక్కులు చేరుతోంది. ఇక్కడ నీటి నిల్వ 14 టీఎంసీలకు చేరుకుంది. మరో 91 టీఎంసీలు చేరితే తుంగభద్ర డ్యామ్ నిండుతుంది. శనివారమూ కృష్ణా బేసిన్‌లో విస్తారంగా వర్షాలు కురిశాయి. అందువల్ల ఆదివారం కూడా ఆల్మట్టి, తుంగభద్ర డ్యామ్‌లలోకి వరద ఉధృతి కొనసాగనుంది.


దోస్త్ మూడో దశ సీట్ల కేటాయింపు పూర్తి

- తాజాగా సీట్లు పొందిన అభ్యర్థులు 73,662
- ఈ నెల 15 నుంచి మొదటి సెమిస్టర్ తరగతులు

సాక్షి, హైదరాబాద్: డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు సంబంధించి మూడో దశ అడ్మిషన్ ప్రక్రియలో భాగంగా సీట్ల కేటాయింపు పూర్తయింది. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్, దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, కళాశాల విద్యా కమిషనర్ దేవసేన ఈ వివరాలను విడుదల చేశారు. దోస్త్ మూడో దశ సీట్ల కేటాయింపులో భాగంగా 73,662 మంది సీట్లు పొందారు. వీరిలో 9,630 మంది అభ్యర్థులు మెరుగైన సీట్ల కోసం దరఖాస్తు చేసుకుని ఆ మేరకు దక్కించుకున్నారు. వీరిలో మొదటి ప్రాధాన్యత సీట్లను 56,731 మంది దక్కించుకున్నారు. తక్కువ ఆప్షన్లు ఇవ్వడంతో 6,650 మంది సీట్లు పొందలేకపోయారు. సీట్లు పొందిన వారిలో బ్రాంచ్‌ల వారీగా పరిశీలిస్తే...ఆర్ట్స్ కేటగిరీలో 11,306 మంది, కామర్స్ 26,552, లైఫ్ సైన్సెస్ 14,789, ఫిజికల్ సైన్స్ 14,289, డి–ఫార్మసీ 93, ఇతరులు 6,633 మంది ఉన్నారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 7వ తేదీ నుంచి 11 వరకు దోస్త్ లాగిన్ ద్వారా ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకుని సీటు రిజర్వ్ చేసుకోవాలి. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి అర్హత ఉన్న విద్యార్థులు మాత్రం సెల్ఫ్ రిపోర్టింగ్‌కు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ నెల 15 నుంచి మొదటి సెమిస్టర్ తరగతులు ప్రారంభం కానున్నాయి.

16 నుంచి ఇంట్రా కాలేజీ వెబ్ ఆప్షన్లు: దోస్త్ కౌన్సెలింగ్ ద్వారా సీటు దక్కించుకుని ధ్రువీకరించుకున్న అభ్యర్థులు ఈ నెల 16 నుంచి 18 వరకు ఇంట్రా కాలేజీ వెబ్ ఆప్షన్లు (స్లైడింగ్) ఇచ్చుకోవచ్చని లింబాద్రి తెలిపారు. రెండ్రోజుల పాటు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకునే అవకాశం కల్పించామన్నారు. ఈ నెల 19వ తేదీన ఇంట్రా కాలేజీ సీట్ల కేటాయింపు ఉంటుందని వెల్లడించారు.

నిరుద్యోగుల డిమాండ్లపై సీఎం చర్చలు జరపాలి: కృష్ణయ్య



ముషీరాబాద్ (హైదరాబాద్): నిరుద్యోగుల డిమాండ్లపై సీఎం రేవంత్‌రెడ్డి చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విద్యానగర్‌లోని సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిమాండ్లు చర్చించి న్యాయమైన వాటిని పరిష్కరించకుండా నిరుద్యోగుల ఉద్యమాన్ని వక్రీకరించి ఎదురు దాడి చేయడం సమంజసం కాదన్నారు. న్యాయమైన డిమాండ్లు కాకపోతే వేలాది మంది నిరుద్యోగులు ఎందుకు ఉద్యమానికి వస్తున్నారని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై ఉద్యమం చేసే హక్కు ప్రతి రాజకీయ పార్టీకి, ప్రజా సంఘానికి ఉందన్నారు. రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ప్రజల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించడానికి ఉన్నాయి తప్ప ప్రభుత్వానికి బాకా కట్టడానికి కాదని కృష్ణయ్య హితవు పలికారు. సీఎం ఒకే దఫా 2 లక్షల ఉద్యోగాల భర్తీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. గ్రూప్–1, 2, 3, 4 సర్వీస్ ఉద్యోగాలను సరిగ్గా పూర్తి స్థాయిలో లెక్కించి గణన చేసి భర్తీ చేయడానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. సమావేశంలో ఎర్ర సత్యనారాయణ, నీల వెంకటేశ్, అంజి, మల్లేశ్‌యాదవ్, వేముల రామకృష్ణ, రేగుల మధుసూదన్‌రావు, అనంతయ్య, రాజేందర్, సతీశ్‌కుమార్, బలరామ్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

మతవాద పాలనకు ఎదురుదెబ్బ



ఇరాన్ అధ్యక్షునిగా సంస్కరణవాది పెజెష్కియాన్

అతివాద జలిలిపై ఘనవిజయం ● ఖమేనీకి మింగుడుపడని ఫలితం

టెహ్రాన్: ఇరాన్ అధ్యక్ష ఎన్నికల్లో సంస్కరణవాదులదే పైచేయి అయింది. కరడుగట్టిన మతవాది సయీద్ జలిలిపై మితవాది, సంస్కరణాభిలాషి మసూద్ పెజెష్కియాన్ ఘనవిజయం సాధించారు. జూన్ 28న జరిగిన తొలి విడత ఎన్నికల్లో ఆరుగురు అభ్యర్థుల్లో ఎవరికీ మెజారిటీ రాలేదు. దాంతో దాంతో విజేతను తేల్చేందుకు తొలి రెండు స్థానాల్లో నిలిచిన జలిలి, పెజెష్కియాన్ మధ్య శుక్రవారం తిరిగి ఎన్నిక అనివార్యమైంది. శనివారం ఫలితాలు వెల్లడయ్యాయి. పోలైన దాదాపు 3 కోట్ల ఓట్లలో పెజెష్కియాన్‌కు 1.64 కోట్లు వచ్చాయి. సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అనుచరునిగా పేరుబడ్డ జలిలి 1.35 కోట్ల ఓట్లు మాత్రమే సాధించారు. దేశ తొమ్మిదో అధ్యక్షునిగా పెజెష్కియాన్ ఎన్నికైనట్టు అంతర్గత మంత్రిత్వ శాఖ అధికారికంగా ప్రకటించింది. ఇరాన్‌పై దశాబ్దాలుగా ఆధిపత్యం చలాయిస్తూ వస్తున్న మతవాద కూటమికి ఈ ఫలితాలు గట్టి షాకివ్వడమే గాక సంస్కరణవాదుల్లో జోష్ నింపాయి. నిజానికి ఈసారి అధ్యక్ష ఎన్నికల ప్రక్రియనే బహిష్కరిస్తున్నట్టు ప్రకటించిన ప్రజలు శుక్రవారం రాత్రి దాకా జరిగిన ఓటింగ్‌లో అనూహ్యంగా భారీ సంఖ్యలో పాల్గొనడం విశేషం. దాంతో 53 శాతానికి పైగా ఓటింగ్ నమోదైంది. తద్వారా ఖమేనీ ఏకపక్ష పోకడలపై ప్రజలు స్పష్టమైన వ్యతిరేకత వ్యక్తం చేశారని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఫలితాల వెల్లడి మొదలవుతూనే రాజధాని టెహ్రాన్, పశ్చిమ ఇరాన్‌లోని పెజెష్కియాన్ సొంత నగరం తబ్రీజ్‌తో పాటు దేశవ్యాప్తంగా ఆయన మద్దతుదారులు, అభిమానులు భారీగా వీధుల్లోకి వచ్చి డ్యాన్సుల సంబరాలు చేసుకున్నారు. దేశాన్ని కాపాడేందుకు ఓటర్లు భారీ సంఖ్యలో బూత్‌లకు తరలారంటూ నినాదాలు చేశారు. పెజెష్కియాన్ ఎన్నికల నినాదమైన 'సేవ్ ఇరాన్' సందేశాలతో సోషల్ మీడియా హోరెత్తిపోయింది. దేశంలో మెజారిటీలపై మైనారిటీల పెత్తనానికి మొత్తానికి తెర పడ్డట్టేనంటూ సంస్కరణవాదులు సంబరపడుతున్నారు. అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ మేలో హెలికాప్టర్ ప్రమాదంలో దుర్మరణం పాలవడంతో ఎన్నిక అనివార్యమైంది. ఎన్నికల ఫలితాలను ఖమేనీ లాంఛనంగా ఆమోదముద్ర వేశాక 30 రోజుల్లో పెజెష్కియాన్ బాధ్యతలు స్వీకరిస్తారు. నాలుగేళ్ల పాటు పదవిలో కొనసాగుతారు. ఆయనకు ప్రధాని నరేంద్ర మోదీతో పాటు పలువురు దేశాధినేతలు శుభాకాంక్షలు తెలిపారు.

పోలింగ్ శాతం పెరగడం వెనక...

- నిజానికి ఏళ్లుగా తామెదుర్కొంటున్న పలు కీలక సమస్యల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై ఇరానీలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.
- ఖమేనీ యంత్రాంగం తీరుకు నిరసనగా ఈసారి అధ్యక్ష ఎన్నికల ప్రక్రియను మూకుమ్మడిగా బహిష్కరించారు. దాంతో తొలి రౌండ్‌లో దేశ చరిత్రలోనే అత్యల్పంగా కేవలం 40 శాతం పోలింగ్ నమోదైంది.
- అత్యంత మితవాదిగా పేరొందిన పెజెష్కియాన్ అనూహ్యంగా తుది పోరులో బరిలో నిలవడంతో ఆయనకు మద్దతుగా వారంతా భారీ సంఖ్యలో పోలింగ్ బూత్‌లకు తరలారు.
- పోలింగ్‌కు ముందు నుంచీ పెజెష్కియాన్ ప్రచార సరళికి, 'సేవ్ ఇరాన్' నినాదానికి దేశ యువత బాగా ఆకర్షితులయ్యారు. దాంతో ఆయన ర్యాలీలకు, సభలకు జనం పోటెత్తారు.
- ఇస్లామిక్ పాలనకు తెర పడాల్సిందేనని యువతతో పాటు విద్యావంతులు కూడా తొలిసారిగా బాహాటంగానే వ్యాఖ్యలు చేస్తూ వచ్చారు. కరడుగట్టిన మతవాది అయిన జలిలి ఇరాన్‌ను ఎప్పటికీ ఏకం చేయలేరని మైకుల సాక్షిగా చెప్పుకొచ్చారు.
- జలిలిని ఓడించడం ద్వారా నిరంకుశ మతవాద పాలనకు వ్యతిరేకంగా ఇరానీలు స్పష్టమైన తీర్పు వెలువరించారు.
- ఖమేనీ మతవాద పాలన, హిజాబ్‌ను తప్పనిసరి వంటి కఠినతరమైన సామాజిక నిబంధనలు, ఇరాన్‌పై ఆర్థిక ఆంక్షలను ఎత్తేసేలా అంతర్జాతీయ సమాజంతో చర్చలకు ముందుకు రాని పోకడలపైనా ప్రజలు తమ వ్యతిరేకతను ఓటు రూపంలో స్పష్టంగా వ్యక్తం చేశారంటున్నారు.

హార్ట్ సర్జన్‌పై ఆశలెన్నో...!




మహిళలపై అత్యంత కఠినమైన ఆంక్షలుండే ఇరాన్‌లో ప్రచారం పొడవునా పెజెష్కియాన్ ఇలా తన కూతురికి భాగస్వామ్యం కల్పించడం ద్వారా ప్రాధాన్యమిచ్చారు (ఫైల్)

69 ఏళ్ల పెజెష్కియాన్‌కు హార్ట్ సర్జన్‌గా దేశవ్యాప్తంగా అపారమైన పేరు ప్రఖ్యాతులున్నాయి. ఆయన ఇరాక్–ఇరాన్ యుద్ధంలో పాల్గొన్న వార్ వెటరన్ కూడా. 16 ఏళ్లుగా పార్లమెంటు సభ్యునిగా ఉన్నారు. డిప్యూటీ స్పీకర్‌గా, నాలుగేళ్ల పాటు ఆరోగ్య మంత్రిగా కూడా చేశారు. ఆయన భార్య కారు ప్రమాదంలో చనిపోయారు. మళ్లీ పెళ్లి చేసుకోకుండా సింగిల్ పేరెంట్‌గా పిల్లలను అన్నీ తానై పెంచారు. మతపరమైన మైనారిటీ అయిన అజెరీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తి కావడం ఈ ఎన్నికల్లో పెజెష్కియాన్‌కు మరింత కలిసొచ్చింది. ప్రచారం పొడవునా కూతురిని వెంట ఉంచుకోవడం ద్వారా మహిళలకు మరింత స్వేచ్ఛ ఇవ్వాల్సిన అవసరాన్ని ఆయన చెప్పకనే చెప్పారు. దాంతో పార్టీలకు అతీతంగా ప్రజలు ఆయనకు భారీగా ఓటేశారు.

సవాళ్ల స్వాగతం...

లెక్కలేనన్ని సమస్యలు పెజెష్కియాన్‌కు స్వాగతం పలుకుతున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థ అత్యంత దయనీయంగా ఉంది. ఇరుగుపొరుగుతో సంబంధాలు దారుణంగా దిగజారాయి. యెమన్, లెబనాన్ గుండా ఇజ్రాయెల్‌పై సాయుధ పోరుకు ఇరాన్ అన్నివిధాలా సాయపడుతూ అంతర్జాతీయ సమాజం నుంచి మరింత ఆగ్రహం చవిచూస్తోంది. ఆ క్రమంలో గత ఫిబ్రవరిలో అమెరికాతో, అనంతరం ఏప్రిల్లో ఇజ్రాయెల్‌తో ఇరాన్ యుద్ధం ముంగిటి దాకా వెళ్లొచ్చింది. ఈ రుగ్మతలకు పెజెష్కియాన్ ఎలాంటి వైద్యం చేస్తారో చూడాలి. అయితే ఆ దిశగా ఇప్పటికే అడుగులు వేస్తున్నట్టు ఆయన స్పష్టమైన సంకేతాలిచ్చారు. దేశ ప్రగతి కోసం ప్రత్యర్థులతో కూడా కలిసి పని చేస్తానని ఫలితాల అనంతరం ప్రకటించారు. ''ఎన్నికలు ముగిశాయి. ఇది మనమంతా సహకరించుకుంటూ ముందుకు సాగాల్సిన సమయం. నేను మిమ్మల్ని ఏకాకులను చేయను. మీరూ నన్ను ఏకాకిని చేయొద్దు'' అంటూ పిలుపునిచ్చారు. తద్వారా అందరినీ కలుపుకుని పోతానంటూ అతివాద వర్గానికి స్పష్టమైన సందేశమిచ్చారు. అదే సమయంలో, 'ఇరాన్ ఇరానీలందరిదీ' అంటూ పునరుద్ఘాటించడం ద్వారా ప్రజల సంక్షేమానికే ప్రథమ తాంబూలమని చెప్పకనే చెప్పారు. ఈ నేపథ్యంలో ఇరాన్‌కు సర్వం సహా చక్రవర్తి అయిన ఖమేనీతో అధ్యక్షునిగా ఆయన సంబంధాలు ఏ మేరకు సజావుగా సాగుతాయన్నది ఆసక్తికరం.

– సాక్షి, నేషనల్ డెస్క్



ప్రజల తీర్పును అంగీకరిస్తున్నా. దేశ ప్రగతి కోసం పెజెష్కియాన్‌కు మనమంతా దన్నుగా నిలవాల్సిన అవసరముంది.

– ఫలితాల అనంతరం సయీద్ జలిలి

నీట్ కౌన్సెలింగ్ వాయిదా

జూలై నెలాఖరులో ప్రారంభమయ్యే అవకాశం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా వైద్య విద్యా సంస్థల్లో ప్రవేశానికి ఉద్దేశించిన జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష–అండర్ గ్రాడ్యుయేట్(నీట్–యూజీ)–2024 కౌన్సెలింగ్ వాయిదా పడింది. జూలై నెలాఖరులో కౌన్సెలింగ్ ప్రారంభమయ్యే అవకాశం ఉందని అధికార వర్గాలు శనివారం వెల్లడించాయి. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 6 నుంచే కౌన్సెలింగ్ ప్రారంభం కావాల్సి ఉంది. చివరి నిమిషంలో వాయిదా వేస్తూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్ణయం తీసుకుంది. నీట్–యూజీ పరీక్షలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని, ప్రశ్నపత్రం లీకయిందని, గ్రేసు మార్కుల కేటాయింపులో భారీగా డబ్బు చేతులు మారిందని ఆరోపణలు రావడం తెలిసిందే. పరీక్షను వాయిదా వేసి, మళ్లీ నిర్వహించాలన్న డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు కేంద్రం అంగీకరించడం లేదు. ఈ నేపథ్యంలో కౌన్సెలింగ్ వాయిదా ప్రాధాన్యం సంతరించుకుంది. నీట్–యూజీ కౌన్సెలింగ్ వాయిదాకు సుప్రీంకోర్టు నిరాకరించినా ఎన్‌టీఏ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

దేవుడు తప్ప నన్నెవరూ... తప్పించలేరు: బైడెన్

వాషింగ్టన్: తన ఆరోగ్యంపై వ్యక్తమవుతున్న ఆందోళనలను అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ (81) కొట్టిపారేశారు. అధ్యక్ష రేసు నుంచి వైదొలగాలని దేవుడు తప్ప తననెవరూ ఒప్పించలేరని ఏబీసీ ఛానల్ ఇంటర్వ్యూలో అన్నారు. గత వారం రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌తో చర్చలో బైడెన్ పదే పదే తడబడటం, ఆగి ఆగి మాట్లాడటంతో ఆయన మానసిక సంతులతపై డెమొక్రాట్లలో తీవ్ర ఆందోళన నెలకొంది. బైడెన్ వైదొలగాలని వారు డిమాండ్ చేస్తున్నారు. సర్వేల్లోనూ ఆయనకు ప్రజాదరణ పడిపోయింది. విరాళాలు ఇచ్చే దాతలు కూడా బైడెన్ తప్పుకుంటేనే తమ ఆర్థిక సహకారం కొనసాగుతుందని స్పష్టం చేస్తున్నారు. ఒత్తిళ్లు పెరుగుతున్నా బైడెన్ మాత్రం వెనక్కి తగ్గే ప్రసక్తే లేదంటున్నారు. ప్రపంచాన్ని నడుపుతున్నానని, అధ్యక్షుడిగా ఉండటానికి తనకంటే మరెవరికీ యోగ్యత లేదన్నారు. మెదడు పనితీరుపై పరీక్ష చేయించుకొని ఫలితాలను ప్రజల ముందు పెడతారా అని ప్రశ్నించగా తాను రోజూ పరీక్ష ఎదుర్కొంటున్నానని బదులిచ్చారు.

23న కేంద్ర బడ్జెట్

22 నుంచి ఆగస్టు 12 దాకా పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రంలో వరుసగా మూడోసారి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మోదీ సర్కారు తొలి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఇందుకోసం పార్లమెంటు సమావేశాలను పిలవాలన్న ప్రభుత్వ ప్రతిపాదనకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారు. జూలై 22న ప్రారంభమయ్యే పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఆగస్టు 12 వరకు జరుగనున్నాయి. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ జూలై 23న లోక్‌సభలో పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ మేరకు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెణ్ రిజిజు శనివారం ట్వీట్ చేశారు. బడ్జెట్‌కు ముందు ప్రభుత్వం ఆర్థిక సర్వేను సమర్పించనుంది. ఆర్థిక మంత్రిగా నిర్మలకు ఇది ఏడో బడ్జెట్ కానుంది. ఆరుసార్లు ప్రవేశపెట్టిన మొరార్జీ దేశాయ్ రికార్డును ఆమె బద్దలు కొట్టనున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు నిర్మలా సీతారామన్ ఈ ఏడాది ఫిబ్రవరిలో మధ్యంతర బడ్జెట్‌ను సమర్పించిన విషయం తెలిసిందే. బడ్జెట్లో భారీ సామాజిక, ఆర్థిక నిర్ణయాలుంటాయని రాష్ట్రపతి తన ప్రసంగంలో పేర్కొన్న నేపథ్యంలో అంచనాలు పెరుగుతున్నాయి.

భోలే బాబాపై కేసు

పట్నా/నోయిడా: ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్ జిల్లాలో సత్సంగ్‌లో 121 మంది మరణానికి కారకుడైన భోలే బాబా అలియాస్ సూరజ్ పాల్ సింగ్‌పై తొలి కేసు నమోదైంది. ప్రజల ఫిర్యాదు మేరకు బిహార్ రాజధాని పట్నా చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో శనివారం కేసు నమోదు చేశారు. తొక్కిసలాటలో చాలా మంది బిహారీలు మృతిచెందారు. భోలే బాబాపై గతంలో అత్యాచారం కేసులు నమోదయ్యాయి. ఒకసారి జైలుకు వెళ్లొచ్చాడు. ప్రధాన నిందితుడు, సత్సంగ్ ముఖ్య సేవాదార్ దేవప్రకాశ్ మధుకర్(42)ను యూపీ పోలీసులు శుక్రవారం రాత్రి ఢిల్లీలో అరెస్టు చేశారు. భోలే బాబా సత్సంగ్‌లకు ఓ పార్టీ నిధులు సమకూరుస్తున్నట్లు అనుమానాలున్నట్టు చెప్పారు. మరో ఇద్దరు నిందితులు రామ్‌ప్రకాశ్ శాక్య(61), సంజూ యాదవ్(33)నూ అదుపులోకి తీసుకున్నారు.

మీడియా ముందుకు భోలే బాబా

హత్రాస్ తొక్కిసలాట ఘటన తననెంతో తీవ్రంగా బాధించిందని భోలే బాబా అన్నారు. ఈ దుర్ఘటన మిగిల్చిన విషాదాన్ని భరించే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. తొక్కిసలాట కారకులకు శిక్ష పడుతుందనే విశ్వాసం తనకు ఉందని తెలిపారు. న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉంచాలని బాధితులను సూచించారు. తొక్కిసలాటలో 121 మంది మరణించిన తర్వాత పరారీలో ఉన్న భోలే బాబా తాజాగా ఓ మీడియా సంస్థతో మాట్లాడారు. మరణించినవారి కుటుంబాలకు, క్షతగాత్రులకు అండగా నిలవాలని, వారికి తగిన సాయం అందించాలని సత్సంగ్ నిర్వహణ కమిటీ సభ్యులను తన న్యాయవాది ద్వారా కోరానని వెల్లడించారు. తొక్కిసలాటలో మృతి చెందిన వారి పిల్లల చదువులు, ఇతర ఖర్చులను నారాయణ్ సకార్ హరి ట్రస్టు భరిస్తుందని భోలే బాబా న్యాయవాది ఎ.పి.సింగ్ చెప్పారు. గత ఐదు నెలలుగా భోలే బాబా సత్సంగ్‌లు నిర్వహించలేదని, అందుకే హత్రాస్ జిల్లాలో జరిగిన కార్యక్రమానికి జనం లక్షల సంఖ్యలో హాజరయ్యారని వెల్లడించారు. భోలే బాబా పరారీలో లేరని, విచారణకు సహకరిస్తారని తెలిపారు.

గుజరాత్‌లోనూ మోదీని ఓడిస్తాం

ఓటమి భయంతోనే అయోధ్యలో పోటీకి వెనకడుగు: రాహుల్



అహ్మదాబాద్‌లో పీసీసీ కార్యాలయ కిటికీ నుంచి రాహుల్ ప్రసంగం

అహ్మదాబాద్: ఉత్తరప్రదేశ్‌లో అయోధ్య ఉన్న లోక్‌సభ స్థానంలో బీజేపీని ఓడించినట్టే గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఓడించబోతున్నామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జోస్యం చెప్పారు. అయోధ్య పరాభవమే అక్కడా ఎదురవుతుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీని సైతం ఓడిస్తామన్నారు. ''నేను చెబుతున్నది చాలా పెద్ద విషయం. అయోధ్యలో బీజేపీని మట్టికరిపించడం ద్వారా అద్వానీ ప్రారంభించిన రామ మందిర ఉద్యమాన్ని కూడా ఇండియా కూటమి ఓడించింది'' అని పేర్కొన్నారు! శనివారం అహ్మదాబాద్‌లోని కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో రాహుల్ మాట్లాడారు. ''కొన్ని రోజుల క్రితం గుజరాత్ బీజేపీ నేతలు మనల్ని బెదిరించారు. మన కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. మనం గుజరాత్‌లో బీజేపీ ప్రభుత్వాన్నే ధ్వంసం చేయబోతున్నాం. బీజేపీని, మోదీని చిత్తుగా ఓడిస్తాం. ఇది రాసి పెట్టుకోవాలి. నూతన ఆరంభం ఇక్కడి నుంచే మొదలవుతుంది. మోదీ విజన్ అనే గాలి బుడగ గుజరాత్‌లో ఇప్పటికే బద్దలైంది. వారణాసి లోక్‌సభ స్థానంలోనూ మోదీ తక్కువ మెజార్టీతోనే గెలిచారు. అక్కడ మనం కొన్ని పొరపాట్లు చేశాం. లేదంటే మోదీ కచ్చితంగా ఓడేవారు. తొలుత అయోధ్యలో పోటీ చేయాలని మోదీ భావించారు. అక్కడ గెలిచే అవకాశం లేదని, రాజకీయ కెరీర్‌కే తెర పడవచ్చని బీజేపీ సర్వేయర్లు చెప్పడంతో వారణాసికే పరిమితమయ్యారు'' అని ఎద్దేవా చేశారు. దైవాంశసంభూతుడైన మోదీకి సామాన్య మానవుల కష్టాలు అర్థం కావడం లేదన్నారు. అయోధ్య ఆలయ నిర్మాణానికి పేదల భూములు లాక్కున్నారని, పరిహారం ఇవ్వలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల గుర్తు 'హస్తం' ప్రతి మతంలోనూ ప్రముఖంగా కనిపిస్తుందన్నారు.

ఆ డ్రెస్సేంటి?

సునాక్ భార్య అక్షతా మూర్తిపై సోషల్ మీడియాలో విసుర్లు



బ్రిటన్ ఎన్నికల్లో ఓటమి అనంతరం శుక్రవారం ప్రధాని నివాసం 10, డౌనింగ్ స్ట్రీట్‌ను ఖాళీ చేసి వెళ్తున్న రిషి సునాక్ దంపతులు

లండన్: బ్రిటన్ పార్లమెంట్ ఎన్నికల్లో కన్జర్వేటివ్ పార్టీ ఓడిపోయింది. ఆ పార్టీ నేత రిషి సునాక్ ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేశారు. లండన్‌లోని తన అధికారిక నివాసమైన 10 డౌనింగ్ స్ట్రీట్ గుమ్మం ఎదుట మీడియాతో మాట్లాడారు. ప్రధానిగా చివరి మాటలు చెప్పేసి వెళ్లిపోయారు. ఆయన భార్య అక్షతా మూర్తి వ్యవహారమే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆమెను విమర్శిస్తూ సోషల్ మీడియాలో చాలామంది పోస్టులు పెడుతున్నారు. జోకులు సైతం విసురుతున్నారు. ఆమె ధరించిన డ్రెస్సు ధర్మపై కూడా చర్చ జరుగుతోంది. రిషి సునాక్ మీడియాతో మాట్లాడుతున్న సమయంలో అక్షతా మూర్తి ఆయన వెనుకే గొడుగు పట్టుకొని నిల్చున్నారు. నీలం, తెలుపు, ఎరుపు రంగులతో కూడిన నిలువు, అడ్డం చారల డ్రెస్సును ధరించారు. ఈ డ్రెస్సు చాలామందికి నచ్చలేదు. ఆ సందర్భానికి అలాంటి వస్త్రాలు నప్పలేదని అంటున్నారు. చూడడానికి ఎబ్బెట్టుగా ఉందని చెబుతున్నారు. డ్రెస్సుపై క్యూఆర్ కోడ్ మాదిరిగా ఆ చారలేంటి అని ప్రశ్నిస్తున్నారు. అంతేకాదు అక్షతా మూర్తి డ్రెస్సు ఖరీదు 395 పౌండ్లు(రూ.42,000). రిషి సునాక్ వెనుక ఆమె అలా గొడుగు పట్టుకొని నిల్చోవడం అస్సలు బాగా లేదని నెటిజన్లు విమర్శిస్తున్నారు. అక్షతా మూర్తి ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి, భారత రాజ్యసభ సభ్యురాలు సుధామూర్తి దంపతుల కుమార్తె అనే సంగతి తెలిసిందే.

10న ఏడు రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ సీట్లకు ఉప ఎన్నికలు

న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్ సహా ఏడు రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ స్థానాలకు ఈ నెల 10వ తేదీన ఉప ఎన్నికలు జరగనున్నాయి. పశ్చిమబెంగాల్‌లోని నాలుగు సీట్లకు గాను మూడు బీజేపీ ఎమ్మెల్యేలు టీఎంసీలో చేరడంతో ఖాళీ కాగా, మిగతావి ఎమ్మెల్యేల మృతితో ఖాళీ అయ్యాయి. ఉప పోరు జరిగే స్థానాలివే..బిహార్‌లోని రుపౌలి, బెంగాల్‌లోని రాయ్‌గంజ్, రాణాఘాట్ దక్షిణ్, బాగ్దాహ, మనిక్తల ఉన్నాయి. ఇంకా తమిళనాడులోని విక్రవండి, మధ్యప్రదేశ్‌లోని అమర్వార, ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్ మంగ్లౌర్, పంజాబ్‌లోని జలంధర్ వెస్ట్, హిమాచల్ ప్రదేశ్‌లోని డెహ్రా, హమీర్‌పూర్, నాలాగఢ్.హిమాచల్ సీఎం సుఖ్‌వీందర్ సింగ్ సుఖు భార్య కమ్లేశ్ ఠాకూర్ డెహ్రా స్థానంలో బరిలో ఉన్నారు. ఆయా స్థానాలకు ఈ నెల 13వ తేదీన ఓట్ల లెక్కింపు చేపడతారు.

టీఎంసీ నేత ముకుల్ రాయ్ పరిస్థితి విషమం

కోల్‌కతా: తృణమూల్ కాంగ్రెస్ సీనియర్ నేత ముకుల్ రాయ్(70) ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కోల్‌కతాలోని తన నివాసంలోని బాత్‌రూంలో ఈ నెల 4న ముకుల్ రాయ్ జారిపడ్డారు. తలకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి జారుకోవడంతో కోల్‌కతాలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. మూడు రోజులుగా వైద్యుల బృందం ఆయన ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తోంది. శనివారం ఆయన ఆరోగ్యం విషమించినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. కొంతకాలంగా ఆయన డిమెన్షియా(మతిమరుపు వ్యాధి)తో బాధపడుతున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ముకుల్ రాయ్ టీఎంసీ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరు.

కశ్మీర్‌లో నలుగురు ఉగ్రవాదులు హతం

నేలకొరిగిన ఇద్దరు ఆర్మీ జవాన్లు

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో శనివారం భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనల్లో నలుగురు ముష్కరులు హతం కాగా, ఇద్దరు జవాన్లు నేలకొరిగారు. జిల్లాలోని మారుమూల ప్రాంతంలో ఉన్న ఫ్రిసాల్ చిన్నిగామ్ వద్ద భద్రతా బలగాలు కార్డన్‌సెర్చ్ చేపట్టాయి. ఈ సందర్భంగా ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. ఘటనలో నలుగురు ఉగ్రవాదులు హతమైనట్లు కశ్మీర్ ఐజీ వీకే బిర్ది చెప్పారు. కాల్పులు కొనసాగుతున్నాయని, ఘటనాస్థలిలోనే మృతదేహాలు పడి ఉన్నాయన్నారు. మరో ఘటన.. ఉగ్రవాదుల కదలికలపై సమాచారం అందుకున్న బలగాలు మొదెర్‌గావ్‌లో శనివారం ఉదయం కార్డన్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. పొంచి ఉన్న ఉగ్రవాదులు ఒక్కసారిగా బలగాలపై కాల్పులకు దిగారు. బలగాలు కూడా దీటుగా స్పందించాయి. కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన ఇద్దరు జవాన్లు నేలకొరిగారు. ముష్కరుల కోసం గాలింపు చేపట్టారు.

ఉత్తరాఖండ్‌లో విరిగిపడిన కొండచరియలు.. ఇద్దరు హైదరాబాద్ వాసుల మృత్యువాత

గోపేశ్వర్: ఉత్తరాఖండ్‌లోని చమోలి జిల్లాలో కొండచరియలు విరిగి పడిన ఘటనలో హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. గౌచర్– కర్ణప్రయాగ్ మార్గంలోని బద్రీనాథ్ జాతీయ రహదారిపై చట్వాపీపల్ వద్ద శనివారం ఈ దుర్ఘటన చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. బద్రీనాథ్ ఆలయాన్ని దర్శించుకుని మోటారు సైకిల్‌పై వస్తున్న నిర్మల్ షాహి(36), సత్యనారాయణ(50)లపై పర్వత ప్రాంతం నుంచి బండరాళ్లు దొర్లుకుంటూ వచ్చి పడటంతో చనిపోయారన్నారు. ఇద్దరి మృతదేహాలను బయటకు తీశామని చెప్పారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో బద్రీనాథ్ హైవేపై సుమారు డజను చోట్ల రహదారి మూసుకుపోయిందని పోలీసులు వివరించారు. కొండచరియలు విరిగి పడటంతో రుద్రప్రయాగ్– కేదార్‌నాథ్ జాతీయ రహదారిలో కూడా రాకపోకలు నిలిచిపోయాయన్నారు. రాష్ట్రంలోని కుమావ్, గఢ్వాల్ ప్రాంతాల్లో శని, ఆదివారాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయంటూ వాతావరణ విభాగం రెడ్ అలెర్ట్ జారీ చేసింది.

ఫ్రాన్స్‌లో నేడే రెండో దశ ఎన్నికలు

501 స్థానాలకు పోలింగ్ ● విపక్ష కూటమిదే దూకుడు

పారిస్: ఫ్రాన్స్‌లో ముందస్తు ఎన్నికల్లో కీలక దశకు సర్వం సిద్ధమైంది. పార్లమెంటులో దిగువ సభ అయిన నేషనల్ అసెంబ్లీలోని 577 స్థానాలకు గాను 501 చోట్ల ఆదివారం రెండో రౌండ్‌లో భాగంగా పోలింగ్ జరగనుంది. తొలి రౌండ్‌లో 76 స్థానాలకు జరిగిన ఓటింగ్‌లో విపక్ష నేషనల్ ర్యాలీ, దాని మిత్ర పక్షాలు స్పష్టమైన ఆధిక్యం కనబరిచాయి. పోలైన 68 శాతం ఓట్లలో అతివాద నేషనల్ ర్యాలీ కూటమి ఏకంగా 33.14 శాతం ఓట్లతో విజయం సాధించింది. మరో విపక్ష కూటమి న్యూ పాపులర్ ఫ్రంట్ 27.99 శాతం ఓట్లతో రెండో స్థానంలో నిలిచింది. అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్ సారథ్యంలోని మితవాద సెంట్రిస్ట్ ఎన్‌సెంబల్ కూటమి కేవలం 20.04 శాతం ఓట్లతో మూడో స్థానానికి పరిమితమైంది. జూన్‌లో జరిగిన యూరోపియన్ యూనియన్ ఎన్నికల్లో మెరీన్ లీ పెన్‌కు చెందిన నేషనల్ ర్యాలీ పార్టీ విజయం నేపథ్యంలో విపక్షాలు పుంజుకుంటున్న సంకేతాలు స్పష్టమయ్యాయి. దాంతో మేక్రాన్ ముందస్తు ఎన్నికలకు వెళ్లడం తెలిసిందే. రెండో రౌండ్‌లో కూడా నేషనల్ ర్యాలీ కూటమి హవాయే కొనసాగవచ్చంటున్నారు. అదే జరిగి 289 పై చిలుకు స్థానాలతో అది పూర్తి మెజారిటీ సాధిస్తే రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఈ ఘనత సాధించిన తొలి రైటిస్టు కూటమి అవుతుంది. ప్రభుత్వాన్ని కూడా ఏర్పాటు చేస్తుంది. అప్పుడు కూటమి అధ్యక్షుడు జోర్డాన్ బార్డెల్లా ప్రధాని అవుతారు. ఆయనతో మాక్రాన్ అధికారాన్ని పంచుకోవాల్సి ఉంటుంది.

అమెరికాలో కాల్పులు.. నలుగురు మృతి

ఫ్లోరెన్స్: అమెరికాలో కెంటకీ రాష్ట్రం ఫ్లోరెన్స్‌లోని ఓ ఇంట్లో బర్త్ డే పార్టీ సందర్భంగా జరిగిన కాల్పుల ఘటనలో నలుగురు చనిపోగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. శనివారం వేకువజామున ఘటన చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కాల్పులకు కారకుడిగా భావిస్తున్న యువకుడిని పోలీసులు వెంటాడారు. ఛేజింగ్ సమయంలో అతడు కారు సహా లోయలో పడిపోయాడని పోలీసులు తెలిపారు. అతడు తనను తాను కాల్చుకున్నాడని, గాయాలతో ఆస్పత్రిలో మృతి చెందాడని చెప్పారు.ఘటనకు కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి సిద్ధం

మోదీతో బ్రిటన్ నూతన ప్రధాని స్టార్మర్ ఫోన్ సంభాషణ

లండన్: భారత్– బ్రిటన్‌ల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని (ఎఫ్‌టీఏ) ఆచరణలోకి తెచ్చేందుకు సిద్ధమని బ్రిటన్ నూతన ప్రధాని కియర్ స్టార్మర్ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీతో శనివారం ఆయన ఈ మేరకు ఫోన్లో చర్చలు జరిపినట్టు బ్రిటన్ ప్రకటించింది. ఆర్థిక బంధాన్ని బలోపేతం చేయడానికి, ఇరు దేశాల ప్రజల వికాసానికి కట్టుబడి ఉన్నామని మోదీ ట్వీట్ చేశారు. వాతావరణ మార్పులు, ఆర్థికాభివృద్ధి అంశాల్లో మోదీ నాయకత్వాన్ని స్టార్మర్ స్వాగతించారని ప్రధాని కార్యాలయం తెలిపింది. 2030 రోడ్‌మ్యాప్‌పై ప్రధానులు చర్చించారని, పలు రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేసుకోవడానికి అంగీకరించారని వెల్లడించింది. త్వరలో భేటీ అవాలని నేతలిద్దరూ నిర్ణయించారు. 38.1 బిలియన్ పౌండ్ల ద్వైపాక్షిక వాణిజ్య భాగస్వామ్యంపై భారత్, బ్రిటన్ 2022 నుంచి సంప్రదింపులు జరుపుతున్నాయి.

అద్వానీకి పొరపాటున మంత్రి శ్రద్ధాంజలి!


తుమకూరు: బీజేపీ దిగ్గజ నేత ఎల్‌కే అద్వానీ చనిపోయారంటూ కేంద్రమంత్రి వి.సోమణ్ణ ఏకంగా ఆయనకు శ్రద్ధాంజలే ఘటించారు! కర్ణాటకలోని తుమకూరులో శనివారం ఈ ఘటన జరిగింది. అద్వానీ అనారోగ్యంతో రెండుసార్లు ఆస్పత్రిలో చేరి చికిత్స అనంతరం కోలుకోవడం తెలిసిందే. మంత్రి మాత్రం బీజేపీ, జేడీ(ఎస్) కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ, ''నాకిప్పుడే సమాచారం అందింది. అద్వానీ మరణించారు'' అంటూ శ్రద్ధాంజలి ఘటించారు. అద్వానీ క్షేమంగా ఉన్నారని తేలడంతో సభికులంతా కంగుతిన్నారు.

సూరత్‌లో కూలిన ఆరంతస్తుల భవనం

సూరత్: గుజరాత్‌లోని సూరత్‌లో శనివారం మధ్యాహ్నం ఆరంతస్తుల భవనం కూలిన ఘటనలో ఒకరు చనిపోయారు. శిథిలాల కింద నలుగురు చిక్కుకున్నట్లు అనుమానిస్తున్నారు. ఒక మహిళను రక్షించామని, ఒక మృతదేహాన్నివెలికి తీశామని పోలీసులు తెలిపారు.

సాక్షి
హైదరాబాద్

ఆదివారం । 7 । జూలై । 2024



రూ.100 కోసం హత్య

రూ.100 కోసం తోటి కార్మికుడిని బండరాయితో కొట్టి హత్య చేసిన ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నట్లు మేడ్చల్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ వివరించారు. -8లో



వ్యాక్సినేషన్ డ్రైవ్.. సూపర్‌హిట్..

జునోసిస్ డే సందర్భంగా పెట్స్‌కు ఉచితంగా రేబిస్ వ్యాక్సినేషన్ వేశారు. దీంతో పెద్దసంఖ్యలో జంతు ప్రేమికులు హాజరై తమ పెట్స్‌కు వ్యాక్సినేషన్ చేయించారు. -10లో

గరిష్టం/కనిష్టం
33.0/24.0

వాతావరణం

నగరంలో రానున్న 24 గంటల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షం పడవచ్చు. గరిష్టంగా 33, కనిష్టంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.



బోనమెత్తుదాం

నేటి నుంచి కోట బోనాలు

• భారీ ఎత్తున ఏర్పాట్లు • ముస్తాబైన అమ్మవార్లు

గోల్కొండ: బోనాలకు వేళైంది. గోల్కొండ కోట ముస్తాబైంది. కోటలో కొలువుదీరిన శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవారి ఆషాఢమాసం బోనాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మొత్తం తొమ్మిది పూజలు అందుకునే అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం జలమండలి భారీ ఎత్తున తాగునీటి ఏర్పాట్లు చేస్తోంది. జలమండలి డీజీఎం ఖాజా జవహర్ అలీ సిబ్బందితో తాగునీటి ట్యాంకర్లను పెట్టిస్తున్నారు. మరోవైపు ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేకంగా హెల్త్ క్యాంప్‌లు ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో అవసరమైయ్యే అంబులెన్స్‌ను కూడా సిద్ధంగా ఉంచారు. అగ్నిమాపక శాఖ వారు మొబైల్ ఫైర్ ఎస్టింగిషర్‌ను కూడా సిద్ధం చేశారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అమ్మవారి అలంకరణలను పూర్తి చేశారు. పోలీసులు లంగర్‌హౌజ్ నుంచి గోల్కొండ వరకు పికెటింగ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు మహిళా పోలీస్ టీమ్‌లను కూడా సిద్ధంగా ఉంచారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరాజు తెలిపారు.



ముస్తాబైన మహంకాళి అమ్మవారు

సప్త మాతృకలకు.. బంగారు బోనాలు..

చార్మినార్: నగరంలో ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని విజయవాడలోని కనక దుర్గ అమ్మవారికి బోనాలను సమర్పించనున్నారు. ఇందులో భాగంగా మొదటి బంగారు బోనాన్ని గోల్కొండ జగదాంబ అమ్మవారికి సమర్పించనున్నామని భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు పాతబస్తీ మీరాలంమండి మహంకాళేశ్వర దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బోనంతో గోల్కొండ కోటకు బయలుదేరుతామన్నారు. లంగర్‌హౌజ్ వద్ద ఏర్పాటు చేసే స్వాగత వేదికపై నుంచి మంత్రులు స్వాగతం పలుకుతారని ఆయన తెలిపారు. కమిటీ ఆధ్వర్యంలో సప్త మాతృకలకు సప్త బంగారు బోనాలను నగరంలోని గోల్కొండ, సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి, బల్కంపేట ఎల్లమ్మ తల్లి, జూబ్లీ హిల్స్ పెద్దమ్మ దేవాలయం, చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయం, లాల్‌దర్వాజా సింహవాహిని దేవాలయం అమ్మవార్లకు బంగారు పాత్రలో సమర్పించనున్నారు. ఇందులో భాగంగా ఆదివారం గోల్కొండ జగదాంబ అమ్మవారికి, 10న బల్కంపేట ఎల్లమ్మ, 12న, జూబ్లీ హిల్స్ పెద్దమ్మ తల్లి, 14న విజయవాడ కనక దుర్గ అమ్మవారికి, 18న సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి, 23న చార్మినార్ భాగ్య లక్ష్మి అమ్మవారికి, 25న లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవార్లకు బంగారు బోనం, పట్టు వస్త్రాలు, ఒడి బియ్యం సమర్పించనున్నారు.



బంగారు బోనం పాత్ర

□ నగరంలో బోనాలు ఇలా.. - వివరాలు 10లో▸



మేయర్ పోడియం వద్ద బీఆర్ఎస్ సభ్యుల ఆందోళన



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బీజేపీ కార్పొరేటర్లు



సభలో మాట్లాడుతున్న ఎంఐఎం సభ్యుడు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సురభి వాణీదేవి



కౌన్సిల్‌కు హాజరైన జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి



బీజేపీ, కాంగ్రెస్ సభ్యుల ఆందోళన.. తోపులాటలతో సభలో గందరగోళ పరిస్థితులు

డిష్యూం డిష్యూం

తోపులాటలు.. నెట్టుకోవడాలు..

- సభలో హోరెత్తిన నినాదాలు
- కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం దోస్తీ అంటూ బీజేపీ సభ్యుల ప్లకార్డులు
- మూడు గంటల సమావేశంలో నాలుగుసార్లు వాయిదాలు
- సభా కార్యక్రమాలు జరగకుండానే ముగిసిన సమావేశం



కౌన్సిల్ సమావేశంలో సభ్యుల మధ్య తోపులాట

బల్దియాలో బాహాబాహీ • కౌన్సిల్ సమావేశం రసాభాస

సాక్షి, సిటీబ్యూరో: ఊహించినట్లుగానే జీహెచ్ఎంసీ కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో జగడమే జరిగింది. సభ ప్రారంభమైనప్పటి నుంచీ ముగిసేంతవరకూ గందరగోళాలు, తోపులాటలు, సభ్యులు మేయర్ పోడియంను చుట్టుముట్టడం వంటి రసాభాసలతోనే ముగిసింది. సమావేశం జరిగింది మూడు గంటలైతే నాలుగు పర్యాయాలు వాయిదా పడింది. తోపులాటలతో సభ అదుపు తప్పుతుండటంతో పలు పర్యాయాలు మార్షల్స్ రంగప్రవేశం చేశారు. ఎలాంటి చర్చ, అజెండా అంశాలు లేకుండానే అర్ధాంతరంగా ముగిసింది. లక్షల రూపాయల ప్రజాధనంతో నిర్వహించిన సభ రసాభాసగా ముగిసింది.

- శనివారం ఉదయం 10.38 గంటలకు మేయర్ సభలోకి రాగానే బీజేపీ, బీఆర్ఎస్ సభ్యులు గందరగోళం సృష్టించారు. పార్టీ మారిన మేయర్ పదవికి రాజీనామా చేయాలంటూ బీఆర్ఎస్ సభ్యులు నినాదాలు చేయడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. పలు పర్యాయాలు పోడియం వద్దకు వెళ్లడంతో పరిస్థితి అస్తవ్యస్తంగా, రసాభాసగా మారింది. పార్టీ మారిన డిప్యూటీ మేయర్ శ్రీలత కూడా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు మేయర్ స్పందిస్తూ.. బీఆర్ఎస్ ఇతర పార్టీల నుంచి చేర్చుకోలేదా? ఫిరాయింపుల్ని ప్రారంభించిందే మీరు.. ఇలా వ్యవహరించేందుకు సిగ్గుండాలి అంటూ వ్యాఖ్యానించారు. తాను బీసీ మహిళనైనందునే ఇలా చేస్తున్నారన్నారు. మీకు అసలు జీహెచ్ఎంసీ నిబంధనల్లో ఏముందో తెలియదు. మీ దగ్గర సబ్జెక్ట్ లేకే ఇలాంటి పనులకు దిగుతున్నారన్నారు. ధర్నాలు చేయాలంటే నా చాంబర్‌కు వచ్చి చేయొచ్చు. అభివృద్ధి, ప్రజా సమస్యలకు కాకుండా ఇలా చేయడం, సభకు వచ్చిన ఎక్స్ అఫీషియో సభ్యులకు అవకాశం లేకుండా చేయడం తగదన్నారు. అయినా గలాభాలు ఆగలేదు. గత రెండేళ్లుగా ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని, ఆర్నెల్లు ఎన్నికల కోడ్ ఉందని, ఇప్పుడు పనులు జరిగే తరుణంలో అడ్డుపడుతున్నారన్నారు. సభ ఆద్యంతం అరుపులు, కేకలు, ప్లకార్డుల ప్రదర్శనలతో దద్దరిల్లిపోయింది. సభ ప్రారంభం కాగానే మేయర్ ఉపన్యసిస్తుండగా.. మరణించిన నేతలకు సంతాపం ముందు తెలపాలని సభ్యులు పట్టుబట్టారు.

ఈ ప్లకార్డుతోనే..

- ఎంఐఎం, బీజేపీ సభ్యుల మధ్య యుద్ధానికి దారి తీసింది ఈ ప్లకార్డులే. ఈ బొమ్మలోని ఒవైసీ క్యారికేచర్‌పై ఎంఐఎం సభ్యులు మండిపడ్డారు. బీజేపీ సభ్యులపై దూసుకెళ్లారు. ఈ సందర్భంగా తోపులాట జరిగింది. ప్లకార్డును ఎంఐఎం సభ్యులు చించివేశారు.
- కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్ ఒకటేనని ఆరోపిస్తూ ప్లకార్డులు పట్టుకున్న బీజేపీ సభ్యులు సభలో జై శ్రీరాం అంటూ నినాదాలు చేశారు. సేవ్ డెమొక్రసీ అంటూ కాంగ్రెస్ ప్లకార్డులు ప్రదర్శించింది. ఆ పార్టీ సభ్యుడు బాబా ఫసియుద్దీన్ రాజ్యాంగం బుక్‌తో సభలోకి వచ్చారు.



కాంగ్రెస్ నాయకులకు పదవుల మీదే ధ్యాస: బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్

కాంగ్రెస్‌కు రాజకీయాలు, పదవుల మీద ఉన్న ధ్యాస ప్రజా సమస్యలపై లేదని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. జీహెచ్ఎంసీ కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో జరిగిన అల్లరి, గందరగోళం ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు. సమావేశం సందర్భంగా ఎక్స్ అఫీషియో సభ్యుడి హోదాలో సభా హాల్‌లోకి ఆయన ప్రవేశించే సమయానికి సభ వాయిదా పడటంతో బయటకు వచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ కంటే కాంగ్రెస్ ప్రభుత్వం బరి తెగించి వ్యవహరిస్తోందని, 2/3 సంఖ్య లేకపోయినప్పటికీ.. ఇద్దరు, ముగ్గురొచ్చినా ఇతర పార్టీలవారికి రాత్రికి రాత్రే కండువా కప్పే పద్ధతి చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. ఇలాంటి పనుల వల్లే గత ప్రభుత్వం భంగపడగా, వాళ్లకు అయిదేళ్లు పడితే వీళ్లు ఆర్నెల్లలోనే అందుకు పాల్పడుతున్నారన్నారన్నారు. మంచి పనులు చేస్తానని అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. మున్సిపల్ శాఖ ముఖ్యమంత్రి వద్దే ఉన్నందున వర్షాకాలంలో ఎదురయ్యే వివిధ సమస్యలను పరిష్కరించాలన్నారు. తమ పార్టీ వాళ్లు కౌన్సిల్‌కు వచ్చింది ప్రజల సమస్యల పరిష్కారం కోసమని చెప్పారు.



వారు రాజీనామాలు చేశారా: మేయర్

సభ జరగవద్దనే తలంపుతోనే బీఆర్ఎస్, బీజేపీలు వ్యవహరించాయని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ధ్వజమెత్తారు. సభ నిరవధిక వాయిదా అనంతరం మీడియాతో ఆమె మాట్లాడారు. గత పదేళ్లలో ఎప్పుడూ లేనట్లు, ఇప్పుడే సమస్యలున్నట్లు వ్యవహరించడమేంటి? అని ప్రశ్నించారు. టీడీపీ నుంచి బీఆర్ఎస్‌కు వచ్చి మంత్రులైన వారెవరైనా రాజీనామాలు చేశారా ? అని ప్రశ్నించారు.

చాలెంజెస్ ఎదుర్కొంటాం: ఆమ్రపాలి

తనతోపాటు కొందరు జోనల్, అడిషనల్ కమిషనర్లు ఇటీవలే వచ్చినందున జీహెచ్ఎంసీలో సమస్యలపై అవగాహన వచ్చిందని, ఇక పరిష్కారంపై దృష్టి పెడతామని కమిషనర్ ఆమ్రపాలి అన్నారు. తమ టీం అంతా చాలెంజ్‌లను సమర్థంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందన్నారు. బోనాలు, మొహర్రం తదితర పండుగలు సాఫీగా జరిగేలా ముందస్తు ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేస్తున్నామని చెప్పారు. వర్షాకాలం ప్రారంభమైనందున నగరంలో ఎదురయ్యే పలు సమస్యలను పరిష్కరించేందుకు సంసిద్ధంగా ఉన్నామన్నారు. దాదాపు 150 వాటర్ లాగింగ్ పాయింట్లను గుర్తించామని, వాటిని ఎప్పటికప్పుడు క్లియర్ చేసే విధంగా ప్రత్యేక టీమ్స్ ఏర్పాటు చేశామని, అన్ని టీమ్స్ క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉన్నాయని చెప్పారు. మాన్సూన్‌లో వ్యాధులు ప్రబలకుండా, దోమల నివారణకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎన్నికల కోడ్‌కు ముందు మంజూరైన నిధులు ఇప్పుడు లేవంటున్నారని, మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖ ఉంటేనే ఇస్తామంటున్నారని బీఆర్ఎస్ సభ్యులు ప్రస్తావించగా.. కోడ్ ముగిసినందున ఆ నిధులు ఇప్పుడు వినియోగించుకోవచ్చునని స్పష్టం చేశారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రణాళికలు: ఈవీడీఎం కమిషనర్ రంగనాథ్

మాన్సూన్ సీజన్‌లో డీసిల్టింగ్, వాటర్ లాగింగ్స్ వంటి సమస్యలే కాకుండా అన్నివేళలా తమ బృందాలు క్షేత్రస్థాయిలో ఉంటాయని ఈవీడీఎం కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నామన్నారు. నాలాలు, చెరువులు, ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురి కాకుండా రక్షించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మేయర్ సూచన మేరకు కొత్తగా ఆయా విభాగాల బాధ్యతలు చేపట్టిన అధికారులు పరిచయం చేసుకున్నారు.

సంతాపం

- ఇటీవల మరణించిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత, ఎర్రగడ్డ కార్పొరేటర్ షాహినా బేగం, కాంగ్రెస్ సీనియర్ నేత డి.శ్రీనివాస్‌లకు సభ సంతాపం వ్యక్తం చేసింది.
- ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, ఎంఎస్ ప్రభాకర్, ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి, కార్పొరేటర్లు, సలీమ్, బొంతు శ్రీదేవి, కొప్పుల నర్సింహారెడ్డి, రవీందర్, వెంకటేశ్ తదితరులు సంతాప తీర్మానంపై మాట్లాడారు.

నిరసన ప్రదర్శనలు



డ్రైనేజీ పైపులతో బీజేపీ సభ్యులు

- సభకు ముందు బీజేపీ సభ్యులు వెలుపల నిరసన ప్రదర్శన నిర్వహించారు. సభ్యులు శ్రవణ్‌కుమార్ మురుగునీరు, దోమల వ్యాప్తి సమస్యలను తెలిపేలా డ్రైనేజీ పైపులు, గుర్రపుడెక్క ప్రదర్శించారు. పేరుకే విశ్వనగరం, సమస్యల పేరెత్తితే గరం గరం, వీధుల్లో కుక్కల దాడి.. అడిగితే ప్రభుత్వ దాడి తదితర నినాదాలతో కూడిన పోస్టర్లు ప్రదర్శించారు.
- వాయిదా సమయంలో బయటకు వచ్చిన కొప్పుల నరసింహారెడ్డి మాట్లాడుతూ, ఎల్‌బీనగర్‌లో టాక్స్‌లు ఫుల్.. అభివృద్ధి నిల్ అన్నారు. పన్నులు మా ఇళ్లనుంచి.. అభివృద్ధి ఎంఐఎం వీధుల్లో.. ఇదేనా మీ తరీఖా అంటూ ప్రశ్నించారు. సమావేశాల పేరిట కాలక్షేపం తప్ప ప్రజాసమస్యలపై శ్రద్ధ లేదన్నారు. పార్టీ మారిన మేయర్, డిప్యూటీ మేయర్ నగరాభివృద్ధికి నిధులు తేవాలని డిమాండ్ చేశారు.
- కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఇతర పార్టీల వారిని తమ పార్టీలోకి చేర్చుకున్న బీఆర్ఎస్.. ఇప్పుడు దాన్ని రాజకీయ అస్త్రంగా వాడుకోవాలని చూస్తోందన్నారు. వాళ్లు తాగితే తల్లిపాలు.. ఇతరులైతే ప్యాకెట్ పాలా? అని ప్రశ్నించారు. ఫిరాయింపుల్ని ప్రోత్సహించిందే ఆ పార్టీ అన్నారు.
- తమకు ప్రజా సమస్యల పరిష్కారం కావాలని, రాజకీయాలతో సంబంధం లేదని ఎంఐఎం సభ్యులు మాజిద్ హుస్సేన్ తదితరులు సభ వెలుపల అన్నారు. ప్రజా సమస్యలపై చర్చ జరగాల్సిన సభను రాజకీయ వేదికగా మార్చారన్నారు.
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద మాట్లాడుతూ.. పార్టీ మారినందున కేకే రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసి హుందాతనాన్ని ప్రదర్శించారని, ఆయన కుమార్తె అయిన మేయర్ విజయలక్ష్మి మాత్రం ఎందుకు రాజీనామా చేయట్లేదని ప్రశ్నించారు.

నల్ల కండువాలు.. బ్యాడ్జిలు





- బీజేపీ కార్పొరేటర్లు నల్ల కండువాలతో, బీఆర్ఎస్ కార్పొరేటర్లు నల్ల బ్యాడ్జిలతో కనిపించారు.
- రేవంత్ డౌన్ డౌన్ అంటూ ఇదేమి రాజ్యం, దొంగల రాజ్యం అంటూ బీఆర్ఎస్ సభ్యులు సభలో ప్లకార్డులు ప్రదర్శించారు.
- బీఆర్ఎస్ సభ్యులు దేదీప్య తదితరులు పోడియం వైపు వెళ్లడంతో మేయర్ వారినుద్దేశించి మీరు మహిళలు.. మహిళలుగా ఉండండి అనడంతో నిరసన వ్యక్తం చేస్తూ వారు మీరు మహిళ కాదా? తమను అలా అన్నందుకు సారీ చెప్పాలని డిమాండ్ చేశారు.
- మురుగునీరు, తాగునీటి సమస్యలెక్కువగా ఉన్నందున సమావేశానికి వాటర్ బోర్డు ఎండీ హాజరు కావాలని సభ్యులు డిమాండ్ చే శారు. జ్వరం వల్ల రాలేకపోయారని మేయర్ తెలిపారు.
- సభ ఎలాంటి చర్చ లేకుండానే ముగిస్తూ మేయర్ అజెండాలోని అంశాలన్నీ డీమ్డ్ టూ అప్రూవ్ అంటూ ఆమోదించినట్లు పేర్కొన్నారు.

సభకు ఎంపీ, ఎమ్మెల్యేలు

ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఈటల రాజేందర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, టి.పద్మారావు, ముఠాగోపాల్, ఎం.గోపీనాథ్, ఎ.గాంధీ, డి.సుధీర్‌రెడ్డి, రహ్మత్ బేగ్ తదితరులు సభకు హాజరయ్యారు.

బాబు ర్యాలీలో దొంగల చేతివాటం

బంజారాహిల్స్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా శుక్రవారం రాత్రి బేగంపేట నుంచి జూబ్లీహిల్స్‌లోని ఇంటి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అయితే టీడీపీ భవన్ వద్దకు చేరుకున్న ఈ ర్యాలీలో జేబు దొంగలు చేతివాటం ప్రదర్శించి నాలుగు గొలుసులు, మూడు మొబైల్ ఫోన్లు తస్కరించాయి. వెంపటి సాలేం రాజు, శ్రీనివాస్, వెల్లంకి రమణ తదితరుల మొబైల్ ఫోన్లతో పాటు రవితేజ, శ్రీకాంత్, గంధి ఆచారి, గోరంట్ల వెంకటేష్ తదితరుల మెడల్లో నుంచి గొలుసులు తస్కరించి పరారయ్యారు. ఈ మేరకు బాధితులు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా దొంగల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

నిమ్స్ అడిషనల్ ప్రొఫెసర్ బలవన్మరణం

సనత్‌నగర్/లక్డీకాపూల్: నిమ్స్ ఆస్పత్రిలో అనస్థీషియా విభాగంలో అడిషనల్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రాచీకార్ (46) బలవన్మరణానికి పాల్పడ్డారు. నెల రోజుల క్రితమే ఖాళీ చేసిన ఇంటికి ఒంటరిగా వచ్చిన ఆమె అధిక మోతాదులో అనస్థీషియా ఇంజెక్షన్ తీసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన వివరాలు పోలీసులు తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి. ఒడిశాకు చెందిన ప్రాచీకార్, దీపక్‌లు దంపతులు. ప్రాచీకార్ నిమ్స్‌లో ఎనస్థీషియా విభాగంలో అడిషనల్ ప్రొఫెసర్‌గా పనిచేస్తుండగా, భర్త దీపక్ మరో ఆస్పత్రిలో కార్డియాలజిస్ట్‌గా ఉన్నారు. వీరికి ఒక కుమారుడు. గత నెల రోజుల క్రితం వరకు బేగంపేట బ్రాహ్మణవాడిలో ఉన్న వీరి కుటుంబం.. మూసాపేటలో కొత్త ఇంటికి షిఫ్ట్ అయ్యారు. అప్పటి నుంచి బేగంపేటలోని ఇల్లు ఖాళీగా ఉంది.



ప్రాచీకార్ (ఫైల్)

ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం పాత ఇంటికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి ప్రాచీకార్ వెళ్లారు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో భర్త దీపక్ ఫోన్ చేయగా స్పందన లేదు. దీంతో అక్కడికి వచ్చిన భర్తకు ఇంటి లోపలి గడియ వేసుకుని ఉండడంతో పాటు ఎంతకీ తలుపు తీయకపోవడంతో స్థానికుల సహాయంతో పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. అపస్మారక స్థితిలో కనిపించిన ప్రాచీకార్‌ను హుటాహుటిన నిమ్స్ ఆస్పత్రికి తరలించగా..పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలిపారు. కాగా ప్రాచీకర్ అధిక మోతాదులో మత్తు మందు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి గాంధీలో పోస్టుమార్టం నిర్వహించి..నిమ్స్ మార్చురీలో భద్రపరిచారు. అయితే ప్రాచీకార్ ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందనేది అంతుపట్టడం లేదు. ఆర్థికంగా, వృత్తిపరంగా మంచి స్థితిలో ఉన్న ప్రాచీకార్ ఆత్మహత్య ఎందుకు చేసుకున్నారో తెలియడం లేదని పోలీసులు పేర్కొన్నారు. అయితే కుటుంబపరమైన సమస్యలు ఏమైనా ఉన్నాయా, లేక విధి నిర్వహణలో ఏదైనా ఇబ్బంది ఉందా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా ప్రాచీకర్ ఆత్మహత్య విషయం తెలిసి నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, ఇతర ఉద్యోగులు అర్ధరాత్రి నిమ్స్‌కు వచ్చారు. ప్రాచీకర్ మృతిపట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సాయంత్రం 6.30 గంటల వరకు ఆమె విధుల్లో ఉన్నారని, రెండేళ్ల బాలుడి సర్జరీకి సహకరించారని కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ అమరేష్ తెలిపారు.

చెట్టును ఢీకొట్టిన కారు..

ఇంజినీరింగ్ విద్యార్థి దుర్మరణం



మృతిచెందిన రాజేందర్

ప్రమాదానికి గురైన కారు

కీసర: కారు అదుపుతప్పి చెట్టును ఢీ కొనడంతో ఓ ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందిన సంఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం మధ్యాహ్నం ముగ్గురు యువకులు విశ్వతేజ, యశ్వంత్, కలసాని రాజేందర్ కారులో బోగారం గ్రామం మీదుగా ఘట్‌కేసర్ వైపు వెళ్తున్నారు. బోగారం దాటాక ఎల్లమ్మ గుడి మూలమలుపు వద్దకు రాగానే కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టడంతో డ్రైవర్ సీట్ పక్కన కూర్చున్న రాజేందర్ (20) అక్కడికక్కడే మృతి చెందాడు. కారు నడుపుతున్న విశ్వతేజ (20) కాలు విరిగింది. వెనక సీటులో కూర్చున్న యశ్వంత్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. ముగ్గురిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. వీరంతా బోగారంలోని హోలీ మేరీ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతూ ఘట్‌కేసర్‌లోని ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్నారు. రాజేందర్, యశ్వంత్‌ల స్వస్థలం ధర్మపురి. కాగా, విశ్వతేజది వేములవాడ. కారులో మద్యం సీసాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మద్యం మత్తులోనే ఘటన జరిగినట్లుగా భావిస్తున్నారు.

నీరు తాగేందుకు వచ్చిన వ్యక్తిని కొట్టి చంపిన కేసులో...

ముగ్గురి రిమాండ్

మియాపూర్: దాహం వేసి టీ స్టాల్ వద్దకు నీరు తాగేందుకు వచ్చిన వ్యక్తిని తీవ్రంగా కొట్టి హత్య చేసిన ముగ్గురు నిందితులను మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. సీఐ దుర్గా రామలింగ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం..మియాపూర్‌లో టీ స్టాల్‌లో నీరుతాగేందుకని వెళ్లిన మెదక్ జిల్లా టేక్మల్ మండలం బోడగట్టుకు చెందిన చాకలి సాయిలు(35)ను ముగ్గురు వ్యక్తులు కొట్టి హత్య చేసిన సంఘటన తెలిసిందే. కాకినాడ జిల్లా గుండెపల్లి మండలం మల్లేపల్లికి చెందిన నారం సతీష్ (24) బోరబండలోని రాజునగర్ కాలనీలో ఉంటూ మియాపూర్‌లోని రాజారామ్ కాలనీ సమీపంలో సురక్ష టీ స్టాల్‌లో పనిచేస్తున్నాడు. శుక్రవారం తెల్లవారు జామున తాగునీరు విషయంలో చాకలి సాయిలుతో గొడవకు దిగాడు. ఈ క్రమంలో రాజారామ్ కాలనీలో ఉంటున్న స్నేహితులు గాంధీగారి జగదీశ్ అలియాస్ లక్కీ(26), పి.భానుప్రసాద్(28)లను ఫోన్ చేసి అక్కడికి పిలిపించాడు. ముగ్గురు కలిసి సాయిలును విచక్షణా రహితంగా కాళ్లతో తన్నడం, కొట్టడం చేశారు. దీంతో తీవ్రంగా గాయపడిన సాయిలు మృతిచెందాడు. ఇది గమనించిన నిందితులు ముగ్గురు అక్కడి నుండి పారిపోయారు. మృతుడు సాయిలు బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అనంతరం సతీష్, జగదీశ్, భానుప్రసాద్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా సాయిలును తామే కొట్టినట్లు అంగీకరించారు. దీంతో ముగ్గురిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు మియాపూర్ పోలీసులు తెలిపారు.

రూ.100 కోసం హత్య

- మేడ్చల్‌లో దారుణం
- కాంట్రాక్టర్‌ను కొట్టి చంపిన కార్మికుడు

మేడ్చల్ రూరల్: రూ.100 కోసం సహచరుడిని బండరాయితో కొట్టి హత్య చేసిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మేడ్చల్ డిటెక్టివ్ ఇన్స్‌పెక్టర్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం..మేడ్చల్ పట్టణంలోని వెంకట్రామిరెడ్డి నగర్ కాలనీకి చెందిన విభూతి పోచయ్య(45) లేబర్ వర్క్స్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతని వద్ద మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ధర్మేంద్ర కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో అతనికి పోచయ్య రూ.100 ఇవ్వాల్సి ఉంది. రోజులాగే శనివారం ఇద్దరు కలిసి ఉదయం నుండి మధ్యాహ్నం వరకు కూలి పని చేసి, మధ్యాహ్నం పట్టణంలోని అయ్యప్ప దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం వద్ద భోజనం చేశారు. అనంతరం కార్మికుడు ధర్మేంద్ర తాను మద్యం తాగడానికి రూ.వంద రూపాయలు ఇవ్వాలని పోచయ్యను అడిగాడు. పోచయ్య డబ్బులు ఇవ్వకపోవడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇలా గొడవ పడుతూ మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో పట్టణంలోని తుమ్మ చెరువు సమీపంలోని లేబర్ అడ్డా వద్దకు నడుచుకుంటూ వెళ్తుండగా..వారి గొడవ తారస్థాయికి చేరింది. దీంతో లేబర్ అడ్డా సమీపంలో ఇద్దరు ఘర్షణ పడగా పోచయ్య తలపై ధర్మేంద్ర రాయితో బలంగా కొట్టాడు. దీంతో పోచయ్య అక్కడికక్కడే మరణించాడు. గొడవను గమనించిన స్థానికులు నిందితుడిని అక్కడే ఓ చెట్టుకు కట్టేసి దేహశుద్ధి చేశారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలికి చేరుకున్న మేడ్చల్ పోలీసులు ఘటన తీరు పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కలెక్టర్‌కు జన్మదిన శుభాకాంక్షలు

హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జన్మదినం సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం కేక్ కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. – సాక్షి, సిటీబ్యూరో



సెక్షన్ 377 రద్దుతో క్వీర్‌ల హక్కులకు విఘాతం

సాక్షి, సిటీబ్యూరో: కేంద్ర ప్రభుత్వం 'భారతీయ న్యాయ సంహిత' పేరుతో తీసుకు వచ్చిన నూతన చట్టాలు పలు సామాజిక, ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగించేలా ఉన్నాయని హైకోర్టు అడ్వొకేట్, ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు శ్రీకాంత్ చింతల అన్నారు. ముఖ్యంగా ఐపీసీ సెక్షన్ 377ను పూర్తిగా రద్దు చేయడం వల్ల స్వలింగ సంపర్కుల(క్వీర్స్)పై లైంగిక దాడులు జరిగితే.. న్యాయం కోసం ఎక్కడికి వెళ్లాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. క్వీర్‌లపై జరుగుతున్న లైంగిక దాడులకు న్యాయ పరిష్కారం లేకుండా చేస్తున్న కొత్త చట్టాలపై 'లిబర్టీ రెబెలియన్, అస్థిత్వం ఫౌండేషన్, నవతేజం ఫౌండేషన్' ఆధ్వర్యంలో లామకాన్ వేదికగా ప్రత్యేక చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ చింతల మాట్లాడుతూ న్యాయ పరిరక్షణ కోసం రూపొందించిన చట్టాలు ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలోంచి పోలీసు వ్యవస్థలోకి మారుతుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. సెక్షన్ 377ను సంపూర్ణంగా రద్దు చేయడం వల్ల క్వీర్ మెన్, క్వీర్ పీపుల్ న్యాయ సంరక్షణ హక్కులను పూర్తిగా కోల్పోతారని ఎల్‌జీబీటీ యాక్టివిస్ట్ విష్ణు తేజ ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కృష్ణజ్యోతి, చందు, ఇష్క్, ఓం ప్రకాష్, లీల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్ నగర్‌లో రెండు రోజులు మద్యం, బార్ షాపుల బంద్

అమీర్‌పేట: ఎస్‌ఆర్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లను రెండు రోజుల పాటు మూసి వేయనున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. ఈ నెల 8వ తేదీ నుండి 10వ తేదీ వరకు బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవ వేడుకలు జరుగనున్న నేపథ్యంలో 9వ తేదీ ఉదయం 6 గంటల నుండి 11వ తేదీ ఉదయం 6 గంటల వరకు స్టేషన్ పరిధిలోని అన్ని మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లు మూసి ఉంటాయని నగర పోలీస్ కమిషనర్ కార్యాలయం అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక యువతి ఆత్మహత్య

మాదాపూర్: ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక టాలీవుడ్‌లో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్న ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం..ఏపీలోని రాజమండ్రికి చెందిన డి.రాజస్వప్న వర్మ (30) గత 10 సంవత్సరాల క్రితం సినీ ఇండస్ట్రీలో పనిచేసేందుకు నగరానికి వచ్చింది. మాదాపూర్‌లోని కావూరిహిల్స్ తీగల హౌస్‌లో ఏడాదిగా ఒంటరిగా ఉంటుంది. గత సంవత్సరం నుంచి చేతిలో ఎలాంటి ప్రాజెక్టులు లేకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురైంది. దీంతో శుక్రవారం తన గదిలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దుర్వాసన రావడంతో ఇంటియజమాని పెట్రోలింగ్ పోలీసులకు సమాచారం అందించడంతో శవాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించారు. స్వప్న వర్మ ఆత్మహత్యకు రెండు రోజుల ముందు ఫైనాన్షియల్‌గా ఇబ్బంది ఉందని, కొంత డబ్బు ఇవ్వమని స్నేహితురాలు సోనికి ఫోన్ ద్వారా చెప్పడంతో ఆమె కొంత డబ్బు ఇచ్చింది. రెండు రోజుల తరువాత సోనికి 'నాకు ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి. బతకాలని లేదు. నేను చనిపోతున్నా' అని ఫోన్‌లో మెసేజ్ పెట్టింది. స్వప్న వర్మ తల్లిదండ్రులు విడాకులు తీసుకోవడంతో ఒంటరిగా ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. తల్లి సుధా ముంబయిలో నివాసం ఉండడంతో పోలీసులు ఆమెకు సమాచారం అందించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రాజస్వప్న వర్మ (ఫైల్)

ఆర్థిక వ్యవస్థలో సీఏల పాత్ర కీలకం

సాక్షి, సిటీబ్యూరో: ఆర్థికాభివృద్ధిలో చార్టర్డ్ అకౌంటెంట్లు(సీఏ) నిర్వహించే పాత్ర ఎంతో కీలకమైనదని హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. శనివారం చార్టర్డ్ అకౌంట్స్ డే సందర్భంగా నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చార్టర్డ్ అకౌంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో రీజనల్ పాస్‌పోర్ట్ అధికారి జె.స్నేహజ, చార్టెడ్ అకౌంటెంట్స్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు దేవరాజ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ జీవితం అందరికీ ఆదర్శం



ఫిలింనగర్‌లో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దానం



కొత్త చెరువు వద్ద దళిత సంఘాల నేతలు



ఎర్రగడ్డ ప్రేమ్‌నగర్‌లో కాంగ్రెస్ నేతలు...

ఫిలింనగర్: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, సంఘ సంస్కర్త బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. శనివారం జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఫిలింనగర్‌లోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే ఘన నివాళులు అర్పించారు. ఫిలింనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగ్ రావు, కాంగ్రెస్ నేతలు కాటూరి రమేష్, శ్యాం, దయ్యాల దాసు, గద్దల ప్రభాకర్, నాగార్జున, ఎం.డి.గౌస్, ఆంజనేయులు పాల్గొన్నారు.

బీజేఆర్‌నగర్‌లో...

బీజేఆర్ నగర్ కొత్త చెరువు వద్ద జగ్జీవన్‌రామ్ విగ్రహానికి స్థానిక దళిత సంఘాల నేతలు నడిమింటి కృష్ణ, దానగళ్ల ప్రభాకర్, దామోదర్, ప్రకాశ్, రాము, రవి, శ్యాం, రాములు, జగన్, నర్సింగ్ తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను నేతలు కొనియాడారు.

ఎర్రగడ్డలో...

శ్రీనగర్‌కాలనీ: బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఎర్రగడ్డ ప్రేమ్‌నగర్‌లో గ్రేటర్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ రవిగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నేతలు ఎర్ర కృష్ణకుమార్, మోసిన్ ఖురేషి, సర్దార్, ఖాజాపాషా, శ్రీనివాస్, జహంగీర్, గోపీ, హనుమంత్, మల్లేష్ పాల్గొన్నారు.

పచ్చదనంలో భాగస్వామ్యం కావాలి



మొక్క నాటుతున్న భోజిరెడ్డి తదితరులు

బంజారాహిల్స్: ప్రధాన మంత్రి నరేంద్రమోడీ పిలుపు మేరకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాడిగారి భోజిరెడ్డి అమ్మ పేరుపై శనివారం మొక్క నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతిఒక్కరూ అమ్మ పేరిట మొక్కను నాటి పచ్చదనం పెంపొందించడంలో భాగస్వాములుగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి మంచి కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. బీజేపీ జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, నేతలు అనిల్‌కుమార్, రామ్మోహన్‌రావు, విద్యాసాగర్ పాల్గొన్నారు.

భళా.. 'ప్రతిభా దర్శన్'





నదుల ప్రాముఖ్యతను తెలియజేస్తూ ప్రదర్శనలో పాల్గొన్న జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

- నదుల ప్రాముఖ్యతను చాటేందుకు సరికొత్త ఆలోచన
- తమ ప్రతిభతో అబ్బురపరచిన విద్యార్థులు
- మూడు భాషల్లో సాగిన కార్యక్రమం

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో 'నదియాన్ హమారా అస్తిత్వ్' పేరిట విద్యార్థులు నిర్వహించిన 'ప్రతిభా దర్శన్' కార్యక్రమం ఆకట్టుకుంది. దేశంలోని ప్రసిద్ధ నదులు, వాటి విశిష్టత, నదులు చాటిచెప్పే సంస్కృతి సంప్రదాయాల గురించి తెలియజేసే ప్రయత్నంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి విద్యార్థిలో దాగి ఉన్న నైపుణ్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని వెలికితీయడమే లక్ష్యంగా సాగిన ప్రతిభా దర్శన్‌లో విద్యార్థులు అబ్బురపరిచి ఆలోచింపజేశారు.

- మూడు భాషల్లో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా నదుల చారిత్రక వైభవం, సాంస్కృతిక ప్రాముఖ్యత, వాటి గొప్పతనం గురించి చాటిచెప్పారు. అలాగే కవితలు, నృత్యాలు, నృత్య నాటకాలు ప్రదర్శించారు.
- ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ వరలక్ష్మీ మాట్లాడుతూ... విద్యార్థుల్లో నదుల వారసత్వం, సంస్కృతి, సహకార నైపుణ్యాలను గురించి అవగాహన కల్పించడం, దేశంలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ప్రవహించే నదులు అందరినీ ఏకం చేస్తున్నాయని చెప్పారు.
- ప్రిన్సిపాల్ కాంచనవల్లి, ప్రాథమిక విభాగం ప్రధానోపాధ్యాయురాలు విదుమోహన్ మాట్లాడుతూ... నదులు పారే జలపాతాలు మాత్రమే కాదని, మన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతిరూపాలుగా చెప్పవచ్చన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎంతగానో కృషి చేశారన్నారు.
- మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు మురళీముకుంద్ మాట్లాడుతూ... ఈ ప్రదర్శనలు విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఎంతగానో దోహదపడతాయన్నారు. నదుల ప్రాముఖ్యతను చాటిచెప్పేందుకు విద్యార్థులు చేసిన కృషి అభినందనీయమన్నారు.
- ఐదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లల అద్భుతమైన ప్రదర్శనలకు ఆశ్చర్యచకితులయ్యారు.

'సేవ్ ట్రీస్' థీమ్‌తో విద్యార్థుల గ్రీన్‌వాక్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-3లోని సుల్తాన్ ఉల్ ఉలూమ్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు శనివారం వన మహోత్సవ వేడుకలను సందేశాత్మకంగా ఆలోచన రేకెత్తించే విధంగా ఘనంగా నిర్వహించారు. సేవ్ ట్రీస్ పేరుతో ప్లకార్డులు ప్రదర్శిస్తూ స్కూల్ ప్రాంగణంలో గ్రీన్‌వాక్ నిర్వహించారు. 'ప్లాంట్ ఏ ట్రీ–సేవ్ ఏ లైఫ్' నినాదంతో నిర్వహించిన ఈ వాక్‌లో అన్ని విభాగాల అధ్యాపకులు, స్కూల్ టీచర్లు, సుల్తాన్ ఉల్ ఉలూమ్ ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవ కార్యదర్శి జాఫర్ జావీద్, స్కూల్ ప్రిన్సిపాల్ సమేర్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు మొక్కలు నాటి స్ఫూర్తిని చాటుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈ సందర్భంగా బహుమతులు ప్రదానం చేశారు.





గ్రీన్‌వాక్‌లో సుల్తాన్ ఉల్ ఉలూమ్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

మేయర్ రాజీనామాకు కార్పొరేటర్ల డిమాండ్



ధర్నాలో పాల్గొన్న కార్పొరేటర్లు కవితారెడ్డి, వెంకటేష్ తదితరులు

బంజారాహిల్స్: జీహెచ్ఎంసీ బల్దియా కౌన్సిల్ సమావేశం శనివారం వాడీవేడిగా జరగ్గా ఖైరతాబాద్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు వెల్దండ వెంకటేష్ (జూబ్లీహిల్స్), మన్నె కవితారెడ్డి (వెంకటేశ్వరకాలనీ)లు పార్టీ మారిన మేయర్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ముందు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. మేయర్, డిప్యూటీ మేయర్ ఇందుకు నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో పాల్గొన్న కార్పొరేటర్లు మాట్లాడుతూ హైదరాబాద్ ఖ్యాతిని కాపాడాలని, అభివృద్ధి పేరుతో గద్దెనెక్కిన ప్రభుత్వం పేద ప్రజలతో ఆడుకుంటుందని, ఫిరాయింపులే కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుందని దుయ్యబట్టారు.

ఇంజినీరింగ్ సర్టిఫికెట్ల పరిశీలన షురూ



ఇంజినీరింగ్ ధ్రువ పత్రాల పరిశీలనలో సైఫాబాద్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్ తదితరులు

బంజారాహిల్స్: సైఫాబాద్ సైన్స్ కళాశాలలో ఇంజినీరింగ్ సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. ఈ నెల 13 వరకు కొనసాగే ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవనీత, డాక్టర్ వెంకటరమణ, కౌన్సెలింగ్ కో–ఆర్డినేటర్ బీ రామయ్య, అసిస్టెంట్ రిజిస్ట్రార్ బాలకృష్ణలు దగ్గరుండి పర్యవేక్షించారు. విద్యార్థులు తమకు సూచించిన ధ్రువపత్రాలన్నింటినీ సిద్ధం చేసుకుని రావలసి ఉంటుందని, ప్రతి ధ్రువపత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలింస్తామని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు.

శ్యామాప్రసాద్‌ముఖర్జీ సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

హిమాయత్‌నగర్: భారతీయ జన్ సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని పలువురు బీజేపీ నేతలు అన్నారు. శనివారం హిమాయత్‌నగర్ డివిజన్ బీజేపీ నేతలు ఆయన జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా శామాప్రసాద్‌ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కె.నర్సింగ్ ముదిరాజ్, సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షులు పి.ప్రసాద్, కె.సుధాకర్, ఎన్.వెంకటేష్, మనీలా శాంతి, నవీన్, గోపి, రామస్వామి, శేఖర్ యాదవ్, రాజు గౌడ్, వేణు గౌడ్, భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూలు ఆపేయాలని జర్నలిస్టుకు వార్నింగ్

బంజారాహిల్స్: తనకు బెదిరింపు వాయిస్ కాల్స్ వస్తున్నాయని ప్రాణహాని ఉందంటూ సీనియర్ జర్నలిస్టు బలివాడ మురళీధర్ బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల సమాచారం మేరకు... కొన్ని సంవత్సరాలుగా పోలీసు అధికారులు, మాజీ నక్సలైట్లను ఇంటర్వ్యూలు చేస్తున్న మురళీధర్‌కు ఇంటర్వ్యూలు ఆపేయాలని, స్క్రీన్‌పైకి రాకూడదని గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి వాయిస్ మెసేజ్ పంపాడు. ఇలా మొత్తం 25 వాయిస్ మెసేజ్‌లు పంపించాడు. మురళీధర్ స్పందించి మీరు ఎవరు..? మీకు ఏం కావాలి..? అంటూ మెసేజ్ చేయగా త్వరలోనే యాక్షన్ చూస్తారు అంటూ మావోయిస్టులకు సంబంధించిన పోస్టర్‌ను పంపించాడు. ఇంటర్వ్యూలు ఆపేయాలని, వార్నింగ్ ఇవ్వడమే కాకుండా యాక్షన్ తప్పదు అని హెచ్చరికలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ 351(4) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మురళీధర్ కొన్ని సంవత్సరాలుగా ఐడ్రీమ్స్‌లో పోలీస్ అధికారులను, జైలుకు వెళ్లి మారిన ఖైదీలను, మాజీ నక్సలైట్‌లను ఇంటర్వ్యూ చేస్తూ వారి జీవిత విశేషాలను వెలుగులోకి తెస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ బెదిరింపు కాల్ వచ్చింది.

ఆటోలోని మహిళ పర్సు స్నాచింగ్

వెంగళరావునగర్: ఆటోలో ఉన్న మహిళ పర్సును అగంతకుడు లాక్కెళ్లిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... జీహెచ్ఎంసీలో స్వీపర్‌గా పనిచేసే వీరమ్మ ఈ నెల 4న నిమ్స్‌లోని తన కోడలి వద్దకు వెళ్లింది. తిరిగి 5వ తేదీ ఆటోలో తిరిగి వస్తుండగా యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ వద్ద ఆటోవాలా టీ తాగడానికి పక్కకు నిలిపాడు. ఈ సమయంలో అగంతకుడు వచ్చి ఆమెతో మాట్లాడటానికి ప్రయత్నించి ఒక్కసారిగా ఆమె చేతిలోని పర్స్ లాక్కుని పారిపోయాడు.

బోనాలకు హాజరు కావాలని మేయర్‌కు ఆహ్వానం



మేయర్‌కు పుస్తకాన్ని బహూకరిస్తున్న కార్పొరేటర్లు

రహమత్‌నగర్: బోరబండ, రహమత్‌నగర్ డివిజన్ల పరిధిలో అంగరంగ వైభవంగా నిర్వహించే బోనాల జాతర ఉత్సవాలకు హాజరు కావాలని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మికి ఆయా డివిజన్ల కార్పొరేటర్లు బాబా ఫసీయుద్దీన్, సీఎన్ రెడ్డి శనివారం కోరారు. ఈ మేరకు మేయర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన వారు ఆమె భారత రాజ్యాంగ పుస్తకాన్ని బహూకరించారు. తమ ప్రాంతాల్లో జరిగే బోనాల ఉత్సవాల్లో పాల్గొనాలని వారు మేయర్ విజయలక్ష్మిని కోరారు. తాము చేసిన విజ్ఞప్తి మేయర్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 41, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 35, బెండకాయ 35, పచ్చిమిర్చి 70, బజ్జీమిర్చి 55, క్యాప్సికమ్ 70, పచ్చకాకర 45, పందిరి బీర 28, క్యాబేజీ 33, క్యారెట్ 35, దొండ 25, గుండుబీన్స్ 105, గింజ చిక్కుడు 75, గోకరకాయ 50, కీర 25, దోసకాయ 25, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 40, చామగడ్డ 37, మొరంగడ్డ 40, కందగడ్డ 55, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 4–5, ముల్లంగి రూ. 5–6 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నేడు జగన్నాథ రథయాత్ర



రథయాత్ర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని శ్రీజగన్నాథ ఆలయంలో ఆదివారం జగన్నాథ రథయాత్ర అత్యంత వైభవంగా జరగనుంది. ఇందుకు సంబంధించిన బందోబస్తు ఏర్పాట్లను బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర పరిశీలించారు. వేలాది మంది భక్తులు రథయాత్రలో పాల్గొనేందుకు రానుండగా ఆ మేరకు మూడు ప్లటూన్లతో దారి పొడవునా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

నిమ్స్‌కు వీల్ చైర్ల వితరణ



లక్డీకాపూల్: నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు సౌకర్యార్థం హెల్ప్‌నీడ్ ట్రస్ట్ 35 వీల్ చైర్లను అందజేసింది. శనివారం నిమ్స్ జరిగిన కార్యక్రమంలో ట్రస్టీ ఆర్.మనోహర్ బాబు ఆధ్వర్యంలో దాతలు మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణకు అందజేశారు. హైకోర్టు సీనియర్ న్యాయవాదులు సింహాద్రి, కంఠంనేని రామకృష్ణ ప్రసాద్, వేములపల్లి రమేష్‌బాబు ఈ వీల్ చైర్లను సమకూర్చారు. డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కేవీకృష్ణారెడ్డి, ఏఎంఎస్‌లు డాక్టర్ రాకేష్, డాక్టర్ చరణ్, మీడియా ఇంచార్జి సత్యాగౌడ్, సూపర్‌వైజర్ రాము పాల్గొన్నారు.

బ్యాగుల పంపిణీ



పంజగుట్ట: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని ఎంతోమంది ఉన్నత శిఖరాలకు వెళ్లారని, మీరుకూడా మంచిస్థాయికి రావాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, పీజేఆర్ ఫౌండేషన్ చైర్మన్ విజయారెడ్డి విద్యార్థులకు సూచించారు. శనివారం రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం కరుణశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాత నేరస్తుల అరెస్టు: భారీగా సొత్తు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి

బంజారాహిల్స్: నిర్మానుష, నిషేధిత స్థలాల్లో మారణాయుధాలతో తిరుగుతున్న వారిని, అనుమానితుల కదలికలపై దృష్టి పెట్టి ఆకస్మిక తనిఖీలు చేస్తున్న సమయంలో దొరికిన ముగ్గురు పాత నేరస్తులను ఫిలింనగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శనివారం ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి, ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసులు, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.జయరాంతో కలిసి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... నగర పోలీసు కమిషనర్ ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ నెల 5న ఫిలింనగర్ పోలీసులు టోలిచౌకి బృందావన్ కాలనీ మోడ్రన్ కేఫ్ వద్ద డిజార్మింగ్ డ్రిల్ నిర్వహిస్తుండగా ఇద్దరు అనుమానిత వ్యక్తులు దొరికారు. వీరిని విచారించగా నగరంలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పది దొంగతనాలు చేసినట్లుగా తేలింది. వీరిలో ఆసిఫ్‌నగర్‌కు చెందిన సయ్యద్ అలీ హుజైఫా (20), మహ్మద్ అజ్మల్ షరీఫ్ అలియాస్ నదీమ్(19), బహదూర్‌పురాకు చెందిన మహ్మద్ అబిద్ బియాబానీ(19)ల నుంచి రూ. 27 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, మొబైల్ ఫోన్లు, బైక్, 100 యూఎస్ డాలర్లు, ఐదు రిస్ట్ వాచ్‌లను స్వాధీనం చేసుకున్నారు. దొంగలను చాకచాక్యంగా పట్టుకుని పెద్ద ఎత్తున సొత్తును రికవరీ చేసిన ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, డీఐ జయరాం, డీఎస్ఐ జె.శ్రీకాంత్‌రెడ్డి, కానిస్టేబుళ్లు జనార్ధన్‌నాయక్, బి.హరీష్‌కుమార్‌లను ఏసీపీ అభినందించారు.

21న టి.అంజయ్యనగర్ బస్తీ ఎన్నికలు

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్ టి.అంజయ్యనగర్ బస్తీ ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల నిర్వాహకులు ప్రకటించారు. కమ్యూనిటీ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నికల నిర్వాహకులు వైవీఆర్ లా అసోసియేట్స్‌కు చెందిన న్యాయవాది వినయ్ కుమార్ మాట్లాడుతూ... టి.అంజయ్యనగర్ బస్తీ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ఈ నెల 8వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రారంభమై 9 తేదీ సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందన్నారు. నామినేషన్ల ఉపసంహరణ 10 తేదీన ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, నామినేషన్ అభ్యర్థుల ప్రకటన 12 తేదీన ఉంటుందన్నారు. ఎన్నికల నిర్వహణ(పోలింగ్) 21 తేదీన ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బ్రిలియంట్ హైస్కూల్‌లో కొనసాగుతుందని వినయ్‌కుమార్ తెలిపారు. ఓట్ల లెక్కింపు అదే రోజు సాయంత్రం 4 గంటలకు ప్రారంభమవుతుందని ప్రకటించారు. ఎన్నికల సంబంధించిన అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశామన్నారు. ఎన్నికల నిర్వహణ సీసీ కెమెరాల పర్యవేక్షణలో కొనసాగుతుందని వినయ్‌కుమార్ తెలిపారు.

ఆకట్టుకుంటున్న ఆకృతి ఎలైట్ ఎగ్జిబిషన్



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నంబర్–1లోని తాజ్ డెక్కన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన ఆకృతి ఎలైట్ ఎగ్జిబిషన్ సందర్శకుల హృదయాలను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఎగ్జిబిషన్‌ను ఆకృతి డైరెక్టర్ శశినాథ శనివారం ప్రారంభించారు. మూడు రోజుపాటు జరిగే ఈ ఎగ్జిబిషన్ సోమవారం వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ట్రాఫిక్ పోలీసుల ఔదార్యం



వృద్ధురాలిని ఆస్పత్రికి తీసుకెళ్తున్న ట్రాఫిక్ పోలీసులు

బంజారాహిల్స్: నిమ్స్ ఆస్పత్రికి వైద్య పరీక్షల కోసం ఓ వృద్ధురాలు సిటీ బస్సులో వచ్చి దిగేందుకు ఇబ్బందులు పడుతుండగా అక్కడే విధి నిర్వహణలో ఉన్న పంజగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గౌస్‌ఖాన్‌తో పాటు ఎస్ఐ ఆమెను బస్సులో నుంచి క్షేమంగా కిందికి దింపారు. అంతేకాదు.. అడుగు ముందుకు వేయలేక ఇబ్బంది పడుతున్న ఆమెను వైద్య పరీక్షలు నిర్వహించే ఆస్పత్రి లోపలి వరకు తీసుకువెళ్లి ఆమెకు పరీక్షలు చేసిన అనంతరం తిరిగి బస్సు ఎక్కించి పంపించారు. వీరి ఔదార్యానికి పలువురు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



ఫిలింనగర్: ఫిలింనగర్ మహాత్మా గాంధీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అగర్వాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్, స్టేషనరీని అందజేశారు. గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధి హరి అగర్వాల్ పాఠశాలలో చదువుకుంటున్న 140 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్, స్టేషనరీని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరి అగర్వాల్ మాట్లాడుతూ... ప్రతియేటా తాము ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, స్టేషనరీ, స్కూల్ బ్యాగ్స్ ఉచితంగా అందజేస్తుంటామని, తమ కుటుంబ సభ్యుల ప్రత్యేక దినాలను పేద విద్యార్థుల మధ్య జరుపుకొంటామని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీవీ భద్రం తదితదరులు పాల్గొన్నారు.

మలబార్‌లో 'నువ' డైమండ్ కలెక్షన్స్

పంజగుట్ట: ప్రముఖ మోడల్స్ బంగారు, వజ్రాభరణాలు ధరించి ర్యాంప్‌పై సందడి చేశారు. సోమాజిగూడలోని మలబార్ గోల్డ్, డైమండ్స్ షోరూంలో శనివారం 'నువ' పేరుతో కొత్త డైమండ్ కలెక్షన్స్ ప్రారంభించారు. యూఏఈలోని తమ షోరూంలో జరిగిన ఒక గ్రాండ్ ఈవెంట్‌లో ప్రముఖ నటి కరీనాకపూర్‌ఖాన్ చేతులమీదుగా ఈ కలెక్షన్ ఆవిష్కరించినట్లు, అదే కలెక్షన్‌ను సోమాజిగూడ షోరూంలో అందుబాటులోకి తెచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.



వ్యాక్సినేషన్ డ్రైవ్.. సూపర్‌హిట్..

జునోసిస్ డే సందర్భంగా ఉచిత రేబిస్ టీకాలు

సూపర్‌స్పెషాలిటీ వెటర్నరీ హాస్పిటల్‌లో క్యాంప్ • పెట్స్‌కు టీకాలు వేయించిన జంతు ప్రేమికులు







పెట్ డాగ్‌కు వ్యాక్సిన్ వేస్తున్న వైద్యులు

హిమాయత్‌నగర్: జునోసిస్ డే సందర్భంగా రేబిస్ వ్యాక్సినేషన్‌ను క్యాంప్‌లో పెట్స్‌కు ఉచితంగా వేశారు. దీంతో పెద్దసంఖ్యలో జంతు ప్రేమికులు హాజరై తమ పెట్స్‌కు వ్యాక్సినేషన్ చేయించారు. క్యాంప్‌లో పలు రకాల పెట్ డాగ్స్ ఆకట్టుకున్నాయి. రేబిస్ వ్యాధి రాకుండా ఉండేందుకు పెంపుడు శునకాల విషయంలో జంతు ప్రేమికులు జాగ్రత్తలు పాటించాలని వెటర్నరీ డాక్టర్లు సూచిస్తున్నారు. జునోసిస్ డే సందర్భంగా ఇండియన్ ఇమ్యూనోలాజికల్స్ లిమిటెడ్ (ఐఐఎల్) దేశవ్యాప్తంగా లక్షకు పైగా కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్‌ను ఉచితంగా వేశారు. ఈ సందర్భంగా నారాయణగూడ సూపర్ స్పెషాలిటీ వెటర్నరీ హాస్పిటల్‌లో శనివారం జరిగిన వ్యాక్సినేషన్ క్యాంప్‌నకు పెద్ద సంఖ్యలో జంతుప్రేమికులు శునకాలను తీసుకొచ్చి టీకాలు వేయించారు. రేబిస్‌పై అవగాహన కల్పించిన వైద్యులు జంతు ప్రేమికులకు పలు సూచనలు చేశారు. జిల్లా వెటర్నరీ అధికారి డాక్టర్ పి.వెంకటేశ్వర్లు, వెటర్నరీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రేబిస్, స్వైన్ ఫ్లూ, బ్రూసెల్లోసిస్, లెప్టోస్పిరోసిస్, పోర్సిన్ సిస్టిసెర్కోసిస్, నిఫా, జికా మొదలైన అన్ని వ్యాధుల్లో 70 శాతం జునోటిక్ స్వభావం కలిగి ఉంటాయన్నారు. జునోటిక్ కేసుల్లో 90 శాతం కంటే ఎక్కువగా ఉన్నాయని, ప్రపంచవ్యాప్తంగా నమోదైన వ్యాక్సినేషన్ ద్వారా రోగనిరోధకత అనేది వ్యాధి ప్రబలకుండా ఉపయోగపడుతుందన్నారు. కుక్కలకు టీకాలు వేయడం ద్వారా అనేక దేశాలు రేబిస్ సంబంధిత మానవ మరణాల సంఖ్యను తగ్గించగలిగాయని వివరించారు.

'వ్యాక్సిన్ల రంగంలో మన దేశానికి స్వయం సమృద్ధి కోసం ఐఐఎల్ అతిపెద్ద సంస్థ. పోర్సిన్ సిస్టిసెర్కోసిస్‌కు వ్యతిరేకంగా ప్రపంచంలోనే మొట్టమొదటి వ్యాక్సిన్‌తో సహా జునోటిక్ వ్యాధులను పరిష్కరించే అనేక వ్యాక్సిన్లను ఐఐఎల్ అభివృద్ధి చేసింది. జునోటిక్ వ్యాధుల నిర్మూలనకు కూడా సంస్థ కట్టుబడి ఉంది.
– ఆనంద్ కుమార్, ఎండీ, ఇండియన్ ఇమ్యూనోలాజికల్స్ లిమిటెడ్

అనేక వ్యాక్సిన్లు అభివృద్ధి చేసిన ఐఐఎల్

రేబిస్‌కు వ్యాక్సిన్‌తో చెక్

జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులను జునోటిక్ వ్యాధులు అంటారు. వీటికి వ్యాక్సిన్ల ద్వారా 90 శాతం వరకు చెక్ పెట్టవచ్చని వైద్యులు అంటున్నారు. వివిధ జునోటిక్ వ్యాధులకు వ్యాక్సిన్లతో సహా ప్రపంచ స్థాయి మానవ, జంతు ఆరోగ్య వ్యాక్సిన్లను ఉత్పత్తి చేసే 'వన్ హెల్త్' కంపెనీ, ప్రతి సంవత్సరం జూలై 6వ తేదీన, దీన్ని 'ప్రపంచ జునోసిస్ డే'గా కూడా జరుపుకుంటారు. ఐఐఎల్ దేశవ్యాప్తంగా అనేక వెటర్నరీ డిస్పెన్సరీలు, పశువైద్యులు రేబిస్ అవగాహన శిబిరాలను నిర్వహిస్తోంది. దేశంలోని 21 రాష్ట్రాల్లోని 100 కేంద్రాల్లో వెటర్నరీ డిస్పెన్సరీలు మొదలైన వాటి ద్వారా లక్షకు పైగా రక్షరాబ్(యాంటీ-రేబిస్ వ్యాక్సిన్) ఉచిత టీకా శిబిరాలను నిర్వహించింది.


వ్యాక్సినేషన్ కోసం తీసుకువచ్చిన మహిళ

బాబు జగ్జీవన్‌రాం కాలేజీకి ఐఎస్‌వో సర్టిఫికెట్


సర్టిఫికెట్ అందజేస్తున్న పరిశీలక బృంద సభ్యులు

హిమాయత్‌నగర్: నారాయణగూడలోని బాబు జగ్జీవన్‌రాం ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి ప్రతిష్టాత్మకమైన ఐఎస్‌వో(ఎడ్యుకేషనల్ ఆర్గనైజేషన్ మేనేజ్‌మెంట్ సిస్టం) గుర్తింపు సర్టిఫికెట్ లభించింది. ఇటీవల హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో శనివారం ప్రతినిధులు కాలేజీని పర్యవేక్షించారు. విద్యా ప్రమాణాలు, క్వాలిటీ, ఎనర్జీ, ఎన్విరాన్మెంట్‌తో పాటు సోలార్ పవర్, వాటర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్, భూసార నాణ్యత, మొక్కలు వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని ఐఎస్‌వో సర్టిఫికెట్ ప్రకటించారు. ఈ సందర్భంగా కాలేజీ ఆవరణలో అధికారిక పరిశీలక సభ్యుడు శివయ్య ఐఎస్‌వో గుర్తింపు సర్టిఫికెట్‌ను కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ.గీతా లక్ష్మీ పట్నాయక్‌కు అందజేశారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

సాక్షి, సిటీబ్యూరో: విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలంగాణ విద్యుత్ వర్కర్స్ యూనియన్ (బి-2871) గౌరవ సలహాదారు కె.రఘు చెప్పారు. ఈ మేరకు శనివారం మింట్ కాంపౌండ్‌లోని యూనియన్ కార్యాలయంలో వ్యవస్థాపక అధ్యక్షుడు గాంబో నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యుత్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మురళి, వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ ఖాదీర్ అలీ, ప్రధాన కార్యదర్శి నాగం సంతోష్‌రెడ్డి, అడిషనల్ జనరల్ సెక్రటరీ ప్రశాంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్, వెంకటేష్, లక్ష్మణ్, జైపాల్, రాజప్ప, జితేందర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న మూత్రనాళ పునర్నిర్మాణ శస్త్రచికిత్సలు

అంతర్జాతీయ సదస్సులో వైద్యుల వెల్లడి



లక్డీకాపూల్: గతంలో మూత్రనాళాలు సన్నబడటానికి గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు ప్రధాన కారణం అయ్యేవి. రెండు దశాబ్దాలుగా అవగాహన పెరగడంతో ఇది 30–40% వరకు తగ్గింది. రోడ్డు ప్రమాదాలు, ఇన్ఫెక్షన్ల వల్ల మూత్రనాళ పునర్నిర్మాణ శస్త్రచికిత్సలు ఎక్కువగా చేయాల్సి వస్తోందని యూరాలజీ సదస్సు అభిప్రాయపడింది. జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో యూరేత్రా @ ఏఐఎన్‌యూ పేరిట శనివారం యూరాలజీ సదస్సు ప్రారంభమైంది. సదస్సు నిర్వాహక కార్యదర్శి, ఏఐఎన్‌యూ కన్సల్టెంట్ యూరాలజిస్టు డాక్టర్ భవతేజ్ ఎన్‌గంటి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ ఫ్రాక్చర్లు జరిగినప్పుడు మూత్రనాళాలు దెబ్బతింటాయి. అలాంటప్పుడు కొన్ని నెలలు వేచి ఉండి, ఆ తర్వాత దీన్ని సరిచేయాలన్నారు. యూటీఐ, ఎస్‌టీఐ వంటి ఇన్ఫెక్షన్ల వల్ల కూడా మూత్రనాళాలు సన్నబడుతున్నాయి. కేన్సర్ వంటి వాటికి రేడియేషన్ ఇచ్చినప్పుడు కూడా మూత్రనాళాల్లో సమస్యలు వస్తున్నాయి. మూత్రనాళాలు సన్నబడిపోవడం వల్ల మూత్రవిసర్జన తగ్గడం, దానివల్ల అనేక సమస్యలు వచ్చినప్పుడు ఈ శస్త్రచికిత్స చేస్తారు. సాధారణంగా మూత్రనాళాలకు రిపేర్ చేసినప్పుడు అవి ఫెయిలయ్యే అవకాశాలు ఉంటాయి. వాళ్ల సొంత టిష్యూల ఆధారంగానే ఆపరేషన్ చేయాలి. బుగ్గలు, నాలుక దగ్గర ఉండే టిష్యూలను తీసుకుంటాం. ఇప్పుడు సెల్ థెరపీ ఆధారంగా రీజనరేటివ్ పద్ధతులు అవలంభిస్తున్నారు. కార్యక్రమంలో ఏఐఎన్‌యూ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ సి.మల్లికార్జున, మూత్రనాళ శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ సంజయ్ కులకర్ణి(పుణె), డాక్టర్ గణేష్ గోపాలకృష్ణన్(కోయంబత్తూరు), ఐఎస్‌బీ హైదరాబాద్ మాజీ డీన్ అజిత్ రంగ్నేకర్ హాజరయ్యారు. 8 దేశాలతో సహా.. దేశంలోని 800 మందికిపైగా యూరాలజిస్టులు పాల్గొన్నారు.

కేఎల్‌హెచ్‌కు అత్యున్నత పురస్కారాలు



అవార్డు అందుకుంటున్న కేఎల్‌హెచ్ ప్రతినిధులు

బంజారాహిల్స్: కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా(సీఎస్ఐ) హైదరాబాద్ చాప్టర్ నిర్వహించిన ఐసీసీఎస్సీపీ, సీఎస్ఐ అవార్డ్స్–2024లో కేఎల్‌హెచ్ అత్యున్నత పురస్కారాలను అందుకుంది. ఆవిష్కరణలకు గాను బెస్ట్ ప్రిన్సిపాల్ అవార్డును డాక్టర్ ఎ.రామకృష్ణ అందుకున్నారు. అలాగే సొసైటీ ఔట్రీచ్ అవార్డు(ఫ్యాకల్టీ)ను డాక్టర్ మల్లేష్‌కు అందజేశారు. అలాగే స్టార్టప్ అవార్డు(సీఎస్ఐ)ను ఈసీఈ విభాగానికి చెందిన విద్యార్థి ఆర్యమాన్ కుమార్ చౌదరి అందుకున్నారు. ఈ సందర్భంగా కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ మాట్లాడుతూ.. సైబర్ సెక్యూరిటీ కరెంటు అంశాలపై జరిగిన అంతర్జాతీయ సదస్సు సందర్భంగా ఈ అవార్డులు అందిస్తామన్నారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో వినూత్న ఐటీ సొల్యూషన్స్ పోషించే కీలక పాత్రను ఆయన వివరించారు.

శేషగిరిరావు యోగక్షేమాలపై ఆరా..


శేషగిరిరావుతో హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

అంబర్‌పేట: బీజేపీ సీనియర్ నాయకులు, సెంట్రల్ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ శేషగిరిరావును కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మర్యాదపూర్వకంగా కలిశారు. నల్లకుంటలోని శేషగిరిరావు నివాసానికి శనివారం చేరుకొని ఆయన యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఏబీవీపీ నాయకుడిగా, ప్రొఫెసర్‌గా, బీజేపీ సీనియర్ నాయకుడిగా ఆయన అందించిన సేవలను గుర్తుచేశారు. బీజేపీ నేతలు మనోహర్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, కెఎస్.గౌతమ్‌రావు, అమృత, కృష్ణగౌడ్, అజయ్, శ్యాంరాజు తదితరులు ఉన్నారు.

తలసానికి పరామర్శ..


తలసాని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బండి సంజయ్

కంటోన్మెంట్: మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కేంద్ర మంత్రి బండి సంజయ్ పరామర్శించారు. ఇటీవల తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు, మోండా మార్కెట్ అధ్యక్షుడు శంకర్ యాదవ్ మరణించారు. శనివారం సాయంత్రం కేంద్ర మంత్రి బండి సంజయ్ వెస్ట్‌మారేడ్‌పల్లి రాధికా కాలనీలోని శంకర్ యాదవ్ నివాసానికి చేరుకుని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ కార్పొరేటర్లు దీపిక, చీర సుచిత్ర శ్రీకాంత్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తలసాని సాయికిరణ్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

సమాజసేవకు సమయం కేటాయించడం భేష్

హైకోర్టు న్యాయమూర్తి శ్రవణ్ కుమార్ వెంకట్


రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఈస్ట్ నూతన కమిటీతో హైకోర్టు న్యాయమూర్తి శ్రవణ్ కుమార్ వెంకట్


బంజారాహిల్స్: సమాజసేవకు విలువైన సమయాన్ని కేటాయించడం అభినందనీయమని హైకోర్టు న్యాయమూర్తి శ్రవణ్ కుమార్ వెంకట్ అన్నారు. ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఈస్ట్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై నూతన కమిటీని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్ సేవలు తనకు తెలుసని, ఎంతో మంది పేదలకు సేవలు అందిస్తున్నారని చాలా మందికి ఆదర్శవంతంగా నిలుస్తున్నారని కొనియాడారు. రోటరీ క్లబ్ ద్వారా మరింత మందికి సేవలు అందించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు. ప్రెసిడెంట్‌గా టీఎంఎస్.చౌదరి, సెక్రటరీగా రాధేశ్యాం తివారితో పాటు పలువురు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు టీఎంఎస్ చౌదరి మాట్లాడుతూ రోటరీ క్లబ్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించామని, త్వరలోనే రాష్ట్రంలోని పలు జిల్లాల్లో డయాలసిస్ రోగులకు ఉచితంగా డయాలసిస్ చేసేలా కేంద్రాలు నెలకొల్పనున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే కేన్సర్‌కు సంబంధించిన పలు చికిత్సలను తాము ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఎయిమ్స్ ఈడీ ప్రొఫెసర్ డాక్టర్ వికాస్ భాటియా, డిస్ట్రిక్ట్ 3150 ఇన్‌స్టలేషన్ ఆఫీసర్ శరత్ చౌదరి, ప్రెసిడెంట్ సుదేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ కేసులో.. మా కాలేజీకి సంబంధం లేదు

• ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ నరేంద్రకుమార్

సుల్తాన్‌బజార్: ఇటీవల డ్రగ్స్ కేసులో అరెస్టయిన వారు తమ కాలేజీకి చెందిన వారు కాదని, ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ నరేంద్రకుమార్ తెలిపారు. ఈ మేరకు కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ కె.మణికందన్ డాక్టర్ వి.అరవింద్ కోఠి బస్టాప్ వద్ద యాంటి నార్కోటిక్ పోలీసులకు డ్రగ్స్ తీసుకుంటుండగా పట్టుబడ్డారు. అయితే పోలీసులు ఉస్మానియా మెడికల్ కళాశాల విద్యార్థులని మీడియాకు వెల్లడించడం సరైంది కాదన్నారు. వారిద్దరు 2016వ బ్యాచ్ పూర్వ విద్యార్థులని, ప్రస్తుతం తమ కళాశాల హాస్టల్‌లో ఉండటం లేదన్నారు. మణికందన్ సీనియర్ రెసిడెన్సిగా ఉస్మానియా ఆస్పత్రిలో పనిచేస్తున్నారని, డాక్టర్ వి.అరవింద్ తమ కళాశాలలో ఇంటర్న్‌షిప్ 2002లో పూర్తి చేశాడని, ప్రస్తుతం ఎక్కడ ఉంటున్నాడో తమకు తెలియదన్నారు. ఈ డాక్టర్లతో తమకు ఎలాంటి సంబంధం లేకున్నా ప్రపంచంలో ఎంతో పేరున్న తమ కళాశాల పేరు మెన్షన్ చేయడం ఎంతవరకు సబబు అన్నారు.

ఆలోచింపజేసే ఫొటోలు



మాదాపూర్: కళాకారులు వేసిన చిత్రాలు, తీసిన ఫొటోలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శనివారం 24 హవర్స్ ప్రాజెక్టు పేరిట 125 మంది ఫొటోగ్రాఫర్లు తీసిన ఫొటోలను సందర్శకులకు అందుబాటులో ఉంచారు. సందేశాత్మకంగా, సోషల్ అవేర్‌నెస్ చూపించే విధంగా ఫొటోలు ఉన్నాయని ప్రముఖులు కొనియాడారు. ఎగ్జిబిషన్ ఈ నెల 14వ తేదీ వరకు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భారత్, ఇరాన్, జపాన్, మెక్సికో, యూఎస్ఏ, యూకేకు చెందిన ఫొటోగ్రాఫర్లు సైతం పాల్గొన్నారు.

మున్నూరు కాపులకు మంత్రి పదవి ఇవ్వాలి


మాట్లాడుతున్న కొండ దేవయ్య

పంజగుట్ట: రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న మున్నూరు కాపులకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ ప్రభుత్వాన్ని కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభాలో 24 శాతం ఉన్న మున్నూరు కాపులకు మంత్రివర్గంలో స్థానం లేకపోవడం బాధాకరమని, రాబోయే మంత్రివర్గ విస్తరణలో రెండు మంత్రి పదవులు తమ సామాజిక వర్గానికి కేటాయించాలన్నారు. మున్నూరు కాపు కార్పొరేషన్‌కు రూ.2 వేల కోట్లు, ఆత్మగౌరవ భవనానికి మరో రూ.20 కోట్లు మంజూరు చేయాలన్నారు. మున్నూరు కాపు బాలబాలికల కోసం ప్రతి జిల్లా కేంద్రంలో రెండు ఎకరాల స్థలం, రూ.2 కోట్లు ఇవ్వాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే నిర్వహించాలన్నారు. త్వరలోనే సీఎం, మంత్రులకు కలిసి వినతిపత్రం ఇస్తామన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయకోటి రాజు, కార్యదర్శి వాసాల వెంకన్న, గ్రేటర్ యూత్ అధ్యక్షుడు దేశెట్టి శివ, నర్సింగ్‌రావు, వాసాల రాజు, రవి, సాయిని శ్రీను, నిరంజన్, దుర్గా ప్రసాద్, ఉమారాణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

1,199 పెంపుడు, వీధి కుక్కలకు టీకాలు

లక్డీకాపూల్: జీహెచ్ఎంసీ పరిధిలో 1,199 పెంపుడు, వీధి కుక్కలకు ఉచితంగా టీకాలు వేశారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జంతువులకు ముఖ్యంగా పెంపుడు, వీధి కుక్కలకు ఉచితంగా ఏఆర్‌వీ టీకాలు అందజేశామని బల్దియా చీఫ్ వెటర్నరీ డాక్టర్ అబ్దుల్ వకీల్ పేర్కొన్నారు. జంతువుల నుంచి మనుషులకు సక్రమించే వ్యాధులను జూనోసిస్ వ్యాధులు అంటారన్నారు. ప్రజల ఆరోగ్యం జంతు సంక్షేమం కోసం ఏఆర్‌వీ చికిత్స అందించేందుకు పశు వైద్య శాఖ అధికారులు పాల్గొన్నారన్నారు. ఈ నేపథ్యంలో ఎల్బీనగర్ జోన్ 617 పెంపుడు వీధి కుక్కలకు ఏఆర్‌వీ టీకాలు వేశామని చెప్పారు. అదేవిధంగా చార్మినార్ జోన్‌లో 252, ఖైరతాబాద్‌లో 115, శేరిలింగంపల్లి జోన్‌లో 48, కూకట్‌పల్లి జోన్‌లో 58, సికింద్రాబాద్ జోన్‌లో 109 పెంపుడు, వీధి కుక్కలకు ఏఆర్‌వీ టీకాలు వేసినట్లు ఆయన తెలిపారు.

నగరంలో బోనాలు ఇలా..





సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఈ నెల 7 నుంచి ఆగస్టు 4 వరకు ఆషాఢ మాసం బోనాలు కొనసాగనున్నాయి. ఇందులో భాగంగా దేవాలయాల కమిటీలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయి.

ఉత్సవాల షెడ్యూల్ ఇలా..

- 7న గోల్కొండ జగదాంబ మహంకాళి బోనాలు, తొట్టెల, రథం ఊరేగింపు, మెట్ల పూజ, సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయంలో ఘటోత్సవం.
- 8న బల్కంపేట ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానంలో ఎదుర్కోళ్ల ఉత్సవం. సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయంలో ఘటోత్సవం.
- 9న ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానంలో కల్యాణం, సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో ఘటోత్సవం.
- 10న బల్కంపేట ఎల్లమ్మ, పోచమ్మ దేవస్థానంలో చండీ హోమం, రథోత్సవం, మహంకాళి దేవాలయంలో ఘటోత్సవం.
- 11న గోల్కొండ జగదాంబిక మహంకాళి ఆలయంలో బోనాలు. సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయంలో ఘటోత్సవం.
- 12, 13న సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయంలో ఘటోత్సవం.
- 14న గోల్కొండ మహంకాళి దేవాలయం, అంబర్ పేట మహంకాళి దేవాలయంలో బోనాలు.
- 15న నుంచి జూలై 17 వరకు సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయం, అంబర్‌పేట, మహంకాళి దేవాలయంలో ఘటోత్సవం.
- 18న గోల్కొండ జగదాంబిక మహంకాళి ఆలయంలో బోనాలు. చండీహోమం, పూర్ణాహుతి, సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయం, అంబర్‌పేట మహంకాళి దేవాలయంలో ఘటోత్సవం.
- 19న లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి దేవాలయం, ఉప్పుగూడ, మహంకాళి దేవాలయం, బంగారు మైసమ్మ దేవాలయం, హరిబౌలి అక్కన్న మాదన్న దేవాలయం శాలిబండ, మిర్యాలమండి మహాకాళేశ్వర దేవాలయం, గౌలిపురా మహంకాళి దేవాలయం, భారత మాత కోట మైసమ్మ దేవాలయం, హైదరాబాద్, మురాద్ మహల్ నల్లపోచమ్మ దేవాలయం, బంగారు మైసమ్మ దేవాలయం, సుల్తాన్ షాహి జగదాంబ దేవాలయం, రామభక్ష బండ బంగారు మైసమ్మ దేవాలయం, సీబీఐ క్వార్టర్స్‌లోని నల్ల పోచమ్మ దేవాలయం, అలియాబాద్ దర్బార్ మైసమ్మ దేవాలయం, అలీజా కోట్ల మహంకాళి దేవాలయంలలో కలశ స్థాపన కుంకుమార్చన, సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి దేవాలయం, అంబర్‌పేట మహంకాళి దేవాలయాల్లో ఘటోత్సవం.
- 22న సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయంలో రంగం, అంబారీ ఊరేగింపు, మహా హారతి, అంబర్‌పేట, కార్వాన్ ఘటోత్సవం, హోమం.
- 23న అంబర్‌పేట, సబ్జీడీ నటరాజ్ నగర్ కార్వాన్‌లో ఘటోత్సవం, ఊరేగింపు.
- 24న లాల్‌దర్వాజా, ఉప్పుగూడ, హరిబౌలి శాలిబండ, మిర్యాల మండి గౌలిపురా, హైదరాబాద్ మురాద్ మహల్, సుల్తాన్ షాహి రామ భక్ష బండ, సీబీఐ క్వార్టర్స్, అలియాబాద్, అలీజా కోట్ల, అంబర్‌పేట కార్వాన్ దేవాలయాల్లో శాకాంబరి అలంకరణ దర్శనం, హోమం.
- 25న గోల్కొండ, అంబర్‌పేట, కార్వాన్, మిస్రీ గంజ్ దేవాలయాల్లో బోనాలు ఘటోత్సవం, హోమం.
- 26న సబ్జీమండి, నటరాజ్ నగర్, అంబర్‌పేట, మిర్యాల మండి, ఉప్పుగూడలోని దేవాలయాల్లో హోమం ఘటోత్సవం, శాంతి కల్యాణం.
- 27న కార్వాన్, అంబర్‌పేట మిస్రీ గంజ్ బ్రిడ్జి, సబ్జీ మండి, నటరాజ్‌నగర్, గోల్కొండ లాల్ దర్వాజా హరిబౌలిలోని దేవాలయాల్లో అభిషేకం, మైల బోనం, ఊరేగింపు, ఘటోత్సవం, కల్యాణం.
- 28న మురాద్ మహల్, హరిబౌలి, మిస్రీ గంజ్ బ్రిడ్జి, సబ్జి మండి, నటరాజ్ నగర్, చిలకలగూడ, ఉప్పుగూడ మిర్యాల మండి, గౌలిపురా, సుల్తాన్ షాహి, హరిబౌలి, రామ భక్షబండ, అలియాబాద్, సీబీఐ క్వార్టర్స్, బోయిగూడ, అలిజాకోట్ల, అంబర్‌పేట, కార్వాన్, చార్మినార్ ఎన్టీఆర్ నగర్, ఎల్బీనగర్ నాచారంలలోని దేవాలయాలలో బోనాలు, శాంతి కల్యాణం. రంగం, రథయాత్ర, అభిషేకం అంబారీ ఊరేగింపు, తొట్టెల ఊరేగింపు.
- 29న హరిబౌలి, చిలకలగూడ, ఉప్పుగూడ, లాల్ దర్వాజా, మిర్యాల మండి, హైదరాబాద్ సుల్తాన్ షాహి, మిస్రీగంజ్ బ్రిడ్జిలలో అంబారీ ఊరేగింపు
- 30న లాల్ దర్వాజా, ఉప్పుగూడ, హరిబౌలి, మిర్యాల మండి, గౌలిపురా, మురాద్ మహల్, రామ బక్ష బండ, సుల్తాన్ షాహి, సీబీఐ క్వార్టర్స్, అలియాబాద్ అలీజాకోట్లలోని దేవాలయంలో అమ్మవార్లకు పూజలు.




సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్‌,
ఆదివారం, 7, జూలై, 2024

'సాల్వ్‌ ఫర్‌ టుమారో'కి 100 టీమ్స్‌...

ప్రముఖ ఎలక్ట్రానిక్స్‌ గృహోపకరణాల బ్రాండ్‌ శామ్‌ సంగ్‌ ఇండియా నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమం సాల్వ్‌ ఫర్‌ టుమారో కోసం ఇప్పటికి 100 టీమ్స్‌ను ఎంపిక చేసినట్లు సంస్థ నగర ప్రతినిధులు తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి స్కూల్‌, యూత్‌ ట్రాక్‌ విభాగాల నుంచి 50 చొప్పున ఎంపిక చేశామని, ఈ టీమ్స్‌ జాతీయ స్థాయిలో పోటీపడతాయని వివరించారు. ఈ 100 టీమ్స్‌ నుంచి 232 మంది ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పర్యావరణం, సస్టెయినబులిటీలకు సంబంధించి వీరి నుంచి వచ్చిన 50 ఐడియాలు అసాధారణ రీతిలో ఉన్నాయన్నారు. విజేతగా నిలిచిన స్కూల్‌కు ఎన్విరాన్‌మెంట్‌ ఛాంపియన్‌ టైటిల్‌తో పాటు రూ.50లక్షలు గ్రాంట్‌గా అందిస్తామన్నారు.



సౌదీ పర్యాటకులకు మరిన్ని వీసా అవకాశాలు



నగరం నుంచి సౌదీకి పెద్ద సంఖ్యలో వెళ్లే పర్యాటకులను దృష్టిలో ఉంచుకుని సౌదీ వీసాలను మంజూరు చేసే కేంద్రం సైతం నగరంలో ఏర్పాటైంది. దీంతోపాటు మరిన్ని టూరిస్ట్‌ వీసా అవకాశాలు సైతం అందుబాటులోకి వచ్చాయి. వీటిలో 96 గంటల వరకూ అమలులో ఉండే స్టాపర్‌ వీసా, అమెరికా, యుకె తదితర దేశాలకు చెందిన పర్యాటక వీసా కలిగినవారు దరఖాస్తు చేసుకుని పొందగలిగిన ఇ–వీసా, అదే విధంగా కొన్ని దేశాల బిజినెస్‌ వీసా కలిగిన వారి కోసం 'వీసా ఆన్‌ అరైవల్‌'ను కొత్తగా అందుబాటులోకి తెచ్చామని సౌదీ పర్యాటక శాఖ ప్రతినిధులు తెలిపారు. తమ దేశానికి వచ్చే భారతీయ పర్యాటకుల సంఖ్య 2030కి 7.5 మిలియన్లకు చేర్చడమే లక్ష్యమని సౌదీ పర్యాటక శాఖ ప్రతినిధులు చెబుతున్నారు.


బేకింగ్‌ వర్క్‌షాప్‌..



పేస్ట్రీలు, బిస్కెట్స్‌.. తదితర బేకరీ ఉత్పత్తుల తయారీ పట్ల ఔత్సాహికుల ఆసక్తిని దృష్టిలో ఉంచుకుని నగరంలో బేకింగ్‌ వర్క్‌షాప్స్‌ విరివిగా ఏర్పాటవుతున్నాయి. అందులో భాగంగానే మాదాపూర్‌లోని ఎఫ్‌ కేఫ్‌ అండ్‌ బార్‌లో ఆదివారం బేకింగ్‌ వర్క్‌షాప్‌ నిర్వహిస్తున్నారు. ఈ వర్క్‌షాప్‌ మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభమవుతుంది. విందు, సంగీతాల నేపథ్యంలో నిర్వహించే ఈ ఈవెంట్‌ విజ్ఞాన వినోదాల మేళవింపుగా కొనసాగుతుందని నిర్వాహకులు అంటున్నారు.

నేడు జగన్నాథ రథయాత్ర

ఇస్కాన్‌ హైదరాబాద్‌ ఆధ్వర్యంలో 45వ శ్రీ జగన్నాథ రథయాత్ర సంబరాలు జరగనున్నాయి. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు ఎన్టీఆర్‌ స్టేడియం వద్ద నుంచి ఆర్టీసీ క్రాస్‌ రోడ్స్‌, చిక్కడపల్లి, నారాయణగూడ క్రాస్‌ రోడ్స్‌, హిమాయత్‌ నగర్‌, టీటీడీ దేవాలయం, లిబర్టీ క్రాస్‌ రోడ్స్‌, బషీర్‌బాగ్‌, చర్మాస్‌, అబిడ్స్‌, ఎంజే మార్కెట్‌ మీదుగా ఎగ్జిబిషన్‌ గ్రౌండ్స్‌ వద్ద సాయంత్రం ఆరు గంటలకు ముగియనుంది. ఇక్కడ ఏడు గంటలకు భక్తులకు ప్రత్యేక చప్పన్‌ భోగ్‌ దర్శనం కల్పించనున్నారు.



అనంతలో ఇంట్రా మూట్‌ కోర్ట్‌

భారత నూతన న్యాయ చట్టాలైన భారత న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష అదినియంపైన యువకులు, విద్యార్థులు తమ ప్రతిభను, అవగాహనను చాటుకున్నారు. కూకట్‌పల్లిలోని అనంత న్యాయ కళాశాలలో ఏర్పాటు చేసిన మూడో ఇంట్రా మూట్‌ కోర్ట్‌ కాంపిటీషన్‌లో యువకులు ఆసక్తిగా పాల్గొన్నారు. ఈ కాంపిటీషన్‌లో ఉత్తమ ప్రతిభ చూపించిన విద్యార్థులకు ఉస్మానియా ప్రొఫెసర్‌ డాక్టర్‌ జిబి రెడ్డి మెడల్స్‌ అందించారు. ఈ సందర్భంగా ప్రొ జిబి రెడ్డి మాట్లాడుతూ నూతన చట్టాలపై ప్రజల్లో అవగాహన అవసరమని, న్యాయ విద్యార్థులకు న్యాయ వ్యవస్థపై మరింత అవగాహన పెంపొందించటానికి ఇలాంటి వేదికలు ఉపయోగకరమని అనంత న్యాయ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ చంద్రమతి పేర్కొన్నారు.



> రాహుల్‌గాంధీ రాజకీయాల్ని మరచిపోతారు.. సచిన్‌ టెండూల్కర్‌ బ్యాటింగ్‌కు బదులు ఈటింగ్‌కి జై కొడతారు.. హైదరాబాద్‌ బిర్యానీ అంటే సెలబ్రిటీలకే సెలబ్రిటీ. శతాబ్దాల నాటి బిర్యానీ ఎప్పటికప్పుడు నగరాన్ని రుచుల విశ్వంలో రారాజుగా నిలబెడుతూనే ఉంది. నేడు ప్రపంచ బిర్యానీ దినోత్సవం.. ఈ సందర్భంగా లొట్టలేస్తూ నెమరేసుకుందాం.. మన బిర్యానీ..కహానీ..
>
> - సాక్షి, సిటీబ్యూరో



దటీజ్‌ దమ్‌

మన బిర్యానీ.. విశ్వవ్యాప్తం

దేశంలో అత్యధికంగా జనం ఆస్వాదిస్తోన్న ఆహారం బిర్యానీయే. అయితే అలా ఆర్డర్‌ ఇస్తున్న ప్రతి ఐదు బిర్యానీల్లో ఒకటి మనదేనట. ఆ విధంగా చూస్తే భాగ్యనగరం దేశానికి బిర్యానీ క్యాపిటల్‌గా మారిందన్నమాటే. దేశవ్యాప్తంగా సెకనుకు సగటున 2.5 బిర్యానీలు హాంఫట్‌ అవుతున్నాయట. గతేడాది నగరంలో 13 మిలియన్ల బిర్యానీలు స్విగ్గీ సర్వ్‌ చేసింది. అంటే అక్షరాలా కోటి 30లక్షలు.. నగరంలోని 1700కు పైగా రెస్టారెంట్లలో కేవలం ఒక్క స్విగ్గీ ద్వారా అమ్ముడవుతున్న బిర్యానీల సంఖ్యే ఇది. ఇక ఇతరత్రా మార్గాల ద్వారా జరిగే విక్రయాలను కలుపుకుంటే చెప్పనక్కర్లేదు. నగరంలో అమ్ముడయ్యే బిర్యానీల్లో తొలిస్థానం చికెన్‌ బిర్యానీ కాగా, రెండో స్థానం వెజ్‌ బిర్యానీ కావడం మరో విశేషం. ఆ తర్వాతి స్థానాల్లో చికెన్‌ దమ్‌ బిర్యానీ, మటన్‌ బిర్యానీలు ఉన్నాయి. తాజాగా టేస్ట్‌ అట్లాస్‌ నిర్వహించిన ఓ అధ్యయనంలో అత్యుత్తమ రుచుల్లో మన బిర్యానీ 6వ స్థానంలో నిలిచింది.

నేడు ప్రపంచ బిర్యానీ దినోత్సవం
- సెకనుకు సగటున 2.5 బిర్యానీలు
- తెల్లవారు జాము నుంచి అర్ధరాత్రి వరకూ..
- మండీ వచ్చినా.. ట్రెండీ మనదే..
- సామాన్యుల నుంచి సెలబ్స్‌ వరకూ ఫిదా
- శతాబ్దాల నాటి అనుబంధం..
- అత్యుత్తమ రుచుల్లో 6వ స్థానం



బిర్యానీ అనే పదం పర్షియన్‌ భాషలోని బిరింజ్‌ నుంచి పుట్టింది. దీని అర్థం రైస్‌. బిర్యానీ మన దేశానికి 1398లో పరిచయం అయ్యిందట. హైదరాబాద్‌ నిజామ్స్‌, లక్నో నవాబులు బిరియానీ అంటే లొట్టలేసేవారట. మొఘలుల కాలంలో తరచూ యుద్ధాల్లో పాల్గొనే సైనికుల కోసం చేసిన ప్రత్యేక వంటకం ఇది. సైనికుల శక్తి సామర్థ్యాలను దృష్టిలో

శతాబ్దాల నాటి అనుబంధం

పెట్టుకుని మటన్‌, బియ్యం సమపాళ్లలో మేళవించి చెక్కల మంట మీద మసాలాలు, కుంకుమ పువ్వు దీనిలో కలిపి వండేవారట. నగరాన్ని పాలించిన నిజామ్‌ ఉల్‌ మల్క్‌.. బిర్యానీ విస్తరణ చరిత్రలో చెక్కుచెదరని పేరు తెచ్చుకున్నారు. స్థానిక వంటకాల శైలులను ఒకటొకటిగా కలుపుకుంటూ ఎన్నో కొత్త రుచులను అద్దుకుంది బిర్యానీ. ఇందులో నిజామ్స్‌ సృష్టించిన కచ్చి గోస్త్‌ బిర్యానీ ఒకటి. ఇటీవల మన దేశపు అగ్రగామి చెఫ్‌ సంజీవ్‌కపూర్‌ సైతం తన అభిమాన బిర్యానీ హైదరాబాద్‌లో పుట్టిన కచ్చి గోస్త్‌ బిర్యానీ గురించి చెప్పడం విశేషం.

బహురూపాల్లో...

- బిర్యానీని సాధారణంగా హండి లేదా కుండలో వండడం అనేది ఏళ్లనాటి సంప్రదాయం. కానీ కుండలోనే వడ్డిస్తూ, పార్సిల్స్‌ కూడా అందిస్తున్నారు. ఆ తర్వాత డబ్బా బిర్యానీ వచ్చింది. ఇది కాంపాక్ట్‌ కంటైనర్‌లో అందించడం మొదలుపెట్టారు. ఆంధ్రప్రదేశ్‌లోని మారేడు మిల్లి బొంగులో బిర్యానీకి ఫేమస్‌. వెదురు బొంగుల్లో వండిన బిర్యానీని అలాగే వడ్డిస్తూ టేక్‌ అవే ఇస్తున్నారు. జూబ్లీహిల్స్‌లోని స్పైసీ వెన్యూ రెస్టారెంట్‌లో ఎంఎల్‌ఏ పొట్లం బిర్యానీ పేరుతో ఆమ్లెట్‌లో చుట్టి వడ్డిస్తూ పార్సిల్స్‌ చేస్తున్నారు.
- కొత్తగా బకెట్‌ బిర్యానీ వచ్చింది. ఎరుపు, తెలుపు, బ్లూ.. ఇలా అనేక రంగుల బిర్యానీ బకెట్లు నగరవాలుకు కలర్‌ఫుల్‌ ట్రీట్‌ అందుబాటులోకి తెచ్చాయి. నగరంలోని ఓ రెస్టారెంట్‌లో బిర్యానీ–ఇన్‌–ఏ–వాటర్‌–వెస్సెల్‌ కూడా రానుందని అంటున్నారు. అంతే కాదు కోన్‌లో బిర్యానీ, పిజ్జాలో బిర్యానీ, సమోసాలో బిర్యానీ, బిర్యానీ సుషీ రోల్స్‌, బిర్యానీ ఫ్లేవర్‌ ఐస్‌ క్రీం వంటివి ఆన్‌ ద వే అట.

తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకూ...

థియేటర్లలో షోస్‌ టైమింగ్స్‌లాగే నగరంలోనూ బిర్యానీ దొరికే వేళలు అంతకంతకూ విస్తరిస్తున్నాయి. నైట్‌లైఫ్‌తో పాటే మిడ్‌నైట్‌ బిర్యానీలు కూడా పుట్టుకొచ్చేశాయి. అబిడ్స్‌లోని గ్రాండ్‌ హోటల్‌ అర్ధరాత్రి బిర్యానీ విందుకు చిరునామాగానూ, అలాగే చాదర్‌ ఘాట్‌ మిడ్‌నైట్‌ బిర్యానీలకు కేరాఫ్‌గా మారాయి. కొన్ని స్టార్‌ హోటల్స్‌ బిర్యానీ ప్రియులకు అర్ధరాత్రుళ్ల తలుపులు తెరుస్తున్నాయి. అలాగే తెల్లవారు జామున 4 గంటలకే వేడివేడి బిర్యానీని అందించే ట్రెండ్‌ ఇటీవలే ఊపందుకుంటోంది. మాదాపూర్‌, గచ్చిబౌలి, బోరబండ, వివేకానందనగర్‌.. ప్రాంతాల్లో సందడి కనిపిస్తోంది. కాల్‌ సెంటర్లు, మాన్యుఫ్యాక్చరింగ్‌ కంపెనీలు, సాఫ్ట్‌వేర్‌ కంపెనీల్లో పనిచేసే ఉద్యోగులు నైట్‌ షిఫ్ట్‌ను ఈ బిర్యానీతో ముగించడానికి అలవాటు పడుతున్నారు.

ఫుడ్‌ ఫైర్‌పై వండే కేటరర్‌.. సూపర్‌..



నగరానికి చెందిన మహారాజ్‌ కేటరర్స్‌, ఎస్‌కె కేటరర్స్‌, ఎలిగెన్స్‌.. తదితర సంస్థలు ఫుడ్‌ ఫైర్‌ మీద వండి కేటరింగ్‌ చేస్తున్నారు. పెళ్లిళ్లు, వేడుకల్లో వీరి బిర్యానీలకు డిమాండ్‌ ఉంది. అలాగే హోటల్స్‌ విషయానికి వస్తే..బావర్చి, పంజాగుట్టలోని మెరిడియన్‌, ఫైవ్‌స్టార్‌ హోటల్‌ మారియట్‌లో బిదిరి అనే హైదరాబాద్‌ స్పెషల్‌ రెస్టారెంట్‌, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని ఆస్టోరియా, పిస్తా హౌజ్‌లోని సాఫ్రాని బిర్యానీలు నా ఛాయిస్‌.

-జుబైర్‌ అలీ, ఫుడ్‌ బ్లాగర్‌

సిటీలో టాప్‌ బిర్యానీ సెంటర్లు ఇవే...

ఏళ్ల నాటి నుంచి చార్మినార్‌కు సమీపంలోని షాబాద్‌ హోటల్‌ బిర్యానీకి ఫేమస్‌. అదే క్రమంలో పాతబస్తీలోని దారుల్‌షిఫాలోని నయాబ్‌, బంజారాహిల్స్‌లోని బిర్యానీ వాలా, హైదర్‌గూడలోని కేఫ్‌ బహార్‌, సికింద్రాబాద్‌లోని పారడైజ్‌, నారాయణగూడలోని మెహఫిల్‌, టోలిచౌకిలోని షాగౌస్‌, ఫలుక్‌నుమా ప్యాలెస్‌లోని అదా, క్రాస్‌రోడ్స్‌లోని బావర్చి, పాతబస్తీలోని పిస్తా హౌజ్‌, పంజాగుట్టలోని మెరిడియన్‌ రెస్టారెంట్‌... తదితర పేర్లు నగరంలోని బిర్యానీప్రియులకు నిత్య స్మరణీయం. ఇవన్నీ దశాబ్దాలుగా బిర్యానీ ఫేవరెట్స్‌ కాగా.. ఇటీవలి కాలంలో మరికొన్ని రెస్టారెంట్స్‌ అత్యాధునిక హంగులతో రుచికరమైన బిర్యానీలను వడ్డిస్తున్నాయి.

చవులూరించే వెరైటీలు...

చికెన్‌, మటన్‌, వెజిటబుల్స్‌.. జోడించిన బిర్యానీలు ఓ వైపు లీడ్‌ చేస్తుండగా, నగరంలో ఉలవచారు బిర్యానీ, క్లాసిక్‌ హైదరాబాదీ బిర్యానీ, రిచ్‌ అండ్‌ క్రీమీ లక్నోవి బిర్యానీ. టాంగీ, ఫ్లేవర్‌ఫుల్‌ బాంబే బిర్యానీ వంటివి విభిన్న రకాల మేళవింపులతో అందుబాటులోకి వచ్చాయి. చైనీస్‌–ఆధారిత ఫ్రైడ్‌ రైస్‌ బిర్యానీ లేదా మెక్సికన్‌–ప్రేరేపిత బురిటో బిర్యానీ ఫ్యూజన్‌ బిర్యానీ... ఇలా ఫుడ్‌ లవర్స్‌కి పదుల సంఖ్యలో ఎంపిక అవకాశాలు అందిస్తున్నారు.

మండీ వచ్చినా... ట్రెండీ మనదే..

నగరంలోని బార్కాస్‌ ప్రాంతంలో పేరొందిన మండీ...బిర్యానీకి గట్టి పోటీ ఇస్తుందని అంచనా. అరబ్బుల వంటకమైన మండీ.. నగరంలో వేగంగా విస్తరించింది. అలా దాదాపు ఎనిమిదేళ్ల నుంచీ మండీ హవా మొదలైంది. అయితే ఇప్పటికీ బిర్యానీకి దరిదాపుల్లో కూడా రాలేకపోయిందంటే.. దటీజ్‌ హైదరాబాద్‌ బిర్యానీ అంటున్నారు సిటీ ఫుడ్‌ ఇండస్ట్రీ వర్గాలు.

పొట్లం బిర్యానీ స్పెషల్‌



బిర్యానీ రుచి, నాణ్యతతో పాటు కంటైనర్స్‌ కూడా ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. వెరైటీ కంటైనర్స్‌లో వడ్డించడం, పార్సిల్‌ చేయడం ద్వారా ఫుడ్‌ లవర్స్‌ని అట్రాక్ట్‌ చేస్తున్నారు. అయితే ఏదేమైనా ఫుడ్‌ క్వాలిటీ, టేస్ట్‌ ముఖ్యం. మా రెస్టారెంట్‌ స్పెషల్‌గా పొట్లం బిర్యానీ అందిస్తున్నాం. ఆమ్లెట్‌లో చుట్టిన బిర్యానీని సిటీలో ఎక్స్‌క్లూజివ్‌గా అందుబాటులోకి తెచ్చాం. - సంపత్‌, ద స్పైసీ వెన్యూ రెస్టారెంట్‌



హైదరాబాద్‌ ఆవకాయతో.. అమెరికాలో బిర్యానీ..

నగరవాసులు అనేకమంది విదేశాల్లో ముఖ్యంగా అమెరికాలో రెస్టారెంట్లు నిర్వహిస్తున్నారు. అక్కడ తెలుగువాళ్లు అధికంగా నివసించే చోట కూడా హైదరాబాద్‌ బిర్యానీ హల్‌చల్‌ చేస్తోంది. 'మన ఇండియన్స్‌తో పాటు అమెరికన్లు కూడా హైదరాబాద్‌ బిర్యానీని బాగా ఇష్టపడతారు' అంటూ చెప్పారు నగరంలోని మల్కాజ్‌గిరి ప్రాంతానికి చెందిన నగేష్‌, సాయిప్రసాద్‌. ఈ బావా, బావమరుదులు ఇద్దరూ అమెరికాకు వలస వెళ్లి అక్కడ బావర్చి బిర్యానీ రెస్టారెంట్‌ను నిర్వహిస్తున్నారు. ఈ రెస్టారెంట్‌లో అందించే ఆవకాయ బిర్యానీ అక్కడ పాప్యులర్‌. దీని కోసం సునీత బంధువులు మల్కాజ్‌గిరిలో భారీ ఎత్తున ఆవకాయ పచ్చడి తయారు చేసి అమెరికాకు పంపిస్తున్నారు.





> ఒకప్పుడు విదేశీయులకు మాత్రమే పరిచయమైన బర్గర్‌లు, పిజ్జాలు... కొన్నేళ్ల క్రితమే మన డైనింగ్‌ టేబుల్‌ మీదకు చేరాయి. ఈ జనరేషన్‌ పిల్లలు వారంలో ఒక సారైనా తినకుండా ఉండలేరు. అయితే బర్గర్‌ అనగానే మెక్‌డోనాల్డ్‌, కేఎఫ్‌సీ వంటి పెద్ద పెద్ద రెస్టారెంట్లే గుర్తుకొస్తాయి.. కానీ ఇలాంటి విదేశీ ఫుడ్‌కు హైదరాబాద్‌ స్పైసీ టేస్ట్‌ని జత చేసి బర్గర్‌ ప్రియుల జిహ్వకు సరికొత్త రుచిని అందిస్తుంది సికింద్రాబాద్‌కు చెందిన షాలిమార్‌ తవా బర్గర్‌. ఆ విశేషాలు తెలుసుకుందాం..
>
> - రాంగోపాల్‌పేట్‌

బిగ్‌ సైజ్‌.. బిగ్‌ టేస్ట్‌

విదేశీ బర్గర్‌కు హైదరాబాద్‌ స్పైసీ టేస్ట్‌



వహ్వా.. తవా బర్గర్‌

తవా బర్గర్‌ గురించి తెలిసిన వాళ్లు హైదరాబాద్‌ నగరానికి వస్తే మాత్రం తప్పకుండా ఒక్కసారి దీన్ని తినే వెళుతుంటారు. అయితే ఈ తవా బర్గర్‌కు మాత్రం సికింద్రాబాద్‌ సిటీలైట్‌ హోటల్‌ పక్కన ఉండే షాలిమార్‌ రెస్టారెంట్‌ ఫేమస్‌. రోడ్డు పక్కన ఉండే ఓ చిన్నపాటి హోటలే కానీ సాయంత్రం అయిందంటే చాలు కస్టమర్లతో కిటకిటలాడుతుంది.

కళ్లముందే తయారీ...

రాణిగంజ్‌కు చెందిన దిలీప్‌ మోర్‌ తల్లిదండ్రుల నుంచి వినూత్న రుచుల వంటలు నేర్చుకున్నాడు. ఈ నేపథ్యంలోనే తనదైన స్టైల్లో డిఫరెంట్‌గా ఏదైనా అందించాలని తాపత్రయపడేవాడు. ఆ ఆలోచనల్లోంచి పుట్టిందే.. ఈ తవా బర్గర్‌. 2012లో అదే టిఫిన్‌ సెంటర్‌లో పిజ్జా, బర్గర్‌లను చేయడం మొదలు పెట్టాడు. సాధారణంగా బయట దొరికే బర్గర్‌లో కట్లెట్‌, మీనస్‌, సాస్‌ ఉంటుంది. అలా కాకుండా చీజ్‌ స్టఫింగ్‌తో టమాట, క్యాప్సికమ్‌, పన్నీర్‌ మిశ్రమాన్ని బ్రెడ్‌ మధ్యలో ఉంచి తవా బర్గర్‌ మన కళ్ల ముందే లైవ్‌ కిచెన్‌లో పెనంపై తయారు చేస్తారు. షాలిమార్‌లో తప్ప ఇంకెక్కడా లభించని ప్రత్యేకమైన రెసిపీతో తయారు చేసిన స్పైసీ గ్రేవీని అద్దుకుని తిన్నవారు ఎవరైనా ఈ బర్గర్‌ టేస్టే వేరప్పా అనాల్సిందే.

సైజ్‌లోనూ పెద్దదే..

ఈ తవా బర్గర్‌ టేస్ట్‌లోనే కాదు.. సైజ్‌లోనూ పెద్దదే.. నగరంలో దొరికే బర్గర్‌లు 80 నుంచి 100 గ్రాముల లోపు ఉంటాయి. కానీ ఇక్కడి బర్గర్‌ మాత్రం 275 గ్రాముల వరకూ ఉంటుంది. అయితే కస్టమర్లు ఒక రోజు ముందు ఆర్డర్‌ ఇస్తే కిలో బరువున్న తవా బర్గర్‌ కూడా తయారు చేసి ఇస్తున్నారు. బర్గరే కాకుండా మెక్సికన్‌, కార్న్‌, పన్నీర్‌ పిజ్జాలతో పాటు చీజ్‌ పన్నీర్‌ ఫర్‌, చోలే కుల్చేలు కూడా అందుబాటులో ఉంటాయి.



నాణ్యతకే ప్రాధాన్యం..

తవా బర్గర్‌లో వాడే మసాలా దినుసులు, కూరగాయలు, కొత్తిమీర, చీజ్‌, పన్నీర్‌, దినుసులు లాంటివన్నీ నాణ్యమైనవే వాడతాము. అదే మంచి టేస్ట్‌కి కారణం. సొంత రెసిపీతో మా బర్గర్‌లు చాలా సమయం పాటు ఏ మాత్రం చెడిపోకుండా ఉంటాయి. – దిలీప్‌ మోర్‌

టేస్ట్‌ బాగుంది..

ఫుడ్‌ బ్లాగ్స్‌లో షాలిమార్‌ గురించి తెలుసుకుని తినడానికి వచ్చాను. ఇంతకు ముందెన్నడూ తినని డిఫరెంట్‌ టేస్ట్‌తో.. ముఖ్యంగా హైదరాబాదీయులకు నచ్చే టేస్ట్‌తో ఉంది. –మురళి (బాచుపల్లి)

వారంలో ఆరు రోజులు తింటా..

రెండేళ్ల క్రితం ఒకసారి వచ్చి ఇక్కడ తవా బర్గర్‌ టేస్ట్‌ చేశాను. అప్పటి నుంచి ఇప్పటి వరకూ వారంలో ఆరు రోజులు తినాల్సిందే. స్పైసీతో పాటు అద్భుతమైన టేస్ట్‌ ఉంటుంది. ఒక బర్గర్‌ తింటే మధ్యాహ్నం భోజనం అవసరం ఉండదు.
– ఈశ్వర్‌ పటేల్‌ (సికింద్రాబాద్‌)




రిమ్స్ ఆస్పత్రి వెలుపల ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

"ఇదివరకెన్నడూ లేని రీతిలో తమకు ఓటు వేయలేదని వైఎస్సార్‌సీపీ శ్రేణులపై, అభిమానులపై దాడులు చేస్తున్నారు. చంద్రబాబు ప్రోత్సహిస్తున్నందు వల్లే నెల రోజులు దాటినా దాడులు, విధ్వంసాలు, దౌర్జన్యాలు ఇంకా కొనసాగుతున్నాయి. మీ వైఖరిలో మార్పు రాకపోతే ఈ చెడు సంప్రదాయ బీజం రేపు చెట్టుగా ఎదిగి మీకూ చుట్టుకుంటుందని గుర్తుంచుకోండి. ఎన్నికల వరకే రాజకీయాలని, ఆ తర్వాత అంతా కలిసి మెలిసి పని చేసుకునే మంచి వాతావరణాన్ని మీరు కలుషితం చేస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. వెంటనే ఆపేయాలని డిమాండ్ చేస్తున్నా.. హెచ్చరిస్తున్నా."

- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

అరాచకం ఆపండి

ఏపీ సీఎం చంద్రబాబుకు వైఎస్ జగన్ మరోమారు హెచ్చరిక

- కూటమి అధికారంలోకి వచ్చాక చెడు సంప్రదాయానికి తెరలేపారు
- గతంలో ఎన్నికల తర్వాత అందరూ కలిసి ఉండే పరిస్థితి
- ఇప్పుడు భయాందోళన సృష్టిస్తున్నారు.. దాడులతో ఆనందం పొందుతున్నారు
- పులివెందులలో ఇలాంటి సంప్రదాయం మునుపెన్నడూ లేదు
- మీ మోసపూరిత వాగ్దానాల వల్ల 10% ఓట్లు టీడీపీకి షిఫ్ట్ అయ్యాయి
- ఎల్లకాలం అధికారం ఉండదని గుర్తుంచుకోండి.. ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చండి
- మధ్యాహ్న భోజన పథకం సరిగా అందక విద్యార్థుల ఆందోళనలు
- రైతులకు భరోసాలేక.. తల్లులకు అమ్మ ఒడి అందక అల్లాడిపోతున్నారు
- అక్కచెల్లెమ్మలకు ప్రతి నెలా ఇస్తానన్న రూ.1,500 చెల్లించండి
- టీడీపీ దాడిలో గాయపడిన అజయ్‌కుమార్‌రెడ్డికి రిమ్స్‌లో పరామర్శ
- అండగా ఉంటామని భరోసా

సాక్షి, కడప: 'రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ వర్గీయులు అరాచకాలు సృష్టిస్తున్నారు. వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారనే కసితో కొందరిని టార్గెట్ చేసి దాడులు చేస్తున్నారు. ఎన్నికల్లో టీడీపీకి ఎదుర్కొడ్డి నిలిచి బాగా పని చేసిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై భౌతిక దాడులకు దిగుతున్నారు. ఆస్తులు ధ్వంసం చేస్తున్నారు. ఇది మంచి సంప్రదాయం కాదు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులను ప్రోత్సహించడం తగదు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు టీడీపీ దుశ్చర్యలను ఆపాలి' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హెచ్చరించారు. టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన పులివెందుల నియోజకవర్గం వేంపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త అజయ్‌కుమార్‌రెడ్డిని శనివారం మధ్యాహ్నం ఆయన వైఎస్సార్ జిల్లా కడప రిమ్స్ ఆస్పత్రిలో పరామర్శించారు. తాము అండగా ఉంటామని, ఆందోళన చెందొద్దని ధైర్యం చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పులివెందులలో ఇంత వరకు ఇలాంటి సంప్రదాయం లేదన్నారు. గతంలో ఎన్నికల అనంతరం అందరూ కలిసిపోయి పని చేసుకునే వాళ్లని చెప్పారు. ఎన్నికల తర్వాత తమకు ఓటు వేయని వారిపై దాడి చేసి కొట్టే కార్యక్రమం ఎప్పుడూ జరగలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒక భయానక వాతావరణం సృష్టించడానికే ఈ తరహా దాడులు దగ్గరుండి చేయిస్తున్నారని మండిపడ్డారు. ఈ తరహా దాడులతో ఏం సాధిస్తారని తెలుగుదేశం పార్టీని, సీఎం చంద్రబాబును నిలదీశారు. ఈ రకమైన దాడులను ప్రోత్సహించడం ద్వారా చంద్రబాబు చెడు సంప్రదాయానికి బీజం వేస్తున్నారని, రేపు టీడీపీ కార్యకర్తలకూ ఇది చుట్టుకుంటుందని హెచ్చరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసిన వారిపై దాడులకు పాల్పడటం ద్వారా చంద్రబాబు నాయుడు తెలియని ఆనందం పొందుతున్నారన్నారు. వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

ఎల్లకాలం అధికారం ఉండదు

ఎల్లకాలం మీరే అధికారంలో ఉండరు. అధికారం మారిన రోజు చంద్రబాబు నాయుడు చేస్తున్న ఈ అన్యాయాలు శిశుపాలుని పాపాలు మాదిరిగా పండే రోజు వస్తుంది. ఆ రోజు ఇవాళ చేస్తున్న చెడు సంప్రదాయం ఆయనకూ చుట్టుకుంటుంది. ఇవాళ అధికార తెలుగుదేశం పార్టీ చేతిలో దెబ్బలు తిన్న ప్రతి ఒక్కరూ రేపొద్దున తిరిగి అదే రీతిన బదులిచ్చేందుకు మీ అంతట మీరే బీజం వేస్తున్నారు. ఇది సరైన పద్ధతి కాదు.

- నాయకులుగా ఉన్న మనలాంటి వాళ్లం ఇలాంటివి ప్రోత్సహించకూడదు. ఈ తరహా దాడులకు పాల్పడే సంప్రదాయం సరికాదు. వీటిని తక్షణం ఆపాలని చంద్రబాబును మరోసారి హెచ్చరిస్తున్నా.

వాగ్దానాల అమలుపై దృష్టి పెట్టండి

రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకం నీరుగారిపోతోంది. విద్యార్థులు రోడ్లపైకి వస్తున్నారు. ఏ వ్యవస్థ సరిగా లేదు. తొలుత ఆ వ్యవస్థలను గాడిలో పెట్టడంపై దృష్టి పెట్టండి. తెలుగుదేశం పార్టీ చేసిన మోసపూరిత వాగ్దానాల వల్ల మాకు రావాల్సిన పది శాతం ఓట్లు మీకు వచ్చాయి. మీరిచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని ప్రజలు ఆశిస్తున్నారు. రైతు భరోసా డబ్బులు అందక అన్నదాతలు, అమ్మఒడి అందక పిల్లల తల్లులు ఆశగా ఎదురు చూస్తున్నారు. నెలనెలా అక్కచెల్లెమ్మలకు రూ.1500 ఇస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నా.

- ఇంటింటికీ ఉద్యోగం, అది ఇవ్వలేకపోతే రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామన్న విషయాన్ని గుర్తించుకోవాలి. వాటి కోసం చదువుకున్న పిల్లలందరూ ఎదురు చూస్తున్నారు. ఇటువంటి మంచి కార్యక్రమాలు ఏపీ చేయకుండా రాష్ట్ర వ్యాప్తంగా భయాందోళనలు మాత్రమే క్రియేట్ చేసే దుశ్చర్యలను ఆపాలి. వైఎస్సార్‌సీపీ శ్రేణులెవ్వరూ అధైర్య పడాల్సిన పని లేదు. మేము అండగా ఉంటాం.
- ఈ కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎస్వీ సతీశ్‌కుమార్‌రెడ్డి, పార్టీ కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్షులు కె.సురేశ్‌బాబు, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్.రమేష్ కుమార్ రెడ్డి, ఆర్టీసీ మాజీ చైర్మన్ ఎ.మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడప-పులివెందుల.. నాలుగు గంటలు

మూడు రోజుల జిల్లా పర్యటన నిమిత్తం కడప ఎయిర్‌పోర్టుకు చేరుకున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పార్టీ శ్రేణుల నుంచి ఘన స్వాగతం లభించింది. అక్కడి నుంచి వైఎస్ జగన్ రిమ్స్‌కు బయలుదేరారు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ నేతలు, యువకులు, అభిమానులు పెద్ద ఎత్తున రిమ్స్‌కు చేరుకుని స్వాగతం పలికారు. తమ అభిమాన నేతను చూసేందుకు పోటీపడ్డారు. రిమ్స్ ఐపీ విభాగంలో రెండవ అంతస్తులోని సర్జికల్ ఐసీయూలో చికిత్స పొందుతున్న అజయ్‌కుమార్‌రెడ్డిని పరామర్శించి బయటకు రాగానే, రిమ్స్‌లో పని చేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది, ఎంఎన్‌ఓలు, స్టాఫ్ నర్సులు, హెడ్ నర్సులు, వైద్య సిబ్బంది అంతా సెల్ఫీ తీసుకునేందుకు పోటీపడ్డారు. తాము ఎన్నో రోజులుగా మీతో ఫోటో తీసుకునేందుకు ఎదురు చూస్తున్నామని చెప్పారు. వారందరినీ వైఎస్ జగన్ ఆప్యాయంగా పలకరిస్తూ వారితో సెల్ఫీ దిగారు. అక్కడి నుంచి క్యాజువాలిటీ వద్ద కు వచ్చారు. ఆ సమయంలో జై జగన్.. నినాదాల తో రిమ్స్ ఆవరణం హోరెత్తిపోయింది. అనంతరం పులివెందులకు రోడ్డు మార్గాన వెళ్తున్నారని తెలుసుకొని.. దారి పొడవునా ప్రజలు గ్రామ గ్రామాన ప్రధాన రహదారిపైకి వచ్చారు. పలువురు పలు సమస్యలపై జగన్‌కు విన్నవించారు. యువతీ యువకులు సెల్ఫీ దిగారు. ఇలా అభిమానం అడ్డుకోవడంతో గంట పాటు సాగాల్సిన ప్రయాణం ఏకంగా నాలుగు గంటలు పట్టింది. అంతకు ముందు గన్నవరం విమానాశ్రయంలో వైఎస్ జగన్‌కు ఎమ్మెల్సీ తలశిల రఘురాం, మాజీ ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పెద్దాపురం పార్టీ ఇన్‌చార్జ్ దావులూరి దొరబాబు, విజయవాడ పశ్చిమ పార్టీ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్, గొల్లపూడి ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్మ కోట్లు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, విజయవాడ రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు కాకర్లమూడి సువర్ణరాజు, పార్టీ నాయకులు కొత్తపల్లి రజని, దేవభక్తుని చక్రవర్తి, ఆవుతు శ్రీనివాసరెడ్డి, శీలం రంగారావు, రామిశెట్టి వెంకటేశ్వరరావు, పలువురు విజయవాడ కార్పొరేటర్లు, పార్టీ నేతలు, కార్యకర్తలు వీడ్కోలు పలికారు.

బిక్కుబిక్కు మంటూ.. రాత్రంతా అడవిలోనే..

టీడీపీ కూటమి అరాచకానికి బెంబేలెత్తిన సుబ్రమణ్యం రెడ్డి కుటుంబం

- ఆయన్ని తీవ్రంగా హింసించిన టీడీపీ గూండాలు
- ఇటుకల బట్టీ ధ్వంసం.. ఇటుకల తరలింపు
- టమాటా పంట మార్కెట్‌కు తీసుకెళ్లకుండా అడ్డు
- పోలీసులూ స్పందించకపోవడంతో ప్రాణ రక్షణ కోసం అడవిలోకి
- రాత్రంతా క్రూరమృగాల మధ్య అడవిలోనే..
- టీడీపీ కూటమి దాడులతో వణుకుతున్న చిత్తూరు జిల్లా
- వైఎస్సార్‌సీపీ వారు శరణు కోరి టీడీపీలో చేరితే వదిలేస్తామంటున్న టీడీపీ నేతలు


టీడీపీ కార్యకర్తల ఆధీనంలో ఉన్న టమాటా పంట

సాక్షి, టాస్క్‌ఫోర్స్: రాష్ట్రంలో అధికార పార్టీ అరాచకానికి భయపడి ఓ కుటుంబం రాత్రంతా అడవిలో తలదాచుకుంది. రాత్రివేళ్ల క్రూర మృగాలు, పాములు, ఇతర విష పురుగుల మధ్య అడవిలోనే బిక్కు బిక్కుమంటూ గడుపుతోంది. ప్రజాస్వామ్య దేశ చరిత్రలో ఇంతటి అరాచకం ఎప్పుడైనా కన్నామా? విన్నామా?.. కానీ ఇది పచ్చి నిజం. సోమల మండలం కమ్మపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత సుబ్రమణ్యంరెడ్డి కుటుంబం దీనగాథ ఇది. శుక్రవారం టీడీపీ గూండాలు పెద్ద సంఖ్యలో ఆయన ఇంటిపై దాడి చేశారు. సుబ్రమణ్యంరెడ్డిని బయటకు ఈడ్చుకు వచ్చి తీవ్రంగా కొట్టారు. రకరకాలుగా హింసించారు. ఆయన ఇటుకల బట్టీలోని ఇటుకలన్నింటినీ తరలించుకుపోయారు. బట్టీ మొత్తాన్ని ధ్వంసం చేశారు. సుబ్రమణ్యంరెడ్డి పొలంలో పండించిన టమాటా కోతకొచ్చింది. ఈ పంటను మార్కెట్‌కు తరలించకుండా టీడీపీ నేతలు అడ్డుపడుతున్నారు. ఆయన పశువులకు గడ్డి కూడా వేయకుండా టీడీపీ నేతలు అడ్డుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పోలీసులకు తెలిపినా స్పందన లేకపోవడంతో సుబ్రమణ్యం రెడ్డి కుటుంబం ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని సమీపంలోని అడవిలోకి పారిపోయింది. శుక్రవారం రాత్రంతా అడవిలోనే గడిపింది. శనివారం కొందరు వ్యక్తులు వారివద్దకు వెళ్లి ఆ కుటుంబాన్ని బయటకు తీసుకువచ్చి వేరే ప్రాంతంలో ఉంచారు. ఆయన తమను శరణుకోరి.. టీడీపీలో చేరితే క్షమించి వదిలేస్తామని టీడీపీ నేతలు చెబుతున్నారు. లేదంటే విడిచిపెట్టే ప్రసక్తే లేదని అంటున్నారు. టీడీపీ నేతల తీరుపై పుంగనూరు ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు. గతంలో ఎవరికి నచ్చిన పార్టీ లో వారు పనిచేసే వారని, ఇటువంటి అరాచకం ఎప్పుడూ చూడలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చిత్తూరు జిల్లావ్యాప్తంగా దాడులు

టీడీపీ నేతలు వారిపై కేసులు రాకుండా బెంగళూరు నుంచి గూండాలను తెచ్చి దాడులు చేయిస్తున్నట్లు సమాచారం. నియోజకవర్గ పరిధిలో ఎవరెవరు వైఎస్సార్‌సీపీకి పనిచేశారో గుర్తించి మరీ దాడులు చేయిస్తున్నారు. కొద్ది రోజులుగా టీడీపీ నేతలు, వారి గూండాల దౌర్జన్యాలు, దాడులతో చిత్తూరు జిల్లా అరాచకానికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. పుంగనూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ అభిమానులు ఊర్లొదిలి వేరే ప్రాంతాల్లో తల దాచుకొంటున్నారు. ఇప్పటి వరకు 55 కుటుంబాలు స్వగ్రామాలను వీడి వెళ్లాయి. శ్రీకాళహస్తి రూరల్ మండలం ఈశ్వరయ్య కాలనీ, వాగివేడు, నారాయణపురం గ్రామాల నుంచి 75 కుటుంబాలను టీడీపీ నేతలు వెళ్లగొట్టారు. వీరంతా తమను శరణు కోరి, టీడీపీలో చేరితేనే వారిని, వారి ఆస్తులను వదిలేస్తామని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

రక్షణ కోరినా స్పందించని పోలీసులు

టీడీపీ కూటమి దాడులు, దౌర్జన్యాలపై అనేక మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతిపరులు పోలీసులకు ఫోన్లు చేసి ఫిర్యాదు చేశారు. ఫోన్ చేసిన సమయంలో ఇరువురి మధ్య సంభాషణలను బాధితులు రికార్డు చేసుకున్నారు. ఆ రికార్డులను వింటే.. రక్షణ కల్పించాల్సిన పోలీసులేనా అలా మాట్లాడేది అనిపించకమానదు. ఇంత జరుగుతున్నా పోలీసులు స్పందించకపోవడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూటమి నేతల దౌర్జన్యాలు, దాడులు ఆగకపోవడం, పోలీసులు స్పందించకపోవడంతో బాధితులు న్యాయస్థానాలను ఆశ్రయించటానికి సిద్ధమవుతున్నారు.

పింఛన్లపై ఫిర్యాదు చేస్తే దాడి చేస్తారా?

టీడీపీ నాయకత్వంపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు ఆగ్రహం

- లబ్ధిదారులకు ఇళ్ల వద్ద పింఛన్లు ఇవ్వమనడం తప్పా?
- టీడీపీ శ్రేణులను అదుపులో పెట్టుకోవాలని హెచ్చరిక
- పింఛన్లపై కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసిన సీపీఎం నేత రామారావుపై టీడీపీ నేతల దాడి
- చికిత్స పొందుతున్న రామారావును పరామర్శించిన శ్రీనివాసరావు
- దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్


ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న రామారావును పరామర్శిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

గుంటూరు/భీమవరం: 'పింఛన్లపై ఫిర్యాదు చేస్తే దాడి చేస్తారా? ఇళ్ల వద్ద పింఛన్లు ఇవ్వమనడం తప్పా?' అంటూ టీడీపీ నాయకత్వంపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేట నియోజకవర్గం పరగటిచర్లలో ఇటీవల లబ్ధిదారులకు ఇళ్ల వద్దే ఇవ్వాల్సిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను.. తమ ఇళ్ల వద్దకు వచ్చి తీసుకోవాలంటూ టీడీపీ నాయకులు చాటింపు వేయించారు. దీనిపై సీపీఎం నాయకుడు కామినేని రామారావు పల్నాడు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కక్ష పెంచుకున్న టీడీపీ నాయకులు శుక్రవారం మూకుమ్మడిగా రామారావు ఇంటిపై దాడి చేశారు. వృద్ధురాలైన ఆయన తల్లిని విచక్షణారహితంగా పక్కకు నెట్టేసి.. దాడి చేయడంతో రామారావు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే ఆయన్ని నరసరావుపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శనివారం రామారావును పరామర్శించారు. రామారావుకు మెరుగైన చికిత్స అందించాలని వైద్య సిబ్బందిని కోరారు.

చంద్రబాబు అదుపులో పెట్టుకో..

అనంతరం ఆస్పత్రి నుంచి డీఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అదనపు ఎస్పీ లక్ష్మీపతికి శ్రీనివాసరావు వినతి పత్రం అందజేశారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధితుడికి తగిన రక్షణ కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ.. 'టీడీపీ నాయకులు 70 ఏళ్ల వయసున్న రామారావుపై కక్షపూరితంగా దాడి చేయడం దారుణం. అడ్డువచ్చిన ఆయన తల్లి అయిన 90 ఏళ్ల వృద్ధురాలిని కూడా పక్కకు నెట్టేశారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. సీఎం చంద్రబాబు వెంటనే స్పందించి తమ పార్టీ వర్గీయులను అదుపులో పెట్టుకోవాలి. దాడులు ఆపకపోతే ఏం చేయాలో మాకు తెలుసు' అంటూ హెచ్చరించారు.

ప్రత్యేక హోదాపై ఎందుకు ప్రశ్నించట్లేదు?

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని కేంద్రాన్ని అడిగే అవకాశమున్నా ఎందుకు జంకుతున్నారని సీఎం చంద్రబాబును సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు ప్రశ్నించారు. శనివారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, విశాఖ ఉక్కు పరిరక్షణ గురించి ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు అడుగుతారని చంద్రబాబును ప్రశ్నించారు. ఉక్కు, భారీ పరిశ్రమ శాఖ సహాయ మంత్రి ఏపీ వ్యక్తే అయినా కూడా విశాఖ ఉక్కును ప్రైవేటుపరం కానివ్వబోమని చెప్పడానికి కూటమి ప్రభుత్వానికి ధైర్యం రావడం లేదని ఎద్దేవా చేశారు. నిత్యావసరాల ధరల పెరుగుదల నియంత్రణలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతోందని సీపీఎం నాయకులు విమర్శించారు.



ఆ ఇళ్లన్నీ.. బాబు ఖాతాలోకి!

గత ప్రభుత్వంలో దాదాపు పూర్తయిన పేదల ఇళ్లను తమ ఘనతగా చెప్పుకునేలా కూటమి ప్రభుత్వం స్కెచ్

- వంద రోజుల్లో 1.28 లక్షల ఇళ్లు పూర్తిచేస్తామని గొప్పలు
- నిజానికి ఈ ఇళ్లు గత ప్రభుత్వంలోనే శ్లాబ్ దశ దాటిన పరిస్థితి
- ఇందులో చాలా ఇళ్లు ఇప్పటికే పూర్తి
- ఎన్నికల కోడ్ నేపథ్యంలో స్టేజ్ అప్‌గ్రెడేషన్‌కు బ్రేక్

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం

- ఒకరికి తీవ్ర గాయాలు
- మృతులందరూ కడప వాసులు
- ముందు వెళుతున్న ట్యాంకర్‌ను కారు ఢీకొట్టడంతో దుర్ఘటన


ప్రమాద దృశ్యం

రామాపురం: కర్నూలు–చిత్తూరు 40వ జాతీయ రహదారిపై అన్నమయ్య జిల్లా రామాపురం మండలం చిట్లూరు పంచాయతీ దళితవాడ సమీపంలో శనివారం తెల్లవారుఝామున ఘోర ప్రమాదం జరిగింది. ముందు వెళ్తున్న ట్యాంకర్‌ను కారు ఢీకొనడంతో నలుగురు మృతి చెందారు. ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుల్లో కడప నాగరాజుపేటకు చెందిన హోంగార్డు పూజారి ఆంజనేయులునాయక్ (28), కడప రాజారెడ్డివీధికి చెందిన కారు డ్రైవర్ పఠాన్ అఫ్రోజ్‌ఖాన్ (35), కడప నాగరాజుపేటకు చెందిన మారాబత్తుల జితేంద్రకుమార్ (24), కడప ఐటీఐ సర్కిల్‌కు చెందిన షేక్ హలీమ్ (35) ఉన్నారు. కడప రవీంద్రనగర్‌కు చెందిన షేక్ ఖాదర్‌బాషాకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. కడప పట్టణానికి చెందిన ఈ ఐదుగురూ శుక్రవారం అర్ధరాత్రి కారులో కడప నుంచి బయలుదేరి రాయచోటి వైపు కారులో వెళ్తుండగా, రామాపురం మండలం చిట్లూరు దళితవాడ సమీపంలోని వంతెన వద్ద ఆ కారు ముందు వెళ్తున్న ట్యాంకర్‌ను వెనుక వైపు ఢీకొట్టింది. ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో రాయచోటి ఆస్పత్రికి తరలిస్తుంగా జితేందర్‌కుమార్ మార్గంమధ్యలో మృతి చెందాడు. లక్కిరెడ్డిపల్లె సీఐ గంగనాధబాబు, రామాపురం ఎస్ఐ వి.లక్ష్మీప్రసాద్‌రెడ్డి సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఏపీ పరువు తీసిన చంద్రబాబు

రాష్ట్రం నుంచి డ్రగ్స్ రవాణా అవుతున్నాయట!

కొకైన్, హెరాయిన్ వంటి డ్రగ్స్ కూడా ఇక్కడి నుంచే వెళుతున్నాయా?

డ్రగ్ కల్చర్‌తో హైదరాబాద్ వణికిపోవడంలో ఏపీ పాత్ర ఉందా?

విభజన సమస్యల పరిష్కారాన్ని మరచి అనవసర విషయాలపై చర్చ

రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై నోరు మెదపని వైనం

కేవలం వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం

నిజానికి ఏపీలో గంజాయి నిర్మూలనకు గత ప్రభుత్వం గట్టి చర్యలు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

చోరీలను అడ్డుకుంటే హత్యలకూ వెనకాడరు

- రాష్ట్రంలో పార్థీ గ్యాంగ్‌పై 32 కేసులు
- ఆ గ్యాంగ్ సభ్యులు ఇద్దరిని అరెస్టు చేశాం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్


విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం: జాతీయ రహదారి వెంట దోపిడీలు, దొంగతనాలు చేస్తున్న పార్థీ తెగకు చెందిన నలుగురు ముఠా సభ్యుల్లో ఇద్దరిని నల్లగొండ పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం ఔటర్ రింగ్ రోడ్డు వద్ద ఇద్దరు ముఠా సభ్యులను పోలీసులు ప్రాణాలకు తెగించి అరెస్టు చేసిన విషయం తెలిసిందే. నిందితుల వివరాలను, పార్థీ గ్యాంగ్ దోపిడీ, హత్యల గురించి నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ శనివారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. రెండు నెలలుగా పార్థీ గ్యాంగ్ జాతీయ రహదారులలో రోడ్డు పక్కన నిద్రించే డ్రైవర్లు, వాహనదారుల నుంచి సొత్తును చోరీ చేస్తున్నారని, చోరీ సమయంలో అడ్డగిస్తే హత్యలు చేశారని ఎస్పీ వెల్లడించారు. పార్థీ ముఠా సభ్యులపై నల్లగొండ జిల్లాలో 6, రాచకొండ కమిషనరేట్ పరిధిలో 13, సంగారెడ్డి జిల్లాలో 11, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 2 కేసులు ఉన్నాయని, ఇందులో ఒక హత్య, ఆరు చోరీలు, 7 చైన్ స్నాచింగ్, 8 బైక్ దొంగతనాలు, 10 నివాసాల్లో దొంగతనాలు ఉన్నాయని చెప్పారు. నల్లగొండ జిల్లాలోని చిట్యాల, నార్కట్‌పల్లి, కట్టంగూర్ మండలాల్లో, రాచకొండ కమిషనరేట్‌లో, సంగారెడ్డి జిల్లా ఎన్‌హెచ్ 65పై వాహనాలు ఆపి పడుకున్న వారిని రాళ్లతో కొట్టి వారి వద్ద నుంచి బంగారం, డబ్బులు చోరీ చేశారని, ఇళ్లలోనూ దోపిడీ చేసి బంగారు ఆభరణాలను దొంగిలించారని తెలిపారు. మే 18న కట్టంగూర్ వద్ద జాతీయ రహదారిలో కృష్ణా జిల్లా పామర్రు మండలం చాట్లవానిపురం గ్రామానికి చెందిన మినీగూడ్స్ వాహన డ్రైవర్ కొల్లూరి రాజవర్ధన్ వాహనం రోడ్డు పక్కన ఆపి నిద్రించగా రూ.14,500 దొంగిలించారని, ప్రతిఘటించిన అతన్ని స్క్రూడ్రైవర్‌తో విచక్షణా రహితంగా కొట్టి చంపారని ఎస్పీ వెల్లడించారు.

ప్రత్యేక టీమ్‌లతో కదలికల గుర్తింపు..

పోలీసు అధికారులు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి ముఠా సభ్యుల కదలికలను సెల్‌ఫోన్ సిగ్నల్స్ ద్వారా గుర్తించారు. శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో ఔటర్ రింగ్ రోడ్డు వద్ద పోలీసులు వారిని అరెస్టు చేసేందుకు ప్రయత్నించగా ఇద్దరు దొంగలు పోలీసులపై దాడి చేసి హత్య చేసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో విక్రమ్ శంకర్ అనే కానిస్టేబుల్ కుడి చేయి మణికట్టు వద్ద గాయమై వేలు విరిగింది.

దొంగలు వీరే.....

మహారాష్ట్రలోని పూనా జిల్లా ఇందాపూర్‌లోని బారమతి చౌరతాకు చెందిన అప్పా పాండురంగ, అదే ప్రాంతానికి చెందిన సరస్వతీనగర్‌కు చెందిన శివం అశోక్ అలియాస్ దిల్దార్‌లను అరెస్టు చేశారు. కాశ్మీర్ శశిపాల్ బోంస్లే, ఆదేష్ అనిల్ ఖలే పరారీలో ఉన్నారని ఎస్పీ చెప్పారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన హెడ్ కానిస్టేబుల్ విష్ణువర్ధన్‌గిరి, మోహసిన్ పాషా, పి.విక్రమ్‌శంకర్, సాయిరామ్, కలీం, ఎస్.సాయికుమార్‌లను ఎస్పీ అభినందించారు. వారికి రివార్డు అందించారు.

యాదాద్రిలో యాదర్షి, ప్రహ్లాద మండపాలు

- శ్రావణ మాసంలో అన్నప్రసాద నూతన భవనం ప్రారంభం
- ఈ నెల 14వ తేదీన వన మహోత్సవం
- యాదాద్రి ఆలయ ఈవో భాస్కర్‌రావు వెల్లడి



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ కొండకు దిగువన యాదర్షి, ప్రహ్లాద మండపాలను ఏర్పాటు చేయనున్నట్లు ఈవో భాస్కర్ రావు వెల్లడించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. శ్రావణ మాసంలో నూతన నిత్యాన్నదాన భవనం ప్రారంభించి, రోజూ 2 వేల మందికి అన్నప్రసాదాన్ని అందజేస్తామని చెప్పారు. లక్ష్మీ పుష్కరిణి సమీపంలో ఉన్న దీక్షాపరుల మండపాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి, మండల దీక్ష భక్తుల కోసం సిద్ధం చేస్తామని తెలిపారు.

14న వన మహోత్సవం..

యాదాద్రీశుడి ఆలయ సన్నిధిలో ఈ నెల 14వ తేదీన వన మహోత్సవం నిర్వహిస్తామని ఈవో భాస్కర్‌రావు తెలిపారు. 15వ తేదీన గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలను ఈ వేడుకకు ఆహ్వానిస్తున్నట్లు ఆయన చెప్పారు. వచ్చే బుధ, గురువారాల్లో తిరుమల తరహాలో శ్రీస్వామిని ఎదురుగా దర్శించుకునే విధానాన్ని ప్రయోగాత్మకంగా నిర్వహిస్తామన్నారు. కాగా, కొండపైనే భక్తులకు మరుగుదొడ్లు, మూత్రశాలల కోసం సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేశామని, త్వరలోనే దీనిని ప్రారంభిస్తామని వివరించారు.

దివ్యాంగులకు ప్రత్యేక దర్శనం..

యాదాద్రి క్షేత్రానికి వచ్చే దివ్యాంగులకు ప్రత్యేక దర్శనం కల్పించే దిశగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో భాస్కర్‌రావు వెల్లడించారు. సోమవారం నుంచి ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందని చెప్పారు. అలాగే కొండపైన శ్రావణ మాసంలో ఆస్పత్రిని ప్రారంభిస్తామన్నారు.

మద్యం సేవించిన వ్యక్తిని పట్టుకున్నాం..

యాదాద్రి దేవస్థానం బాత్‌రూమ్‌లలో మద్యం సేవించి, బాటిల్ పెట్టి వెళ్లిన వ్యక్తిని పట్టుకున్నట్లు ఈవో తెలిపారు. అతడిని పోలీస్ స్టేషన్‌లో అప్పగించామన్నారు. కొండపై ఇకపై బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు సైతం చేస్తామన్నారు. విలేకరుల సమావేశంలో ఆలయాధికారులు దోర్బల భాస్కర్‌శర్మ, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

అత్యాశకు పోవద్దు.. ఉచ్చులో పడొద్దు!

- సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయెల్



సాక్షి, హైదరాబాద్: అత్యాశకు పోయి ఎంతోమంది సైబర్‌నేరగాళ్ల వలకు చిక్కుతున్నారని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయెల్ హెచ్చరించారు. ప్రధానంగా ఫెడ్ఎక్స్, బీఎస్ఎన్ఎల్, ట్రాయ్‌ల పేరిట పార్శిళ్లు వచ్చాయని, మీకు బహుమతులు వచ్చాయని సైబర్ నేరగాళ్ల మోసాలకు తెరతీస్తున్నారని పేర్కొన్నారు. సైబర్‌మోసాలకు సంబంధించి టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ప్రతీ శుక్రవారం ఒక్కో నేర విధానంపై ప్రత్యేకంగా తానే ఒక కార్యక్రమం 'గార్డ్ అప్ విత్ శిఖాగోయెల్'నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా 8712672222 వాట్సాప్ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

బంజారాహిల్స్ ట్రాఫిక్ సిబ్బందిని అభినందించిన డీజీపీ

- తప్పుడు ట్రాఫిక్ చలాన్‌ను తొలగించిన పోలీసులు



సాక్షి, హైదరాబాద్: సీనియర్ సిటిజన్ సమస్యను పరిష్కరించిన బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బందిని డీజీపీ రవి గుప్తా అభినందించారు. ఈ మేరకు శనివారం డీజీపీ తన కార్యాలయంలో బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏఎస్సై బాగేందర్ సింగ్, కానిస్టేబుళ్లు రాఘవాచారి, మొహమ్మద్ ఇర్షాద్ అలీలకు క్యాష్ రివార్డులను అందించారు. ఈనెల 1న బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సమీపంలోని మోర్ సూపర్ మార్కెట్ ముందు డ్యూటీలో ఏఎస్సై నిలబడి ఉండగా సీనియర్ సిటిజన్ అయిన మహిళ అతన్ని సంప్రదించి, ఈ ఏడాది జూన్ 16న అగ్రసేన్ ఐలాండ్‌లో రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేశారంటూ తన వాహనానికి తప్పుగా ఈ–చలాన్ విధించిన విషయం ఆ ఏఎస్సై దృష్టికి తెచ్చింది. ఆ ఏఎస్సై మహిళ ఫిర్యాదును సావధానంగా విన్న తర్వాత ఆమెను పోలీస్ స్టేషన్‌లో కూర్చోబెట్టి ఆ ఈ–చలాన్ గురించి వివరాలు తెలుసుకున్నారు. వివరాలు ఈ–చలాన్ సెంటర్‌కు పంపి దాన్ని తొలగించేలా కానిస్టేబుళ్లు మొహమ్మద్ ఇర్షాద్ అలీ, రాఘవాచారి చర్యలు తీసుకున్నారు. బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది బాధ్యతాయుతమైన, మర్యాదపూర్వక ప్రవర్తన, సత్వర చర్యకు సీనియర్ సిటిజన్ చాలా సంతోషంగా భావించి తన అనుభవాన్ని డీజీపీ రవి గుప్తాతో పంచుకున్నారు. భవిష్యత్‌లో అంకితభావంతో పనిచేయాలని డీజీపీ వారికి సూచించారు.

ప్రిన్సిపాల్ గదిలో బీరు సీసాలు

- బాలెంల సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో కలకలం
- విద్యార్థినుల ఆందోళన.. మంత్రి ఉత్తమ్ ఆగ్రహం.. ప్రిన్సిపాల్ బదిలీ



గురుకుల కళాశాలఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

సూర్యాపేట: సూర్యాపేట జిల్లా కేంద్రానికి సమీపంలోని బాలెంల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల డిగ్రీ కళాశాలలో మద్యం సీసాలు దర్శనమివ్వడంతో విద్యార్థినులు ఆందోళనకు దిగారు. తరచూ మద్యం తాగుతూ ప్రిన్సిపాల్ శైలజ తమను వేధింపులకు గురిచేస్తున్నారని వారు ఆరోపించారు. ప్రిన్సిపాల్ అర్ధరాత్రి వేళ సహాయ కేర్ టేకర్ సామిత్రితో కలిసి మద్యం తాగుతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రిన్సిపాల్ రూమ్‌కు తాళం వేశారు. విషయం తెలుసుకున్న స్థానిక ఆర్డీవో వేణుమాధవ్‌రావు, కళాశాలలో ఆర్సీవో అరుణకుమారి, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిణి జ్యోతి, డీఎస్పీ రవికుమార్ కళాశాలకు చేరుకున్నారు. వాస్తవాలను విచారించి ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయినా విద్యార్థినులు శాంతించలేదు. ఈ ఘటనపై మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరపాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌ను ఆదేశించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు పూర్తి స్థాయి విచారణ కమిటీ అధికారిగా అదనపు కలెక్టర్ బీఎస్ లతను నియమిస్తూ కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు ప్రాథమిక విచారణ ఆధారంగా కళాశాల ప్రిన్సిపాల్‌ను బదిలీ చేస్తున్నట్టు తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణి ఒక ప్రకటనలో తెలిపారు.

శాకాహార భోజనం మరింత ప్రియం



కూరగాయల ధరల పెరుగుదలతో 10% పెరిగిన భోజనం ధరలు

- టమాటా, ఉల్లిపాయ, బంగాళాదుంపలకు రెక్కలు
- బియ్యం, కందిపప్పు ధరల్లో కూడా పెరుగుదల
- ఇదే సమయంలో తగ్గిన మాంసాహార భోజన రేట్లు
- నిత్యావసర ధరలపై ఆసక్తికర క్రిసిల్ నివేదిక

సాక్షి, అమరావతి:కూరగాయల ధరలు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలకు రెక్కలతో ఓ పక్క శాకాహార భోజన ధరలు పెరుగుతుంటే అదే సమయంలో బాయిలర్ చికెన్ ధరలు తగ్గడంవల్ల మాంసాహార భోజన ధరలు తగ్గాయి. దేశవ్యాప్తంగా సగటున చూసుకుంటే గతేడాది ఇదే సమయంతో పోలిస్తే శాకాహార భోజన ధరలు పది శాతం పెరిగితే మాంసాహార భోజన ధరలు నాలుగు శాతం తగ్గినట్లు క్రిసిల్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. క్రిసిల్ ప్రతినెలా విడుదల చేసే 'రోటీ రైస్ రేట్' పేరిట విడుదల చేసిన నివేదిక ప్రకారం..

ప్లేట్ రోటీ రూ.26.7 నుంచి రూ.29.4కు పెరుగుదల

గతేడాది జూన్‌లో సగటున రూ.26.7గా ఉన్న ప్లేట్ రోటీ ధర (రోటీ, కర్రీ, పెరుగుకప్పు) ఇప్పుడు రూ.29.4కు పెరిగింది. శాకాహార భోజన ధరలు పెరగడంలో కూరగాయలు కీలక భూమిక పోషించినట్లు క్రిసిల్ పేర్కొంది. ఎందుకంటే.. 2023తో పోలిస్తే టమోటా ధరలు 30 శాతం, ఉల్లిపాయలు 46 శాతం, బంగాళాదుంప 59 శాతం పెరగడం ప్రధాన కారణంగా పేర్కొంది. వేసవిలో అకాల వర్షాలకు తోడు రబీ సాగు తగ్గడంతో బంగాళాదుంప, ఉల్లిపాయల ధరలు కూడా పెరగడానికి కారణంగా పేర్కొంది. అలాగే, టమోటా అత్యధికంగా పండే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో అసాధారణ స్థాయిలో ఉష్ణోగ్రతల నమోదవడంతో టమాటా దిగుబడులు పడిపోయాయి. ఇదే సమయంలో బియ్యం ధరలు 13 శాతం, కందిపప్పు ధర 22 శాతం పెరిగినట్లు క్రిసిల్ పేర్కొంది.

ప్లేట్ చికెన్ థాళీ ధర ధమాల్..

మరోవైపు.. 2023లో రూ.60.5గా ఉన్న ప్లేట్ చికెన్ థాళీ ధర ఇప్పుడు రూ.58కు పడిపోయింది. చికెన్ థాళీ ధరలో 50 శాతం వాటా ఉండే బాయిలర్ చికెన్ ధర గతేడాదితో పోలిస్తే 14 శాతం తగ్గడం దీనికి కారణంగా క్రిసిల్ పేర్కొంది. ఒక సాధారణ కుటుంబంలో ఒక వెజ్ లేదా నాన్ వెజ్ థాళీ చేసుకోవడానికి సగటున అయ్యే వ్యయం ఆధారంగా క్రిసిల్ ఈ నివేదికను రూపొందించింది.

ఒకే టీచర్... ఒకే విద్యార్థి



ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులు లేక వెలవెలబోతున్నాయి. నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలం ఉల్సాయిపాలెం గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో 39 మంది విద్యార్థులు, ఆరుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ పాఠశాలకు చెందిన ఐదుగురు ఉపాధ్యాయులు ఈ ఏడాది బదిలీతో పాటు ప్రమోషన్‌పై వెళ్లిపోయారు. ఈ పాఠశాలకు చెందిన 38 మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు వెళ్లడంతో శనివారం ప్రభుత్వ పాఠశాలకు ఒకే ఒక్క విద్యార్థి హాజరయ్యాడు. ఈ పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు, ఒక విద్యార్థి మాత్రమే ఉన్నారు.

– అడవిదేవులపల్లి(మిర్యాలగూడ)

'గురుకులం'లో హడలెత్తిస్తున్న ఎలుకలు

- 16 మంది విద్యార్థినులకు గాయాలు
- నల్లగొండ జిల్లా డిండిలో ఘటన



డిండి పీహెచ్‌సీలో వైద్యం కోసం వచ్చిన విద్యార్థినులు

డిండి(నల్లగొండ): నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురులకు పాఠశాల(బాలికలు)లో ఎలుకలు హడలెత్తిస్తున్నాయి. ఇటీవల 16 మంది విద్యార్థినులను ఎలుకలు కరవడంతో వారు ఆస్పత్రి పాలయ్యారు. ఈ విషయం శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గురుకుల పాఠశాలలో 635 మంది విద్యార్థినులు చదువుతున్నారు. పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు పెరగడం, గదుల గోడలకు ఏర్పడిన రంధ్రాల్లో ఎలుకలు, పాములు తిరుగుతున్నాయి. విద్యార్థినులు నిద్రిస్తున్న సమయంలో ఈ నెల 2న ఆరుగురు, 3న మరో ఆరుగురు, 5న నలుగురు విద్యార్థినులను ఎలుకలు కరిచాయి. దీంతో వారు స్థానిక పీహెచ్‌సీలో యాంటీ రేబిస్ టీకాను వేయించుకున్నారు. ఈ నెల 2వ తేదీన మండల వైద్యాధికారి ఎస్.శైలి గురుకుల ఆవరణను పరిశీలించి వెంటనే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఎంపీడీఓ, ఎంఈఓకు లేఖ రాశారు. ప్రిన్సిపాల్ పద్మ విద్యార్థినుల సంరక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఆమెపై చర్యలు తీసుకోవాలని శనివారం విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల ఎదుట ధర్నా చేశారు.

వేషం మార్చి.. పేకాట రాయుళ్లకు ఝలక్

కూలీల వేషంలో పట్టుకున్న పోలీసులు



కూలీలుగా వేషం మార్చి నిందితులను పట్టుకున్న పోలీసులు


ముస్తాబాద్(సిరిసిల్ల): నేరగాళ్లు, దొంగలు, తీవ్రవాదులను పట్టుకునేందుకు పోలీసులు మారువేషాల్లో వెళ్లడం సినిమాల్లో చూస్తుంటాం.. కానీ ప్రజల జీవితాల్లో చిచ్చురేపుతున్న పేకాటను అడ్డుకునేందుకు రాజన్నసిరిసిల్ల జిల్లా పోలీసులు అచ్చంగా ఇలాగే వెళ్లారు. ముస్తాబాద్ మండలం బందనకల్‌లో పంట పొలాల మధ్య పేకాటాడుతున్నారనే సమాచారం సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలికి అందింది. పొలాల్లోకి నేరుగా పోలీస్ వాహనం వెళ్లే పరిస్థితి లేకపోవడం.. గట్లపై నుంచి యూనిఫాంలో వెళ్తే తమను చూసి పేకాటరాయుళ్లు పారిపోతారని రైతులుగా, కూలీలుగా అవతారం ఎత్తారు. లుంగీలు, తలపాగ కట్టుకొని సీఐ మొగిలి, హెడ్‌కానిస్టేబుల్ భూమయ్య, కానిస్టేబుళ్లు దామోదర్, రాజశేఖర్, సంతోష్ పేకాట స్థావరం వైపు వెళ్లారు. వచ్చే వారు రైతులుగా భావించిన పేకాటరాయుళ్లు పట్టించుకోలేదు. అనంతరం పోలీసులు మూడువైపులా చుట్టుముట్టి వారిని అరెస్టు చేశారు.

'దేవాలయ భూములపై చట్టపర చర్యలు తీసుకోండి'

సాక్షి, హైదరాబాద్: రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన దేవాలయాల భూముల రక్షణకు శాశ్వత, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) తెలంగాణ విజ్ఞప్తిచేసింది. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయానికి సంబంధించిన 890 ఎకరాల భూముల (రాష్ట్రాల విభజన అనంతరం ఏపీ పరిధిలోకి వెళ్లాయి) రక్షణకు ఉమ్మడి కార్యాచరణ ప్రకటించాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఒక ప్రకటనలో కోరింది.

సికింద్రాబాద్ – గోవా మధ్య కొత్త బైవీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు

- ప్రధాని, రైల్వేశాఖ మంత్రికి ధన్యవాదాలు తెలిపిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
- గతంలో ఈ రైలు అవసరంపై రైల్వే మంత్రికి లేఖ రాసిన కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ : తెలుగు రాష్ట్రాలనుంచి గోవా వెళ్లే ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. సికింద్రాబాద్ నుంచి వాస్కోడిగామా (గోవా) వెళ్లేందుకు కొత్త ఎక్స్‌ప్రెస్ రైలును (17039/17040) ప్రారంభించనుంది. ఈ బై వీక్లీ రైలు బుధ, శుక్రవారాల్లో సికింద్రాబాద్ నుంచి బయల్దేరి గోవా నుంచి గురువారం, శనివారం తిరుగు ప్రయాణం అవుతుంది. ఇప్పటివరకు వారానికి ఒక రైలు 10 కోచ్‌లతో సికింద్రాబాద్ నుంచి బయల్దేరి గుంతకల్‌కు చేరుకుని అక్కడ తిరుపతి నుంచి గోవాకు వెళ్లే మరో 10 కోచ్‌లతో కలుపుకుని గోవాకు చేరుకునేది. ఇది కాకుండా కాచిగూడ –యలహంక మధ్య వారానికి 4 రోజులు ప్రయాణం సాగించే రైలుకు గోవాకు వెళ్లే 4 కోచ్‌లను కలిపేవారు. ఈ 4 కోచ్‌లను తిరిగి గుంతకల్ వద్ద షాలిమార్ – గోవా మధ్య తిరిగే రైలుకు కలిపి ప్రయాణం సాగించేవారు. అయితే సికింద్రాబాద్ – గోవా మధ్య రైళ్లన్నీ 100 ఆక్యుపెన్సీతో వెళ్లడం, చాలామంది సీట్లు దొరక్క ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ...రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఈ ఏడాది మార్చి 16న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లేఖ రాశారు. మళ్లీ కేంద్రంలో మూడోసారి మోదీ సర్కారు అధికారంలోకి రావడంతో..ఈ ప్రాజెక్టు విషయాన్ని ఇటీవల రైల్వేశాఖ మంత్రిని కలిసిన సందర్భంగా కిషన్‌రెడ్డి గుర్తు చేశారు. దీనిపై అశ్వినీ వైష్ణవ్ సానుకూలంగా స్పందించారు. దీంతో సికింద్రాబాద్–వాస్కోడిగామా (గోవా) మధ్య బైవీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభిస్తున్నట్లు రైల్వేశాఖ ప్రకటించింది. త్వరలో ఇది అందుబాటులోకి రానుంది. ఈ రైలు సికింద్రాబాద్, కాచిగూడ, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, గద్వాల్, కర్నూల్ సిటీ, డోన్, గుంతకల్, బళ్లారి, హోస్పేట, కొప్పల్, గడగ్, హుబ్బళ్లి, ధార్వాడ్, లోండా, క్యాసిల్ రాక్, కులెం, సాన్వోర్‌డెమ్, మడగావ్ జంక్షన్లలో ఆగుతూ వాస్కోడిగామా చేరుకుంటుంది. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంపై జి.కిషన్‌రెడ్డి ప్రధాని మోదీ, రైల్వే శాఖ మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.


బొగతకు పర్యాటకుల సందడి

ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని చీకుపల్లి గ్రామ సమీపంలో ఉన్న బొగత జలపాతం వద్ద శనివారం పర్యాటకుల సందడి నెలకొంది. పర్యాటకులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. జలపాతం నీటిలో స్నానాలు చేసి సేదతీరారు. జలపాతం ఫొటోలను ఫోన్లలో బంధించారు.

– వాజేడు



టుడేస్ గ్రాఫిక్



చదువు పక్కన పెట్టి.. చీపురు పట్టి..



పాఠశాల ఆవరణ శుభ్రం చేస్తున్న విద్యార్థులు

జ్యోతినగర్ (రామగుండం):సర్కారు బడుల్లో సకల సౌకర్యాలు కల్పిస్తున్నామని విస్తృత ప్రచారం చేస్తున్న ప్రభుత్వ ప్రకటనలు ఆచరణలో కానరావడం లేదు.. ఇందుకు నిదర్శనం పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీ కాకతీయనగర్ ప్రభుత్వ ఉర్దూ మీడియంపాఠశాల దుస్థితి. ఇక్కడ 30మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఒకేఒక ఉపాధ్యాయిని విద్యాబోధన చేస్తున్నారు. ఆమె కూడా కరీంనగర్ నుంచి రోజూ వచ్చిపోతున్నారు. బడిలో స్వీపర్ లేరు. ఉపాధ్యాయిని వచ్చేలోగా విద్యార్థులే బడి తాళాలు తీసి.. చీపుర్లు పట్టుకుని తరగతి గదులు, పాఠశాల ఆవరణ శుభ్రం చేస్తున్నారు. దీనిపై ఉపాధ్యాయినిని వివరణ కోరగా.. తమ పాఠశాలలోని 30మంది విద్యార్థులకు తాను ఒక్కరినే విద్యాబోధన చేస్తున్నట్టు స్పష్టం చేశారు. స్వీపర్, అటెండర్‌ను కేటాయించలేదని తెలిపారు. ఒక మహిళను ఆయాగా నియమించుకుని సొంత డబ్బుతో వేతనం చెల్లిస్తున్నట్టు పేర్కొన్నారు. మరో టీచర్‌ను నియమించాలని ఎమ్మెల్యేకు విన్నవించానని వెల్లడించారు.

గర్భిణికి సాయం చేసిన ఆర్టీసీ సిబ్బందికి సజ్జనార్ సన్మానం



కండక్టర్ సరోజ, డ్రైవర్ అలీలను సన్మానిస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ సిటీ బస్సులో పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణికి సాయం అందించి సుఖ ప్రసవానికి కారకులైన సంస్థ కండక్టర్, డ్రైవర్‌ను టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం అభినందించింది. ఈ మేరకు కండక్టర్ సరోజ, డ్రైవర్ ఎంఎం అలీలను హైదరాబాద్ బస్ భవన్‌లో శనివారం ఉన్నతాధికారులతో కలిసి సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్సులో జన్మించిన చిన్నారి.. తమ బస్సుల్లో జీవిత కాలం ఉచితంగా ప్రయాణించేలా బస్ పాస్‌ను అందిస్తున్నట్లు ప్రకటించారు. ఆర్టీసీ బస్సులు, బస్‌స్టేషన్లలో పుట్టిన పిల్లలకు జీవిత కాలపు ఉచిత బస్ పాస్ ఇవ్వాలని గతంలో యాజమాన్యం తీసుకున్న నిర్ణయం మేరకు.. ఈ ఆడపిల్లకు పుట్టిన రోజు కానుకగా బస్ పాస్ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ముషీరాబాద్ డిపోకు చెందిన 1 జెడ్ రూట్ బస్సులో శుక్రవారం ఉదయం ఆరాంఘర్‌లో శ్వేతా రత్నం అనే గర్భిణికి పురిటి నొప్పులు రాగా.. కండక్టర్ ఆర్.సరోజ అప్రమత్తమై మహిళా ప్రయాణికుల సాయంతో సాధారణ ప్రసవం చేయడం తెలిసిందే. గర్భిణి పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చారు. సన్మాన కార్యక్రమంలో సీవోవో డాక్టర్ రవీందర్, జాయింట్ డైరెక్టర్ అపూర్వరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, కృష్ణకాంత్, హైదరాబాద్ ఆర్ఎం వరప్రసాద్, ముషీరాబాద్ డీఎం కిషన్ తదితరులు పాల్గొన్నారు.

శిశువుకు బర్త్ సర్టిఫికెట్

ఆర్టీసీ బస్సులో ప్రసవించిన మహిళ బిడ్డకు భవిష్యత్‌లో ఇబ్బంది లేకుండా ఉండేందుకు జీహెచ్ఎంసీ అధికారులు జనన ధ్రువపత్రం జారీ చేశారు. ప్రసవం జరిగిన ప్రదేశం జీహెచ్ఎంసీ మూడు సర్కిళ్ల పరిధిలో ఉన్నందున, జనన ధ్రువ పత్రం ఎక్కడ తీసుకోవాలో అన్న అవగాహన లేక భవిష్యత్తులో సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉంటుందని అధికారులు గుర్తించారు. సంబంధిత బర్త్, రిజిస్ట్రార్ ద్వారా బేబీ ఆఫ్ శ్వేతా రత్నం అని పేర్కొంటూ బర్త్ సర్టిఫికెట్ ఇప్పించారు.

హీరో రాజ్ తరుణ్ కేసులో ట్విస్టులు

- ఆధారాలు ఇవ్వాలన్న పోలీసుల నోటీసుకు స్పందించని లావణ్య
- కేసు క్లోజ్ చేసే దిశగా నార్సింగి పోలీసులు

మణికొండ (హైదరాబాద్): హీరో రాజ్‌తరుణ్‌కేసు పలు మలుపులు తిరుగుతోంది. రాజ్‌తరుణ్ తనను ప్రేమించాడని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి, ప్రస్తుతం మరో యువతి మోజులో పడి తనను పట్టించుకోవటం లేదని లావణ్య అనే యువతి నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అయితే కేసుకు సంబంధించి ఆమె ఎటువంటి ఆధారాలు ఇవ్వలేదు. దీంతో నార్సింగి పోలీసులు ఆమెకు నోటీసు జారీ చేశారు. ఫిర్యాదుకు అనుగుణంగా ఆధారాలను సమర్పించాలని అందులో సూచించారు. ఆమెకు ఫోన్ చేసి విషయం తెలిపేందుకు యత్నించినా స్పందన లేకపోవటంతో ఆదివారం వరకు వేచి చూసి సోమవారం కోర్టు అనుమతితో కేసును మూసివేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. తన మాజీ ప్రియుడు తన వద్దకు రావటం లేదని, అతనితో కలిసి ఓ సినిమాలో నటిస్తున్న హీరోయిన్ మాలివి మల్హోత్రా సోదరుడు తనను చంపేస్తానని బెదిరించాడని, వారికి రాజకీయ పలుకుబడి ఉందని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. వాటికి సంబంధించిన ప్రాథమిక ఆధారాలను ఆమె సమర్పిస్తే విచారణ చేపడతామని పోలీసు అధికారులు తెలిపారు. లేదంటే ఆమె తప్పుడు కేసు పెట్టిందనే ఉద్దేశాన్ని కోర్టుకు తెలిపి దాన్ని మూసివేస్తామని వారు పేర్కొన్నారు.

మస్తాన్‌సాయితో లావణ్య రిలేషన్: రాజ్‌తరుణ్


లావణ్యతో కొన్ని సంవత్సరాలు రిలేషన్‌లో ఉన్న మాట వాస్తవమని హీరో రాజ్‌తరుణ్ మీడియాకు వెల్లడించారు. ఆమెకు డ్రగ్స్ అలవాటు ఉండటం, పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపడంతో తనకు చెడ్డ పేరు వస్తుందనే ఉద్దేశంతోనే తాను ఆమెకు దూరంగా ఉంటున్నానన్నారు. ప్రస్తుతం ఆమె గుంటూరుకు చెందిన మస్తాన్ సాయితో లివింగ్ రిలేషన్‌లో ఉందని చెప్పారు.

నిరాధార ఆరోపణ: సినీనటి మాల్వీ మల్హోత్రా

ఒక సినిమాలో కలిసి పనిచేసినంత మాత్రాన హీరోతో రిలేషన్‌ను అంటగట్టడం, వారి మధ్య ఉన్న గొడవకు తనను బాధ్యురాలిని చేయడం మంచి పద్ధతి కాదని రాజ్‌తరుణ్‌తో కలిసి నటించిన హీరోయిన్ మాల్వీ మల్హోత్రా పేర్కొన్నారు. శనివారం ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ, సినిమా షూటింగ్ పూర్తి అయిన తరువాత గత ఎనిమిది నెలల నుంచి అతనితో మాట్లాడిందే లేదన్నారు. తన పేరుతో లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేయటం దారుణమని ఆమె తెలిపారు.

తిరుపతి దర్శన సిఫార్సు లేఖలకు ప్రాధాన్యం ఇచ్చేలా చూడండి

సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి తుమ్మల లేఖ



సాక్షి,హైదరాబాద్: తిరుమల తిరుపతి దర్శనం కోసం తెలంగాణ ప్రజాప్రతినిధులు ఇచ్చే సిఫార్సు లేఖలకు ప్రాధాన్యం ఇచ్చేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు శని వారం సీఎం రేవంత్‌రెడ్డికి తుమ్మల లేఖ రాశారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు శనివారం ప్రజాభవన్‌లో భేటీ అయిన నేపథ్యంలో తిరుమల దర్శనం అంశాన్ని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

వాదనలు అనవసరం!

ఏపీ సీఎస్, అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్, భట్టి స్పష్టీకరణ

- వివాదాల పరిష్కారం కోసమే సమావేశమయ్యాం
- కూర్చుని పరిష్కరించుకుందాం.. కమిటీలు వేసుకుందామని సూచన
- ఇరు రాష్ట్రాల ప్రజాప్రతినిధులు పరస్పరం గౌరవించుకునేలా ప్రొటోకాల్ అమలుకు నిర్ణయం
- ఆస్తుల పంపకాలు, విద్యుత్ బకాయిలను ప్రస్తావించిన ఏపీ సీఎస్
- టీటీడీలో, కోస్తా తీర ప్రాంతంలో వాటాల అంశాన్ని ప్రస్తావించిన తెలంగాణ సీఎస్
- తిరిగి వెళ్లే సమయంలో చంద్రబాబు, రేవంత్ మధ్య ముచ్చట్లు


శనివారం సీఎంల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న మంత్రులు

సాక్షి, హైదరాబాద్: 'విభజన' సమస్యలకు సంబంధించి వాదనలు అనవసరమని.. వివాదాల పరిష్కారం కోసమే సమావేశం ఏర్పాటు చేసుకున్నామని ఆంధ్రప్రదేశ్ సీఎస్, అధికారులకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేసినట్టు తెలిసింది. వాదనలతో కాకుండా చర్చలతోనే పెండింగ్ సమస్యలను పరిష్కరించుకుందామని పేర్కొన్నట్టు సమాచారం. విభజన సమస్యల పరిష్కారం ఎజెండాగా హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఇరు రాష్ట్రాల సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు, మంత్రులు, అధికారులు శనివారం సాయంత్రం సమావేశమయ్యారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ఏపీ సీఎం చంద్రబాబు తొలుత మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్ర విభజన సమస్యల పరిష్కారం కోసం తాను లేఖ రాసిన వెంటనే సానుకూలంగా స్పందించి సమావేశం ఏర్పాటు చేయడం పట్ల తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పెండింగ్ సమస్యల పరిష్కారానికి చంద్రబాబు ముందుకు రావడం పట్ల రేవంత్‌రెడ్డి కూడా కృతజ్ఞతలు తెలిపారు.

కూర్చుని పరిష్కరించుకుందాం..

ఎజెండాలో భాగంగా తొలుత ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ పెండింగ్‌లో ఉన్న విభజన సమస్యలను వివరించారు. 9, 10వ షెడ్యూళ్లలోని అంశాలు, తెలంగాణ పరిధిలో ఉన్న వివిధ ప్రభుత్వ సంస్థల ఆస్తుల పంపకాలు, విద్యుత్ బకాయిలపై మాట్లాడారు. ఈ సందర్భంగా ఏపీ సీఎస్ నీరబ్‌కుమార్ ఢిల్లీలోని ఏపీ భవన్ విభజన అంశాన్ని ప్రస్తావించగా.. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకున్నారు. వివాదాల పరిష్కారం కోసమే సమావేశం ఏర్పాటు చేసుకున్నప్పుడు వాదనలు అనవసరమని స్పష్టం చేశారు. ఏదైనా కూర్చొని పరిష్కరించుకోవాలని రేవంత్‌తోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. మరోవైపు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి.. ఉద్యోగుల విభజన, ఏడు విలీన మండలాలు, భద్రాచలం పరిధిలోని 5 గ్రామాల అంశం, టీటీడీలో, కోస్తా తీర ప్రాంతంలో వాటాలు, ఏపీలోని ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తుల పంపకాలు మొదలైన అంశాలను ప్రస్తావించారు. చివరగా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ సీఎస్‌ల ఆధ్వర్యంలో ఒక అధికారుల కమిటీ, మంత్రుల ఆధ్వర్యంలో మరో కమిటీ ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఇక ఇరు రాష్ట్రాల ప్రజాప్రతినిధులు పరస్పరం గౌరవించుకునే విధంగా ప్రొటోకాల్ నిబంధనలు అమలు చేయాలని నిర్ణయించారు.


'కాళోజీ' పుస్తకాన్ని ఏపీ సీఎం చంద్రబాబుకు ఇస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సాదర స్వాగతంతో.. మనసారా నవ్వుకుంటూ..

ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రులు శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో ప్రజాభవన్‌కు చేరుకోగా.. సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు సాదరంగా స్వాగతం పలికారు. సమావేశ మందిరంలోకి వెళ్లిన తరువాత ఏపీ సీఎం చంద్రబాబును సీఎం రేవంత్ శాలువాతో సత్కరించి.. కాళోజీ రాసిన 'నా గొడవ' పుస్తకాన్ని బహూకరించారు. నంది జ్ఞాపికను అందజేశారు. తర్వాత చంద్రబాబు సీఎం రేవంత్‌కు శాలువా కప్పి సత్కరించి, వెంకటేశ్వరస్వామి విగ్రహాన్ని బహూకరించారు. సమావేశం తర్వాత ఏర్పాటు చేసిన విందులో హైదరాబాదీ దమ్ బిర్యానీతోపాటు ఆమ్లెట్లు, చేపల కూర వంటి వంటకాలను వడ్డించారు. తిరిగి వెళ్లే సమయంలో రేవంత్, చంద్రబాబు ముచ్చట్లాడుకుంటూ కనిపించారు. ఏదో అంశం ప్రస్తావనకు రాగా నవ్వుకుంటూ బయటికి వచ్చారు.

'అమ్మ' వద్దంది.. ఆస్పత్రి అమ్మేసింది!

- వివాహేతర బంధంతో పుట్టబోయే బిడ్డను వదిలించుకోవాలనుకున్న గర్భిణి
- ఓ ప్రైవేటు ఆస్పత్రితో రూ. 2 లక్షలకు డీల్.. గుట్టుచప్పుడు కాకుండా డెలివరీ చేసి ఆడ శిశువును రూ. 20 వేలకు అమ్మేసిన ఆస్పత్రి
- కామారెడ్డిలో ఘటన.. వైద్యుడు సహా 8 మంది అరెస్ట్


చిన్నారిని ఐసీడీఎస్ అధికారులకు అప్పగిస్తున్న పోలీసులు

కామారెడ్డి క్రైం: పుట్టబోయే బిడ్డను వదిలించుకోవాలనుకున్న ఓ గర్భిణి నుంచి పెద్ద మొత్తంలో డబ్బు తీసుకొని గుట్టుచప్పుడు కాకుండా డెలివరీ చేయడంతోపాటు నవజాత శిశువును విక్రయించిన ఓ ప్రైవేటు ఆస్పత్రి నిర్వాకం కామారెడ్డి జిల్లా కేంద్రంలో బట్టబయలైంది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆస్పత్రి వైద్యుడు, సిబ్బంది సహా మొత్తం 8 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు.

పెళ్లికి ముందే గర్భం దాల్చడంతో..

జిల్లాలోని తాడ్వాయి మండలం చిట్యాల గ్రామానికి చెందిన లావణ్యకు కామారెడ్డి మండలం పోసానిపేట గ్రామానికి చెందిన మహేశ్‌తో ఫిబ్రవరిలో వివాహం జరిగింది. పెళ్లికి ముందే ఆమెకు మరొకరితో సాన్నిహిత్యం ఉండటంతో ఆ కారణంగా పెళ్లి సమయానికే ఆమె గర్భం దాల్చింది. పెళ్లయిన నెల రోజులకు భర్తకు ఈ విషయం తెలియడంతో నాటి నుంచి లావణ్య పుట్టింట్లోనే ఉంటోంది. పుట్టబోయే బిడ్డ తనతో లేకపోతే భర్త మళ్లీ చేరదీస్తాడని భావించిన లావణ్య.. ఏప్రిల్‌లో శ్రీరాంనగర్ కాలనీలో ఉన్న సమన్విత ఆస్పత్రిని సంప్రదించింది. గాంధారి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న వైద్యుడు ఇట్టం ప్రవీణ్‌కుమార్, ఆయన తండ్రి నడిపి సిద్ధిరాములు ఈ ఆస్పత్రిని నడుపుతున్నారు. అందుకు అంగీకరించిన వారు మొత్తం రూ. 2 లక్షలకు లావణ్య, ఆమె కుటుంబ సభ్యులతో బేరం కుదుర్చుకున్నారు. అందులో భాగంగా కొంత నగదు, ఫోన్ పే ద్వారా రూ. లక్షా 30 వేలను లావణ్య కుటుంబ సభ్యులు చెల్లించారు. ఏప్రిల్ 11న అర్ధరాత్రి లావణ్యకు డెలివరీ చేయగా ఆడపిల్లకు జన్మనిచ్చింది. అప్పటికే రాజంపేటకు చెందిన ఇట్టం బాలకృష్ణ ద్వారా అతని బంధువైన సిరిసిల్లకు చెందిన దేవయ్యతో బిడ్డను కొనే వారితో డాక్టర్, ఆయన తండ్రి ఒప్పందం చేసుకున్నారు. సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం రేపాన గ్రామానికి చెందిన భూపతి అనే వ్యక్తికి పిల్లలు లేకపోవడంతో పసిబిడ్డను కొనుగోలు చేసేందుకు ముందుకొచ్చాడు. రూ. 20 వేలు తీసుకుని ఏప్రిల్ 12న పాపను భూపతి దంపతులకు అప్పగించారు.

మహేశ్ ఫిర్యాదుతో విషయం వెలుగులోకి..

విషయం తెలుసుకున్న లావణ్య భర్త మహేశ్ డీసీపీవో స్రవంతికి, పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో వైద్యుడు ఇట్టం ప్రవీణ్ కుమార్, ఆయన తండ్రి నడిపి సిద్దిరాములు, ఆస్పత్రి మేనేజర్ ఉదయ్ కిరణ్, వాచ్‌మన్ బాలరాజుతోపాటు లావణ్య, మధ్యవర్తులు బాలకృష్ణ, దేవయ్య, భూపతిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించారు. పసిపాపను బాలల సంరక్షణ కేంద్రానికి తరలించారు. 2021లో కౌసల్య మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని నడిపిన డాక్టర్ ప్రవీణ్, ఆయన తండ్రి ఓ గర్భిణికి లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లు తేలడంతో సిద్దిరాములుతోపాటు కొందరిని అరెస్టు చేసి ఆస్పత్రిని సీజ్ చేశారు.

కమిటీలతో తేలుస్తాం

▶ మొదటి పేజీ తరువాయి

తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఇరు రాష్ట్రాల మంత్రులు ప్రజాభవన్‌లో మీడియా సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు.

ఒక్క భేటీలోనే పరిష్కారాలు లభించవు: భట్టి

సీఎంలు, మంత్రులు, అధికారుల సమావేశంలో అనేక అంశాలపై లోతుగా చర్చించామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. పదేళ్ల నుంచీ అపరిష్కృతంగా ఉన్న రాష్ట్ర విభజన చట్టంలోని అంశాలతోపాటు ఇతర విషయాలపైనా చర్చించి ముందుకెళ్లాలనే ఆలోచనతో చర్చలు జరిపామన్నారు. పదేళ్లుగా పరిష్కారానికి నోచుకోని అంశాలకు ఈ ఒక్క సమావేశంలోనే సమాధానాలు దొరుకుతాయని అనుకోలేదని చెప్పారు. సమస్యలకు పరిష్కారాలు చూపడానికి విధానపరమైన వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగా తొలుత సీఎంల ఆధ్వర్యంలో చర్చలు జరిపామన్నారు. ఈ క్రమంలోనే సీఎస్‌లతో ఓ కమిటీ, మంత్రులతో మరో కమిటీకి ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు.

డ్రగ్స్, సైబర్ నేరాలపై కో–ఆర్డినేషన్ కమిటీ

మాదక ద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాలపై దర్యాప్తులో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు పరస్పరం సహకరించుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్టు భట్టి తెలిపారు. తెలంగాణ ప్రతిష్టాత్మకంగా యాంటీ నార్కోటిక్స్ స్పెషల్ డ్రైవ్‌ను చేపట్టిందని.. అదనపు డీజీ స్థాయి అధికారి నేతృత్వంలో ఒక వ్యవస్థను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. తెలంగాణ నుంచి ఈ అదనపు డీజీ, ఏపీ నుంచి అదే స్థాయి అధికారితో కలిపి కో–ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు.

ఇక తరచూ కలుస్తారు: ఏపీ మంత్రి

అపరిష్కృత అంశాలపై చర్చించడానికి ఏపీ, తెలంగాణ సీఎంలు, అధికారులు సమావేశమవడం తెలుగు జాతికి హర్షణీయమని ఏపీ మంత్రి ఎ.సత్యప్రసాద్ పేర్కొన్నారు. తెలుగువారు ఎక్కడున్నా సుభిక్షంగా ఉండాలని ఏపీ సీఎం చంద్రబాబు కోరుకుంటారని.. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అపరిష్కృత అంశాలపై చర్చిద్దామని చంద్రబాబు లేఖ రాయగానే తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించడంతో ఈ సమావేశం ఏర్పాటైందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో జరిగిన ఉద్యమం ద్వారా తెలంగాణ ఏర్పాటైన అంశంతోపాటు ఏపీ అభివృద్ధి విషయంలో ఉన్న సెంటిమెంట్లను పరిగణనలోకి తీసుకుని చర్చలు జరిగాయన్నారు. ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా మంచి వాతావరణంలో, సానుకూల ధోరణితో చర్చించినట్టు తెలిపారు. ఇరు రాష్ట్రాల మధ్య సుహృద్భావ వాతావరణం కోసం తరచుగా కలుసుకోవాలని ఇద్దరు సీఎంలు నిర్ణయించారని వెల్లడించారు. ఏపీ నుంచి తెలంగాణకు మాదక ద్రవ్యాలు సరఫరా అవుతున్నాయని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారని, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలని ఆయన సంకల్పించారని సత్యప్రసాద్ వివరించారు. ఏపీలో సైతం డ్రగ్స్ నియంత్రణ కోసం ఇప్పటికే ఆరుగురు మంత్రులతో సబ్ కమిటీ వేశామన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రతి ఒక్కరూ హర్షించేలా కమిటీలు చర్చించి, వివాదాల పరిష్కారానికి నిర్ణయాలు తీసుకుంటాయని చెప్పారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భట్టి. చిత్రంలో శ్రీధర్‌బాబు, సత్యప్రసాద్, జనార్దన్‌రెడ్డి, పొన్నం

తమ్ముడు కొట్టేసిన భూమిని తిరిగి ఇప్పించట్లేదని రైతు ఆత్మహత్య

- ఆరేళ్లుగా పోలీసులు, పెద్ద మనుషుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేక మనస్తాపం
- పురుగుల మందు తాగి బలవన్మరణం.. హనుమకొండ జిల్లాలో విషాదం
- రాజకీయ అండతో సాదాబైనామా పేరుతో మొత్తం 3.20 ఎకరాలు కాజేసిన తమ్ముడు
- ప్రస్తుతం ఎకరం సుమారు రూ. 4 కోట్ల దాకా పలుకుతున్న ధర


మహేందర్‌రెడ్డి (ఫైల్)

హసన్‌పర్తి: ఆరేళ్ల కిందట తమ్ముడు కొట్టేసిన తన భూమిని తిరిగి ఇప్పించాలంటూ పోలీసులు, పెద్ద మనుషుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో మనస్తాపం చెందిన ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అన్నాసాగరం గ్రామంలో ఈ విషాదకర ఘటన చోటుచేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... అన్నాసాగరం గ్రామానికి చెందిన బండా శ్రీనివాస్‌రెడ్డికి ఇద్దరు కుమారులు మహేందర్‌రెడ్డి (55), ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు. తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన భూమిలో తన వాటా తీసుకున్న ప్రభాకర్‌రెడ్డి అన్నకు చెందిన వాటా భూమితోపాటు పెళ్లి సమయంలో కట్నంగా వచ్చిన భూమి కలిపి మొత్తం 3.20 ఎకరాలను కొట్టేసేందుకు ఆరేళ్ల క్రితమే పక్కా ప్రణాళిక రచించాడు. ఆ మొత్తం భూమిని తన కుమారుడు సాయినాథ్‌రెడ్డి కొనుగోలు చేసినట్లు సాదాబైనామా కింద రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. అప్పటి తహసీల్దార్‌కు లంచం ఇచ్చి పట్టాదారు పాస్‌పుస్తకం కూడా పొందాడు. స్థానిక ప్రజాప్రతినిధి సహకారంతోనే ఈ వ్యవహారం జరిగినట్లుగా ప్రచారం జరుగుతోంది. హసన్‌పర్తి సమీపంలో హైవే పక్కన, విద్యాసంస్థలకు చేరువగా ఉన్న ఆ భూమి ప్రస్తుత మార్కెట్ విలువ ఎకరం రూ. 3–4 కోట్ల దాకా పలుకుతోంది. మరోవైపు మహేందర్‌రెడ్డి తనకు న్యాయం చేయాలంటూ ఆరేళ్ల క్రితమే హసన్‌పర్తి పోలీసులను ఆశ్రయించారు. కానీ రాజకీయ, ధనబలం లేకపోవడంతో పోలీసులు ఆయన ఫిర్యాదును పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

ఎనిమిది నెలల కిందట ఓసారి ఆత్మహత్యాయత్నం...

దీంతో మహేందర్‌రెడ్డి 8 నెలల క్రితం హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అక్కడే పురుగుల మందు తాగాడు. అయితే వెంటనే ఆస్పత్రికి తరలించడంతో అప్పుడు ప్రాణాపాయం తప్పింది. రెండు రోజుల క్రితం మహేందర్‌రెడ్డి మళ్లీ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి న్యాయం చేయాలని కోరినా నిరాశ ఎదురవడంతో మనోవేదనకు గురై ఇంటికొచ్చి పురుగుల మందు తాగాడు. స్థానికులు వెంటనే ఆయన్ను తొలుత వరంగల్‌లోని ఎంజీఎంకు అక్కడి నుంచి ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

మృతుడి భార్య ఫిర్యాదు.. కేసు నమోదు

తన భర్త మృతికి కారకులైన బండా ప్రభాకర్‌రెడ్డి, బండా జ్యోతి, బండా సాయినాథ్‌రెడ్డి, బండా రత్నాకర్‌రెడ్డి, రామంచ సాయిలుపై చర్యలు తీసుకోవాలంటూ మృతుడి భార్య పద్మ హసన్‌పర్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. భూమి పంచాయితీ కోసం పెద్ద మనుషులుగా వ్యవహరించిన మాజీ వైస్ ఎంపీపీ బండా రత్నాకర్‌రెడ్డి, అన్నాసాగరం మాజీ ఉపసర్పంచ్ సాయిలు భారీగా డబ్బు డిమాండ్ చేశారని ఆరోపించింది. ఆమె ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా, తమకు న్యాయం చేయాలంటూ బాధిత కుటుంబం మహేందర్‌రెడ్డి మృతదేహంతో ప్రభాకర్‌రెడ్డి ఇంటి ముందు కాసేపు ఆందోళన చేపట్టింది.

పెన్షన్లకు ఏటా రూ. 22 వేల కోట్లు అవసరం

- మొత్తంగా ఆర్థిక సంవత్సరానికి రూ. 51 వేల కోట్లు కావాలి
- ప్రభుత్వానికి పీఆర్‌శాఖ ప్రతిపాదన
- బడ్జెట్ సన్నాహక భేటీలో చర్చించిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి సీతక్క

సాక్షి, హైదరాబాద్: చేయూత పథకం కింద పెన్షన్ల మొత్తాన్ని పెంచాల్సి ఉందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రభుత్వానికి తెలిపింది. ప్రస్తుతం ఆసరా పెన్షన్ల కింద (పాత పద్ధతుల్లో) వివిధ కేటగిరీల వారికి పెంచిన పింఛన్ మొత్తం ఇచ్చేందుకు ఏటా రూ. 22 వేల కోట్లు అవసరం అవుతాయని అంచనా వేసింది. గత ప్రభుత్వం వృద్ధాప్య, ఇతర కేటగిరీల ఆసరా పింఛనుదారులకు నెలకు రూ. 3 వేలు, దివ్యాంగులకు రూ. 4 వేలు ఇవ్వగా వృద్ధాప్య, ఇతర కేటగిరీల వారికి రూ. 4 వేలు, దివ్యాంగులకు రూ. 6 వేల చొప్పున పెన్షన్లు ఇస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇవ్వడం తెలిసిందే. దీనికి అనుగుణంగా పీఆర్ శాఖ ఈ మేరకు బడ్జెట్ ప్రతిపాదనలు చేసింది. శనివారం సచివాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ బడ్జెట్ ప్రతిపాదనలపై సన్నాహక సమావేశం జరిగింది. డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధ్యక్షతన జరిగిన భేటీలో ఈ ఆర్థిక సంవత్సరానికి అవసరమైన బడ్జెట్ ప్రతిపాదనలను ఆర్థిక శాఖకు పీఆర్ శాఖ నివేదించింది. ఈ ఆర్థిక సంవత్సరానికి మొత్తంగా రూ. 51 వేల కోట్లతో పీఆర్‌శాఖ బడ్జెట్‌ను ప్రతిపాదించింది.

ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో స్కిల్ సెంటర్లు: భట్టి

గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే అంశంపై దృష్టిపెట్టాలని పీఆర్ శాఖ అధికారులను డిప్యూటీ సీఎం భట్టి ఆదేశించారు. మంత్రి సీతక్కతో కలిసి బడ్జెట్ సన్నాహక భేటీలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువత ఉపాధి లేక ఇబ్బందులు పడుతోందన్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా మొదట ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో సెంటర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే సాఫ్ట్‌వేర్ కంపెనీలతో అనుసంధానం చేసుకొని ఉపాధి కల్పనపై దృష్టి పెట్టాలన్నారు. గత పదేళ్లలో మిషన్ భగీరథ పేరిట రూ. వేల కోట్లు ఖర్చు చేయడంపై అధికారుల నుంచి ఆరా తీశారు.

పరిశ్రమల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తాం

- తెలంగాణ పారిశ్రామికవేత్తల సమాఖ్య
- మంత్రి కోమటిరెడ్డిని కలసిన టిఫ్ ప్రతినిధులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధికి కొత్త ప్రభుత్వంతో కలసి పనిచేస్తామని పారిశ్రామికవేత్తలు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని తెలంగాణ పారిశ్రామికవేత్తల సమాఖ్య (టిఫ్) ప్రతినిధులు కలిశారు. యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల పరిధిలో నూతన పారిశ్రామికవాడల ఏర్పాటుకు విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని, ఆ దిశగా ప్రభుత్వంతో కలసి కొత్త పారిశ్రామికవాడల ఏర్పాటుకు తమ సహకారం అందిస్తామని టిఫ్ ఈ సందర్భంగా తెలిపింది. అదే విధంగా ప్రస్తుతం హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై దండు మల్కాపూర్ సమీపంలో ఇప్పటికే ఏర్పాటైన టిఫ్ ఎంఎస్ఎంఈ గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ వద్ద వీలైనంత త్వరగా ఫ్లై ఓవర్‌ను నిర్మించాల్సిన అవసరం ఉందని మంత్రి కోమటిరెడ్డికి టిఫ్ వివరించింది. ఈ ప్రాంతంలో 1,855 ఎకరాల విస్తీర్ణంలో పారిశ్రామిక ప్రాంతం విస్తరించనుందని, ఇప్పటికే 552 ఎకరాల్లో టిఫ్ గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు అయిందని, ఫుడ్ పార్క్, భారత్ పెట్రోలియం బాట్లింగ్ ప్లాంట్, టాయ్స్ పార్క్, ప్లగ్ అండ్ ప్లే పార్క్‌లు అభివృద్ధి పనులను ప్రారంభించాయని, ఫలితంగా ఈ ప్రాంతంలో రూ.6,675 కోట్ల పెట్టుబడులతో 1,500 పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని టిఫ్ వివరించింది. ఈ పరిశ్రమల వల్ల 45,000 మంది ప్రత్యక్షంగా, 35,000 పరోక్షంగా ఉపాధి పొందుతారని తెలిపింది. ఈ పారిశ్రామిక జోన్‌తో తీవ్రమైన రద్దీ ఏర్పడుతుందని, ఈ నేపథ్యంలో రాకపోకలు సాఫీగా జరగడానికి ఫ్లైఓవర్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని టిఫ్ ప్రతినిధులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలను కోరారు. ఈ సమావేశంలో టిఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి గోపాల్‌రావు, చౌటుప్పల్ జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, పారిశ్రామికవేత్తలు జలంధర్‌రెడ్డి, స్వామిగౌడ్, ఏ ఎల్ఎన్ రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, మోహన్ అమిరెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రానున్న మూడ్రోజులు మోస్తరు వర్షాలు

- పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం

సాక్షి, హైదరాబాద్: పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీంతో రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతుండటంతో రానున్న మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. శనివారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు, కొన్నిచోట్ల భారీ వర్షాలు నమోదైనట్లు తెలిపింది. అత్యధికంగా పెద్దపల్లి జిల్లా ధర్మారంలో 7.93 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వరంగల్ జిల్లా చెన్నారావుపేటలో 6.85 సెంటీ మీటర్ల వర్షం కురిసింది. శనివారం రాష్ట్రంలో సగటున 1 సెంటీమీటర్ వర్షం కురిసింది. రానున్న మూడు రోజులు దక్షిణ తెలంగాణ జిల్లాల్లో మోస్తరు వర్షాలు, రెండు, మూడు చోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.

న్యాయ వ్యవస్థ బలోపేతానికి సహకారం

ట్రయల్ కోర్టుల్లోనూ మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ
- నల్సార్‌లో 'క్యాపిటల్'అవార్డుల ప్రదానానికి హాజరు
- పాల్గొన్న హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే, అటార్నీ జనరల్ వెంకటరమణి


'భారత బాలలమైన మేము' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పర్యావరణవేత్త పురుషోత్తమ్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏకే పట్నాయక్, హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, అటార్నీ జనరల్ వెంకటరమణి, నల్సార్ వీసీ శ్రీకృష్ణదేవరావు, రిజిస్ట్రార్ విద్యుల్లత, రామ్‌లాల్ అగర్వాల్

సాక్షి, హైదరాబాద్: న్యాయ వ్యవస్థ మరింత బలోపేతమయ్యేలా అవసరమైన సహకారం అందిస్తామని, ట్రయల్ కోర్టుల్లోనూ మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలోనే నల్సార్ లా యూనివర్సిటీలో స్థానిక విద్యార్థులకు 20 శాతం రిజర్వేషన్‌ను ప్రవేశపెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ సంఖ్య ఇంకా పెంచేలా చూడాలని వైస్ చాన్సలర్ శ్రీకృష్ణదేవరావును మంత్రి కోరారు. క్యాపిటల్ ఫౌండేషన్ వార్షికోపన్యాసం, అవార్డుల ప్రదాన కార్యక్రమం శనివారం సాయంత్రం నల్సార్ వర్సిటీలో నిర్వహించారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏకే పట్నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే గౌరవ అతిథిగా పాల్గొనగా, మంత్రి ఉత్తమ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 'సాంకేతిక పరిజ్ఞానం, న్యాయం–మానవీయత'అంశంపై అటార్నీ జనరల్ డాక్టర్ ఆర్.వెంకటరమణి ప్రసంగించారు. అనంతరం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు.

నల్సార్ వర్సిటీకి పూర్తి సహకారం

'నల్సార్ దేశంలోనే అగ్రస్థాయి న్యాయ విశ్వవిద్యాలయంగా ఎదుగుతోంది. వర్సిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తాం. న్యాయ వ్యవస్థపై మాకు అపారమైన గౌరవం ఉంది. న్యాయ వ్యవస్థ చేసే సూచనలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుంది. ఇందులో భాగంగానే రాజేంద్రనగర్‌లో హైకోర్టు నిర్మాణం కోసం 100 ఎకరాలు కేటాయించాం. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన అత్యున్నత స్థాయి హైకోర్టు నిర్మాణం చేపడతాం. ఎప్పటికప్పుడు హైకోర్టు ఇచ్చే తీర్పులను గమనిస్తున్నాం. ఆ మేరకు చర్యలు చేపడుతున్నాం. త్వరలో మానవ హక్కుల కమిషన్‌లోని ఖాళీలను భర్తీ చేస్తాం..'అని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వినోద్‌కుమార్, జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి, జస్టిస్ సూరేపల్లి నంద, వర్సిటీ రిజిస్ట్రార్ విద్యుల్లత రెడ్డి, పర్యావరణవేత్త ప్రొఫెసర్ కె.పురుషోత్తం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్సిటీ ప్రవేశపెట్టిన 'భారత రాజ్యాంగం'కోర్సును మంత్రి ఆవిష్కరించారు. జస్టిస్ లీలా సేథ్ రచించిన 'ది చిల్డ్రన్ ఆఫ్ ఇండియా, ది ప్రియాంబుల్ ఆఫ్ అవర్ కానిస్టిట్యూషన్'పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులకు అవార్డులు అందజేశారు.

సీజే అరాధేకు జేఎస్ వర్మ అవార్డు

సీజే జస్టిస్ అలోక్ అరాధే (జస్టిస్ జేఎస్ వర్మ నేషనల్ అవార్డు), సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఇందిరా బెనర్జీ (జస్టిస్ దీపాంకర్ ప్రసాద్ గుప్తా సొలిసిటర్ జనరల్ అవార్డు), గువాహతి హైకోర్టు మాజీ సీజే జస్టిస్ అజయ్ లంబా (జస్టిస్ పీఎన్ భగవతి అవార్డు), ప్రొఫెసర్ గోవర్ధన్ మెహతా (ఏపీజే అబ్దుల్ కలామ్ అవార్డు), సీనియర్ న్యాయవాది పరాగ్ పి.త్రిపాఠి (కేకే వేణుగోపాల్ అటార్నీ జనరల్ అవార్డు), బార్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ నాగానంద్ (అటార్నీ జనరల్ కె.పరాశరణ్ అవార్డు),

సీనియర్ జర్నలిస్టు దిలీప్‌రెడ్డి (ఎన్.నరోత్తమ్‌రెడ్డి అవార్డు), డా.కె.తులసీరావు (పర్యావరణ పరిరక్షణ అవార్డు), డా.నర్సింహారెడ్డి దొంతి (డా. శివాజీరావు అవార్డు), ప్రొఫెసర్ రామినేని శివరామప్రసాద్ (కేపిటల్ ఫౌండేషన్ అవార్డు) అవార్డులు అందుకున్నారు. పర్యావరణ, ఆరోగ్య సంరక్షణ అవార్డును అల్లాని కిషన్‌రావు తరఫున కుటుంబ సభ్యులు అందుకున్నారు.


హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధేకు అవార్డు అందజేస్తున్న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏకే పట్నాయక్

వైరల్



ఆహా నా డ్రెస్ అంటా.... ఏఐ డ్రెస్ అంటా...



గూగుల్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ క్రిస్టినా ఎర్నెస్ట్ సృష్టించిన 'వరల్డ్స్ ఫస్ట్ ఏఐ డ్రెస్' వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ రోబోటిక్ మిడాస్ డ్రెస్ వీడియో 3.6 మిలియన్‌ల వ్యూస్‌ను దక్కించుకుంది. ఈ బ్లాక్ డ్రెస్‌లో ఎన్నో రోబోటిక్ పాములు ఉన్నాయి. చాలామంది ఈ డ్రెస్‌కు 'ఎక్స్‌ట్రార్డినరీ' అని కితాబు ఇవ్వగా కొద్దిమంది మాత్రం 'బోరింగ్' అని పెదవి విరిచారు.

రోబో సూసైడ్?!


'పని ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న రోబో' వార్త ఇంటర్‌నెట్‌లో హల్‌చల్ చేస్తోంది. 'రోబో ఏమిటి? ఆత్మహత్య ఏమిటీ!' అనే ఆశ్చర్యం మాట ఎలా ఉన్నా దీన్ని ఆ దేశ తొలి రోబో ఆత్మహత్యగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. రోబో వెయిటర్ టెక్నాలజీకి ప్రసిద్ధి చెందిన కాలిఫోర్నియాకు చెందిన 'బేర్ రోబోటిక్స్' కంపెనీ ఈ రోబోను తయారుచేసింది. ఈ రోబో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు వరకు పనిచేసేది. 'ఆత్మహత్య' అనే ప్రచారం మాట ఎలా ఉన్నా 'రోబో కుప్పకూలిపోవడానికి అసలు కారణం ఏమిటి?' అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

'టీ'పాట



'చాయ్ హోటల్‌కు ఎందుకు వెళతారు?' అనే ప్రశ్నకు–'చాయ్ కోసమే వెళతారు' అనే జవాబు మాత్రమే వినిపిస్తుంది. అయితే సూరత్‌లోని విజయ్‌భాయి పటేల్ అలియాస్ డాలీ చాయ్‌వాలా అలియాస్ సింగింగ్ చాయ్‌వాలా హోటల్‌కు 'పాట' కోసం వెళతారు. డాలీ చాయ్‌వాలా కస్టమర్‌లకు వేడి వేడి టీ అందిస్తూనే, మైక్రోఫోన్‌లో అద్భుతంగా పాడుతుంటాడు. ఆయన గానం వింటూ 'మరో చాయ్' అనే మాట కస్టమర్‌ల నోటి నుంచి వినిపించడం అక్కడ సాధారణ దృశ్యం. ఈ 'సింగింగ్ చాయ్‌వాలా'కు సంబంధించిన వీడియో క్లిప్‌ను ముంబైలోని సెలబ్రిటీ ఫొటోగ్రాఫర్ బయాని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తే వైరల్ అయింది.

మోదీ గారూ రోడ్లు కిధర్ హై



సోషల్ మీడియా చేతిలోకి వచ్చాక సామాన్యులు ప్రశ్నించే పద్ధతులు మారాయి. ఏకంగా ప్రధాని మోదీని ఉద్దేశిస్తూ మధ్యప్రదేశ్‌కు చెందిన ఒక గ్రామీణ మహిళ విడుదల చేసిన వీడియో వైరల్ అయ్యింది. 'మధ్యప్రదేశ్ నుంచి 29 సీట్లు ఇచ్చాం. మరి మా రోడ్ల సంగతేంటి?' అని అడుగుతూ డొక్కు రోడ్ల మీద ఆమె ప్రయాణం చేస్తూ తీసిన వీడియో మోడి వరకు చేరేలా ఉంది.

పూర్వం ప్రధానికి కార్డు ముక్క రాసి పడేసేవారు జనం. ఇవాళ ఒక వీడియో చేసి వదులుతున్నారు. కార్డు రాస్తే ఎవరికీ తెలిసేది కాదు. కాని వీడియో లక్షలాది మంది కంట పడుతోంది. మధ్యప్రదేశ్‌లోని సిధి జిల్లా అటవీప్రాంతంతో, బొగ్గు గనుల నిక్షేపాలతో ఉంటుంది. కాని వెనుకబాటుతనం కూడా ఉంది. 'మేం అడవుల్లో ఉంటాం. అయితే మాకు రోడ్లు అక్కర్లేదా మోదీ గారూ' అని శివాని సాహు అనే మహిళ మోదీని ప్రశ్నించింది. 'మధ్యప్రదేశ్ మీకు 29 సీట్లు ఇచ్చింది. ఇప్పుడైనా రోడ్లు వేయండి. చూడండి రోడ్లు ఎలా ఉన్నాయో. మేము ఎం.ఎల్.ఏ, ఎం.పి, కలెక్టర్ అందరినీ కలిశాం. కాని ఏం ప్రయోజనం లేదు. వానొస్తే మా పరిస్థితి అధ్వానం. బస్సు మలుపు తిరగలేదు. పిల్లలు నడవడం కూడా వీలు కావడం లేదు. రోడ్లు వేయండి మోదీ గారూ' అని ఆమె వేడుకుంది. అంతే కాదు 'ఈ వీడియో మోదీ గారికి చేరేవరకు షేర్ చేయండి' అని కోరింది. దాంతో అందరూ షేర్ చేస్తున్నారు. ఈ వీడియో వచ్చాక సిధి జిల్లాలో పురోభివృద్ధి గురించి చర్చ నడుస్తోంది. అన్నట్టు ఇది నాటి మహా విదూషకుడు బీర్బల్ జన్మస్థలం. ఆయన మళ్లీ పుడితే ఇలాంటి ప్రభుత్వ పనితీరు చూసి ఎన్ని పరిహాసాలు ఆడేవాడో. మరెన్ని వ్యంగ్యాలు పోయేవాడో. వాతలు వేసేవాడో.

చీర కాల కోరిక నెరవేరింది ఇలా...



చీరకట్టుకోవాలనేది ఆ బామ్మ కల. బామ్మది ఇండియా అయితే ఆమె కల గురించి ఆశ్చర్యపోవాల్సిందే. 'అదేం భాగ్యం!' అనుకోవాల్సిందే. అయితే బామ్మగారిది ఇండియా కాదు ఇటలీ. ఇటాలియన్ డీజె, ఇన్‌ఫ్లుయెన్సర్ వోలీ ఎస్సే బామ్మ ఇరవై సంవత్సరాల క్రితం తన కుటుంబంతో మన దేశానికి వచ్చింది. ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు ఆమెకు బాగా నచ్చాయి. ముఖ్యంగా చీర ఆమెకు బాగా నచ్చింది. అప్పటినుంచి చీర ధరించాలనే కోరిక మనసులో ఉండిపోయింది. 'ఈరోజు నీ కలను నిజం చేస్తాను' అని బామ్మను చీరతో సర్‌ప్రైజ్ చేసింది మనవరాలు వోలీ. చీర ధరించి తన చిరకాల కోరిక నెరవేర్చుకున్న బామ్మ కళ్లలోని వెలుగు చీరకు కొత్త అందం తెచ్చింది.

భ్రుకు టీ ముడిపడే సీన్!



శివుని జటాఝూటంలోని గంగ గురించి మనకు తెలుసు. అయితే ఇరానీ మోడల్ శిరోజాలలోని 'టీపాట్' వీడియో ఇప్పుడు వైరల్ అయింది. హెయిర్ స్టైల్లో ఎన్నో రకాలు ఉన్నాయి. అయితే 'టీ పాట్ హెయిర్‌స్టైల్' గురించి మాత్రం ఎప్పుడూ విని ఉండం. ఇరాన్‌కు చెందిన హెయిర్ స్టైలిస్ట్ సైదెహ్ 'టీపాట్ హెయిర్‌స్టైల్' వీడియోను చూసి నెటిజనులు 'ఆహో వోహో' అంటున్నారు. ఈ వీడియో నాలుగు మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. హెయిర్ పిన్స్‌తో మోడల్ సబుర్ నగర్‌కు పోనీ టెయిల్ వేసింది. ఆ తరువాత మెటల్ వైర్లు, గ్లూగన్‌తో టీపాట్ స్ట్రక్చర్స్‌ను సెట్ చేసింది. ఈ శిరో టీపాట్‌లో టీ పోసి ఆ తరువాత కప్పులోకి ఒంపి తాగింది. 'ఫ్యాషన్ స్టైల్ అనేది ఎన్నో వెరైటీలకు కేంద్రం. హెయిర్ స్టైల్‌కు సంబంధించి సహజంగా ఉండేలా ఏదైనా చేయాలనుకున్నాను. రెండు రోజుల కృషి ఫలితమే ఈ విజయం. ఇంత స్పందన వస్తుందని ఊహించలేదు' అని తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో చెప్పింది సైదేహ్.

టాటూస్‌తో క్యాన్సర్ రిస్క్!

పరిశోధన




పచ్చబొట్లతో(టాటూస్) క్యాన్సర్ రిస్క్ పెరుగుతుందంటున్నారు పరిశోధకులు. ఇవి లింఫోమా అనే క్యాన్సర్‌ను కలగజేస్తాయని హెచ్చరిస్తున్నారు.

ఇటీవల స్వీడన్‌కు చెందిన కొందరు పరిశోధకుల సర్వేలో టాటూ వేయించుకోని వారితో పోలిస్తే పచ్చబొట్లు పొడిపించుకున్న వారిలోనే ఎక్కువగా లింఫోమా క్యాన్సర్ వచ్చినట్లుగా తేలింది. అంతే కాదు... టాటూ సైజ్ చిన్నదీ, పెద్దదీ అనే తేడా లేకుండా ఈ క్యాన్సర్ వృద్ధి చెందినట్లు పరిశోధకులు పేర్కొంటున్నారు.

''సైజూ, డిజైనుతో నిమిత్తం లేకుండా పచ్చబొట్టు దేహంలో తొలుత 'లో–గ్రేడ్ ఇన్‌ఫ్లమేషన్'కు కారణమవుతోంది. ఆ తర్వాత అది క్యాన్సర్‌ను ప్రేరేపిస్తుంది. పచ్చబొట్టు కోసం ఉపయోగించే సిరా చర్మంలోకి ఇంజెక్ట్ కాగానే దేహం దాన్ని ఫారెన్ బాడీగా గుర్తించి వ్యాధి నిరోధక వ్యవస్థను ప్రేరేపిస్తుంది. దీన్ని తొలగించే క్రమంలో ఆ సిరాలోని చాలా భాగం లింఫ్‌నోడ్స్‌కు చేరి అక్కడ డిపాజిట్ అవుతుంది. అదే క్యాన్సర్‌ను ప్రేరేపిస్తోంది'' అన్నది పరిశోధకుల మాట. పైగా చాలా చిన్నవయసులోనే టాటూ వేయించుకున్నవారు చాలాకాలం పాటు ఈ టాటూ సిరాకు ఎక్స్‌పోజ్ అయ్యే అవకాశం ఉందని, అది క్యాన్సర్‌కు దారితీయ వచ్చని వారు హెచ్చరిస్తున్నారు.

హెల్త్

కుక్క కాటా?



ఇటీవల వీధి కుక్కలు కాటు వేస్తున్న కేసులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. కొన్నిసార్లు పెంపుడు కుక్కలు కూడా కరుస్తుంటాయి. ప్రధానంగా చిన్నారులు అందులోనూ... 5 నుంచి 9 ఏళ్ల పిల్లలు ఎక్కువగా కుక్కకాటుతో గాయపడతారు. ఇక మహిళల కంటే పురుషులే కుక్కకాటుకు ఎక్కువగా గురవుతుంటారు. కుక్కకాటుకు గురైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రథమ చికిత్స, తదుపరి చికిత్సలను తెలుసుకుందాం.

కుక్కల కోర పళ్లు మినహాయించి, మిగతావి చివర్లలో కోసుగా గీసుకు పోయేట్లు కాకుండా గుండ్రగా అరగదీసినట్లు ఉంటాయి. తమ పిల్లల్ని ఒక చోటినుంచి మరో చోటికి తీసుకెళ్లే సమయంలో గుచ్చుకుపోకుండా ప్రకృతి చేసిన ఏర్పాటిది. అయితే ఈ అంశమే కుక్క గట్టిగా కొరికినప్పుపడు కోసుకు పోయినట్లు కాకుండా ఛిద్రమైనట్లుగా తీవ్రమైన గాయమయ్యేలా చేస్తుంది. ఆ గాయం తీవ్రతతో కండ, ఎముక, నరాలు, టెండన్స్, రక్తనాళాలు... ఇలా ఏదైనా ప్రభావితం కావచ్చు.

కుక్క కాటుకు గురవగానే చేయాల్సినవి...

● మొదట గాయం తీవ్రత ను పరిశీలించాలి. లోతుగా గాయమైందా లేక పైపైన గీరుకున్నట్లుగా ఉందేమో చూడాలి. పైపైన గీరుకుపోయినట్లుగా ఉంటే... గాయాన్ని మరికాసేపు పరిశీలించాలి. అంటే... కొద్దిసేపటి తర్వాత ఆ గీరుకుపోయిన చోట నొప్పి, వాపు, వేడి (వార్మ్‌త్)గా ఉన్నట్లుగా ఉందా లేక రక్తస్రావం అవుతోందా అన్న విషయాలు పరిశీలించాలి. గాయం తీవ్రత కొద్దిగా లేదా ఓ మోస్తరుగా ఉంటే ఈ కింది జాగ్రత్తలు తీసుకోవచ్చు...

కుక్క కాటుకు తొలి జాగ్రత్తలివి...

● కుక్క కాటుతో గాయమైనప్పుడు మగ్‌తో నీళ్లు పోస్తూ లేదా నల్లా / కుళాయి కింది గాయాన్ని ఉంచి నీళ్లు పడుతుండగా సబ్బు/ డెటాల్/ అయోడిన్‌తో వీలైనంత ఎక్కువసేపు శుభ్రంగా కడగాలి. ఒకవేళ సబ్బు దొరక్కపోతే గాయం ప్రాంతమంతా శుభ్రంగా కడుక్కుపోయేలా నీరు ధారగా పడేలా చేయాలి ● గాయానికి ఎలాంటి కట్టూ కట్టకుండా ఓపెన్‌గా ఉంచాలి ● కుక్క కాటు తర్వాత రేబీస్ వచ్చే అవకాశాలు ఎక్కువ కాబట్టి తక్షణం డాక్టర్‌ను సంప్రదించి యాంటీరేబీస్ వ్యాక్సిన్‌ను అవసరాన్ని బట్టి మూడు లేదా ఐదు మోతాదుల్లో ఇప్పించాలి. పెంపుడు కుక్క కరిచినా కూడా డాక్టర్‌ను సంప్రదించి వీలైనంత త్వరగా ఈ వ్యాక్సిన్‌ను తీసుకోవాలి.



డాక్టర్ వెంకట్ నాని
సీనియర్ ఫిజీషియన్

రేబీస్ అంటే ఏమిటి? అప్రమత్తత ఎందుకు అవసరమంటే...

రేబీస్ అనేది కుక్కతో పాటు కోతి, ఎలుకల వంటి ఇతర జంతువులు కరచినప్పుడు వాటి లాలాజలంలో ఉండే ఒక రకం వైరస్ కారణంగా వచ్చే వ్యాధి. ఇది బాధితుల నాడీ వ్యవస్థను దెబ్బతీసే ప్రాణాంతకమైన వ్యాధి. అదృష్టవశాత్తు దీనికి వ్యాక్సిన్ ఉంది. కాబట్టి కుక్కకాటుకు గురైన వ్యక్తులు ఈ వ్యాక్సిన్ తప్పక తీసుకోవాలి.

డంబ్ రేబీస్ ఉంటే...

వీటి శరీరం, కండరాలూ చాలా బలహీనంగా ఉంటాయి. తూలుతున్నట్లుగా నడుస్తాయి. నోట్లోంచి లాలాజలం వస్తుంటుంది. తర్వాత మృతి చెందుతుంది.

రేబీస్ ఉన్న కుక్క కరిస్తే... కుక్కకాటుకు గురైన వాళ్లలోనూ ఇవే లక్షణాలు కనిపించడంతోపాటు నీళ్లంటే భయపడటం, తీవ్రమైన యాంగ్జైటీ, విమాన ప్రయాణాలతోపాటు గాలిలో ఎగురుతూ వెళ్లే క్రీడల పట్ల భయాందోళనలు వ్యక్తం చేయడం (ఏరోఫోబియా), గుటక వేయడం కష్టం కావడం, నిద్రలేమి వంటి లక్షణాలతో పాటు తీవ్రమైన కేసుల్లో కోమాలోకి వెళ్లడం, గుండె ఆగి మరణించడం వంటి పరిణామాలు కనిపిస్తాయి. కాబట్టి వీలైనంత త్వరగా చికిత్స తీసుకోవడం మేలు.

కుక్కను పరిశీలించడమూ అవసరమే...

కుక్క కాటుకు గురైనప్పుడు... అది ఇంటి పరిసరాల్లోనే ఉండే కుక్క అయితే అది పిచ్చిదో కాదో తెలుసుకునేందుకు 10 రోజుల పాటు దాన్ని గమనిస్తూ ఉండటం అవసరం. కుక్కలో ఉండే రేబీస్ రెండు రకాలుగా ఉంటుంది. మొదటిది తీవ్రమైన రేబీస్, రెండోది మూగ (డంబ్) రేబీస్.

తీవ్రమైన రేబీస్ ఉన్న కుక్కలు


కుక్కల్లో తీవ్రమైన రేబీస్ ఉన్నప్పుడు వాటి ప్రవర్తన చాలా క్రోధపూరితంగా ఉంటుంది. చిన్నపాటి అలికిడికే మీదికి వచ్చేయడం, గుర్రుమనడం (గ్రౌలింగ్), మొరగడం, ఆ తర్వాత నీటికి తీవ్రంగా భయపడుతూ చివరికి మృతి చెందడం.

చికిత్స: ● కుక్కకాటుకు గురైన వారి గాయాన్ని పరిశీలించి ఎంత లోతుగా గాయమైంది, నరాలు, రక్తనాళాలు తెగాయా లేక గాయం కండరానికే పరిమితమైందా అన్న అంశాల్ని చూసి, గాయం తీవ్రతను బట్టి చికిత్సను నిర్ణయిస్తారు. నరాలు, రక్తనాళాలు తెగితే, శస్త్రచికిత్స ద్వారా సరిచేస్తారు ● గాయానికి ఇన్ఫెక్షన్ రాకుండా తొలుత టీటీ ఇంజెక్షన్, తర్వాత యాంటీబయాటిక్స్ ఇస్తారు ● గాయం తీవ్రతను బట్టి ఇమ్యునోగ్లోబులిన్ ఇంజెక్షన్స్‌ను గాయం అయిన చోట రెండు డోసులు ఇచ్చాక, మిగతాది చేతికి ఇంజెక్ట్ చేస్తారు ● గాయం అయిన వైపు ఉండే చేతికి ఇమ్యునోగ్లోబ్యులిన్ ఇంజెక్షన్... ఆ రెండోవైపు చేతికి యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌ను ఇవ్వాలి. పెంపుడు కుక్కలకూ యాంటీ రేబిస్ ఇంజెక్షన్ అంతే అవసరమని గుర్తించాలి.

అపోహ | వాస్తవం

సైక్లింగ్ వ్యాయామంతో...

సైక్లింగ్‌తో మోకాళ్లపై మరింత ఒత్తిడి పడి మోకాళ్ల అరగడం, దాంతో నొప్పులు రావడం సహజమనే అభిప్రాయం కేవలం అపోహ మాత్రమే. సాధారణ వ్యక్తులతో పోలిస్తే ఈ వ్యాయామం చేసేవారిలో మోకాళ్ల నొప్పులు 17 శాతం తక్కువ. అంతే కాదు... ఆర్థ్రైటిస్‌తో మోకాలికి వచ్చే బాధలు కూడా వీళ్లలో 21 శాతం తక్కువ. ● సైక్లింగ్ కాలి కండరాల్లో ప్రధానమైన క్వాడ్రిసెప్స్ (తొడ కండరాలు), గ్లూటీ (పిరుదు కండరాలు), హ్యామ్‌స్ట్రింగ్స్ (తుంటిభాగంలోని తొడ కండరాలు), కాఫ్ (పిక్కలు) మజిల్స్ బలాన్ని పెంచుతుంది. ఊపిరితిత్తుల సామర్థ్యమూ పెరుగుతుంది. అలాగే పూర్తి శరీర సామర్థ్యాన్నీ (ఓవరాల్ ఎండ్యూరెన్స్) పెంచుతుంది ●అందుకే మోకాళ్లపై బరువు పడటానికి వీల్లేని వారు ప్రత్యామ్నాయంగా సైక్లింగ్‌ను ఎంచుకోవచ్చు.



ఓ చికిత్స ప్రక్రియపై వ్యాఖ్య... వాస్తవం!

వివాదం



సమంత సామాజిక మధ్యమాల్లో పెట్టిన ఒక పోస్ట్ వివాదాలకు దారితీసింది. ''వైరల్ ఫీవర్స్ ఉన్నప్పుడు మందులు వాడకుండా హైడ్రోజన్ పెరాక్సైడ్ ని నెబ్యులైజర్ సహాయంతో తీసుకుంటే అద్భుతమైన ఫలితాలు వస్తాయి'' అని చెబుతూ ఒక డాక్టర్ తనకి చెప్పినట్టు సమంత తెలిపారు. అయితే కొందరు వైద్య ప్రముఖులు దీన్ని ఖండించడంతో ఇప్పుడు ఈ పోస్టు వివాదానికి కారణమైంది. హైడ్రోజన్ పెరాక్సైడ్‌ని నెబ్యులైజ్ చేయటంలో కొన్ని ప్రమాదాలు పొంచి ఉన్నాయని 'ఆస్తమా అండ్ ఎలర్జీ ఫౌండేషన్ ఆఫ్ అమెరికా' 2021 లోనే సూచించిందనీ, అమెరికాలోని సీటీపీడీ ఫౌండేషన్ కూడా అది సరికాదని పేర్కొంది. ఈ విషయం వివాదాస్పదం కావడంతో సమంత వివరణ ఇస్తూ... 'వైద్యచికిత్స తీసుకుంటున్న క్రమంలో తాను ఎన్నో కష్టనష్టాలను ఓర్చుకున్న తర్వాత కొన్ని ప్రత్యామ్నాయ వైద్య విధానాలను (ఆల్టర్నేటివ్ మెడిసిన్స్) అనుసరించాననీ, దాంతో తనకు ఉపశమనం కలిగిందని మాత్రమే తను చెప్పదలుచుకున్నానన్నారు. తను చెప్పిన దాంట్లో ఏదైనా తప్పు ఉంటే వైద్యవర్గాలు దాన్ని చర్చించాలి గాని, తనని దోషిగా చూపే ప్రయత్నం చేయటం తగద'ని ఆమె పేర్కొన్నారు. అయితే సినీ ప్రముఖులు పూర్తి అవగాహన లేకుండా కేవలం తమకి అక్కరకు వచ్చిన వైద్య విధానాల్ని పాటించాలని సూచించకూడదు, తాము పాటించిన దానిని నలుగురిలో వ్యక్తపరచటానికి ప్రముఖులకు పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. అయితే, హేతుబద్ధత లేని వైద్యవిధానాన్ని పాటించమని పదిమందికీ చెప్పడంవల్ల ప్రాణాపాయాలతో పాటు సమాజానికి నష్టం చేకూరే ప్రమాదమున్నందున దీన్ని భావ ప్రకటన స్వేచ్ఛగా భావించలేమని వైద్యవర్గాల వాదన.

హేతుబద్ధమైన సమాచారమే ఇవ్వాలి

ఇప్పుడున్న పరిస్థితుల్లో నకిలీ సమాచారాన్ని గుర్తించేందుకు ప్రజల దగ్గర సరైన వనరులు అందుబాటులో లేవు. ఒక ఆరోగ్య పరమైన సమాచారాన్ని నకిలీదా కాదా అన్న విషయాన్ని ఆయా రంగాల నిపుణులను సంప్రదించి, తెలుసుకోవటానికి ప్రయత్నించాలి. నకిలీ ఆరోగ్య సమాచారాన్ని బట్టబయలు చేయడంలో ప్రభుత్వ పాత్ర ఎంతో ఉంటుంది. ఎవరిని నమ్మాలో కచ్చితంగా తెలియనప్పుడు ప్రజలు ప్రభుత్వం వైపే చూస్తారు. కాబట్టి ఈ విషయంలో ప్రభుత్వాలు ఎంతో శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఉన్న సమాచార యుగంలో హేతుబద్ధమైన సమాచారం ఎంతో బలమైనది. కొంతమంది వైద్యనిపుణులు కూడా కొన్నిసార్లు తప్పుడు సమాచారాల్ని ప్రజల ముందు ఉంచటం వల్ల ప్రభుత్వాల బాధ్యత మరింత కీలకం.



డాక్టర్
ఎం.ఎస్.ఎస్. ముఖర్జీ
సీనియర్ కార్డియాలజిస్ట్



వినేశ్ ఫొగాట్‌కు స్వర్ణం

భారత రెజ్లర్ వినేశ్ ఫొగాట్ పారిస్ ఒలింపిక్స్‌కు ముందు కీలక విజయాన్ని సొంతం చేసుకుంది. మాడ్రిడ్‌లో జరిగిన స్పెయిన్ గ్రాండ్‌ప్రిలో వినేశ్ స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. 50 కేజీల కేటగిరీ ఫైనల్లో వినేశ్ 10-5 స్కోరుతో మారియా తియుమెరికొవాపై విజయం సాధించింది. రష్యాకు చెందిన మారియా తటస్థ అథ్లెట్‌గా బరిలోకి దిగింది. ఫైనల్‌కు ముందు వినేశ్ సంపూర్ణ ఆధిపత్యంతో వరుసగా మూడు బౌట్‌లలో గెలుపొందింది. యుజ్‌నీలిస్ గజ్‌మన్ (క్యూబా)పై 12-4తో, ఆ తర్వాత మాడిసన్ పార్క్స్ (కెనడా)పై 'విన్ బై ఫాల్'తో, సెమీ ఫైనల్లో కేటీ డచక్ (కెనడా)పై 9-4తో వినేశ్ గెలిచింది.

రజావత్ సంచలనం

బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్-500 కెనడా ఓపెన్‌లో భారత షట్లర్ ప్రియాన్షు రజావత్ సంచలన విజయంతో సెమీ ఫైనల్లోకి ప్రవేశించాడు. పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ప్రపంచ 39వ ర్యాంకర్ ప్రియాన్షు 21-11, 17-21, 21-19 స్కోరుతో టాప్ సీడ్, వరల్డ్ నంబర్ 4 ఆండర్స్ ఆంటోన్‌సెన్ (డెన్మార్క్)ను ఓడించాడు. మహిళల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో గాయత్రి గోపీచంద్ - ట్రెసా జాలీ (భారత్) జోడి 18-21, 21-19, 16-21తో పీ షన్ సీ - ఎన్ జు హంగ్ (చైనీస్ తైపీ) చేతిలో ఓడి నిష్క్రమించింది.

కుర్రాళ్లు నిలవలేకపోయారు...

- తొలి టి20లో ఓడిన భారత జట్టు
- 13 పరుగులతో జింబాబ్వే విజయం
- నేడు రెండో టి20 మ్యాచ్


ఐపీఎల్ అనుభవంతో జింబాబ్వే గడ్డపై అడుగు పెట్టిన భారత యువ బృందం అంతర్జాతీయ వేదికపై ఆ మెరుపులు చూపించలేకపోయింది. తమతో పోలిస్తే టి20 క్రికెట్‌లో తక్కువ అనుభవం ఉన్న బలహీన ప్రత్యర్థిని నిలువరించడంలో విఫలమైంది. తమ ప్రధాన ఆటగాళ్లతో బరిలోకి దిగిన జింబాబ్వే ఎనిమిదేళ్ల తర్వాత టీమిండియాపై విజయాన్ని నమోదు చేసింది. తక్కువ స్కోర్ల మ్యాచ్‌లో స్ఫూర్తిదాయక ఆటతో సొంత అభిమానుల్లో ఆనందం పంచింది. వరల్డ్ కప్ ఫైనల్ గెలిచిన టీమ్‌లోని ఒక్క ఆటగాడు కూడా ఈ మ్యాచ్‌లో ఆడకపోయినా... అధికారిక రికార్డుల ప్రకారం వరల్డ్ చాంపియన్ అయిన తర్వాత భారత్‌కు ఇది ఓటమి!



హరారే: సొంత గడ్డపై ఐదు టి20 మ్యాచ్‌ల సిరీస్‌లో జింబాబ్వే శుభారంభం చేసింది. శనివారం జరిగిన పోరులో జింబాబ్వే 13 పరుగుల తేడాతో భారత్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 115 పరుగులు చేసింది. క్లైవ్ మదాండె (25 బంతుల్లో 29 నాటౌట్; 4 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా...మైర్స్ (23), బెన్నెట్ (22), మదెవెరె (21) స్కోరులో తలా ఓ చేయి వేశారు. రవి బిష్ణోయ్ (4/13) అంతర్జాతీయ టి20ల్లో తన అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన నమోదు చేయగా, సుందర్‌కు 2 వికెట్లు దక్కాయి. అనంతరం భారత్ 19.5 ఓవర్లలో 102 పరుగులకు ఆలౌటైంది. శుబ్‌మన్ గిల్ (29 బంతుల్లో 31; 5 ఫోర్లు), వాషింగ్టన్ సుందర్ (24 బంతుల్లో 27; 1 ఫోర్, 1 సిక్స్) మినహా అంతా విఫలమయ్యారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సికందర్ రజా (3/25), చటారా చెరో 3 వికెట్లతో భారత్‌ను దెబ్బ తీశారు. రెండో టి20 నేడు ఇక్కడే జరుగుతుంది. ఈ మ్యాచ్‌తో అభిషేక్ శర్మ, రియాన్ పరాగ్, ధ్రువ్ జురేల్ భారత్ తరఫున అంతర్జాతీయ టి20ల్లో అరంగేట్రం చేశారు.

రవి బిష్ణోయ్‌కు 4 వికెట్లు...

రెండో ఓవర్లోనే కయా (0) అవుటైనా...ఖలీల్ ఓవర్లో 4 ఫోర్లతో జింబాబ్వే బ్యాటర్లు 17 పరుగులు రాబట్టారు. అయితే ఆ తర్వాత ఈ జోరుకు బ్రేక్ పడింది. బిష్ణోయ్ తన తొలి రెండు ఓవర్లలో 2 వికెట్లతో జింబాబ్వేను దెబ్బ తీశాడు. 10 ఓవర్లలో స్కోరు 69/3కి చేరింది. ఆ తర్వాత ఒకే స్కోరు వద్ద రెండు వికెట్లు కోల్పోయిన జట్టు 74/5 వద్ద నిలిచింది. కొద్ది సేపటికే సుందర్ కూడా ఒకే ఓవర్లో 2 వికెట్లు తీసి ప్రత్యర్థిని పూర్తిగా నిలువరించాడు. ఇన్నింగ్స్ 16వ ఓవర్ వేసిన బిష్ణోయ్ కూడా మరో 2 వికెట్లు పడగొట్టడంతో జింబాబ్వే 100 లోపే ఆలౌట్ అయ్యేలా అనిపించింది. అయితే చటారా, మదాండె కలిసి తర్వాతి 27 బంతులను జాగ్రత్తగా ఆడి అభేద్యంగా 25 పరుగులు జోడించారు. 90/9 నుంచి స్కోరు 115 వరకు చేరింది. మ్యాచ్ తుది ఫలితంతో ఈ చివరి పరుగులే కీలకంగా మారాయి.



టపటపా...

తొలి అంతర్జాతీయ మ్యాచ్‌లో అభిషేక్ శర్మ (0) నాలుగు బంతులు ఆడితే, రియాన్ పరాగ్ (2) ఆట మూడు బంతుల్లో ముగిసింది. రుతురాజ్ (7) విఫలం కాగా, రింకూ సింగ్ (0) పేలవంగా నిష్క్రమించాడు. దాంతో స్కోరు 22/4. మరో అరంగేట్ర ఆటగాడు ధ్రువ్ జురేల్ (6) విఫలం కావడంతో 9.5 ఓవర్లలో సగం టీమ్ పెవిలియన్‌కు! ఇదీ భారత జట్టు పరిస్థితి. మరో వైపు జాగ్రత్తగా ఆడిన కెప్టెన్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దేందుకు ప్రయత్నించాడు. అయితే రజా బౌలింగ్‌లో అతను వెనుదిరగడంతో 47/6 వద్ద భారత్ ఆశలు ఆవిరయ్యాయి. చివర్లో సుందర్ పోరాడినా లాభం లేకపోయింది. ఆఖరి ఓవర్లో 16 పరుగులు అవసరం కాగా 5 బంతుల్లో 2 పరుగులే చేసిన జట్టు చివరి వికెట్ కోల్పోయింది.

స్కోరు వివరాలు:

జింబాబ్వే ఇన్నింగ్స్: మదెవెరె (బి) బిష్ణోయ్ 21; కయా (బి) ముకేశ్ 0; బెన్నెట్ (బి) బిష్ణోయ్ 22; రజా (సి) బిష్ణోయ్ (బి) అవేశ్ 17; మయర్స్ (సి) అండ్ (బి) సుందర్ 23; క్యాంప్‌బెల్ (రనౌట్) 0; మదాండె (నాటౌట్) 29; మసకద్జ (స్టంప్డ్) జురేల్ (బి) సుందర్ 0; జొంగ్వే (ఎల్బీ) (బి) బిష్ణోయ్ 1; ముజరబాని (బి) బిష్ణోయ్ 0; చటారా (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 115. వికెట్ల పతనం:** 1-6, 2-40, 3-51, 4-74, 5-74, 6-89, 7-89, 8-90, 9-90. **బౌలింగ్:** ఖలీల్ 3-0-28-0, ముకేశ్ 3-0-16-1, రవి బిష్ణోయ్ 4-2-13-4, అభిషేక్ 2-0-17-0, అవేశ్ 4-0-29-1, సుందర్ 4-0-11-2.

భారత్ ఇన్నింగ్స్: అభిషేక్ (సి) మసకద్జ (బి) బెన్నెట్ 0; గిల్ (బి) రజా 31; రుతురాజ్ (సి) కయా (బి) ముజరబాని 7; పరాగ్ (సి) (సబ్) మవుతా (బి) చటారా 2; రింకూ సింగ్ (సి) బెన్నెట్ (బి) చటారా 0; జురేల్ (సి) మదెవెరె (బి) జొంగ్వే 6; సుందర్ (సి) ముజరబాని (బి) చటారా 27; బిష్ణోయ్ (ఎల్బీ) (బి) రజా 9; అవేశ్ (సి) రజా (బి) మసకద్జ 16; ముకేశ్ (బి) రజా 0; ఖలీల్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (19.5 ఓవర్లలో ఆలౌట్) 102. వికెట్ల పతనం:** 1-0, 2-15, 3-22, 4-22, 5-43, 6-47, 7-61, 8-84, 9-86, 10-102. **బౌలింగ్:** బెన్నెట్ 1-1-0-1, మసకద్జ 3-0-15-1, చటారా 3.5-1-16-3, ముజరబాని 4-0-17-1, జొంగ్వే 4-0-28-1, రజా 4-0-25-3.

ప్రిక్వార్టర్స్‌లో జ్వెరెవ్

- నంబర్‌వన్ స్వియాటెక్ అవుట్
- వింబుల్డన్ టోర్నీ



లండన్: గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ వింబుల్డన్‌లో జర్మనీ స్టార్ అలెగ్జాండర్ జ్వెరెవ్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. మరో వైపు మహిళల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్‌పై అనామక ప్లేయర్ యులియ పుతిన్‌త్సెవా (కజకిస్తాన్) సంచలన విజయాన్ని నమోదు చేసింది. శనివారం కూడా వర్షం అంతరాయం కలిగించడంతో మ్యాచ్‌లన్నీ ఆలస్యమయ్యాయి. పురుషుల సింగిల్స్‌లో జరిగిన మూడో రౌండ్ పోరులో నాలుగో సీడ్ జ్వెరెవ్ 6-4, 6-4, 7-6 (17/15)తో కామెరాన్ నోరీ (బ్రిటన్)పై గెలుపొందాడు. తొలి రెండు సెట్లను అలవోకగానే గెలుచుకున్న జర్మనీ స్టార్‌కు మూడో సెట్లో నోరీ నుంచి అనూహ్య ప్రతిఘటన ఎదురైంది. దీంతో సెట్ ఫలితం తేల్చేందుకు టైబ్రేక్ అనివార్యమైంది. మిగతా మ్యాచ్‌ల్లో వుగో హంబెర్ట్ (ఫ్రాన్స్) 7-6 (11/9), 6-3, 6-7 (5/7), 7-6 (8/6)తో బ్రాండన్ నకషిమా (అమెరికా)ను, బెన్ షెల్టన్ (అమెరికా) 6-7 (4/7), 6-2, 6-4, 4-6, 6-2తో షపొవలోవ్ (కెనడా)ను ఓడించగా, ఈ సీజన్ ఆ్రస్టేలియా ఓపెన్ చాంపియన్, టాప్ సీడ్ యానిక్ సినెర్ (ఇటలీ) 6-1, 6-4, 6-2తో కెక్మనోవిచ్ (సెర్బియా)పై అలవోక విజయం సాధించాడు.

మహిళల సింగిల్స్‌లో జరిగిన మూడో రౌండ్లో ప్రపంచ నంబర్‌వన్, తాజా ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) 6-3, 1-6, 2-6తో యులియ పుతిన్‌త్సెవా (కజకిస్తాన్) చేతిలో కంగుతింది. మిగతా మ్యాచ్‌ల్లో జెలీనా ఒస్టాపెంకో (లాత్వియా) 6-1, 6-3తో బెర్నార్డ పెర (అమెరికా)పై సునాయాస విజయం సాధించింది. గత వింబుల్డన్ సెమీఫైనలిస్ట్ స్వితోలినా (ఉక్రెయిన్) 6-1, 7-6 (7/4)తో పదో సీడ్ జాబెర్ (ట్యూనిషియా)పై గెలుపొందగా, బార్బర క్రెజిసికొవా (చెక్ రిపబ్లిక్) 6-0, 4-3తో జెస్సికా బౌజస్ మనెరో (స్పెయిన్)పై ఆధిక్యంలో ఉన్న దశలో మనెరో మ్యాచ్ నుంచి తప్పుకుంది. మనెరో ఈ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ వొంద్రుసొవాపై సంచలన విజయం సాధించింది. ఎమ్మా రాడుకాను (బ్రిటన్) 6-2, 6-3తో తొమ్మిదో సీడ్ మరియా సకారి (గ్రీస్)ని కంగుతినిపించింది. ఈ సీజన్‌లో ఆ్రస్టేలియా, ఫ్రెంచ్ ఓపెన్‌లలో సెమీఫైనలిస్టుగా నిలిచిన కోకో గాఫ్ (అమెరికా) 6-4, 6-0తో సోనే కర్టల్ (బ్రిటన్)పై గెలిచింది. పురుషుల డబుల్స్‌లో రెండో సీడ్ రోహన్ బోపన్న-ఎబ్డెన్ (ఆ్రస్టేలియా) జోడీ 3-6, 6-7 (4/7)తో ఫ్రాంట్‌జెన్-జెబెన్స్ (జర్మనీ) జంట చేతిలో ఓడిపోవడంతో వింబుల్డన్‌లో భారత్ పోరాటం ముగిసింది.



సచిన్‌కు స్టాండింగ్ ఒవేషన్

భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ వింబుల్డన్ రాయల్ బాక్స్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాడు. 'సెంట్రల్ కోర్టులోకి మళ్లీ మిమ్మల్ని ఆహ్వానించడం గర్వంగా ఉంది. మనతో క్రికెట్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన సచిన్ టెండూల్కర్ ఉన్నాడు' అని నిర్వాహకులు ప్రకటించగా... ప్రేక్షకులంతా గౌరవభావం ప్రదర్శిస్తూ స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు.

సెమీఫైనల్లో ఫ్రాన్స్

- షూటౌట్‌లో పోర్చుగల్‌పై విజయం
- యూరో కప్ ఫుట్‌బాల్


ఫ్రాన్స్ జట్టు విజయానందం

హాంబర్గ్: యూరో కప్ ఫుట్‌బాల్ టోర్నీలో మాజీ చాంపియన్ ఫ్రాన్స్ సెమీ ఫైనల్లోకి అడుగు పెట్టింది. క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఫ్రాన్స్ 'షూటౌట్' ద్వారా మరో మాజీ విజేత పోర్చుగల్‌ను ఓడించింది. నిర్ణీత సమయంతో పాటు అదనపు సమయం ముగిశాక కూడా ఇరు జట్లు 0-0తో సమంగా నిలవగా షూటౌట్ అనివార్యమైంది. ఇందులో ఫ్రాన్స్ 5-3తో పోర్చుగల్‌పై విజయం సాధించింది. ఆల్‌టైమ్ గ్రేట్‌లలో ఒకడైన క్రిస్టియానో రొనాల్డో తన జాతీయ జట్టు తరఫున ఆఖరి మ్యాచ్ ఆడేశాడు. ఆరో సారి యూరో కప్‌లో బరిలోకి దిగిన రొనాల్డో ముందే ఇది తనకు చివరి యూరో అని ప్రకటించాడు. 2026 వరల్డ్ కప్‌లో 41 ఏళ్లు ఉండే అతను వరల్డ్ కప్ ఆడే అవకాశాలు దాదాపుగా లేవు!

పేరుకు రెండు పెద్ద జట్లే అయినా ఈ క్వార్టర్స్ పోరు పెద్దగా ఉత్కంఠ, మలుపులు లేకుండా సాగింది. ఇరు జట్లూ కూడా డిఫెన్స్‌కే ప్రాధాన్యనివ్వడంతో ఆటలో వేగం కనిపించలేదు. అటు రొనాల్డో, ఇటు ఎంబాపె కూడా పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. పోర్చుగల్ ప్లేయర్లలో బ్రూనో ఫెర్నాండెజ్, విటిన్హ కొట్టిన షాట్‌లను ప్రత్యర్థి గోల్‌కీపర్ మైక్ మెగ్నన్ నిలువరించగా... ఫ్రాన్స్ ఆటగాళ్లు రాండల్, కామవింగాలకు గోల్స్ అవకాశం వచ్చినా కీపర్ రూబెన్ దయాస్‌ను దాటి బంతి వెళ్లలేకపోయింది. అదనపు సమయంలో రొనాల్డో కొట్టిన ఒక కిక్ కూడా గోల్ బార్ మీదనుంచి వెళ్లిపోయింది. ఇక ఆ తర్వాత ఇరు జట్లు జాగ్రత్తగానే ఆడాయి. షూటౌట్‌లో తొలి నాలుగు ప్రయత్నాల్లో ఫ్రాన్స్ తరఫున డెంబెలె, ఫొఫానా, కొండే, బార్కొలా గోల్స్ కొట్టగా...పోర్చుగల్ తరఫున రొనాల్డో, బెర్నార్డో సిల్వా, న్యూనో మెండెస్ గోల్ సాధించగా జోవో ఫెలిక్స్ విఫలమయ్యాడు. దాంతో స్కోరు ఫ్రాన్స్ పక్షాన 4-3తో నిలిచింది. ఐదో షాట్‌ను కూడా ఫ్రాన్స్ ప్లేయర్ హెర్నాండెజ్ గోల్ సాధించి తమ జట్టును గెలిపించాడు. మరో క్వార్టర్ ఫైనల్లో స్పెయిన్ 2-1 తేడాతో ఆతిథ్య జర్మనీని ఓడించింది. శనివారం జరిగిన క్వార్టర్స్‌లో ఇంగ్లండ్ షూటౌట్‌లో 5-3తో స్విట్జర్లాండ్‌ను ఓడించి సెమీస్ చేరింది.


రొనాల్డో

సినిమా


• జాన్వీ కపూర్
• ఎన్టీఆర్

మోడ్రన్ మాస్టర్


• రాజమౌళి

ప్రముఖ దర్శకుడు రాజమౌళి బయోగ్రాఫికల్ డాక్యుమెంటరీ 'మోడ్రన్ మాస్టర్స్: రాజమౌళి' పేరిట నెట్‌ఫ్లిక్స్‌లో ఆగస్టు 2 నుంచి స్ట్రీమింగ్ కానుంది. 'ఎక్స్' వేదికగా నెట్‌ఫ్లిక్స్ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. ''ఒక వ్యక్తి... ఎన్నో బ్లాక్‌బస్టర్ సినిమాలు. అంతులేని ఆశయం. ఈ దిగ్గజ దర్శకుడు ఇంత గుర్తింపు తెచ్చుకోవడానికి ఎంత కష్టపడ్డారు? అనే అంశాలతో ఈ 'మోడ్రన్ మాస్టర్స్' రూపొందింది'' అంటూ రాజమౌళి బయోగ్రాఫికల్ డాక్యుమెంటరీని ఉద్దేశించి నెట్‌ఫ్లిక్స్ 'ఎక్స్'లో పేర్కొంది. రాజమౌళి జీవిత విశేషాలు, 'బాహుబలి, ఆర్ఆర్ఆర్' చిత్రాల మేకింగ్ గురించిన ఆసక్తికర సన్నివేశాలు ఈ డాక్యుమెంటరీలో ఉంటాయని తెలుస్తోంది. అంతేకాదు... ప్రభాస్, ఎన్టీఆర్, రామ్‌చరణ్, రానా వంటి స్టార్స్ రాజమౌళి గురించి ఏం అభిప్రాయపడుతున్నారు? అనే సంగతులు కూడా ఈ 'మోడ్రన్ మాస్టర్స్: రాజమౌళి'లో ఉంటాయట. ఈ బయోగ్రాఫికల్ డాక్యుమెంటరీని అనుపమా చోప్రా సమర్పణలో అప్లాజ్ ఎంటర్‌టైన్మెంట్, ఫిల్మ్ కంపానియన్ నిర్మించగా రాఘవ్ ఖన్నా దర్శకత్వం వహించారని, తన్వీ అజింక్యా సహ దర్శకులుగా వ్యవహరించారని తెలుస్తోంది.

ఆట పూర్తయింది


• రామ్‌చరణ్

'గేమ్ చేంజర్' ఆటను పూర్తి చేశారు రామ్‌చరణ్. ఆయన హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'గేమ్ చేంజర్'. ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కాగా ఈ సినిమాలో రామ్‌చరణ్ వంతు షూటింగ్ శనివారంతో ముగిసిందని సమాచారం. హైదరాబాద్‌లో జరిగిన 'గేమ్ చేంజర్' సినిమా కీలక సన్నివేశాల చిత్రీకరణలో రామ్ చరణ్ పాల్గొన్నట్లుగా తెలిసింది. పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ మూవీగా రానున్న ఈ సినిమాలో రామ్‌చరణ్ తండ్రీకొడుకుగా రెండు పాత్రల్లో కనిపిస్తారని టాక్. అంజలి, శ్రీకాంత్, ఎస్‌జే సూర్య, నవీన్‌చంద్ర, జయరాం, సునీల్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు తమన్ స్వరకర్త. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమా విడుదల తేదీపై త్వరలోనే ఓ స్పష్టత రానుంది.


దేవర ఆటా పాటా

'దేవర' రొమాంటిక్ మోడ్ ఇంకా కొనసాగుతున్నట్లుగా తెలుస్తోంది. ఎన్టీఆర్, జాన్వీ కపూర్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'దేవర'. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో దేవరగా ఎన్టీఆర్ కనిపిస్తారు. ఇటీవల జాన్వీ, ఎన్టీఆర్ పాల్గొనగా ఈ సినిమాకు చెందిన ఓ పాటను థాయ్‌లాండ్‌లో చిత్రీకరించారు మేకర్స్. తాజాగా ఎన్టీఆర్, జాన్వీ కాంబినేషన్‌లో మరో రొమాంటిక్ సాంగ్‌ను చిత్రీకరించడానికి యూనిట్ ప్లాన్ చేసిందని సమాచారం.

ఇందుకోసం హైదరాబాద్ శివార్లలో ఓ స్పెషల్ సెట్‌ను రెడీ చేస్తున్నారని, వచ్చే వారం ఈ సెట్‌లో ఈ పాట చిత్రీకరణ జరుగుతుందని టాక్. ఇప్పటికే యాక్షన్ పార్ట్, టాకీ ఎక్కువ శాతం పూర్తి కావడంతో కొరటాల శివ పాటల చిత్రీకరణపై ఫోకస్ పెట్టినట్లుగా తెలుస్తోంది. సైఫ్ అలీఖాన్, శ్రీకాంత్, ప్రకాశ్‌రాజ్, షైన్ టామ్ చాకో, నరైన్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. కల్యాణ్‌రామ్ సమర్పణలో కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న 'దేవర' రెండు భాగాలుగా విడుదల కానుంది. తొలి భాగాన్ని సెప్టెంబరు 27న విడుదల చేయనున్నారు.


• శ్రుతీహాసన్

సమ్మర్‌లో ఎఫ్1 రేసింగ్


• బ్రాడ్ పిట్

హాలీవుడ్ ప్రముఖ నటుడు బ్రాడ్ పిట్ తాజా చిత్రంగా 'ఎఫ్1' ఖరారైంది. 'ఓబ్లీ ది బ్రేవ్, టాప్‌గన్: మేవరిక్' వంటి హాలీవుడ్ చిత్రాలకు దర్శకత్వం వహించిన జోసెఫ్ కొసిన్స్కి ఈ స్పోర్ట్స్ డ్రామా సినిమాను తెరకెక్కించనున్నారు. 'ఎఫ్1'ని అధికారికంగా ప్రకటించి, ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ఫార్ములా వన్ రేసింగ్ నేపథ్యంలో ఓ రేసర్ కథగా ఈ సినిమా రూపొందనుంది. ఫార్ములా వన్ రేసింగ్‌లో ఉండే సవాళ్లు, రేసర్ల వ్యక్తిగత, వృత్తిపరమైన జీవన విధానాలను ఈ సినిమాలో చూపించనున్నారట జోసెఫ్. జెర్రీ బ్రూక్‌హైమర్, బ్రాడ్ పిట్ ఈ సినిమాను నిర్మించనున్నారు. 'ఎఫ్1' చిత్రం వచ్చే ఏడాది సమ్మర్‌లో విడుదల కానుంది.

హను-మాన్ మాకు ఓ వరం

- నిర్మాత చైతన్య



''మా ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలో నిర్మించే సినిమాలకు కథే హీరో. 'డార్లింగ్' సినిమాకూ అంతే. ఈ చిత్రంలో ప్రియదర్శి, నభా నటేశ్ అద్భుతంగా నటించారు. ఈ సినిమా ప్రేక్షకులకు తప్పక కనెక్ట్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు నిర్మాత చైతన్య. ప్రియదర్శి, నభా నటేశ్ లీడ్ రోల్స్‌లో నటించిన రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ మూవీ 'డార్లింగ్'. అశ్విన్ రామ్ దర్శకత్వంలో కె. నిరంజన్ రెడ్డి, చైతన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 19న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో చైతన్య మాట్లాడుతూ– ''డార్లింగ్ కథను నిరంజన్‌రెడ్డి గారే ఓకే చేశారు. మాది ప్రేమ వివాహం. దర్శకుడు రామ్ అశ్విన్‌ది కూడా ప్రేమ వివాహం. సో.. ప్రేమ నేపథ్యంలో రామ్ చెప్పిన 'డార్లింగ్' సినిమా పాయింట్‌కు నిరంజన్ కనెక్ట్ అయ్యారు. సింపుల్‌గా ఉండే అబ్బాయి పాత్రలో ప్రియదర్శి, కొంచెం హైపర్ యాక్టివ్‌గా ఉంటూ స్వతంత్ర భావాలు కలిగిన అమ్మాయి పాత్రలో నభా కనిపిస్తారు. ఇక 'హను-మాన్' సినిమా మాకు ఓ వరంలా లభించింది. సంక్రాంతి సమయంలో విడుదల కావడం, అంత పెద్ద హిట్ కావడం అనేది ఆ హనుమంతుడి దయ వల్లే జరిగిందని భావిస్తున్నాం. 'హను-మాన్' సీక్వెల్ 'జై హనుమాన్' ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. నావరకైతే 'జై హనుమాన్'లో చిరంజీవి, రామ్‌చరణ్‌గార్లు అయితే బాగుంటుందని అనుకుంటున్నా. సాయితేజ్‌గారితో ఓ సినిమా ప్రకటించాం. ఇంకో పది సినిమాలు ప్రొడక్షన్‌లో ఉన్నాయి. వచ్చే మూడేళ్లలో మా బేనర్ నుంచి పది సినిమాలు రిలీజ్ అవుతాయి'' అని చెప్పుకొచ్చారు. ఇంకా మాట్లాడుతూ– ''రెండు మాస్టర్స్ డిగ్రీలు చేశాను. టెక్నికల్ సపోర్ట్ ఉంది. సో.. బిజినెస్‌ను నేను బాగా హ్యాండిల్ చేయగలుగుతున్నాను. ఇందుకు మా ఫ్యామిలీ సపోర్ట్ కూడా ఉంది'' అన్నారు.

హారర్ మూవీకి సై

గ్లామర్, డీ-గ్లామర్... ఏ పాత్రని అయినా సునాయాసంగా చేసేస్తారు శ్రుతీహాసన్. అయితే ఇప్పటివరకూ సినిమా మొత్తం పూర్తిగా తన చుట్టూ తిరిగేలా ఉన్న కథల్లో ఈ బ్యూటీ కనిపించలేదు. అంటే... పూర్తి స్థాయి ఫీమేల్ ఓరియంటెడ్ మూవీ శ్రుతీహాసన్ చేయలేదనే చెప్పాలి. ఇప్పుడు ఏకంగా కథానాయిక ప్రాధాన్యంగా సాగే రెండు చిత్రాల్లో ఆమె కనిపించే చాన్స్ ఉంది. ఒకటి 'చెన్నై స్టోరీ'. ఈ సినిమా గురించి ఇప్పటికే అధికారిక ప్రకటన వచ్చింది. అయితే ఈ సినిమా నుంచి శ్రుతి తప్పుకున్నారనే వార్త కూడా ఉంది. ఆ విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. ఇక మరో హీరోయిన్ ఓరియంటెడ్ మూవీ విషయానికొస్తే... శ్రుతీహాసన్ హీరోయిన్‌గా యూవీ క్రియేషన్స్ బేనర్ ఈ సినిమాని ప్లాన్ చేస్తోందట. హారర్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రం సాగుతుందని, పూర్తి స్థాయి హీరోయిన్ ఓరియంటెడ్ మూవీ అని సమాచారం. ఈ చిత్రాన్ని కొత్త దర్శకుడు తెరకెక్కిస్తారనే ప్రచారం జరుగుతోంది. మరి... వార్తల్లో ఉన్న ప్రకారం యూవీలో సినిమాకి శ్రుతీహాసన్ సై అన్నారా? అనేది నిర్మాణ సంస్థ కానీ శ్రుతి కానీ చెబితేనే తెలుస్తుంది.

ప్రేమించానే పిల్లా


• రవితేజ మహాదాస్యం, అనన్య నాగళ్ల

వెన్నెల కిశోర్, అనన్య నాగళ్ల లీడ్ రోల్స్‌లో రైటర్ మోహన్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. సీయా గౌతమ్, స్నేహా గుప్తా, రవితేజ మహాదాస్యం తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ క్రైమ్ కామెడీ థ్రిల్లర్‌ని లాస్య రెడ్డి సమర్పణలో వెన్నపూస రమణా రెడ్డి నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్, టైటిల్ సాంగ్ విడుదల అయ్యాయి. ఈ చిత్రంలో రవితేజ మహాదాస్యం, అనన్య మధ్య సాగే 'ప్రేమించానే పిల్లా...' పాటను శనివారం విడుదల చేశారు. చిత్ర సంగీత దర్శకుడు సునీల్ కశ్యప్ స్వరపరచిన ఈ మెలోడీ సాంగ్‌కు పూర్ణాచారి సాహిత్యం అందించగా రాహుల్ సిప్లిగంజ్ పాడారు.

మనిషి కాదు... శివుడి అంశ

ఉమ్మడి కుటుంబంలో ఎదరయ్యే సవాళ్లు, పాత సంప్రదాయాలు వంటి అంశాల నేపథ్యంలో రూపొందిన సినిమా 'పౌరుషం: ది మ్యాన్ హుడ్'. సుమన్ తల్వార్, మేకా రామకృష్ణ, షెరాజ్, అశోక్ ఖుల్లార్, ఆమని, గీతా రెడ్డి, జ్యోతీ రెడ్డి లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. లాస్ ఏంజిల్స్‌లో ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేయగా, డాక్టర్ ఒలంపియా ఏ. జెలినీ, హాలీవుడ్ హీరోయిన్- సింగర్ ల్యూబా పామ్, అంబర్ మార్టినేజ్, సాగే, హాలీవుడ్ లక్స్ ఏంజెల్స్ స్టూడియోస్ కో- ప్రొడ్యూసర్ లెన్నీ విటుల్లి అతిథులుగా హాజరయ్యారు. 'ఫ్రెండ్‌షిప్ అయినా లవ్ అయినా నన్ను చూసిన వెంటనే కళ్లలో మెరుపులు రావాలి', 'వాడు మనిషి కాదు... శివుడి అంశ' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి.


• షెరాజ్

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

చార్జిషీట్ నుంచి అమిత్‌షా, కిషన్‌రెడ్డి పేర్లు తొలగింపు

- ఎన్నికల కేసులో కేంద్ర మంత్రులకు ఊరట

సిటీ, కోర్టులు: ఎన్నికల కేసుకు సంబంధించి కేంద్ర మంత్రులు అమిత్‌షా, కిషన్‌రెడ్డిలకు ఊరట లభించింది. ఎన్నికల సమయంలో దాఖలైన కేసులో మొఘల్‌పురా పోలీసులు చార్జిషీట్ నుంచి అమిత్‌షా, కిషన్‌రెడ్డిల పేర్లు తొలగించారు. ఈ నేపథ్యంలో విచారణలో భాగంగా ఈ నెల 10న కోర్టుకు హాజరు కావాలని నాంపల్లి 7వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్‌కు నోటీసులు జారీ చేసింది. ఎన్నికల ప్రచారంలో నిబంధనలకు విరుద్ధంగా గత అక్టోబర్ 1న హైదరాబాద్‌లోని శాలిబండ ప్రాంతంలో జరిగిన అమిత్‌షా సభలో చిన్నపిల్లలను వేదికపైకి పిలిచి వారితో బీజేపీ గుర్తును ప్రదర్శింపజేయడమేకాక, నినాదాలు ఇప్పించారని గోపిశెట్టి నిరంజన్ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అక్టోబర్ 2న మొఘల్‌పురా పోలీస్ స్టేషన్‌లో అమిత్‌షా, కిషన్‌రెడ్డిలతో పాటు మరికొంత మంది బీజేపీ నాయకులపైన పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే వారు ఉద్దేశపూర్వకంగా కోడ్ ఉల్లంఘించలేదని పోలీసులు అమిత్‌షా, కిషన్‌రెడ్డిల పేర్లను చార్జిషీట్ నుంచి ఉపసంహరించుకొని కేసును వెనక్కి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో కేసులో వివరణ ఇచ్చేందుకు ఈనెల 10 న హాజరుకావాలని నిరంజన్‌కు పంపిన నోటీసులో కోర్టు పేర్కొంది.

నారాయణలో ఫ్యాకల్టీగా ఐఐటీయన్లు

సాక్షి, హైదరాబాద్: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు నారాయణ విద్యాసంస్థ నడుం బిగించింది. ఇందులో భాగంగా విద్యార్థులకు అర్థవంతంగా, విశ్లేషణాత్మకంగా బోధించే ఉపాధ్యాయులను, అధ్యాపకులను ప్రఖ్యాత విద్యాసంస్థలైన ఐఐటీ, ఎన్ఐటీలలో బీటెక్, ఎంటెక్, ఎమ్మెస్సీ పూర్తి చేసిన 180 మంది ప్రతిభావంతులను క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఎంపిక చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. 'నారాయణాస్ నవతరం' పేరు మీద ప్రత్యేకంగా రిక్రూట్‌మెంట్ ప్రక్రియ చేపట్టినట్లు పేర్కొంది. ఈ సందర్భంగా నారాయణ విద్యాసంస్థల సీఈఓ పునీత్ మాట్లాడుతూ నవతరం అభ్యర్థులను ప్రోత్సహించేందుకు నారాయణ విద్యాసంస్థ చొరవ తీసుకుందన్నారు. వీరి కోసం ప్రత్యేకంగా ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ను నిర్వహించినట్లు తెలిపారు. నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు పి.సింధూర నారాయణ, శరణి నారాయణ మాట్లాడుతూ రాబోయే కాలంలోని అవసరాలను ముందే గుర్తించి నేటి నుంచే వనరులను సమకూర్చుకోవడం నారాయణ ముందుచూపుకు నిదర్శనమని పేర్కొన్నారు.

న్యాయవిద్యలో మనమే లీడర్!

- భారత్ ప్రపంచ నాయకత్వ పాత్ర పోషించబోతోంది
- భారత అటార్నీ జనరల్ వెంకటరమణి వెల్లడి



గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ లాలో మూట్ కోర్టును ప్రారంభించి మాట్లాడుతున్న భారత అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి


రాయదుర్గం (హైదరాబాద్): న్యాయ విద్యపరంగా భారత్ ప్రపంచ నాయకత్వ పాత్ర పోషించబోతోందని భారత అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి చెప్పారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం (మనూ)లోని 'స్కూల్ ఆఫ్ లా'లో మూట్ కోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయ విద్యను అందించే సంస్థల వైఫల్యం గురించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. అమెరికా, యూరప్‌లలో అక్కడి న్యాయ విద్యాసంస్థల వైఫల్యంపై మేధావులు మాట్లాడుతున్నారని గుర్తు చేశారు. కానీ భారతీయ న్యాయ విద్యావ్యవస్థ బాగా పని చేస్తోందని, అందుకే న్యాయ విద్యలో ప్రపంచ నాయకత్వ పాత్రను పోషించబోతోందని చెప్పారు. ఉర్దూ భాషలో న్యాయ విద్య భారతదేశ సాంస్కృతిక సంపద పెంపుదలకు బాటలు వేస్తుందని చెప్పారు. న్యాయ కళాశాలలు వాస్తవానికి న్యాయ ప్రయోగశాలలని, ఉర్దూ విశ్వవిద్యాలయంలో లా స్కూల్ విద్యార్థులకు ఉర్దూ భాష విలువైన ఆస్తిగా ఉంటుందని, ఇది వారికి ప్రత్యేకమైన అవకాశాన్ని ఇస్తుందని పేర్కొన్నారు.

కొత్త చట్టాలను ఉర్దూలోకి అనువదించాలి

'మనూ'కి రాజ్యాంగ హోదా కల్పించడంతోపాటు జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థగా గుర్తించాలని పట్నా సీఎన్ఎల్‌యూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఫైజాన్ ముస్తఫా కోరారు. ఉర్దూ వర్సిటీ లా స్కూల్ మూడు కొత్త నేర చట్టాలను ఉర్దూలోకి అనువదించే ప్రాజెక్టును ఆమోదించాలని అటార్నీ జనరల్‌ను కోరారు. ఈ అనువాద ప్రాజెక్టుకు తానే పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఉర్దూ వర్సిటీ సర్వతోముఖాభివృద్ధికి ఎప్పుడూ కృషి చేస్తానని వర్సిటీ చాన్స్‌లర్ ముంతాజ్‌అలీ చెప్పారు. ఈ కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్, రిజిస్ట్రార్ ఇష్తియాక్ అహ్మద్, లా స్కూల్ డీన్ తబ్రేజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కేసుల సత్వర పరిష్కారానికి కొత్త కోర్టులు

హైకోర్టు జడ్జి జస్టిస్ కాజా శరత్



నూతన కోర్టును ప్రారంభిస్తున్న జస్టిస్ శరత్

ఆదిలాబాద్ టౌన్: పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం కోసం నూతన కోర్టులను ఏర్పాటు చేస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కాజా శరత్ చెప్పారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి, రెండో అదనపు జుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ కోర్టును శనివారం ఆయన ప్రారంభించారు. ముందుగా న్యాయమూర్తికి గుస్సాడీ నృత్యాలతో స్వాగతం పలికి జ్ఞాపిక అందజేశారు. అనంతరం ఆయన పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ కోర్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదిలాబాద్‌లో నూతన కోర్టు ఏర్పాటుతో మరిన్ని కేసులు త్వరగా పరిష్కారమయ్యే అవకాశం ఉందన్నారు. అనంతరం కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. బార్ అసోసియేషన్ సభ్యులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షిషా, జిల్లా జడ్జి కె.ప్రభాకరరావు, సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలజైన్, జడ్జిలు దుర్గారాణి, సూర్యవార్ మంజుల పాల్గొన్నారు.

శ్రీలంక మీడియా ప్రొఫెషనల్స్‌కు శిక్షణ పూర్తి

సాక్షి, హైదరాబాద్: ఇండియన్ టెక్నికల్ అండ్ ఎకనమిక్ కోఆపరేషన్ (ఐటీఈసీ) ప్రోగ్రామ్ కింద... కేంద్ర విదేశాంగశాఖ ప్రాయోజిత కార్యక్రమంలో భాగంగా శ్రీలంక పాత్రికేయులకు మీడియా మేనేజ్ మెంట్‌పై ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో నిర్వహించిన రెండువారాల శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగి సింది. ఈ సందర్భంగా సంస్థ డీజీ, స్పెషల్ సీఎస్ డా.శశాంక్ గోయెల్ మాట్లాడుతూ సాంకేతికత విస్తరిస్తున్న నేపథ్యంలో అందుకనుగుణంగా కొత్త నైపుణ్యాలను అందించి వృత్తి నిపుణులను తయా రు చేసేందుకు తమ శిక్షణ సంస్థ తగిన కార్యక్రమా లను నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో శ్రీలంక ప్రధాని మీడియా సలహా దారు సుగీశ్వర పి.సేనధీరతోపాటు కోర్స్ డైరెక్టర్ డా.రావులపాటి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి రక్షిత మంచినీరు అందించడమే లక్ష్యం

- ఆవాస గ్రామాలకూ మిషన్ భగీరథ చేరాలి
- తెలంగాణ డ్రింకింగ్ వాటర్ సప్లై కార్పొరేషన్ అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్ : రాష్ట్రంలోని అన్ని ఆవాస గ్రామాలకు సురక్షిత మంచి నీరు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి సీతక్క ఆదేశించారు. తెలంగాణ డ్రింకింగ్ వాటర్ సప్లై కార్పొరేషన్‌తో అన్ని ఆవాసాలను అనుసంధానించాలని సూచించారు. కుళాయి ద్వారా రక్షిత మంచి నీరు అందని గ్రామాలను గుర్తించి తక్షణమే పనులు ప్రారంభించాలన్నారు. శనివారం సచివాలయంలో మంత్రి సీతక్క అధ్యక్షతన జరిగిన తెలంగాణ డ్రింకింగ్ వాటర్ సప్లై కార్పొరేషన్ లిమిటెడ్ బోర్డు సమావేశంలో అధికారులు మిషన్ భగీరథ పథకంపై అధికారులు ఆడిట్ నివేదిక సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ...ఏజెన్సీ ప్రాంతాల్లో, అడవుల్లో నివసించే ప్రజలకు సైతం కుళాయి నీళ్లు అందించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అటవీ ఆవాస గ్రామాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసి బోర్ల ద్వారా తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలన్నారు. పీఆర్ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్ మిషన్ భగీరథ ఇంజనీర్ ఇన్ చీఫ్ కృపాకర్‌రెడ్డి, తెలంగాణ రూరల్ డ్రింకింగ్ వాటర్ సప్లై కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

'ఈవీ'ల ఉత్పత్తిలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలుపుతాం

పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: ఈవీ వాహనాల ఉత్పత్తి విషయంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేలా కృషి చేస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. విద్యుత్తు వాహనాలు, లిథియం బ్యాటరీల తయారీ పరిశ్రమలకు ప్రభుత్వ విధానాల ప్రకారం ప్రోత్సాహకాలు, మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి అవాంతరాలు లేకుండా చూస్తామని శనివారం గోల్డ్‌స్టోన్ ప్రసాద్ ఆధ్వర్యంలో తనను కలిసిన 'ఈటో' (ఈటీవో) ఎలక్ట్రిక్ త్రిచక్ర వాహనాల సంస్థ ప్రతినిధులకు మంత్రి హామీ ఇచ్చారు. ఏటా పది వేల యూనిట్ల తయారీ సామర్థ్యంతో ఈటో ఆటో ఎలక్ట్రిక్ సంస్థ జడ్చర్ల వద్ద ఏర్పాటు చేసిన పరిశ్రమను మరింత విస్తరించాలని మంత్రి సూచించారు. ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతున్నందున విదేశీ పెట్టుబడులను తీసుకురావాలని మంత్రి సంస్థ ప్రతినిధులకు సూచించారు. దీనికి ప్రభుత్వం తరఫున అన్నిరకాలుగా సహకరిస్తామని చెప్పారు. మహిళా ఆటో డ్రైవర్లను ప్రోత్సహించేందుకు ఈటో సంస్థ చేపట్టిన కార్యక్రమాన్ని మంత్రి శ్రీధర్‌బాబు ప్రశంసించారు. హైదరాబాద్, అలాగే జిల్లా కేంద్రాల్లో మహిళలకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వడం ద్వారా వారు సొంతంగా ఉపాధి పొందేలా తీర్చిదిద్దాలని కోరారు. ప్రభుత్వానికి తగిన సూచనలు చేస్తే ప్రోత్సాహకాలపై విధాన నిర్ణయం ప్రకటిస్తామని ఆయన తెలిపారు.

వైభవోపేతంగా బోనాల దశాబ్ది ఉత్సవాలు

- బోనాల నిర్వహణకు రూ.20 కోట్లు కేటాయింపు
- నేటి నుంచి వచ్చేనెల 4 వరకు బోనాల ఉత్సవాలు
- ఉత్సవ కేలండర్ ఆవిష్కరణ... దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ



దేవాలయాల కమిటీలకు చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్

సాక్షి,హైదరాబాద్: ఆషాఢ మాస బోనాల దశాబ్ది ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దేవాలయ కమిటీలకు పిలుపునిచ్చారు. శనివారం బేగంపేట హరిత టూరిజం ప్లాజాలో బోనాల దశాబ్ది ఉత్సవాలు- 2024 సందర్భంగా దేవాలయాల కమిటీలకు చెక్కుల పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ...ఈ నెల 7 నుంచి ఆగస్టు 4 వరకు బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్లు కేటాయించిందని వెల్లడించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... హైదరాబాద్ సంస్కృతీ సంప్రదాయాలను రాష్ట్ర, దేశవ్యాప్తంగా తెలిసేలా ఉత్సవాలను నిర్వహించాలన్నారు. నిర్వహణలో ఎలాంటి లోటుపాటు లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రమంతా సమృద్ధిగా వర్షాలు పడి మంచి పంటలు పండాలని ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బోనాల ఉత్సవ కేలండర్, ఈవెంట్ కేలండర్, ఉత్సవాల పోస్టర్, బోనాల పండుగ పై పుస్తకం, పాటల సీడీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, దేవదాయ శాఖ, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.